ఈనాడు

కరీంనగర్ 28-8-2017 సోమవారం సిటీ సంపుటి 44 సంచిక 18
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00. పేజీలు 16+16 www.eenadu.net
Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Anantapur, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

ఈ జాప్యానికి మందేది?

సమయపాలన పట్టని సర్కారీ వైద్యులు • చికిత్స కోసం నిరుపేదలకు నిత్యం నిరీక్షణే



నిజామాబాద్ ప్రభుత్వాసుపత్రిలో ఓపీ సమయానికి ఖాళీగా ఉన్న వైద్యుడి కుర్చీ

వైద్యో నారాయణో హరీ అంటారు.. అంటే వైద్యుడు దేవుడితో సమానమని అర్థం. సర్కారు ఆసుపత్రులకు వచ్చే నిరుపేదలకు చికిత్సనందిస్తూ కనిపించే దైవంగా భాసిస్తున్నారు కొందరు వైద్యులు. ఇలాంటివారి వల్లే ప్రభుత్వ వైద్యశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన చికిత్సలు.. అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు సైతం జరుగుతున్నాయి. అయితే ఆ వైద్యుడు గాడి తప్పితే వైద్య వ్యవస్థంతా అస్తవ్యస్తమవుతుంది. అధిక శాతం మంది వైద్యుల్లో చిత్తశుద్ధి కరవైపోయింది. కాసుల మీద మోజుతో.. విధుల్లో ఉండాల్సిన సమయంలో ప్రైవేటు సేవలో మునిగితేలుతున్నారు. ఉస్మానియా, గాంధీ, ఎంజీఎం, నిజామాబాద్ తదితర సర్కారు దవాఖానాల్లో వైద్యుల పనితీరుపై 'ఈనాడు యంత్రాంగం' క్షేత్రస్థాయిలో పరిశీలించింది. వైద్యులు ఎప్పుడొస్తారో, ఎప్పుడెళ్తారో కనీసం ఆసుపత్రి పర్యవేక్షకుడికి కూడా తెలియనంత దారుణంగా విధులు నిర్వహిస్తున్నారు. బోధనాసుపత్రులే కాదు.. జిల్లా, ప్రాంతీయ ఆసుపత్రులు, సామాజిక, ప్రాథమిక ఆసుపత్రుల్లో పనిచేసే వైద్యుల్లోనూ అత్యధికులది ఇదే తీరు. సర్కారు వైద్యుల పనితీరుపై ఇటీవల తెలంగాణ 'నిఘా' వర్గాలు ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలోనూ ఇవే అంశాలు ఉండడం గమనార్హం.

- వైద్యుల సమయపాలనపై ప్రత్యేక కథనం -9లో

వైద్యుల పనివేళలివీ..

ఇలా పనిచేయాలి

- అన్ని ఆసుపత్రుల్లోనూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విధులు నిర్వర్తించాలి.
- బోధనాసుపత్రుల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఓపీ, తర్వాత వార్డుల్లో రోగులను చూడాలి.
- ఉదయం 9.15 గంటల్లోపు హాజరు పుస్తకంలో సంతకం చేయాలి.
- హాజరును వైద్యకళాశాల ప్రధానాచార్యులు పరిశీలించాకే వేతనాల బిల్లు ఆమోదిస్తారు.



బోధనాసుపత్రుల్లో

మధ్యాహ్నం ఒంటి గంటలోపు వెళ్లే వైద్యులు	70%
వైద్యకళాశాలల్లో 4గంటల వరకూ ఉండేవారు	30%

ఇలా వస్తున్నారు

ఉదయం 9 గంటలకు వచ్చే వైద్యులు:	25%
10-11 గంటల మధ్యలో వచ్చేవారు:	50%
11 గంటలు దాటాక వచ్చేవారు:	10%
అసలు రాకుండానే సంతకాలతో సరిపుచ్చేవారు:	10%
గైర్హాజరీలు:	5%

ఆసుపత్రి నుంచి బయటకు వెళ్లేటప్పుడు..

మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట మధ్య వెళ్లేవారు:	60%
1-2 గంటల మధ్య వెళ్లే వైద్యులు:	30%
సాయంత్రం 4 గంటల వరకూ ఉండే వైద్యులు:	10%

ఓడినా.. విజేతే!

- ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో సింధుకు రజతం
- ఫైనల్లో అసాధారణ పోరాటం



మళ్లీ అదే దృశ్యం.. సింధు ఓడింది.. కానీ ఆమె పోరాటం హృదయాల్ని తాకింది. ఏడాది కిందట రియో ఒలింపిక్స్‌లో అద్భుత ప్రదర్శనతో స్వర్ణ పతకానికి అత్యంత చేరువగా వెళ్లి.. చివరికి రజతంతో సరిపెట్టుకున్న తెలుగుతేజం.. ఇప్పుడు ప్రతిష్టాత్మక ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లోనూ అదే ప్రదర్శనను పునరావృతం చేసింది. ప్రపంచ ఛాంపియన్‌షిప్ చరిత్రలోనే అత్యంత హోరాహోరీగా.. ఆద్యంతం ఉత్కంఠ రేపుతూ.. రసవత్తరంగా సాగిన మహిళల సింగిల్స్ ఫైనల్ పోరులో సింధు పోరాడి ఓడింది. ఏకంగా గంటా 49 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో విజయానికి అత్యంత చేరువగా వెళ్లిన సింధు.. త్రుటిలో పరాజయం చవిచూసింది. ఇంకో రెండు పాయింట్లు గెలిస్తే స్వర్ణం ఖాయమయ్యే దశలో సింధు అడుగులు తడబడ్డాయి. ప్రత్యర్థి అనూహ్యంగా పుంజుకుని సింధును వెనక్కి నెట్టి స్వర్ణం ఎగరేసుకుపోయింది. అయితే ఫైనల్లో ఓడి, రజతానికే పరిమితమైనా సింధు అద్భుత పోరాటం మాత్రం అభిమానుల మనసులు గెలిచింది. సింధుకు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఇది మూడో పతకం కావడం విశేషం. ఆమె ఇప్పటికే రెండు కాంస్యాలు (2013, 2014) గెలిచింది. భారత షట్లర్లలో ఇంకెవ్వరూ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో మూడు పతకాలు గెలవలేదు.

హింసను సహించం

• దోషుల్ని వదిలిపెట్టం • చట్టానికి అందరూ తలొగ్గాల్సిందే • అహింసా పరమో ధర్మః... అదే మన మార్గం
• మన సాంస్కృతిక వారసత్వ గొప్పదనానికి ప్రతీకలు పండగలు • 'మన్ కీ బాత్'లో ప్రధాని నరేంద్ర మోదీ



> చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునే హక్కు ఏ ఒక్కరికీ లేదు. ప్రతి ఒక్కరూ చట్టానికి తలొగ్గాల్సిందే. దోషులెవరో చట్టమే తేలుస్తుంది. వారికి నిస్సందేహంగా శిక్షలు పడతాయి

> మతం పేరుతో హింసకు పాల్పడితే సహించేది లేదని పంద్రాగస్టు ప్రసంగంలో నేను ఎర్రకోట బురుజులపైనుంచి ప్రకటించాను. అది మతపరమైన విశ్వాసమైనా, ఒక రాజకీయ సైద్ధాంతికతను అనుసరించడమైనా, ఒక వ్యక్తికి లేదా సంప్రదాయానికి విధేయత ప్రకటించడమైనా... ఏదైనా కానీయండి.. హింసకు దిగితే మాత్రం ఊరుకునేది లేదు

దిల్లీ

విశ్వాసాల పేరుతో ఏ రూపంలో హింసకు పాల్పడినా సహించేది లేదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు. దోషులకు శిక్ష పడక తప్పదని చెప్పారు. హరియాణాలో స్వయం ప్రకటిత దైవాంశ సంభూతుడు గుర్మీత్ రామ్ రహీం సింగ్‌ను న్యాయస్థానం దోషిగా తేల్చడంతో అతని అనుచరులు సృష్టించిన వీరంగంపై ప్రధాని ఆదివారం 'మన్ కీ బాత్'లో ఈ మేరకు పరోక్షంగా ప్రస్తావన తీసుకువచ్చారు. సమస్యల్ని పరిష్కరించుకోవడానికి, ప్రతి ఒక్కరూ న్యాయం పొందడానికి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వీలు కల్పిస్తోందని చెప్పారు.

ఆ విలువలు మనలో ఉన్నవే

'గౌతమ బుద్ధుడు, మహాత్మాగాంధీ నడయాడిన నేల మనది. జాతిని ఐక్యపరచడానికి సర్వస్వాన్నీ ధారపోసిన సర్దార్ పటేల్ పుట్టిన భూమి ఇది. అహింసకు పెట్టింది పేరు మన దేశం. అహింసా పరమో ధర్మః (అహింసే అతి పెద్ద మతం) అని మన పూర్వీకులు ఏనాడో ప్రవచించారు. సమాజ విలువలు, అహింస, పరస్పర గౌరవం అనేవి మనలో అంతర్భూతంగా ఉన్నవే. వీటిని మన పితామహులు అనేక శతాబ్దాల క్రితమే మనకు ఒంటబట్టించారు. విశ్వాసం పేరుతో చట్టాన్ని తమ చెప్పుచేతల్లోకి తీసుకునే హక్కు ఎవరికీ లేదు. అలా చేసినవారు, హింసాత్మక మార్గంలో పయనించేవారు వ్యక్తులైనా, బృందాలైనా ఈ దేశం గానీ, ప్రభుత్వం గానీ సహించేది లేదని దేశ ప్రజలకు నేను భరోసా ఇస్తున్నా'నని మోదీ చెప్పారు.

ఉపాధ్యాయ దినోత్సవాన ప్రతినబూనుదాం

దేశంలో భిన్నత్వం సహా వివిధ అంశాల గురించి ప్రధాని అరగంట ప్రసంగంలో ప్రస్తావించారు. స్వచ్ఛభారత్ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా గాంధీ జయంతికి 15 రోజుల ముందు 'పరిశుభ్రత ఒక సేవ' అనేదానిని ప్రచార కార్యక్రమంగా తీసుకోవాలని (మిగతా 6లో)

భయం గుప్పిట హరియాణా

• హింస చెలరేగవచ్చని హెచ్చరించిన సీఐడీ • భారీగా భద్రత ఏర్పాట్లు
• అంతర్జాలం నిలిపివేత • 38కి పెరిగిన మృతుల సంఖ్య -11లో

గుర్మీత్‌సింగ్ శిక్షపై నేడే నిర్ణయం



రైతు సమన్వయ సమితులకు శ్రీకారం
- సెప్టెంబర్ 9లోగా గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో ఏర్పాటు -6లో

విస్తరణకు వడివడిగా..
- రాష్ట్రంలో 2,915 కి.మీ. జాతీయ రహదారుల విస్తరణకు కేంద్రం అనుమతి
- నూతన చట్టం ప్రకారం చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు -3లో

కొత్త మద్యం విధానం సిద్ధం
- ముఖ్యమంత్రి పరిశీలనకు ముసాయిదా -2లో

మరమగ్గాలకు మంచి రోజులు
- రాష్ట్రవ్యాప్తంగా 68 వేల ఆధునికీకరణ -5లో

సైన్యానికి బార్‌కోడ్‌తో యుద్ధ వాహనాలు
- ప్రారంభించిన రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ -11లో

భారత్‌దే వన్డే సిరీస్



రోహిత్‌శర్మ

శ్రీలంకతో ఐదు వన్డేల సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే భారత్ 3-0తో కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన మూడో వన్డేలో కోహ్లి సేన 6 వికెట్ల తేడాతో లంకను ఓడించింది. ఓపెనర్ రోహిత్‌శర్మ (124 నాటౌట్; 145 బంతుల్లో 16×4, 2×6) సెంచరీతో మెరిసి జట్టుకు ఘన విజయాన్ని అందించాడు. ధోని (67 నాటౌట్; 86 బంతుల్లో 4×4, 1×6), బుమ్రా (5/27) కూడా విజయంలో కీలక పాత్ర పోషించారు.

ఇదీ సంగతి!



రైల్వే ప్రమాదాలకు బాధ్యత వహిస్తూ మీరిద్దరూ రెండు రోజులు రైళ్లలోనే తిరగాలని శాఖాపర నిర్ణయం తీసుకున్నాం!



బాంబుతో పరుగెడుతున్న కానిస్టేబుల్ అభిషేక్ పటేల్

బాంబు భుజాన పెట్టుకుని కిలోమీటరు పరుగెత్తాడు

• 400 మంది పాఠశాల విద్యార్థుల ప్రాణాలను కాపాడిన మధ్యప్రదేశ్ కానిస్టేబుల్ -11లో


జమిలి ఎన్నికలు మేలు

• 2024 నుంచి లోక్‌సభ, అసెంబ్లీలకు ఏకకాలంలో జరపాలి
• అన్ని వర్గాల వారితో అధ్యయన బృందం ఏర్పాటు చేయాలి
• నీతి ఆయోగ్ సిఫార్సు



దిల్లీ: జాతి ప్రయోజనాల దృష్ట్యా 2024 నుంచి లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు జమిలి ఎన్నికలు నిర్వహించాలని నీతి ఆయోగ్ అభిప్రాయపడింది. ప్రభుత్వం ప్రచార సరళిలో పనిచేయడం పరిపాలనపై ప్రభావం చూపుతోందని, ఈ 'ప్రచార సరళి'ని కనిష్ఠ స్థాయికి తగ్గించాలంటే ఏకకాల ఎన్నికలే మంచివని తెలిపింది. '2017-18 నుంచి 2019-20 వరకు మూడేళ్ల కార్యాచరణ అజెండా' అన్న నివేదికలో ఈ అంశాన్ని పేర్కొంది. "2024 నుంచి రెండు దశల్లో జమిలి ఎన్నికలు నిర్వహించే దిశగా పనులు ప్రారంభించాల్సి ఉంది. అందుకోసం రాష్ట్ర అసెంబ్లీల కాలపరిమితిని ఒక్కసారికి పెంచడమో, తగ్గించడమో చేయాల్సి ఉంటుంది. దీని అమలుకు రాజ్యాంగ నిపుణులు, మేధావులు, ప్రభుత్వాధికారులు, పార్టీల ప్రతినిధులతో అధ్యయన బృందాన్ని ఏర్పాటు చేయాలి. అవసరమైన రాజ్యాంగ, చట్టాల సవరణ కోసం తగిన సూచనలు ఇవ్వడంతో పాటు, కార్యాచరణ ప్రణాళికను కూడా రూపొందించాల్సి ఉంటుంది. ఈ క్రతువు నిర్వహణకు ఎన్నికల సంఘాన్ని సమన్వయకర్తగా (మిగతా 6లో)

పంచ్‌కు రూ. 1500 కోట్లు



లాస్ వెగాస్: ప్రొ బాక్సింగ్‌లో అమెరికా దిగ్గజం ఫ్లాయిడ్ మేవెదర్ సరికొత్త రికార్డు సృష్టించాడు. అజేయంగా 50 మ్యాచ్‌లు గెలిచిన తొలి బాక్సర్‌గా ఘనత సాధించాడు. భారత కాలమానం ప్రకారం ఆదివారం జరిగిన మ్యాచ్‌లో మేవెదర్ ఐర్లాండ్‌కు చెందిన కానర్ మెక్‌గ్రెగర్‌ను చిత్తు చేశాడు. ఈ విజయం ద్వారా ప్రైజ్‌మనీ రూపంలో మేవెదర్ దాదాపుగా రూ. 1500 కోట్లు సొంతం చేసుకోనున్నాడు! మ్యాచ్ ఆడినందుకు గాను కనీస మొత్తం కింద రూ. 638 కోట్లు తీసుకోనున్న అతడు.. మ్యాచ్ ద్వారా వచ్చిన ఆదాయంలో వాటా, స్పాన్సర్‌షిప్ ఆధారంగా మిగతా మొత్తం దక్కించుకోనున్నాడు. మ్యాచ్‌లో ఓటమిపాలైన మెక్ గ్రెగర్ కూడా సుమారు రూ.447 కోట్లు ఆర్జించనున్నాడు.

వివరాలు ఛాంపియన్‌లో

బ్రస్సెల్స్‌లో దాడి చేసిన వ్యక్తి మావాడే: ఐఎస్

బ్రస్సెల్స్: బెల్జియంలో ముగ్గురు సైనికులపై కత్తితో దాడి చేసిన వ్యక్తి తమ సంస్థకు చెందిన వాడేనని ఇస్లామిక్ స్టేట్(ఐఎస్)కు చెందిన వార్తా సంస్థ అమాక్ తెలిపింది. ఐఎస్‌తో పోరాడుతున్న సంకీర్ణ దేశాల లక్ష్యంగా దాడి చేసినట్లు చెప్పింది.

కొత్త మద్యం విధానం సిద్ధం

- **ముఖ్యమంత్రి పరిశీలనకు ముసాయిదా**

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో కొత్త మద్యం విధానం సిద్ధమైంది. దీని ముసాయిదాను ముఖ్యమంత్రి కేసీఆర్ పరిశీలనకు పంపనున్నారు. సెప్టెంబరు నెలాఖరులోగా కొత్త మద్యం విధానం విడుదల కానుంది. దీనికి సంబంధించి అధికారులు కసరత్తు పూర్తి చేశారు. రాష్ట్రంలో ఈ నెలాఖరుతో బార్ల లైసెన్సు గడువు పూర్తికానున్న సంగతి తెలిసిందే. రెండేళ్లకు సంబంధించి అమలు చేసిన మద్యం విధానం గడువు వాస్తవానికి గత జులైలోనే పూర్తయింది. అయితే జాతీయ రహదారులకు 500 మీటర్ల పరిధిలోని మద్యం దుకాణాలు తొలగించాలన్న సుప్రీం కోర్టు ఆదేశాలకు సంబంధించిన వివాదం పరిష్కారం కాకపోవడంతో సెప్టెంబరు నెలాఖరు వరకు పొడిగించారు. దీనికి సమయం దగ్గర పడుతుండటంతో అధికారులు కొత్త మద్యం విధానాన్ని రూపొందించారు. ఆదాయం పెంపే లక్ష్యంగా కొత్త విధానంపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా లైసెన్సు ఫీజు కొంత తగ్గించాలని.. తద్వారా ఎక్కువ దుకాణాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తున్నట్లు సమాచారం. తక్కువ ఆల్కహాల్ ఉన్న బీరు వంటి వాటిని వాణిజ్య సముదాయాలు (మాల్స్), సూపర్‌మార్కెట్లలోనూ అందుబాటులో ఉంచాలనేది ప్రధాన నిర్ణయాలుగా చెబుతున్నారు. ప్రస్తుతం లైసెన్సు గడువు రెండేళ్లు మాత్రమే ఉంది. దీన్ని మరో సంవత్సరం పెంచాలని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పరిశీలన పూర్తయిన అనంతరం కొత్త మద్యం విధానాన్ని అధికారికంగా ప్రకటించనున్నారు.

రుతుపవన ద్రోణి ప్రభావం.. రేపటి వరకు భారీ వర్షాలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో సోమ, మంగళ వారాల్లో భారీ వర్షాలు కురవనున్నాయి. తెలంగాణవ్యాప్తంగా ఉపరితల ఆవర్తనం వ్యాపించి ఉండటంతోపాటు దాని ప్రభావం మరింత విస్తరించే అవకాశాలున్నట్లు వాతావరణశాఖ అంచనా వేస్తోంది. మరోవైపు ఉత్తర భారత్ నుంచి దిగువకు రుతుపవన ద్రోణి ఉన్నట్లు గుర్తించారు. దీని ప్రభావంతో రానున్న రెండు రోజులు వర్షాలు కురుస్తాయని ఆ శాఖ పేర్కొంది. ఉత్తర బంగాళాఖాతం నుంచి ఒడిశా వరకు విస్తరించిన ఉపరితల ఆవర్తనం సోమవారం ఉదయానికి అల్పపీడనంగానూ మారే అవకాశాలు ఉన్నాయని ఆ శాఖ సంచాలకుడు వైకే రెడ్డి 'ఈనాడు'కు వివరించారు. దీని ప్రభావంతో మూడు రోజుల వరకు అక్కడక్కడ భారీవర్షాలు, కొన్నిచోట్ల మోస్తారుగా కురిసే అవకాశం ఉందన్నారు. మరోవైపు రెండురోజులుగా రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్‌లో ఆదివారం ఏ వీధి చూసినా వరద కనిపించింది. రాష్ట్రవ్యాప్తంగా 460 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. భూపాలపల్లిలో ఏడు సెంటీమీటర్లు, కొత్తగూడలో ఆరు సెం.మీ, వికారాబాద్ జిల్లా దోమలో 5, నిజామాబాద్ జిల్లాలో పలుచోట్ల 4, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో పలు చోట్ల మూడు సెం.మీటర్లు, ఆదిలాబాద్, ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో మూడు సెం.మీటర్లకుపైగా వర్షం కురిసింది.

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ | ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ

బహిరంగ ప్రకటన

2017-18 ఆర్థిక సంవత్సరానికి రిటైల్ సరఫరా ఛార్జీలు మరియు ఓపెన్ ఆక్సెస్ వినియోగదారులకు క్రాస్ సబ్సిడి సర్‌ఛార్జీలు

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

1. రెండు డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు అనగా (1) సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (టిఎస్ఎస్‌పిడిసిఎల్) మరియు (2) నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (టిఎస్ఎన్‌పిడిసిఎల్) వారు 2017-18 సంవత్సరానికి రిటైల్ సరఫరా ఛార్జీలు మరియు క్రాస్ సబ్సిడి, సర్‌ఛార్జ్ & అదనపు సర్‌ఛార్జీల ప్రతిపాదనలను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి వారు యావత్ తెలంగాణ రాష్ట్రంలోని వినియోగదారులందరికి 2017-18 కాలానికి రిటైల్ సరఫరా ఛార్జీలు మరియు క్రాస్ సబ్సిడి సర్‌ఛార్జీలను ఈ క్రింద వివరించబడ్డ అనుబంధం-1 మరియు అనుబంధం- 2 ప్రకారం నిర్ణయించడమైనది.
2. విద్యుత్ చట్టం 2003 సెక్షన్ 65 మరియు 108లో పేర్కొన్న ప్రకారం ప్రభుత్వం వారు కొన్ని కేటగిరి వినియోగదారులకు ఇచ్చిన సబ్సిడీ మొత్తాలను పరిగణలోకి తీసుకున్న మీదట 2017-18 ఆర్థిక సంవత్సరానికి రిటైల్ సరఫరా ఛార్జీలను నిర్ణయించడమైనది.
3. రిటైల్ సరఫరా ఛార్జీలు రాష్ట్రంలోని సిరిసిల్ల గ్రామీణ విద్యుత్ సరఫరా సహకార సంఘం పరిధిలోని వినియోగదారులకు కూడా వర్తిస్తాయి.
4. ఈ రిటైల్ సరఫరా ఛార్జీలు మరియు క్రాస్ సబ్సిడి సర్‌ఛార్జీలు 1-9-2017 నుండి 31-3-2018 వరకు చట్టాన్ని అనుసరించి కమీషన్ వారు సవరించనంత వరకు అమలులో ఉంటాయి.

CMD/TSSPDCL **CMD/TSNPDCL**

అనుబంధం - 1

2017-18 ఆర్థిక సంవత్సరానికి రిటైల్ సరఫరా ఛార్జీల షెడ్యూల్

వినియోగదారుని విభాగం	ఎనర్జీ యూనిట్	ఫిక్సడ్/డిమాండ్ ఛార్జీలు (రూ॥లు/కెడబ్ల్యు/హెచ్‌పి/కెవిఎ/నెల)	ఎనర్జీ ఛార్జీలు (రూ॥లు/యూనిట్)
ఎల్‌టి.I గృహావసరం			
ఎల్‌టి.I(A) నెలకు 100 యూనిట్ల వరకు			
మొదటి 50 యూనిట్లు	కె.డబ్ల్యు.హెచ్	0.00	1.45
51 - 100	కె.డబ్ల్యు.హెచ్	0.00	2.60
ఎల్‌టి.I(B)(i) నెలకు 100 యూనిట్ల పైన మరియు 200 యూనిట్ల వరకు			
మొదటి 100 యూనిట్లు	కె.డబ్ల్యు.హెచ్	0.00	3.30
101 - 200	కె.డబ్ల్యు.హెచ్	0.00	4.30
ఎల్‌టి.I(B)(ii) నెలకు 200 యూనిట్ల పైన			
మొదటి 200 యూనిట్లు	కె.డబ్ల్యు.హెచ్	0.00	5.00
201 - 300	కె.డబ్ల్యు.హెచ్	0.00	7.20
301 - 400	కె.డబ్ల్యు.హెచ్	0.00	8.50
401 - 800	కె.డబ్ల్యు.హెచ్	0.00	9.00
800 పైన	కె.డబ్ల్యు.హెచ్	0.00	9.50
ఎల్‌టి.II గృహేతర అవసరాలు/ వాణిజ్యం			
ఎల్‌టి.II(A) నెలకు 50 యూనిట్ల వరకు	కె.డబ్ల్యు.హెచ్/ కె.వి.ఎ.హెచ్	50.00	6.00
ఎల్‌టి.II(B) నెలకు 50 యూనిట్ల పైన			
0-100	కె.డబ్ల్యు.హెచ్/ కె.వి.ఎ.హెచ్	60.00	7.50
101-300		60.00	8.90
301-500		60.00	9.40
500 పైన		60.00	10.00
ఎల్‌టి.II (C) అడ్వర్టయిజ్‌మెంట్ హోర్డింగ్‌లు	కె.డబ్ల్యు.హెచ్/ కె.వి.ఎ.హెచ్	60.00	12.00
ఎల్‌టి.II(D) క్షౌరశాలలు నెలకు 200 యూనిట్ల వరకు			
0-50	కె.డబ్ల్యు.హెచ్/ కె.వి.ఎ.హెచ్	60.00	5.30
51 -100		60.00	6.60
101-200		60.00	7.50
ఎల్‌టి.III పరిశ్రమలు			
పరిశ్రమలు	కె.డబ్ల్యు.హెచ్/ కె.వి.ఎ.హెచ్	60.00	6.70
సీజనల్ లోడుకై (ఆఫ్ సీజనల్)		60.00	7.40
మత్స్య & రొయ్యల పెంపకం		21.00	5.20
చెఱకు క్రషింగ్		21.00	5.20
కోళ్ళ ఫారం		50.00	4.00
పుట్టగొడుగు,కుందేళ్ళ గొర్రెల & మేకల ఫారాలు,		60.00	6.30
పూలతోటల పెంపకం(గ్రీన్‌హౌస్)		60.00	6.30
ఎల్‌టి.IV కుటీర పరిశ్రమలు			
కుటీర పరిశ్రమలు 10 హెచ్.పి వరకు	కె.డబ్ల్యు.హెచ్	20.00	4.00
వ్యవసాయ సంబంధిత పనులు 10 హెచ్.పి వరకు	కె.డబ్ల్యు.హెచ్	20.00	4.00
ఎల్‌టి.V(A) వ్యవసాయం (డిఎస్ఎమ్ తప్పనిసరి)			
కార్పొరేట్ రైతులు	కె.డబ్ల్యు.హెచ్	0.00	2.50
కార్పొరేటేతర రైతులు	కె.డబ్ల్యు.హెచ్	0.00	0.00
ఎల్‌టి.V(B) ఇతరులు			
ఉద్యాన మొక్కల పెంపకం 15హెచ్.పి లోడ్ వరకు	కె.డబ్ల్యు.హెచ్	20.00	4.00
ఎల్‌టి.VI వీధి దీపాలు మరియు పిడబ్ల్యుఎస్ స్కీమ్‌లు			
ఎల్‌టి.VI(A) వీధి దీపాలు			
పంచాయితీలు	కె.డబ్ల్యు.హెచ్	32.00	6.10
మున్సిపాలిటీలు	కె.డబ్ల్యు.హెచ్	32.00	6.60
మున్సిపల్ కార్పోరేషన్‌లు	కె.డబ్ల్యు.హెచ్	32.00	7.10
ఎల్‌టి.VI(B) పిడబ్ల్యుఎస్ స్కీమ్‌లు			
పంచాయితీలు	కె.డబ్ల్యు.హెచ్/ కె.వి.ఎ.హెచ్	32.00	5.00
మున్సిపాలిటీలు		32.00	6.10
మున్సిపల్ కార్పోరేషన్‌లు		32.00	6.60
ఎల్‌టి.VII సాధారణ అవసరం			
ఎల్‌టి.VII(A) సాధారణ అవసరం	కె.డబ్ల్యు.హెచ్/ కె.వి.ఎ.హెచ్	21.00	7.30
ఎల్‌టి.VII(B) ప్రార్థనా మందిరాలు			
2 కిలోవాట్ లోడ్ వరకు	కె.డబ్ల్యు.హెచ్	21.00	5.40
2 కిలోవాట్ లోడ్ పైన	కె.డబ్ల్యు.హెచ్	21.00	6.00
ఎల్‌టి.VIII తాత్కాలిక సరఫరా	కె.డబ్ల్యు.హెచ్/ కె.వి.ఎ.హెచ్	21.00	11.00
హెచ్‌టి.I(A) పరిశ్రమలు-సాధారణం			
132 కెవి మరియు ఆపైన	కె.వి.ఎ.హెచ్	390.00	5.65
33 కెవి	కె.వి.ఎ.హెచ్	390.00	6.15
11 కెవి	కె.వి.ఎ.హెచ్	390.00	6.65
లైట్లు మరియు ఫ్యాన్స్			
132 కెవి మరియు ఆపైన	కె.వి.ఎ.హెచ్	-	5.65
33 కెవి	కె.వి.ఎ.హెచ్	-	6.15
11 కెవి	కె.వి.ఎ.హెచ్	-	6.65
పరిశ్రమ కాలనీలు			
132 కెవి మరియు ఆపైన	కె.వి.ఎ.హెచ్	-	6.30
33 కెవి	కె.వి.ఎ.హెచ్	-	6.30
11 కెవి	కె.వి.ఎ.హెచ్	-	6.30
సీజనల్ పరిశ్రమలు			
132 కెవి మరియు ఆపైన	కె.వి.ఎ.హెచ్	390.00	6.70
33 కెవి	కె.వి.ఎ.హెచ్	390.00	6.90
11 కెవి	కె.వి.ఎ.హెచ్	390.00	7.60
కోళ్ళ పరిశ్రమలు			
33 కెవి	కె.వి.ఎ.హెచ్	390.00	4.15
11 కెవి	కె.వి.ఎ.హెచ్	390.00	4.65
హెచ్‌టి.I(A) 150 కెవిఎ లోడ్ వరకు ఐచ్ఛిక విభాగం			
11 కెవి	కె.వి.ఎ.హెచ్	80.00	7.00
టైమ్ ఆఫ్ డే టారిఫ్ (6.00 పి.ఎమ్ నుండి 10.00 పి.ఎమ్ వరకు మరియు 6 ఎ.ఎమ్ నుండి 10.00 ఎ.ఎమ్ వరకు)			
132 కెవి మరియు ఆపైన	కె.వి.ఎ.హెచ్	-	6.65
33 కెవి	కె.వి.ఎ.హెచ్	-	7.15
11 కెవి	కె.వి.ఎ.హెచ్	-	7.65
టైమ్ ఆఫ్ డే టారిఫ్ (10.00 పి.ఎమ్ నుండి 6 ఎ.ఎమ్ వరకు)			
132 కెవి మరియు ఆపైన	కె.వి.ఎ.హెచ్	-	4.65
33 కెవి	కె.వి.ఎ.హెచ్	-	5.15
11 కెవి	కె.వి.ఎ.హెచ్	-	5.65
కోళ్ళ పరిశ్రమలు టైమ్ ఆఫ్ డే టారిఫ్ (6.00 పి.ఎమ్ నుండి 10.00 పి.ఎమ్ వరకు మరియు 6 ఎ.ఎమ్ నుండి 10.00 ఎ.ఎమ్ వరకు)			
33 కెవి	కె.వి.ఎ.హెచ్	-	5.15
11 కెవి	కె.వి.ఎ.హెచ్	-	5.65
కోళ్ళ పరిశ్రమలు టైమ్ ఆఫ్ డే టారిఫ్ (10.00 పి.ఎమ్ నుండి 6 ఎ.ఎమ్ వరకు)			
33 కెవి	కె.వి.ఎ.హెచ్	-	3.15
11 కెవి	కె.వి.ఎ.హెచ్	-	3.65
హెచ్‌టి.I(B) ఫెర్రో అల్లాయిస్			
132 కెవి మరియు ఆపైన	కె.వి.ఎ.హెచ్	-	5.00
33 కెవి	కె.వి.ఎ.హెచ్	-	5.50
11 కెవి	కె.వి.ఎ.హెచ్	-	5.90
హెచ్‌టి.II ఇతరులు			
132 కెవి మరియు ఆపైన	కె.వి.ఎ.హెచ్	390.00	6.80
33 కెవి	కె.వి.ఎ.హెచ్	390.00	7.00
11 కెవి	కె.వి.ఎ.హెచ్	390.00	7.80
టైమ్ ఆఫ్ డే టారిఫ్ (6.00 పి.ఎమ్ నుండి 10.00 పి.ఎమ్ వరకు మరియు 6 ఎ.ఎమ్ నుండి 10.00 ఎ.ఎమ్ వరకు)			
132 కెవి మరియు ఆపైన	కె.వి.ఎ.హెచ్	-	7.80
33 కెవి	కె.వి.ఎ.హెచ్	-	8.00
11 కెవి	కె.వి.ఎ.హెచ్	-	8.80
టైమ్ ఆఫ్ డే టారిఫ్ (10.00 పి.ఎమ్ నుండి 6 ఎ.ఎమ్ వరకు)			
132 కెవి మరియు ఆపైన	కె.వి.ఎ.హెచ్	-	5.80
33 కెవి	కె.వి.ఎ.హెచ్	-	6.00
11 కెవి	కె.వి.ఎ.హెచ్	-	6.80
హెచ్‌టి.III ఏయిర్‌పోర్ట్, బస్‌స్టేషన్స్ మరియు రైల్వే స్టేషన్స్			
132 కెవి మరియు ఆపైన	కె.వి.ఎ.హెచ్	390.00	6.45
33 కెవి	కె.వి.ఎ.హెచ్	390.00	6.85
11 కెవి	కె.వి.ఎ.హెచ్	390.00	7.50
టైమ్ ఆఫ్ డే టారిఫ్ (6.00 పి.ఎమ్ నుండి 10.00 పి.ఎమ్ వరకు మరియు 6 ఎ.ఎమ్ నుండి 10.00 ఎ.ఎమ్ వరకు)			
132 కెవి మరియు ఆపైన	కె.వి.ఎ.హెచ్	-	7.45
33 కెవి	కె.వి.ఎ.హెచ్	-	7.85
11 కెవి	కె.వి.ఎ.హెచ్	-	8.50
టైమ్ ఆఫ్ డే టారిఫ్ (10.00 పి.ఎమ్ నుండి 6 ఎ.ఎమ్ వరకు)			
132 కెవి మరియు ఆపైన	కె.వి.ఎ.హెచ్	-	5.45
33 కెవి	కె.వి.ఎ.హెచ్	-	5.85
11 కెవి	కె.వి.ఎ.హెచ్	-	6.50
హెచ్‌టి.IV లిఫ్ట్ ఇరిగేషన్ మరియు సి.పి.డబ్ల్యు.యస్			
హెచ్‌టి.IV(A) లిఫ్ట్ ఇరిగేషన్, వ్యవసాయం (11కె.వి., 33కె.వి. & 132 కె.వి. మరియు ఆపైన)	కె.వి.ఎ.హెచ్	0.00	6.40
హెచ్‌టి.IV(B) కాంపోజిట్ ప్రొటెక్టెడ్ వాటర్ సప్లై స్కీములు (11కె.వి.,33కె.వి.&132 కె.వి. మరియు ఆపైన)	కె.వి.ఎ.హెచ్	0.00	5.10
హెచ్‌టి.V(A) రైల్వే ట్రాక్షన్	కె.వి.ఎ.హెచ్	390.00	4.05
హెచ్‌టి.V(B) హెచ్ఎమ్ఆర్ (మెట్రో)	కె.వి.ఎ.హెచ్	390.00	3.95
హెచ్‌టి.VI టౌన్‌షిప్స్ మరియు కాలనీలు (11కె.వి., 33కె.వి. మరియు 132 కె.వి. మరియు ఆపైన)	కె.వి.ఎ.హెచ్	60.00	6.30
హెచ్‌టి.VII తాత్కాలిక సరఫరా			
132 కెవి మరియు ఆపైన	కె.వి.ఎ.హెచ్	500.00	9.80
33 కెవి	కె.వి.ఎ.హెచ్	500.00	10.00
11 కెవి	కె.వి.ఎ.హెచ్	500.00	10.80
హెచ్‌టి: రూరల్ ఎలక్ట్రిక్ సప్లై కో- ఆపరేటివ్ సొసైటీలు (రెస్కోలు)			
సిరిసిల్ల రెస్కో 11 కెవి	కె.డబ్ల్యు.హెచ్	0.00	1.00

నియమ నిబంధనలు:

1. ఇంధన సర్‌ఛార్జ్ సర్దుబాటు ఛార్జీలు విద్యుత్ చట్టం 2003 నిబంధనలను అనుసరించి వర్తించును.
2. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సుంకం చట్టం నిబంధనల ప్రకారం విద్యుత్ సుంకం ఈ ధరలలో కలిసి లేదు.
3. **వోల్టేజ్ సర్‌ఛార్జ్:** వోల్టేజ్ సర్‌ఛార్జ్ ఉపసంహరణ 2017-18 సంవత్సరానికి కూడా కొనసాగించడమైనది.
4. **డిమాండ్‌ను దాటిన వారికి అదనపు ఛార్జీలు**

ఏదైనా ఒక నెలలో నమోదైన డిమాండ్ (ఆర్ఎమ్‌డి) వినియోగదారుడు లైసెన్సీతో కుదుర్చుకున్న ఒప్పందపు డిమాండ్ (సిఎమ్‌డి) కన్నా ఎక్కువగా ఉంటే అట్టి వినియోగదారుడు ఈ క్రింది ఛార్జీలను చెల్లించవలెను.

సిఎమ్‌డిలో ఆర్ఎమ్‌డి %	ఎక్కువ డిమాండ్‌పై డిమాండ్ ఛార్జీలు	మొత్తం ఎనర్జీపై ఎనర్జీ ఛార్జీలు
100% నుండి 120%	సాధారణ ఛార్జీలకు రెండు రెట్లు	సాధారణ ఛార్జీలు
120% కంటే ఎక్కువ 200% వరకు	సాధారణ ఛార్జీలకు రెండు రెట్లు	సాధారణ ఛార్జీలకు 1.15 రెట్లు
200% కంటె ఎక్కువ	సాధారణ ఛార్జీలు రెండు రెట్లు	సాధారణ ఛార్జీలకు 1.20 రెట్లు

హెచ్.టి. కేటగిరి - 5ఎ & 5బి రైల్వే ట్రాక్షన్ మరియు హెచ్ఎమ్ఆర్‌కు సంబంధించి నమోదైన డిమాండ్ ఒప్పందపు డిమాండ్‌కు 120% దాటినచో మొత్తం వినియోగించిన ఎనర్జీపై సాదారణ ఛార్జీలకు 1.05 రెట్లు లెక్కించబడును.

5. కనీస ఛార్జీలు:

కేటగిరి ఎల్‌టి విభాగాలు		2017-18 సం॥నకు రేట్లు
ఎల్‌టి-I(A)	గృహ వినియోగం	కనెక్టెడ్ లోడ్ 1000 వాట్స్ వరకు
ఎల్‌టి-I(B)(i)		సింగిల్ ఫేస్ రూ. 25/- నెలకు
ఎల్‌టి-I(B)(ii)		కనెక్టెడ్ లోడ్ 1000 వాట్స్ పైన
		సింగిల్ ఫేస్ రూ. 50/- నెలకు
		త్రీ ఫేస్ రూ. 150/- నెలకు
ఎల్‌టి-II(A&B)	గృహేతర / వాణిజ్యం	సింగిల్ ఫేజ్ రూ. 65/- నెలకు
		త్రీ ఫేజ్ రూ.200/- నెలకు
ఎల్‌టి-II(C)	అడ్వర్‌టైజ్‌మెంట్ హోర్డింగ్	రూ.300/- నెలకు
ఎల్‌టి-II(D)		సింగిల్ ఫేజ్ రూ. 65/- నెలకు
		త్రీ ఫేజ్ రూ.200/- నెలకు
ఎల్‌టి-VI(A)	వీధి దీపాలు పంచాయితీలు	రూ.2/పాయింట్ /నెలకు
	వీధి దీపాలు మున్సిపాలిటీలు &కార్పోరేషన్‌లు	రూ.6/పాయింట్ /నెలకు
ఎల్‌టి-VII(A)	సాధారణ అవసరం	సింగిల్ ఫేజ్ రూ.50/నెలకు
		త్రీ ఫేజ్ రూ.150/నెలకు
ఎల్‌టి-VIII	తాత్కాలిక సరఫరా	మొదటి 30రోజులు లేక అందులో పాక్షికానికి ప్రతి ఒప్పందపు లోడ్ కిలోవాట్ కి రూ.125/-చొప్పున తదుపరి ప్రతి 15 రోజులు లేక అందులో పాక్షిక కాలానికి ఒప్పందపు లోడు కిలో వాట్‌కి రూ.75/- చొప్పున
హెచ్‌టి విభాగాలు		
కనీస బిల్లింగ్ డిమాండ్:		హెచ్‌టి 6 (అనగా టౌన్‌షిప్ కాలనీ కేటగిరిలో వాస్తవ నమోదిత డిమాండ్ బిల్లింగ్ డిమాండ్ అవుతుంది) మినహాయించి మిగిలిన అన్ని కేటగిరిలకు నెలలో నమోదయిన డిమాండ్ లేదా ఒప్పందపు డిమాండ్‌లో 80% గాని ఏది గరిష్ఠమో అది.
కనీసం ఎనర్జీ ఛార్జీలు:		
హెచ్.టి I(A)	పారిశ్రామిక	50 యూనిట్లు(కెవిఎహెచ్)/ బిల్లింగ్ డిమాండ్ కెవిఎ నెలకు
హెచ్.టి-I(B)	ఫెర్రో అల్లాయిస్	గ్యారెంటీ ఆఫ్‌టేక్ ఎనర్జీ 6701యూనిట్లు (కెవిఎహెచ్/కెవిఎ/ సంవత్సరానికి). దీనిని నెలవారిగా కాకుండా సంవత్సరం మొత్తానికి లెక్కించాలి మరియు మినిమమ్ ఆఫ్‌టేక్ లెక్కించడానికి సరఫరా నిలిపివేసిన కాలాన్ని మినహాయించవలెను.
హెచ్.టి-II	ఇతరాలు	25 యూనిట్లు(కెవిఎహెచ్)/ బిల్లింగ్ డిమాండ్ కెవిఎ నెలకు
హెచ్.టి-III	ఎయిర్‌పోర్టు, బస్‌స్టేషన్ మరియు రైల్వే స్టేషన్	50 యూనిట్లు(కెవిఎహెచ్)/ బిల్లింగ్ డిమాండ్ కెవిఎ నెలకు
హెచ్.టి-V(A&B)	రైల్వే ట్రాక్షన్ & హెచ్ఎమ్ఆర్	32 యూనిట్లు (కెవిఎహెచ్)/ ఒప్పందపు డిమాండ్ కెవిఎ నెలకు
హెచ్.టి-VI	టౌన్‌షిప్స్ కాలనీలు	నమోదైన డిమాండ్‌ను బిల్లింగ్ డిమాండ్‌గా పరిగణించవలెను. 25యూనిట్లు (కెవిఎహెచ్) /ఒప్పందపు డిమాండ్ కెవిఎ నెలకు

6. వినియోగ దారుల ఛార్జీలు:

వినియోగ దారుల విభాగం	రూ. నెలకు
ఎల్‌టి విభాగం:	
ఎల్‌టి-1 గృహవినియోగం (యూనిట్లు/నెలకు)	
0-50	25/-
51-100	30/-
101-200	50/-
201-300	60/-
300 పైన	80/-
ఎల్‌టి-2 గృహేతర /వాణిజ్యం (యూనిట్లు/నెలకు)	
0-50	45/-
51-100	55/-
100 పైన	65/-
ఎల్‌టి-2సి అడ్వర్‌టైజ్‌మెంట్ హోర్డింగ్స్	70/-
ఎల్‌టి-2డి హెయిర్ కటింగ్, సెలూన్ నెలకు 200 యూనిట్ల వరకు	
0-50	45/-
51-100	55/-
101-200	65/-
ఎల్‌టి-3 పరిశ్రమలు 20హెచ్‌పి వరకు	75/-
ఎల్‌టి-3 పరిశ్రమలు 21-50హెచ్‌పి	300/-
ఎల్‌టి-3 పరిశ్రమలు 51-100హెచ్‌పి	1125/-
ఎల్‌టి-4 కుటీరపరిశ్రమలు	45/-
ఎల్‌టి-5 వ్యవసాయం	30/-
ఎల్‌టి-6 వీధిదీపాలు & పిడబ్ల్యుఎస్	50/-
ఎల్‌టి-7 సాధారణ అవసరం	60/-
ఎల్‌టి-8 తాత్కాలిక సరఫరా	65/-
హెచ్‌టి విభాగాలు	
హెచ్‌టి వినియోగదారులు 11కెవి వద్ద	1685/-
హెచ్‌టి వినియోగదారులు 33కెవి వద్ద	1685/-
హెచ్‌టి వినియోగదారులు 132కెవి మరియు ఆపైన	3370/-

7. అపరాధ రుసుము:

ఎల్‌టి విభాగాలు

ఎ. ఎల్‌టి -1ఎ, ఎల్‌టి-1బి, ఎల్‌టి-2ఎ, ఎల్‌టి-2డి, ఎల్‌టి-4 మరియు ఎల్‌టి-5బి కేటగిరీలలోని వినియోగదారుడు గడువు తేది తదుపరి బిల్లు చెల్లించినచో ఈ క్రింది తెలిపిన ధరల ప్రకారం బిల్లుపై నెలకు అపరాద రుసుము చెల్లించాలి.

ఎల్.టి -1ఎ	రూ. 10/- నెలకు
ఎల్‌టి -1బి, 2ఎ, 2డి, 4 మరియు 5బి	రూ. 25/- నెలకు

బి. ఎల్‌టి - 2బి, 2సి, 3, 6 మరియు 7 క్యాటగిరీలలో వినియోగదారులు గడువు తేదీలోపు విద్యుత్ ఛార్జీలు చెల్లించనప్పుడు బిల్లుపై ఉన్న గడువు తేదీ నుండి బిల్లు చెల్లింపు తేదీ వరకు ప్రతీ 100రూ॥లకు 5 పైసలు చొప్పున లేదా 150రూ॥లు ఈ రెండింటిలో ఏది ఎక్కువ అయితే అది లైసెన్సీ వారిచే అపరాధ రుసుము విధించబడును. వాయిదాలు మంజూరు చేసిన సందర్భంలో బకాయి ఉన్న మొత్తం పై సాలీన 18% చక్రవడ్డీ చొప్పున లెసెన్సీ వారిచే వడ్డీ విధించబడును. మరియు ఈ రెండు (అపరాధ రుసుము మరియు వడ్డీ) ఒకేసారి విధించబడదు.

హెచ్‌టి విభాగాలు:

వినియోగదారులు గడువు తేదీలోపు విద్యుత్ ఛార్జీలు చెల్లించనప్పుడు బిల్లుపై ఉన్న గడువు తేదీ నుండి బిల్లు చెల్లింపు తేదీ వరకు ప్రతీ 100రూ॥లకు 5 పైసలు చొప్పున లేదా 550రూ॥లు ఈ రెండింటిలో ఏది ఎక్కువ అయితే అది లైసెన్సీ వారిచే అపరాధ రుసుము విధించబడును. వాయిదాలు మంజూరు చేసిన సందర్భంలో బకాయి ఉన్న మొత్తం పై సాలీన 18% చక్రవడ్డీ చొప్పున లెసెన్సీ వారిచే వడ్డీ విధించబడును. మరియు ఈ రెండు (అపరాధ రుసుము మరియు వడ్డీ) ఒకేసారి విధించబడదు.

8. రీకనెక్షన్ ఛార్జీలు

ఎ. ఎల్‌టి సర్వీసులు	
ఎల్‌టి -1ఎ	రూ. 25/-
ఎల్‌టి-1ఎ మినహా మిగతా అన్ని ఎల్‌టి ఓవర్‌హెడ్ సర్వీసులకు	రూ. 75/-
భూగర్భ సర్వీసులు	రూ. 200/-
బి. హెచ్.టి సర్వీసులు	
11 కెవి	రూ. 1000/-
33 కెవి	రూ. 2000/-
132 కెవి మరియు ఆపైన	రూ. 3000/-

9. టెస్టింగ్ ఛార్జీలు

	ఎల్‌టి	హెచ్‌టి
ఇన్‌స్టాలేషన్ నూతన ఇన్‌స్టాలేషన్ లేదా ఇంతకు ముందు ఉన్న ఇన్‌స్టాలేషన్ విస్తరణకు మొదటిసారి పరీక్ష మరియు తనిఖీ	లేదు	లేదు
తదుపరి పరీక్ష మరియు లేదా తనిఖీ సంబంధిత విభాగంచే ఇన్‌స్టాలేషన్‌లో లోపం గుర్తించినప్పుడు లేదా సరఫరా నిబంధన పాటించనప్పుడు ముందస్తుగా వినియోగదారుడు చెల్లించవలసిన ఛార్జీలు	20/-	200/-
మీటర్లు		
ఎసి సింగిల్ ఫేజ్ ఎనర్జీ మీటర్	100/-	
ఎసి త్రీ ఫేజ్ ఎనర్జీ మీటర్	300/-	
ఎల్‌టి ట్రై వెక్టర్ మీటర్	2000/-	
11కెవి		3000/-
33కెవి		3000/-
132 కెవి మరియు ఆపైన		3000/-
ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్		
ప్రతీ తైలం నమూనాకు	రూ. 150/- ప్రతీ నమూనాకు	

10. పర్యవేక్షణ / తనిఖీ మరియు చెకింగ్ ఛార్జీలు

అన్ని ఎల్‌టి విభాగాలకు	రూ.100/-
అన్ని హెచ్‌టి విభాగాలకు	రూ.600/-

11. తక్కువ పవర్‌ఫ్యాక్టర్ ఛార్జీలు

కెవిఎహెచ్ బిల్లింగ్ వర్తించే అన్ని వినియోగదారులకు పవర్‌ఫ్యాక్టర్ సర్‌ఛార్జ్ విధించబడదు

12. కెపాసిటర్ సర్‌ఛార్జీలు

ఈ క్రింద తెలిపిన కనెక్టెడ్ లోడ్ కలిగిన కెడబ్లూహెచ్ ఆదారిత బిల్లింగ్ ఎల్‌టి వినియోగదారులకు (ఎల్‌టి గృహా అవసరాలు మినహాయించి) కెపాసిటర్లు పనిచేయనట్లుగా గుర్తించినచో అమలులో ఉన్న నిబందనల ప్రకారం బిల్లు మొత్తంపై 25% చొప్పున కెపాసిటర్ సర్‌ఛార్జ్ విధించబడును.

క్యాటగిరి	ఒప్పందపు లోడ్
ఎల్‌టి 2 మరియు ఎల్‌టి 7ఎ	10 కిలో వాట్ల లోపు
ఎల్‌టి 3 మరియు ఎల్‌టి 6బి	20హెచ్‌పి లోపు

13. స్థిర ఛార్జీలు - సీజనల్ పరిశ్రమలు

ఎల్‌టి 3 : ఒప్పందపు లోడ్‌లో రూ. 50/ హెచ్‌పి/నెలకు

హెచ్‌టి డిమాండ్ ఛార్జీలు : ఒప్పందపు డిమాండ్‌లో 30% లేదా నమోదిత డిమాండ్ రెండింటిలో ఏది ఎక్కువ అయితే అది.

14. ఎల్.టి మరియు హెచ్‌టి వినియోగదారులకు తాత్కాలిక సరఫరా

వినియోగదారుని అభ్యర్థన మేరకు తాత్కాలిక విభాగం ధరలలో మొదటి 12 నెలల వరకు తాత్కాలిక సరఫరా ఇవ్వవచ్చు. 12 నెలల అనంతరం వినియోగదారునికి తాత్కాలిక విభాగం క్రింద కొనసాగించే స్వేచ్ఛ కలదు.

అనుబంధం - 2

ఆర్థిక సం॥ 2017-18 కు ఓపెన్ యాక్సిస్ వినియోగదారులకు కమీషన్ వారు నిర్ణయించిన క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీలు (రూ./కె.డబ్ల్యు.హెచ్)

వినియోగదారుని విభాగం	ఎస్‌పిడిసిఎల్	ఎన్‌పిడిసిఎల్
11కెవి హెచ్‌టి		
హెచ్‌టి I పరిశ్రమలు	1.65	1.66
హెచ్‌టి II ఇతరాలు	2.03	1.97
హెచ్‌టి III ఎయిర్‌పోర్టులు, బస్‌స్టేషన్స్ మరియు రైల్వే స్టేషన్	1.80	1.77
హెచ్‌టి IV ఎత్తిపోతలు మరియు వ్యవసాయం & సిపిడబ్ల్యుయస్	0.36	0.21
హెచ్‌టి VI టౌన్‌షిప్స్ మరియు కాలనీలు	1.31	1.01
హెచ్‌టి తాత్కాలిక సరఫరా	2.76	
33కెవి హెచ్‌టి		
హెచ్‌టి I పరిశ్రమలు	1.46	1.44
హెచ్‌టి II ఇతరాలు	1.76	1.78
హెచ్‌టి IV ఎత్తిపోతలు మరియు వ్యవసాయం & సిపిడబ్ల్యుయస్	1.26	0.86
హెచ్‌టి VI టౌన్‌షిప్స్ మరియు కాలనీలు	1.32	1.29
132 కెవి హెచ్‌టి మరియు ఆపైన		
హెచ్‌టి I పరిశ్రమలు	1.30	1.31
హెచ్‌టి II ఇతరాలు	1.69	3.55
హెచ్‌టి III ఎయిర్‌పోర్టులు, బస్‌స్టేషన్స్ మరియు రైల్వే స్టేషన్	1.51	-
హెచ్‌టి IV ఎత్తిపోతలు మరియు వ్యవసాయం & సిపిడబ్ల్యుయస్	1.24	1.28
హెచ్‌టి V ట్రాక్షన్ & హెచ్.ఎమ్.ఆర్	1.28	1.05
హెచ్‌టి VI టౌన్‌షిప్స్ మరియు కాలనీలు	-	1.28

విద్యుత్ అమూల్యమైనది. దానిని బాధ్యతాయుతంగా వాడండి

నగర, పురపాలక అనుమతుల గడువు తగ్గింపు

ఈనాడు, హైదరాబాద్: సులభతర వాణిజ్యంలో భాగంగా తెలంగాణలో నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో వివిధ అనుమతులకు గరిష్ఠ నిర్దేశిత గడువును తగ్గించారు. అనుమతుల్లో జాప్యాన్ని నివారించేందుకు వీలుగా టీఎస్ఐపాస్‌లో భాగంగా ఈ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. దీనికి అనుగుణంగా గడువును స్పష్టం చేశారు. భవన నిర్మాణాలకు వివిధ దశల్లో తనిఖీలు చేసిన నివేదికలను తనిఖీ చేసిన 48 గంటల్లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ మేరకు పురపాలక శాఖ డైరెక్టర్ టి.కె.శ్రీదేవి ఉత్తర్వులు జారీచేశారు.

వివిధ అనుమతులకు నిర్దేశించిన గడువు: ట్రేడ్ లైసెన్స్: 15 రోజులు; మ్యుటేషన్: 15 రోజులు; భూమి లేదా భవనాల ఆస్తిపన్ను మదింపు: 15 రోజులు; ప్రకటన లైసెన్స్: 15 రోజులు; భవన నిర్మాణ ప్లాన్ తనిఖీ రిపోర్టు: 48 గంటలు; భవన నిర్మాణం పూర్తి అయిన రిపోర్టు అప్‌లోడ్: 48 గంటలు; భవన నిర్మాణ సమయంలో తనిఖీ నివేదిక: 7 రోజులు; నిర్మాణం పూర్తయిన భవనానికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్: 8 రోజులు.

కార్మికుల హామీలను నెరవేర్చని కేసీఆర్

- **తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు రమణ**

ఈనాడు, హైదరాబాద్: ఉద్యమ సమయంలో సింగరేణి కార్మికులకు పలు హామీలిచ్చిన కేసీఆర్ సీఎం అయినా వాటిని నెరవేర్చలేదని తెదేపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ ఆరోపించారు. సింగరేణి కార్మిక సంఘాల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఆదివారం ఎన్టీఆర్ భవన్‌లో టీఎన్‌టీయూసీ ఏర్పాటుచేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఉపరితల బొగ్గు గనులపై మాట్లాడిన దానికి భిన్నంగా ఇప్పటికీ వాటిని తెరాస ప్రభుత్వం కొనసాగిస్తోందని విమర్శించారు.. తెదేపా కార్యనిర్వాహక అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. 3 నెలల క్రితం జరిగిన తెరాస సమావేశంలో వచ్చే ఎన్నికల్లో 116 అసెంబ్లీ స్థానాలు గెలుస్తామని కేసీఆర్ చెప్పారని.. తాజాగా జరిగిన సమావేశంలో 105 సీట్లు అన్నారని.. అంటే 3 నెలలకే 11 సీట్లు తగ్గాయంటే ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందని ఒప్పుకున్నట్లయిందన్నారు. పార్టీ అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. వచ్చే నెల 14 నుంచి 17 వరకూ సింగరేణి కార్మికులతో తెదేపా ఏర్పాటుచేసే సమావేశాలకు రాష్ట్ర నేతలు హాజరవుతారన్నారు.

పోలీసు నిర్బంధంలో ప్రజాభిప్రాయ సేకరణ: చాడ

ఈనాడు, హైదరాబాద్: నిర్వాసితులు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వెల్లడించకుండా ప్రభుత్వం అణిచివేతకు పాల్పడడం అప్రజాస్వామికమని.. పోలీసుల నిర్బంధంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణను చేపట్టడాన్ని ఖండిస్తున్నామని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణ ప్రాంగణం నుంచి నిర్వాసితులను బలవంతంగా బయటకు నెట్టివేయడం, డ్రోన్‌లతో పహారా కాయడం వంటివి ప్రభుత్వ దాష్టికానికి అద్దంపడుతున్నాయని విమర్శించారు. భూములు కోల్పోతున్న రైతులకు 2013 చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయే తప్ప.. కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించవద్దని కోరడం లేదన్నారు.

దేశంలోనే తొలిసారిగా 'విదేశ్‌భవన్' ఏర్పాటు

ముంబయి: విదేశాంగ వ్యవహారాల శాఖ ఇప్పుడు ప్రజలకు మరింత చేరువగా ఉందనీ...విదేశాల్లో చిక్కుకున్న భారత పౌరులను రక్షించడానికి ప్రాధాన్యతనిస్తోందని మంత్రి సుష్మాస్వరాజ్ తెలిపారు. వివిధ కారణాల వల్ల విదేశాల్లో చిక్కుబడిపోయిన సుమారు 80వేల మంది భారతీయులను 2014లో భాజపా సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచీ రక్షించినట్లు ఆమె వివరించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన 'విదేశ్ భవన్'ను ఆమె ఆదివారం ప్రారంభించారు. ఈ తరహా కార్యాలయం ఏర్పాటు కావడం దేశంలో ఇదే ప్రథమం. విదేశాంగ వ్యవహారాల శాఖకు సంబంధించి మహారాష్ట్రలో ఉన్న అన్ని కీలక కార్యాలయాలు 'విదేశ్ భవన్'లో ఉంటాయి. అంటే... ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం, 'భారత సాంస్కృతిక వ్యవహారాల మండలి ప్రాంతీయ కార్యాలయం, 'ప్రొటెక్టర్ ఆఫ్ ఇమిగ్రెంట్స్ కార్యాలయం వంటి కీలక కార్యాలయాలు ఇక్కడ ఉంటాయి.

ప్రశాంతంగా టీఎస్‌పీఎస్సీ పరీక్షలు

ఈనాడు, హైదరాబాద్: వివిధ విభాగాల్లో దాదాపు 882 పోస్టులకు ఆదివారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని 130 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించామన్నారు. అసిస్టెంట్ ఇంజినీర్లు (483 పోస్టులు), ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్ (4), వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ (7) పోస్టులకు జరిపిన ఈ పరీక్షలకు హాజరుశాతం 64.29గా నమోదైందని వెల్లడించారు. పీజీటీ భాషల (తెలుగు, హిందీ, ఉర్దూ) పోస్టులకు కంప్యూటర్ ఆధారిత పరీక్షనూ నిర్వహించామని.. ఇందులో హాజరు శాతం 87.51గా ఉందని వివరించారు.

నేటి పరీక్షలు..

సోమవారం నిర్వహిస్తోన్న పీజీటీ (ఆంగ్లం), ఏఈఈ(సివిల్, మెకానికల్ ఉమ్మడి పేపరు) పోస్టులకు ఏర్పాట్లు పూర్తిచేశామని వాణీప్రసాద్ తెలిపారు. ఏఈఈ పోస్టులకు 44,483 మంది, పీజీటీ పోస్టులకు 2900మంది హాజరు కావాల్సి ఉందని పేర్కొన్నారు.







వరంగల్ అర్బన్ జిల్లా దేవనంపేట వద్ద జాతీయ రహదారి విస్తరణ పనులు ● ఆలేరు మండలం కమ్మగూడెం వద్ద బైపాస్ నిర్మాణం ● ఆలేరు మండలం బహదూర్‌పేట వద్ద నిర్మాణంలో ఆర్‌యూబీ

విస్తరణకు వడివడిగా..

- **రాష్ట్రంలో 2,915 కి.మీ. జాతీయ రహదారుల విస్తరణకు కేంద్రం అనుమతి**
- **భూసేకరణే కీలకం**
- **నూతన చట్టం ప్రకారం చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు**

ఈనాడు, హైదరాబాద్: జాతీయ రహదారుల విస్తరణలో తెలంగాణ వడివడిగా అడుగులు ముందుకు వేస్తోంది. సాగునీటి ప్రాజెక్టుల తర్వాత రహదారుల విస్తరణకే ప్రభుత్వం పెద్దపీట వేసింది. గత మూడేళ్లలో సుమారు రూ.10 వేల కోట్ల వరకు నిధులు కేటాయించింది. దీనికితోడు కేంద్రం భారీ ఎత్తున జాతీయ రహదారులను ప్రకటిస్తోంది. తెలంగాణ ఆవిర్భావం నాటికి రాష్ట్రంలో ఎంత విస్తీర్ణంలో జాతీయ రహదారులున్నాయో అంతకు మించి జాతీయ రహదారులను ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం కోరిన ప్రతి మార్గానికి కేంద్ర ఉపరితల రవాణా మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదముద్ర వేశారు.

కేంద్రం ప్రకటించిన 2,915 కిలోమీటర్ల జాతీయ రహదారుల విస్తరణను మూడేళ్లల్లో పూర్తి చేయాలన్నది తెలంగాణ ప్రభుత్వ యోచన. నిర్మాణానికి అవసరమైన నిధులిచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. గత మూడేళ్లలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సుమారు 500 కిలోమీటర్ల మేర జాతీయ రహదారుల విస్తరణ పనులు పూర్తి చేశారు. మరో 500 కిలోమీటర్ల పనులు జరుగుతున్నాయి. జాతీయ రహదారుల సంస్థ 75 కిలోమీటర్ల పనులు పూర్తి చేసింది. ప్రధానంగా యాదగిరిగుట్ట- వరంగల్ మార్గాన్ని నాలుగు లైన్లుగా విస్తరించే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 100 కిలోమీటర్ల మేర పనులు జరుగుతుండగా మరో 460 కిలోమీటర్ల పనులు చేపట్టాల్సి ఉంది. రానున్న మూడేళ్లల్లో మరో మరో 1,500 కిలోమీటర్ల మార్గాలను పూర్తి చేయాలన్న వ్యూహంతో ఉన్నట్లు తెలంగాణ రాష్ట్ర రహదారులు- భవనాల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ గణపతిరెడ్డి 'ఈనాడు'తో చెప్పారు.

ఐదో స్థానానికి తెలంగాణ

తెలంగాణ ఆవిర్భావం నాటికి రాష్ట్రంలో 2,527 కిలోమీటర్ల జాతీయ రహదారులున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో 2,915 కి.మీ. జాతీయ రహదారుల విస్తరణకు కేంద్రం అనుమతిచ్చింది. దేశవ్యాప్తంగా చూస్తే ప్రతి 100 చదరపు కిలోమీటర్లకు 2.84 కి.మీ. జాతీయ రహదారులున్నాయి. ప్రస్తుతం మంజూరైనవన్నీ పూర్తయితే రాష్ట్రంలో జాతీయ రహదారి సగటు 4.62 కిలోమీటర్లకు పెరుగుతుందని అంచనా. దేశంలో 8,483 కిలోమీటర్ల జాతీయ రహదారులతో ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. రాజస్థాన్, మహారాష్ట్ర, కర్ణాటక తర్వాత స్థానాల్లో ఉన్నాయి. ప్రస్తుత విస్తరణలన్నీ పూర్తయితే జాతీయ రహదారుల విస్తీర్ణంలో తెలంగాణ దేశంలో ఐదో స్థానానికి చేరుకోనుంది. దక్షిణాది రాష్ట్రాల్లో కర్ణాటక తర్వాత రెండో స్థానం తెలంగాణదే అవుతుంది.

నూతన చట్టం ప్రకారమే భూసేకరణ

జాతీయ రహదారుల నిర్మాణంలో భూసేకరణ పెద్ద చిక్కుముడి. ఇటీవల వరకు కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు చేపట్టేవారు. ఇందుకు సుమారు ఏడాదిన్నర వరకు పట్టేది. జాప్యాన్ని నియంత్రించేందుకు తెలంగాణ ప్రభుత్వం 123 జీవో ప్రకారం భూసేకరణ చేపడతామని కేంద్రం నుంచి అనుమతి తీసుకుంది. ఆ జీవో వ్యవహారం వివాదాస్పదం కావటంతో దాన్ని నిలిపివేశారు. పార్లమెంటు ఆమోదం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చట్టం- 2017ను ఇటీవల అమలులోకి తీసుకువచ్చింది. దీనిప్రకారం భూ యజమానులతో సంప్రదింపుల ద్వారా భూమిని సేకరిస్తారు. కాబట్టి యజమానులకు అధిక మొత్తంలో పరిహారం అందటంతోపాటు త్వరితగతిన భూసేకరణకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో రహదారుల విస్తరణకు ఎంత భూమి సేకరించాలన్నదానిపై కన్సల్టెంట్లు కసరత్తు చేస్తున్నారు. జాతీయ రహదారుల సంస్థ చేపట్టేవన్నీ రెండు వరుసల నుంచి నాలుగు వరుసలుగా విస్తరించాల్సిన మార్గాలే. ఇందుకోసం భారీగా భూమి సేకరించాల్సినందున దశల వారీగా చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జాతీయ రహదారుల విస్తరణలో కీలకమైన భూసేకరణ క్రతువును పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తోంది.

దేశానికి ఆదర్శంగా నిలుపుతాం

జాతీయ రహదారుల విస్తరణలో తెలంగాణను అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రణాళిక రూపొందించాం. గడువులోగా నాణ్యతతో నిర్మాణం పూర్తి చేసేలా ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. నూతన చట్టం ప్రకారం భూసేకరణ చేయనున్నందున జాప్యం బాగా తగ్గుతుంది. కేంద్రం వద్ద మరో ఐదారు వేల కోట్ల రూపాయల విలువైన రహదారుల విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణ ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. అవి కూడా మంజూరవుతాయన్న ఆశాభావంతో ఉన్నాం.

– తుమ్మల నాగేశ్వరరావు, రహదారులు– భవనాల శాఖ మంత్రి

నాలుగు మార్గాలు.. రూ. 8వేల కోట్లు

గతేడాది హైదరాబాద్‌లో జరిగిన జాతీయ రహదారి కాంగ్రెస్ (ఇండియన్ రోడ్ కాంగ్రెస్) సమావేశానికి హాజరైన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ రూ.8 వేల కోట్ల వ్యయంతో 460 కిలోమీటర్ల మేర రాష్ట్ర రహదారులను నాలుగు వరుసలుగా విస్తరించేందుకు ఆమోదం తెలిపారు. సంగారెడ్డి- నాందేడ్- అకోల మార్గాన్ని 150 కిలోమీటర్ల మేర విస్తరించేందుకు రూ.2,300 కోట్లు ప్రకటించారు. జగిత్యాల- కరీంనగర్- వరంగల్ మార్గంలో 130 కిలోమీటర్ల విస్తరణకు రూ.2,500 కోట్లు, మంచిర్యాల- చంద్రాపూర్ మార్గంలో 90 కిలోమీటర్లకు రూ.1,500 కోట్లు, సూర్యాపేట- ఖమ్మం మార్గంలో 60 కిలోమీటర్లకు రూ.1,000 కోట్లు, కోదాడ- ఖమ్మం మార్గంలో 40 కిలోమీటర్ల విస్తరణకు రూ.700 కోట్లు మంజూరు చేస్తున్నట్లు గడ్కరీ ప్రకటించారు.

జాతీయ రహదారులుగా మారే మార్గాలివే..

21 మార్గాల్లోని 2,915 కిలోమీటర్ల రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చేందుకు కేంద్రం పచ్చజండా ఊపింది.

వరుస సంఖ్య	మార్గం	దూరం (కిలోమీటర్లలో)
1.	సారపాక- ఏటూరునాగారం- కాళేశ్వరం- చెన్నూరు- కౌటాల- సిర్పూర్	396
2.	హైదరాబాద్- మెదక్- రుద్రూరు- బోధన్- బాసర- భైంసా	248
3.	హైదరాబాద్- ఓఆర్ఆర్- ఘట్‌కేసర్- ఎదులాబాద్- వలిగొండ- తొర్రూరు- నెల్లికుదురు- మహబూబాబాద్- ఇల్లందు- కొత్తగూడెం	234
4.	కోదాడ- మిర్యాలగూడ- దేవరకొండ- కల్వకుర్తి- జడ్చర్ల	211
5.	చౌటుప్పల్- ఇబ్రహీంపట్నం- ఆమనగల్- షాద్‌నగర్- చేవెళ్ల- శంకరపల్లి- కంది	186
6.	సిరిసిల్ల- సిద్దిపేట- జనగాం- అర్వపల్లి- సూర్యాపేట	184
7.	సూర్యాపేట- ఖమ్మం- అశ్వారావుపేట- రాజమండ్రి (ఆంధ్రప్రదేశ్)	177
8.	కరీంనగర్- సిరిసిల్ల- కామారెడ్డి- ఎల్లారెడ్డి- పిట్లం	165
9.	సంగారెడ్డి- నర్సాపూర్- తూప్రాన్- గజ్వేల్- జగదేవ్‌పూర్- భువనగిరి- చౌటుప్పల్	152
10.	హైదరాబాద్- మొయినాబాద్- చేవెళ్ల- మన్నెగూడ- కొడంగల్- కర్ణాటక సరిహద్దు వరకు	135
11.	మెదక్- సిద్దిపేట- ఎల్కతుర్తి	133
12.	వరంగల్- ఖమ్మం	120
13.	తాండూర్- కొడంగల్- మహబూబ్‌నగర్	96
14.	నిర్మల్- మామడ- ఖానాపూర్- మల్లాపురం- రాయికల్	90
15.	మంచిర్యాల- చంద్రాపూర్ (మహారాష్ట్ర) వయా ఆసిఫాబాద్- రెబ్బన	90
16.	మద్దనూరు- బోధన్- నిజామాబాద్	76
17.	భద్రాచలం- జీలుగుమిల్లి- జంగారెడ్డిగూడెం- దేవరపల్లి	68
18.	నిజాంపేట- నారాయణఖేడ్- బీదర్	60
19.	ఆదిలాబాద్- బేల	43
20.	మిర్యాలగూడ- పిడుగురాళ్ల- నరసరావుపేట (ఆంధ్రప్రదేశ్)	26
21.	జహీరాబాద్- బీదర్- డెగ్లూర్	25



లలితా జ్యువెలరీ దుకాణాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్ సతీమణి శైలిమ. చిత్రంలో కేటీఆర్, లలితా జ్యువెలరీ సీఎండీ కిరణ్ కుమార్ దంపతులు

ఆకట్టుకుంటేనే విజయం

- **కేంద్ర మంత్రి దత్తాత్రేయ, రాష్ట్ర మంత్రులు నాయిని, కేటీఆర్**

హైదరాబాద్, న్యూస్‌టుడే: సౌకర్యవంతమైన సేవలు అందిస్తూ వినియోగదారులకు ఆకట్టుకుంటే ఏ వ్యాపారమైనా విజయవంతం అవుతుందని కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ, రాష్ట్ర హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి, పంచాయతీరాజ్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. ఆదివారం వారు హైదరాబాద్ సోమాజిగూడలో లలిత జ్యుయలరీ షోరూంను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సంస్థ సీఎండీ కిరణ్ కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తక్కువ ధరలలో నగలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూకట్‌పల్లి, విజయవాడలోనూ శాఖలను ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మండలి ఛైర్మన్ స్వామిగౌడ్, ఎంపీలు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతారాం నాయక్, అసదుద్దీన్ ఒవైసీ, సుబ్బిరామిరెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, పోలీసు ఉన్నతాధికారి నాగిరెడ్డి, సినీనటుడు గిరిబాబు పాల్గొన్నారు.

యూనిట్ రూ.3.74

- **500 మెగావాట్ల కొనుగోలుకు టెండర్లు ఖరారు**
- **వానలపై ఆశతో మరో 500 మెగావాట్ల కొనుగోలు రద్దు**
- **తెలంగాణ ట్రాన్స్‌కో నిర్ణయం**
- **దక్షిణాది రాష్ట్రాల పోటీతో పెరుగుతున్న విద్యుత్ ధరలు**

ఈనాడు – హైదరాబాద్

వచ్చే రెండు నెలలకు కొనుగోలు చేయాల్సిన విద్యుత్‌ను వెయ్యి మెగావాట్ల నుంచి 500 మెగావాట్లకు తగ్గించాలని తెలంగాణ ట్రాన్స్‌కో తాజాగా నిర్ణయించింది. వెయ్యి మెగావాట్లను రెండు నెలల కాలానికి కొంటామని ఇటీవల ట్రాన్స్‌కో టెండర్లు పిలిచింది. కనిష్ఠ(ఎల్1) ధర రూ.3.74కు 300 మెగావాట్లు సరఫరా చేస్తామని ఓ విద్యుత్ కంపెనీ టెండర్ వేసింది. ఇతర కంపెనీలను సైతం ఇదే ధరకు ఇవ్వమని అడుగుతున్నారు. ధరల సరళిని బట్టి వెయ్యి మెగావాట్లకు బదులు 500 మెగావాట్లు కొంటే సరిపోతుందని తాజాగా నిర్ణయించారు. వచ్చే నెల ఒకటి నుంచి అక్టోబరు చివరిదాకా రోజంతా(24 గంటలూ) కొనేందుకు 2 నెలల స్వల్పకాలిక ఒప్పందాన్ని విద్యుత్ కంపెనీలతో కుదుర్చుకోనున్నారు. ప్రస్తుత వానాకాలం(ఖరీఫ్) పంటల సాగు విస్తీర్ణం కోటి ఎకరాలకు చేరనుందని వ్యవసాయశాఖ అంచనా. ఇప్పుడు భారీ వర్షాలు కురుస్తున్నందున జల విద్యుదుత్పత్తికి సైతం అవకాశాలున్నాయని భావించి.. కొనుగోలు చేయాల్సిన దానిని వెయ్యి నుంచి 500 మెగావాట్లకు తగ్గించినట్లు చెబుతున్నారు. మరోవైపు కేరళ, తమిళనాడు, కర్ణాటకల్లో విద్యుత్ డిమాండు పెరగడం వల్ల 'భారత విద్యుత్ ఎక్స్ఛేంజీ'(ఐఈఈ)లో కొనుగోలు ధరలు పెరుగుతున్నాయి. గత నెల(జులై)లో విద్యుత్ అమ్మకపు ధరలను ఐఈఈ తాజాగా వెల్లడించింది. పశ్చిమ, తూర్పు భారత రాష్ట్రాలు సగటున యూనిట్‌ను రూ.2.45 పైసలకు ఐఈఈలో రోజువారీగా కొనగా దక్షిణాది రాష్ట్రాలు రూ.2.59 చొప్పున చెల్లించాయి. ఒక్కోసారి గరిష్ఠంగా రూ.6.03కు, అత్యల్పంగా 50 పైసలకు అమ్మకాలు జరిగాయి. రోజుకు సగటున 5,773 మెగావాట్ల విద్యుత్ అమ్మకాలు జరిగాయి. దేశంలో దక్షిణాది రాష్ట్రాలు తప్ప మిగతా రాష్ట్రాలన్నీ జూన్‌కన్నా జులైలో ఎక్స్ఛేంజీలో విద్యుత్ కొనుగోలు తగ్గించాయి. జూన్‌లో దక్షిణాది రాష్ట్రాల రోజువారీ సగటు విద్యుత్ కొనుగోలు 1,119 మెగావాట్లుంటే జులైలో 2008 మెగావాట్లకు పెరిగింది. దీనికి భిన్నంగా పశ్చిమ రాష్ట్రాల కొనుగోలు 1,973 నుంచి 1,019 మెగావాట్లకు పడిపోవడం గమనార్హం. తమిళనాడులో పవన విద్యుదుత్పత్తి తగ్గడం, కర్ణాటక, కేరళలో వ్యవసాయ డిమాండు పెరగడం వల్ల దక్షిణాది మొత్తమ్మీద డిమాండు అధికమైంది.

వర్షాలతో జెన్‌కో ప్లాంట్లలో ఉత్పత్తికి కోత

గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో తెలంగాణలో విద్యుత్ డిమాండు కొంతమేర తగ్గింది. ఈ నెల 12న 176 మిలియన్ యూనిట్ల(ఎంయూ) విద్యుత్ వినియోగమవగా ఇందులో 51 ఎంయూలను జెన్‌కో సొంత థర్మల్ కేంద్రాల్లో ఉత్పత్తి చేశారు. తాజాగా ఈ నెల 26న 143 ఎంయూలకు డిమాండు తగ్గగా జెన్‌కో సొంత థర్మల్ కేంద్రాల్లో ఉత్పత్తి 32 ఎంయూలకు తగ్గించారు. ఇతర విద్యుత్కేంద్రాల నుంచి తప్పనిసరిగా కొనాల్సిన ఒప్పందాలున్నందున సొంత కేంద్రాల్లో ఉత్పత్తికి కోత పెడుతున్నారు. వర్షాలు ఆగితే మళ్లీ వ్యవసాయానికి విద్యుత్ డిమాండు పెరుగుతుందని డిస్కంల అంచనా. వానాకాలం పంటలు చివరి దశకు వస్తున్నందున వచ్చే నెలలో వ్యవసాయ బోర్ల వినియోగం అధికంగా ఉంటుందని ముందు జాగ్రత్తగా 500 మెగావాట్లు కొంటున్నట్లు ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకరరావు 'ఈనాడు'కు చెప్పారు.

ఆస్పత్రిలోని మహిళ శవాన్ని పీక్కుతిన్న కుక్క

లక్నో: ప్రభుత్వ ఆస్పత్రిలోని శవాల గదిలో భద్రపరిచిన ఓ మహిళ శవాన్ని కుక్క పీక్కుతింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న డా.రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రిలో ఆదివారం జరిగిన ఈ ఘటన తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. చిన్హట్ ప్రాంతానికి చెందిన పుష్ప తివారి(40) అనే మహిళ విషం తాగింది. దీంతో ఆమెను ఆస్పత్రిలో చేర్చారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో ఆమె చనిపోయింది. మెడికో లీగల్ కేసు కాబట్టి శవపరీక్ష చేసేందుకు మృతదేహాన్ని శవాల గదిలో ఉంచారు. ఆదివారం ఉదయం మృతురాలి బంధువులు వచ్చి చూసేసరికి శవం ముఖం, మెడ భాగాలు కుక్క పీక్కుతిన్నట్లు కన్పించింది. శవానికి ఉన్న చెవిపోగు, ముక్కుపుడగ కూడా కనబడటం లేదని వారు ఆరోపించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఆస్పత్రికి చేరుకున్నారు. శవాల గది ద్వారం వద్ద కుక్క కాలి గుర్తులు ఉండటాన్ని వారు గమనించారు. ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేశారని, పూర్తి విచారణకు ఆదేశించామని ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి ప్రశాంత్ త్రివేది తెలిపారు. ఆస్పత్రి భద్రత పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినందకు సెక్యూరిటీ పర్యవేక్షకుడిని, మరో సిబ్బందిని విధుల నుంచి తొలగించినట్లు ఆయన చెప్పారు.

యురేనస్, నెప్ట్యూన్ గ్రహాలపై వజ్రాల వర్షం

శాస్త్రీయంగా నిరూపించిన పరిశోధకులు

జర్మనీ: మన భూమ్మీద సముద్రాల్లోని నీరు ఆవిరి అయి వర్షం కురిసినట్లే, యురేనస్, నెప్ట్యూన్ గ్రహాలపై వజ్రాల వర్షం కురుస్తుంటుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. హైడ్రోకార్బన్ సమ్మిళితమైన అక్కడి మహాసముద్రాలపై వాతావరణ పీడనం భూమితో పోలిస్తే లక్షల రెట్లు అధికంగా ఉంటుంది కాబట్టి హైడ్రోజన్, కార్బన్ విడిపోతాయని చెబుతున్నారు. ఫలితంగా కార్బన్ ఆవిరై, సముద్ర పైభాగంలో స్ఫటికీకరణం చెంది వజ్రాలుగా వర్షిస్తుందంటున్నారు. చెప్పడమే కాదు ఫ్యాన్సీ ప్లాస్టిక్, అత్యంత శక్తిమంతమైన లేజర్ల సాయంతో ఇది శాస్త్రీయంగా సంభవమేనని శాస్త్రవేత్తలు తాజాగా నిరూపించారు. ఇప్పటివరకు వజ్రాలు కేవలం ఏర్పడతాయని భావించేవారమని, నా జీవితంలోనే ఇది అపురూపమైన క్షణమని జర్మనీలోని హెల్మ్‌హోల్జ్ డ్రెస్‌డెన్ రోస్సెన్‌డోర్ఫ్‌కు చెందిన భౌతిక శాస్త్రవేత్త డొమినిక్ క్రౌస్ పేర్కొన్నారు. పరిశోధన పూర్తి వివరాలు 'నేచర్ ఆస్ట్రోఫిజిక్స్' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

పశ్చిమబెంగాల్‌లోని జల్పాయ్‌గురి జిల్లాలో ఆవుల్ని తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకున్న గుంపు ఒకటి వాహనంలోని ఇద్దరు యువకుల్ని తీవ్రంగా కొట్టి చంపింది.

సైబర్ నేరాలపై అవగాహనకు రాజమౌళి, జూనియర్ ఎన్టీఆర్‌ల గాత్రం

- **ఐదు అంశాలపై లఘుచిత్రాలు రూపొందించిన హైదరాబాద్ పోలీసులు**
- **సినిమా హాళ్లు, టీవీలు, బహిరంగ ప్రదేశాల్లో ప్రసారం**





ఈనాడు, హైదరాబాద్: అంతర్జాల ఆధారిత నేరాలు అంతకంతకూ పెరుగుతుండడంతో హైదరాబాద్ పోలీసులు సరికొత్త రీతిలో చర్యలకు శ్రీకారం చుట్టారు. ఫేస్‌బుక్, వాట్సప్, డెబిట్, క్రెడిట్‌కార్డు మోసాలు, పెళ్లిపేరుతో బహుమతులిస్తామంటూ రూ.లక్షలు స్వాహాచేస్తున్న నేరగాళ్లబారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఐదు అంశాల్లో లఘుచిత్రాలను రూపొందించారు. పోలీసు అధికారులు, సినీ, టీవీ నటీనటులతో లఘుచిత్రాలను నిర్మించాక వాటిని జనబాహుళ్యంలోకి తీసుకెళ్లేందుకు బాహుబలి చిత్ర దర్శకుడు రాజమౌళి, యువ సినీహీరో జూనియర్ ఎన్టీఆర్ గాత్రాలను(వాయిస్ ఓవర్) జోడించారు. సినిమా థియేటర్లు, మల్టీప్లెక్సులు, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు, టీవీలు, బహిరంగ ప్రదేశాల్లో ఈ లఘుచిత్రాలను ప్రసారం చేయనున్నామని హైదరాబాద్ అదనపు సీపీ(నేరపరిశోధన) స్వాతి లక్రా వివరించారు. సామాజిక మాధ్యమాలు పదునైన కత్తులనే ఇతివృత్తంతో పోలీసులు ఈ లఘు చిత్రాలను రూపొందించారు. ఫేస్‌బుక్, వాట్సప్ తదితరాలతో నేరగాళ్లు ఎలా ట్రాప్ చేస్తారు? ఫేస్‌బుక్‌లో వ్యక్తిగత ఫొటోలను ఎలా దుర్వినియోగం చేస్తున్నారు?. అమ్మాయిలు, అబ్బాయిల నకిలీ ఫొటోలతో ఖాతాలు తెరిచి ఎలా మోసాలకు పాల్పడుతున్నారన్న అంశాలు లఘుచిత్రాల్లో ఉన్నాయి. ఈ లఘుచిత్రాలకు జూనియర్ ఎన్టీఆర్ గాత్రం అందించారు. ఆయన సినిమా షూటింగ్‌లో తీరికలేకుండా ఉన్నా.. అడగ్గానే సమయం కేటాయించారని పోలీసులు తెలిపారు. కొందరు సైబర్ నేరస్థులు యువతను ముఖ్యంగా ఇంజినీరింగ్ పూర్తిచేసిన ఉద్యోగార్థులను మోసం చేస్తున్నారని, వారు మోసపోకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చెప్పాలంటూ దర్శకుడు రాజమౌళిని పోలీసు ఉన్నతాధికారులు అభ్యర్థించారు. సామాజిక బాధ్యతలో భాగంగా తాను కచ్చితంగా గాత్రం అందిస్తానంటూ రాజమౌళి ముందుకురావడంతోపాటు డబ్బింగ్ థియేటర్‌లో లఘుచిత్రాన్ని తిలకించి తనదైన శైలిలో మార్పులు సూచించారు. ఈ లఘుచిత్రంతోపాటు డెబిట్‌కార్డులు, క్రెడిట్‌కార్డులకు సంబంధించిన మోసాలు, ఓటీపీ పిన్ నంబర్లు చెప్పకూడదంటూ నిర్మించిన చిత్రానికీ ఆయన గాత్రం అందించారు. లాటరీలు, ఇతర మోసాలపై తీసిన చిత్రానికి హీరో రవితేజతో వాయిస్ ఓవర్ ఇప్పించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

బ్రెజిల్ బత్తాయిపై గురి

- **మహారాష్ట్ర రైతులకు లాభాలనిస్తున్న పంట**
- **తెలంగాణలో ప్రయోగాత్మకంగా సాగుకు ఏర్పాట్లు**
- **ఇజ్రాయెల్ నుంచి మొక్కలు తెప్పిస్తున్న ఉద్యానశాఖ**

ఈనాడు, హైదరాబాద్: బ్రెజిల్‌లో సాగవుతున్న బత్తాయి వంగడాలను తెలంగాణలో ప్రయోగాత్మకంగా సాగుచేయించడానికి ఉద్యానశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ఈ వంగడాలను మహారాష్ట్ర రైతులు సాగుచేస్తున్నారు. వారి పొలాలకు తెలంగాణ ఉద్యానశాఖ అధికారులు వెళ్లి అధ్యయనం చేసి వచ్చారు. రాష్ట్రంలో బత్తాయి తోటలు ఉమ్మడి నల్గొండ జిల్లాలో అధికంగా ఉన్నాయి. కానీ ఇక్కడి పండించే బత్తాయి పండ్లు రసం తయారీకి అనువైనవి కాదని ఎగుమతులకు పెద్దగా ప్రోత్సాహం లభించడం లేదు. గత నాలుగైదేళ్లుగా పండ్ల రసాల కంపెనీలు మహారాష్ట్ర బత్తాయిలకు అధిక ధరలు చెల్లిస్తున్నాయి. ఉదాహరణకు నల్గొండ నుంచి సోమవారం గడ్డి అన్నారం పండ్ల మార్కెట్‌కు వచ్చిన బత్తాయిలకు క్వింటాకు రూ.1666 నుంచి రూ. 2777 దాకా ధర ఇచ్చారు. అదే మహారాష్ట్ర పండ్ల మార్కెట్లలో రూ.2300 నుంచి రూ. 7950 దాకా ధర పలికింది. రుచి, నాణ్యతలో తేడా వల్లనే తెలంగాణ పండ్లకు అధిక ధర రావడం లేదని వ్యాపారులు చెపుతున్నారు. బ్రెజిల్ రకాల పండ్ల నుంచి తయారుచేసే రసాలను ఎక్కువ కాలం నిల్వ చేసే అవకాశమున్నందున ప్రపంచ మార్కెట్‌లో వాటికి అధిక డిమాండు ఉంది. ప్రపంచంలో బత్తాయి పండ్లను, రసాలను ఎగుమతి చేస్తున్న దేశాల్లో బ్రెజిల్ అగ్రస్థానంలో ఉంది. తెలంగాణ ఉద్యానశాఖ అధికారులు మహారాష్ట్ర రైతులతో మాట్లాడి పంటపై అధ్యయనం చేశారు. స్థానిక వంగడాలకన్నా 2 నుంచి 3 టన్నుల అధిక దిగుబడి వస్తోందని, రసాల తయారీ పరిశ్రమలు కొంటున్నాయని వారు చెప్పారు. ఇజ్రాయెల్‌లో అధిక దిగుబడినిస్తున్న బ్రెజిల్ రకాల బత్తాయి మొక్కలను ఒక్కోటీ రూ.300 చొప్పున చెల్లించి ఉద్యానశాఖ అధికారులు తెప్పించారు. వీటిని సిద్దిపేట జిల్లా ములుగు సమీపంలోని ఉద్యానశాఖ పరిశోధనా కేంద్రంలో సాగుచేయిస్తున్నారు.

చేదు వల్ల నాణ్యమైన రసం రావడం లేదు

–వెంకట్రాంరెడ్డి, కమిషనర్, తెలంగాణ ఉద్యానశాఖ

తెలంగాణలో పండుతున్న బత్తాయి పండ్లలో లియోనిన్ శాతం అధికంగా ఉన్నందున చేదుగా ఉంటున్నాయి. వీటి నుంచి తయారయ్యే రసం ఎక్కువ కాలం నిల్వ ఉండటం లేదు. బ్రెజిల్ రకాల్లో లియోనిన్ శాతం తక్కువ ఉన్నట్లు మా అధ్యయనంలో తేలింది. వీటి సాగును ప్రోత్సహిస్తే పండ్ల రసాల శుద్ధి, తయారీ పరిశ్రమలను ఏర్పాటుచేయడానికి అవకాశం ఉంటుంది. మహారాష్ట్ర రైతులు బ్రెజిల్ రకాల సాగుతో లాభాలనార్జిస్తున్నారు.

ఈనాడు

దిక్సూచిలాంటి తీర్పు

దేశ పౌరులందరికీ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాల పరికల్పనను ప్రస్తావించిన రాజ్యాంగ అవతారిక- వ్యక్తుల గౌరవప్రద జీవనానికీ గట్టి భరోసానిచ్చింది. వ్యక్తి గౌరవం రాజ్యాంగ మౌలిక సూత్రమని, వ్యక్తిగత గోప్యత (ప్రైవసీ) దాని పరిధిలోకి వస్తుం దంటూ దాన్ని ప్రాథమిక హక్కుగా నిర్ధారించిన తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పు చరిత్రాత్మకమైనది. 1973నాటి కేశవానంద భారతి తీర్పు దరిమిలా అంత విశిష్టమైన తీర్పుగా సన్నుతులందుకొంటున్న ఈ చారిత్రక న్యాయనిర్ణయం- 130 కోట్ల జనావళి రోజువారీ జీవన పార్శ్వాలను గణనీయంగా ప్రభావితం చేసేటంత పదునైనది. ఆధార్ పేరిట పౌరులకు విశిష్ట గుర్తింపు సంఖ్య కార్డుల్ని జారీచేస్తున్న ప్రభుత్వం- అందుకోసం వారి వేలిముద్రలు, ఐరిస్ (కంటిపాప) చిత్రాలు నమోదు చేస్తుండటం తెలిసిందే. అలా ప్రభుత్వం సేకరించిన విస్తృత సమాచార నిధి పౌరుల వ్యక్తిగత గోప్యతకు భంగకరంగా ప్రైవేటు సంస్థల చేజిక్కే ప్రమాదంపై ఆందోళన చెందుతూ పలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వాటిని ఫైసలా చేస్తూ రాజ్యాంగ ధర్మాసనం విడివిడిగా ఆరు తీర్పులు వెలువరించినా వాటి ఉమ్మడి సారం ఒక్కటే. అది- రాజ్యాంగంలోని మూడోవిభాగం కింద పౌరులకు హామీగా దఖలు పడిన ప్రాథమిక హక్కుల్లో వ్యక్తిగత గోప్యతా అంతర్భాగమన్నదే! ఏనాడో 1791లో అమెరికా రాజ్యాంగానికి చేసిన నాలుగో సవరణ పౌరుల వ్యక్తిగత గోప్యతకు ఎత్తుపీట వేసింది. అలాంటి అధికరణ లేవీ భారత రాజ్యాంగంలో లేవంటూ లోగడ ఎంపీ శర్మ, ఖరక్ సింగ్ కేసుల్లో రాజ్యాంగ ధర్మాసనాలు వెలువరించిన తీర్పుల దన్నుతో సుప్రీంకోర్టులో కేంద్రం 'ప్రైవసీ'కి వ్యతిరేకంగా వాదించింది. ఏడు దశాబ్దాల క్రితం లేని సమస్యలు ఇప్పుడున్నాయంటూ వాటిని పరిష్కరించేలా సరళంగా రాజ్యాంగానికి భాష్యం చెప్పాల్సి ఉందన్న సుప్రీం న్యాయపాలిక- పౌరుల వ్యక్తిగత గోప్యతను ప్రాథమిక హక్కుగా నిర్ధారించి దాని పరిరక్షణ బాధ్యతను ప్రభుత్వాలకు కట్టబెట్టింది. స్థూల దృష్టికి ఎన్నో వివాదాలకు పరిష్కారంగా ఉన్న తీర్పే, మున్ముందు మరెన్నో న్యాయ సంకటాలకు పాదు చెయ్యనుంది!

భారత రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చే అపరిమిత అధికారం పార్లమెంటుకు సైతం లేదంటూ 1973లో కేశవానంద భారతి కేసులో 12 మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చింది. అది వెలువడిన రెండేళ్లకే సమస్త పౌరహక్కుల్నీ తొక్కిపట్టి నాటి ఇందిర జమానా ఆత్యయిక స్థితి విధించిన సమయంలో- 1976 ఏప్రిల్‌లో వెలువడిన 'సుప్రీం' తీర్పు ప్రజాస్వామ్య భారతి కంటిలో నలుసులా సలుపుతూనే ఉంది. జీవించేందుకు పౌరులకు లభించిన ప్రాథమిక హక్కు రాజ్యాంగం ఇచ్చిన బహుమతి అని, ఆత్యయిక పరిస్థితుల్లో దాన్ని తాత్కాలికంగా నిలుపుచేయవచ్చునన్న మెజారిటీ తీర్పు జస్టిస్ వైవీ చంద్రచూడ్ ముఖతా నాడు వెలువడింది. ఏడీఎం జబల్‌పూర్‌గా ప్రసిద్ధమైన ఆ కేసులో అత్యంత అమానుషమైన ఆ తీర్పును ఏడు నిలువుల లోతు పాతిపెడుతూ జస్టిస్ డీవై చంద్రచూడ్ (నాటి తీర్పు రాసిన న్యాయమూర్తి తనయుడు) ఇచ్చిన తాజా తీర్పు ప్రాథమిక హక్కుల్ని జేగీయమానం చేసింది. వ్యక్తిగత గోప్యత ప్రాథమిక 'తత్వాన్ని' తీర్మానించడంతో సరిపుచ్చుకుండా దాని విస్తృతిని అవలోకిస్తూ ధర్మాసనం వెలువరించిన 547 పేజీల తీర్పు- ఇప్పటికే కొన్ని రాజ్యాంగ ధర్మాసనాలు విచారిస్తున్న వ్యాజ్యాల భవిష్యత్తునూ నిర్ధారించేసింది. పౌరుల లైంగిక జీవనమూ వ్యక్తిగత గోప్యత పరిధిలోనిదన్న జస్టిస్ చంద్రచూడ్ న్యాయనిర్ణయంతో- ఐపీసీలోని 377 సెక్షన్‌పై ముసురుకొన్న మబ్బులు తొలగిపోనున్నాయి. నయంకాని వ్యాధుల పాలబడి మరణమే శరణమనుకొనేవారికి జస్టిస్ చలమేశ్వర్ తీర్పు ఊరట కలిగిస్తోంది. తనకు సంతానం కావాలో వద్దో నిర్ణయించుకోవడం నుంచి గర్భస్రావం కోరుకొనే స్వేచ్ఛ దాకా అన్నీ మహిళల వ్యక్తిగత గోప్యత పరిధిలోకి వస్తాయనడం- ఈ తీర్పు ఎంత ప్రభావాన్వితమైనదో వెల్లడిస్తోంది.

పౌరుల టెలిఫోన్ సంభాషణల్ని రహస్యంగా ప్రభుత్వాలు వినడం వ్యక్తిగత గోప్యత హక్కు ఉల్లంఘన కిందకు వస్తుందా అన్న న్యాయవివాదంపై 1928లో అమెరికా సుప్రీంకోర్టు 'రాదు' అనే తీర్పు ఇచ్చింది. ఆ తీర్పుతో విభేదించిన జస్టిస్ లూయిస్ బ్రాండిస్- సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోయేకొద్దీ వ్యక్తిగత గోప్యత పరిధీ విస్తరిస్తుందని దార్శనికంగా స్పందించడం గమనార్హం. రాజ్యాంగ ధర్మాసనం తాజా తీర్పులోనూ అలాంటి ముందుచూపు ఉట్టిపడుతోంది. 'మలేరియా, డెంగీ లాంటి సాంక్రామిక వ్యాధులపై పటిష్ఠపోరాట వ్యూహాల నిర్మాణానికి ప్రభుత్వాలు ఏదైనా ఆసుపత్రి నుంచి రోగులందరి వివరాలూ సేకరించినప్పటికీ, వారి సమాచారం బయటకు పొక్కకుండా జాగ్రత్త వహించినప్పుడే వ్యక్తిగత గోప్యతను మన్నించినట్లవుతుంది' అన్న తీర్పు- ఆధార్ సమాచార నిధి భద్రతపై ప్రభుత్వాలకు బాధ్యత మప్పుతోంది. సర్కారీ తీర్మానం ద్వారా భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ 2009 జనవరిలో ఏర్పాటైంది మొదలు, ఈ తొమ్మిదేళ్లలో ఆధార్ ప్రక్రియ అక్షరాలా త్రివిక్రమావతారం దాల్చింది. మొన్న జూన్ నాటికే 115 కోట్ల ఆధార్ కార్డులు జారీ అయ్యాయని, ఆధార్ అనుసంధానంతో లబ్ధిదారులకు ప్రభుత్వ రాయితీల్ని నేరుగా అందిస్తున్నందున ఖజానాకు 57 వేలకోట్ల రూపాయలు ఆదా అయ్యాయని కేంద్రసర్కారు చెబుతోంది. పరిమిత ఆర్థిక వనరుల్ని గరిష్ఠ ప్రయోజనదాయకంగా మలచడానికి అవినీతిని మట్టగించే అంకుశంగా ఆధార్‌ను వినియోగించాలనుకొంటోంది. ఆ క్రమంలో పౌరుల వ్యక్తిగత సమాచారం పరుల పాలబడకుండా పటిష్ఠ సాంకేతిక రక్షణలు దుర్భేద్యంగా ఉండాల్సిందే. బ్రెజిల్, ఇండొనేసియా, అమెరికా, ఐరోపా దేశాల అనుభవాలను స్వీకరించి పౌరుల ఆధార్ వివరాలు సమాచార చోరుల పాలబడకుండా కాచుకొనే వ్యవస్థల నిర్మాణం- జాతి హితానికి ఎంతగానో దోహదపడేదే!

ఉపాధి విపణిలో నిపుణతకే పట్టం!

భారత ప్రభుత్వం చేపట్టిన పెద్దనోట్ల రద్దు, వస్తు సేవల పన్ను, కార్మిక సంస్కరణల వల్ల కొత్త ఉద్యోగాలు పుట్టకపోగా, ఉన్న ఉద్యోగాలు ఊడిపోతున్నాయని విమర్శలు జోరందుకున్నాయి. ఈ విమర్శల్లో నిజం ఉందనిపించినా, లోతుగా పరిశీలిస్తే అసలు కారణాలు వేరని తెలిసివస్తుంది. 2016 నవంబరులో పెద్దనోట్లను రద్దు చేసిన తరవాతనే కాదు, దానికి ముందూ ఉద్యోగాలు తరిగిపోతూ వచ్చాయి. 2017 జనవరి-ఏప్రిల్ మధ్య సంఘటిత, అసంఘటిత రంగాల్లో మొత్తం 15 లక్షల ఉద్యోగాలు అదృశ్యమయ్యాయని భారత ఆర్థికరంగ పర్యవేక్షణ సంస్థ (సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ- సీఎంఐఈ) తెలిపింది. అయితే, పెద్దనోట్ల రద్దుకు ముందే అసంఘటిత రంగంలో ఉద్యోగాల సృష్టి స్తంభించిపోయిందని జాతీయ నమూనా సర్వే సంస్థ (ఎన్ఎస్ఎస్ఓ) 2015-16 నివేదిక నిర్ధారించింది. మరో అసాధారణ విషయమేమంటే, ఉద్యోగాల కోసం అన్వేషిస్తున్న యువత సంఖ్యా తగ్గిపోవడం. 2017 జనవరిలో 2.59 కోట్లుగా ఉన్న నిరుద్యోగుల సంఖ్య జులైకల్లా 1.37 కోట్లకు తగ్గిందని సీఎంఐఈ తెలిపింది. అంటే ఉద్యోగుల సంఖ్యతోపాటు, ఉద్యోగార్థుల సంఖ్యా తగ్గుతోందన్న మాట. ఈ విరుద్ధాంశాల వెనక ఉన్న కథేమిటి? ఉద్యోగాన్వేషణ వృథా అని నిరుద్యోగులు అనుకుంటున్నారా? మొత్తమ్మీద ఈ గణాంకాలు దేశంలో మారిన పరిస్థితులకు అనుగుణమైన వ్యూహాలు చేపట్టాలని విధానకర్తలను హెచ్చరిస్తున్నాయి.



సాంకేతిక సత్తా చాటాల్సిన తరుణం

పొంతనలేని గణంకాలు

కంపెనీల చట్టం, ఫ్యాక్టరీల చట్టం కింద నమోదుకాని అసంఘటిత వ్యాపారాలపై జాతీయ నమూనా సర్వే సంస్థ 2010-11లో, 2015-16లో నివేదికలు వెలువరించింది. 2015-16 నివేదికలో 6.3 కోట్ల వ్యవసాయేతర, నిర్మాణేతర వ్యాపారాల వివరాలున్నాయి. 2010-11 కన్నా 2015-16లో వ్యాపార యూనిట్ల సంఖ్య 10 శాతం (57 లక్షల యూనిట్ల మేరకు) పెరగ్గా, కార్మికుల పెరుగుదల మూడు శాతానికి (33 లక్షల మేరకు) పరిమితమైంది. అంటే ఈ వ్యాపార యూనిట్లలో గత అయిదేళ్లలో ఏడాదికి 6.5 లక్షల కొత్త ఉద్యోగాలే పుట్టుకొచ్చాయన్నమాట. ఏటా కోటి మంది ఉద్యోగ విపణిలో ప్రవేశిస్తున్నారని గుర్తుంచుకుంటే, ఇది ఎంత తక్కువో తెలిసివస్తుంది. 2008 ఆర్థిక సంక్షోభం తరవాత ఉద్యోగ నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్ర కార్మిక శాఖ నిర్వహిస్తున్న సర్వేలూ నిరాశాజనక చిత్రాన్ని అందిస్తున్నాయి. ఈ సర్వేల ప్రకారం 2008 సెప్టెంబరు-2014 సెప్టెంబర్ మధ్యకాలంలో తయారీ, నిర్మాణ తదితర రంగాల్లో 36.3 లక్షల ఉద్యోగాల సృష్టి జరిగింది. అంటే ఏడాదికి 6.04 లక్షల కొత్త ఉద్యోగాలు లభించాయన్నమాట. ఇక 2014 డిసెంబరు-2015 డిసెంబరు మధ్య మరీ కనాకష్టంగా కేవలం 1.35 లక్షల కొత్త ఉద్యోగాలు పుట్టాయి. ఏటా 50 లక్షల మంది వ్యవసాయాన్ని వదిలిపెడుతున్న దేశంలో ఈ కొత్త ఉద్యోగాలు ఓ పంటి కిందకూ చాలవు. నేడు జాట్, పటేల్, మరాఠా తదితర వ్యవసాయ కులాలు, తమిళ రైతులు చేస్తున్న ఆందోళనలను చూస్తే గ్రామాల్లో పరిస్థితులు ఏమీ బాగాలేవని నిర్ధారణ అవుతుంది.

అందుకేనేమో ఎన్ఎస్ఎస్ఓ నివేదిక వ్యవసాయేతర, నిర్మాణేతర వ్యాపార సంస్థల మీదనే దృష్టి పెట్టింది. ఈ అసంఘటిత సంస్థల్లో 82 శాతం ఇళ్ల నుంచో, ఇళ్ల వెలుపలి దుకాణాల నుంచో పనిచేస్తున్నాయి. 98 శాతం యూనిట్లు ఏడాది పొడవునా పనిచేస్తుంటాయి. క్రితం సర్వేకన్నా తాజా సర్వేలో అసంఘటిత కార్మికుల సంఖ్య పెద్దగా పెరగకపోయినా, వారి ఆదాయాలు మాత్రం 86 శాతం ఇనుమడించాయి. ఈ రంగంలో సగటు కార్మికుడి వేతనం అయిదేళ్ల క్రితం రూ.4,000. ఇప్పుడు రూ.7,000. ప్రతి కార్మికుడి వల్ల సమకూరే స్థూల విలువ 78 శాతం పెరగడం సంతోషకరమే. కానీ, కార్మికులు ఎక్కువ గంటలు పనిచేయడం ద్వారా ఎక్కువ సంపాదిస్తున్నారే తప్ప ఆధునిక టెక్నాలజీతో ఉత్పాదక శక్తిని పెంచుకొని కాదు. ఉన్నవాళ్లతోనే ఎక్కువ పని చేయించుకోవడం వల్ల వ్యవసాయేతర అసంఘటిత రంగంలో ఆశించిన స్థాయిలో కొత్త ఉద్యోగాలు పుట్టడం లేదు. ఎక్కువ శ్రమించడమనేది కార్మికుల ఆరోగ్యం, కుటుంబ సంబంధాల మీద ప్రతికూలత ప్రసరించక మానదు. ఈ అసంఘటిత వ్యవసాయేతర యూనిట్లను సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలుగా వర్గీకరించారు. వ్యవసాయాన్ని వదలి పట్టణాలకు వచ్చే పేద రైతులు, కూలీలకు ఎంఎస్ఎంఈ రంగం భారీగా ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని ఆశించినా- ఆచరణలో అది నెరవేరడం లేదు. ఈ రంగంలోని యూనిట్లలో 84 శాతం కుటుంబ అజమాయిషీలోనే నడుస్తున్నాయి. బయటివారిని ఉద్యోగంలోకి తీసుకోవడం లేదు. వీటిలో 36 శాతం చిన్న దుకాణాలే, మహిళలు నడిపే యూనిట్లు, దుకాణాలు 20 శాతం వరకు ఉంటాయి. అందులో కూడా 1.8 శాతం యూనిట్లను మహిళా స్వయం సహాయక బృందాలు నడుపుతున్నాయి. 2010-11లో ఈ తరహా యూనిట్లు 2.1 శాతం ఉండేవి. అంటే మహిళా స్వయం సహాయక బృందాల వల్ల ఒరిగిందేమీ లేకపోగా, ఉన్న కొద్ది యూనిట్లూ తరిగిపోతున్నాయి. మొత్తం 6.3 కోట్ల అసంఘటిత యూనిట్లలో సగం కేవలం అయిదు రాష్ట్రాల్లోనే (ఉత్తర్ ప్రదేశ్, పశ్చిమ్ బంగ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటకల్లో) కేంద్రీకృతమై ఉండటం మరో వైరుధ్యం. అన్నట్లు, ఉద్యోగార్థుల సంఖ్య బాగా పడిపోయినది ఉత్తర్ ప్రదేశ్, బిహార్, ఒడిశా, ఝార్ఖండ్‌లలోనే!

సర్వే చెప్పిన కథ

ఏతావతా పెద్దనోట్ల రద్దుకు ముందు అసంఘటిత రంగంలో కొత్త ఉద్యోగాల కల్పన స్తంభించిందని ఎన్ఎస్ఎస్ఓ తెలపగా, రద్దు తరవాత ఉన్న ఉద్యోగాలూ ఊడిపోయాయని సీఎంఐఈ తేల్చింది. 2016 సెప్టెంబర్-డిసెంబర్ మధ్య అన్ని రంగాల్లో మొత్తం 40 కోట్ల 65 లక్షల ఉద్యోగాలు ఉండగా, 2017 జనవరి-ఏప్రిల్ మధ్య అవి 40 కోట్ల 50 లక్షలకు పడిపోయాయి. అంటే 15 లక్షల ఉద్యోగాలు గల్లంతయ్యాయన్న మాట. 2016 చివరి నాలుగు నెలలు పండుగ సీజను కావడం వల్ల ఉద్యోగాలు వెంటనే ఊడిపోలేదు. సీజను ముగిసిన తరవాత నుంచి పెద్దనోట్ల రద్దు ప్రభావం వ్యాపారాలపై పడి ఉద్యోగాలు తగ్గిపోయాయని సీఎంఐఈ విశ్లేషించింది. మరోవైపు అఖిల భారత తయారీదారుల సంఘం (ఏఐఎంఓ) అధ్యయనం, 2017 మార్చికల్లా ఉద్యోగాలు 60 శాతంమేరకు, కంపెనీల ఆదాయాలు 50 శాతంమేరకు పడిపోతాయని తేల్చింది. దేశంలో మూడు లక్షల చిన్న, మధ్య, భారీ పరిశ్రమలకు ఏఐఎంఓ ప్రాతినిధ్యం వహిస్తోంది. ఏదిఏమైనా ఐటీతోపాటు సంఘటిత, అసంఘటిత రంగాల్లో ఉద్యోగ నష్టానికి కేవలం పెద్దనోట్ల రద్దే కారణమని చెప్పలేం. ఈ పరిణామానికి రకరకాల కారణాలున్నాయి. భారత్‌లో ఏటా కోటిమంది యువజనులు ఉపాధి విపణిలో ప్రవేశిస్తున్నారు. క్రిసిల్ అంచనా ప్రకారం 2011-2019 మధ్య కేవలం 3.8 కోట్ల వ్యవసాయేతర ఉద్యోగాలు మాత్రమే పుట్టుకొస్తాయి. కాబట్టి పనివారి గిరాకీ కన్నా సరఫరా ఎక్కువని స్పష్టంగానే తెలుస్తోంది. ఆటొమేషన్, డేటా సైన్స్, కృత్రిమ మేధ, రోబోల వల్ల కార్మికుల అవసరం తగ్గిపోనుంది కూడా. మారుతున్న యుగానికి కావలసిన కొత్త నైపుణ్యాలు మన యువతలో కొరవడ్డాయి. దేశంలో ఏటా 10 లక్షల మంది ఇంజినీర్లు తయారవుతున్నా, వారిలో 90 శాతానికి ఉద్యోగార్హత ఉండటం లేదు. ప్రపంచీకరణకు ప్రతిఘటన పెరగడం వల్ల ఎగుమతులు పడిపోతున్నాయి. అందువల్ల కర్మాగారాల్లో ఉత్పత్తి తగ్గిపోతోంది. ఉద్యోగుల సంఖ్య పడిపోతోంది. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం భారత్‌లో తయారీ, నైపుణ్య భారత్, డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటి వినూత్న పథకాలను చేపట్టి ఆర్థిక వ్యవస్థను రూపాంతరం చెందించాలనుకొంటోంది. తద్వారా కొత్త ఉద్యోగాలు పుట్టి, వస్తుసేవలకు గిరాకీ పెరగనుంది. దేశమంతటినీ ఏకీకృత విపణిగా మార్చే జీఎస్టీ చట్టం ఈ గిరాకీని మరింత వృద్ధి చేస్తుంది. కొత్త టెక్నాలజీలను అందిపుచ్చుకొని అత్యాధునిక వస్తుసేవలను ప్రపంచ విపణికి అందించే సత్తాను భారత్‌కు సమకూర్చాలని కేంద్రం నడుంకట్టింది!

– వరప్రసాద్

ఉద్యోగుల సంఖ్య కచ్చితంగా ఎంత?

ఉద్యోగిత, నిరుద్యోగితలపై ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారం సమగ్రమైనది కాదు. పైగా దానికి కాలదోషం పట్టింది కూడా. సీఎంఐఈ వినియోగదారుల కుటుంబ సర్వే (సీపీహెచ్ఎస్) ప్రకారం 2017 జనవరి-ఏప్రిల్ మధ్య కాలంలో మొత్తం ఉద్యోగులు, కార్మికుల సంఖ్య 40 కోట్ల 50 లక్షలు. వీరిలో 21 శాతం (దాదాపు 8.6 కోట్లమంది) సంఘటిత రంగంలో పనిచేస్తున్నారు. తెల్లచొక్కా వేసుకుని కుర్చీలో కూర్చుని పనిచేసేవారు, పారిశ్రామిక కార్మికులు, మేనేజర్లు, కర్మాగారాలు-కార్యాలయాల్లో సహాయక సిబ్బంది ఈ వర్గం కిందకు వస్తారు. లక్షలాది ఉద్యోగాలు కల్పిస్తామంటూ ఎన్నికలవేళ రాజకీయ పార్టీలు చేసే వాగ్దానాలు వినగానే జనం మదిలో మెదిలే ఉద్యోగాలివే. తాము అధికారంలోకి వస్తే రెండు కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తామని భారతీయ జనతాపార్టీ భరోసా ఇచ్చినప్పుడూ ఓటర్లు ఈ తరహా ఉద్యోగాలనే ఊహించుకున్నారు తప్ప, అవి వ్యవసాయ రంగంలోనో, నిర్మాణ రంగంలోనో పుట్టుకొస్తాయని అనుకోలేదు. కానీ, జనం 'గౌరవప్రదమైనవి'గా భావించే సంఘటిత రంగ ఉద్యోగాల్లోకన్నా అసంఘటిత రంగంలోనే ఎంతో ఎక్కువ మంది పనిచేస్తున్నారు. చిన్న వ్యాపారులు, వ్యవసాయ కూలీలు, దినసరి వేతన కార్మికులు ఈ కోవలోకి వస్తారు. వీరందరినీ సంఘటిత రంగంలోకి తీసుకొస్తామంటూ రాజకీయ నాయకులు ఉపన్యాసాలు దంచుతూ ఉంటారు కానీ, అందుబాటులోని గణాంకాలను చూస్తే అది సాధ్యమయ్యేపనేనా అనే సందేహం కలుగుతోంది. 2016 జనవరి-ఏప్రిల్ మధ్య సంఘటిత రంగంలో 9.3 కోట్ల ఉద్యోగాలు ఉంటే, అదే సంవత్సరం మే-ఆగస్టు మధ్య అవి 8.9 కోట్లకు, 2017 జనవరి-ఏప్రిల్ మధ్య 8.6 కోట్లకు పడిపోయాయని సీఎంఐఈ లెక్కగట్టింది. అంటే 70 లక్షల సంఘటితరంగ ఉద్యోగాలు అదృశ్యమయ్యాయన్న మాట. ఇక సీఎంఐఈ గణాంకాల ప్రకారం ఉద్యోగావకాశాల కోసం వెదకడం మానేసినవారి సంఖ్య ఉత్తర్ ప్రదేశ్, బిహార్ వంటి పేద రాష్ట్రాల్లోనే ఎక్కువ. ఇలాంటివారు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు మళ్లే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో కొత్త సాంకేతికతలతో సరికొత్త వృత్తివ్యాపారాలను సృష్టించే పని అత్యవసరంగా జరగాలి.





వీరేంద్ర కపూర్

విపక్షాల ఆశాకిరణం!

ప్రతిపక్షం నేడు నాయకత్వ లేమితో కొట్టుమిట్టాడుతోంది. 2019 లోక్‌సభ ఎన్నికల సమరంలో విపక్ష సేనావాహినికి సమర్థ సారథ్యం ఎవరు వహిస్తారన్నది పెద్ద ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైతే మమతా బెనర్జీ ఒక్కరే కనిపిస్తున్నారు. నితీశ్ నిష్క్రమణ దరిమిలా మహాకూటమి చతికిలపడింది. కాంగ్రెస్ యువరాజు రాహుల్ గాంధీ రాజకీయ పరిణతి కనబరచడంలేదు. ఆయన నిరాసక్త యోగం కొనసాగుతోంది. మోదీ జగన్నాథ రథ చక్రాలకు ఎదురులేకుండాపోతోంది. ఆయనను ఎలా ఎదుర్కోవాలో అర్థంగాక అయోమయానికి లోనవుతున్న విపక్షాల్లో పోనుపోను అసహనం పెరుగుతోంది. చివరికవి మమత శరణుజొచ్చే అవకాశాలు లేకపోలేదు.

అవినీతి కేసుల్లో చిక్కి లాలు ప్రసాద్ యాదవ్ ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కొత్తగా ఆయనతో జట్టుకట్టిన శరద్‌యాదవ్, పెద్ద నాయకుడేమీకాదు. నవీన్ పట్నాయక్ సంగతి సరేసరి. దూసుకొస్తున్న భాజపాను ఎలా ఎదుర్కోవాలో, ఒడిశాలో అధికారాన్ని ఏ విధంగా నిలబెట్టుకోవాలో తెలియక కిందుమీదులవుతున్నారు. దక్షిణాది నాయకుల విషయానికి వస్తే, వారంతా జాతీయ పార్టీలకు తోకలుగా మిగిలిపోతున్నారు తప్ప, జాతీయస్థాయిలో తమంతట తాముగా కీలకపాత్ర పోషించేందుకు ఉత్సాహం చూపడంలేదు. ఇక మిగిలింది మమత ఒక్కరే.

మచ్చలేని నాయకుడిగా మంచి పేరున్న నితీశ్‌కుమార్ తమవైపు ఉంటే, మోదీ-షాల సారథ్యంలోని భాజపాను గట్టిగా ఎదుర్కొనగలమని విపక్ష శిబిరం భావించింది. కానీ లాలు తనయుడు, బిహార్ ఉపముఖ్యమంత్రి తేజస్విని అవినీతి ఆరోపణల దరిమిలా పదవి నుంచి వైదొలగడానికి నిరాకరించడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. మహాకూటమి నుంచి వైదొలగి, బిహార్ ముఖ్యమంత్రి పదవికీ రాజీనామా చేసిన నితీశ్ కుమార్- 24 గంటలైనా గడవకముందే పాత నేస్తం భాజపా మద్దతుతో మళ్ళీ సీఎంగా గద్దెనెక్కడంతో బిహార్‌లో కొత్త సమీకరణాలు ఏర్పడ్డాయి. జాతీయ రాజకీయాలపైనా దాని ప్రభావం తీవ్రంగా పడింది. ముఖ్యంగా విపక్ష శిబిరం విశ్వసనీయ నాయకుడిని కోల్పోయింది. మరోవైపు మమతాబెనర్జీ పశ్చిమ్ బంగలో తిరుగులేని నాయకురాలిగా కొనసాగుతున్నారు. ఇటీవలి స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీ ఘనవిజయం సాధించింది. మార్క్సిస్టుల ప్రభ కొడిగట్టింది. కాంగ్రెస్‌కూ నిలువనీడ లేకుండా పోయింది. మార్క్సిస్టులు ఖాళీచేసిన స్థానాన్ని ప్రధాన ప్రతిపక్షంగా భాజపా ఆక్రమిస్తోంది. దాంతో భాజపాపై దూకుడు పెంచిన మమత, ప్రస్తుతానికి ప్రతిపక్షాలకు కనిపిస్తున్న ఏకైక ఆశాకిరణం.



కీలకంగా మారుతున్న మమత

మమతా బెనర్జీ ప్రధానాస్త్రం ముస్లిం అనుకూల రాజకీయాలు. పశ్చిమ్ బంగలో దాదాపు మూడో వంతు ముస్లిములే ఉన్నారు. దాంతో అధికారాన్ని నిలబెట్టుకోవడానికి వారి మద్దతు మీదే ఆమె ఆధారపడుతున్నారు. తాజాగా, మొహర్రం ఊరేగింపులు జరిగే రోజున దుర్గామాత విగ్రహాల నిమజ్జనాన్ని ఆమె నిషేధించారు. అంతకుముందు శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా ఊరేగింపుల మీదా నిషేధం విధించారు. ముస్లిములను బుజ్జగించడం, వారి ఓట్లను కొల్లగొట్టడం ఒక్కటే లక్ష్యంగా ఆమె ముందుకు సాగుతున్నారు. అదే భావజాలం కలిగిన ఇతర విపక్షాలకు ఆమెలో గొప్ప నాయకురాలు కనిపించడంలో ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు. మమత వైఖరివల్ల సహజంగానే పశ్చిమ్ బంగలో భాజపా బలపడే అవకాశాలు మెరుగుపడుతున్నాయి. ఈ అవకాశాన్ని ఆ పార్టీ ఎంతవరకు సద్వినియోగపరచుకొంటుందో చూడాలి.

లౌకిక పక్షాలమని చెప్పుకొంటున్న పార్టీలు ఒక వ్యూహమంటూ లేకుండా అడ్డగోలుగా వ్యవహరిస్తున్నాయి. భాజపాను మతతత్వ పార్టీగా ఆడిపోసుకుంటూనే తాము మాత్రం మైనారిటీ మతవర్గాలను యథాశక్తి దువ్వుతూ అవి తమ ద్వంద్వ ప్రమాణాలను చాటుకొంటున్నాయి. ఈ వైఖరి కారణంగానే దేశ విశాల ప్రజానీకానికి దూరమవుతున్న వాస్తవాన్ని అవి గుర్తించలేకపోతున్నాయి. విపక్షాలన్నీ హిందూ వ్యతిరేక శక్తులన్న భాజపా వాదనకు దీనివల్లే బలం చేకూరుతోంది. విపక్షాలు కనుక మమతకు నాయకత్వం అప్పగిస్తే, ఆ చర్య ఎన్నికల రాజకీయాల్లో భాజపాకే అనుకూలంగా పరిణమిస్తుందనడంలో సందేహం లేదు. కాంగ్రెస్‌కు సరైన నాయకత్వాన్ని అందించడంలో రాహుల్ గాంధీ వైఫల్యం వల్లే యావత్ ప్రతిపక్షాలు ఇంతటి దురవస్థను ఎదుర్కొంటున్నాయి.

మరోవైపు తమిళనాడు రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతూ, ఆసక్తికంగా తయారవుతున్నాయి. ఏఐఏడీఎంకే రెండు వర్గాలు విలీనమైనంత మాత్రాన కథ ముగియలేదు. ప్రస్తుతం బెంగళూరు జైలులో ఉన్న శశికళ, ఆమె మేనల్లుడు దినకరన్ రాష్ట్ర రాజకీయాల్లో పట్టు కోసం తెరవెనక వ్యూహాలెన్నో రచిస్తున్నారు. భాజపాతో చేతులు కలపడానికి సైతం వారు సిద్ధంగానే ఉన్నారు. కానీ, వారితో జట్టుకడితే తన పరువు ప్రతిష్ఠలు దెబ్బతింటాయన్న భయంతో అందుకు భాజపా సుముఖంగా లేదు. దినకరన్, శశికళ ఇప్పటికే తమ తరఫున కొంతమంది దూతల్ని పంపారు. భాజపా మధ్యస్థాయి నాయకులతో వారు మాట్లాడారు. కానీ వారితో స్నేహానికి తమ పార్టీ తయారుగా లేదని ఆ మధ్యవర్తులకు భాజపా నాయకులు స్పష్టం చేశారు.

ఈనాడు లేఖలు

సాఫీగా చర్చలు సాగేదెన్నడు?

కొన్నేళ్లుగా పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న తీరు ప్రజలకు ఎంతో ఆవేదన కలుగజేస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో విమర్శలు, ప్రతివిమర్శలు సాధారణం. కానీ, దూషణభూషణలతో చట్టసభల స్ఫూర్తే ఆసాంతం నీరుగారిపోతుండటం బాధాకరం. ఆర్థిక రంగంలో ప్రభుత్వం అనేక సంస్కరణలు ప్రవేశపెట్టింది. అంతర్జాతీయంగా ఉగ్రవాద పోకడలు పెచ్చరిల్లుతున్నాయి. పొరుగున చైనా నుంచి సరిహద్దుల్లో బెదిరింపులు ఎదురవుతున్నాయి. ఇలాంటి క్లిష్టసమయంలో అధికార ప్రతిపక్ష సభ్యులు జాతికి దిశానిర్దేశం చేసేలా చర్చల్లో పాల్గొనాలి. పాలక ఎన్డీయే కూటమికి రాజ్యసభలో ఇప్పుడు సంపూర్ణ మెజారిటీ సాధించింది. సమీకరణాలు మారిపోయాయి. కనుక అధికార, విపక్షాలు పట్టువిడుపులు ప్రదర్శించాలి. విస్తృతస్థాయిలో పరస్పర అవగాహనకు రావాలి. తద్వారా భవిష్యత్తులో సమావేశాలు నిరాటంకంగా సాగడానికి పాటుపడాలి.

- జనమంచి వినీత్, హైదరాబాద్

వేగ నియంత్రణ చర్యలు

నగరాలు, పట్టణాల్లో వాహనాల వినియోగం అధికమవుతోంది. ముఖ్యంగా అతివేగంగా దూసుకుపోయే వాహనాలు యువతకు అందుబాటులోకి రావడం వల్ల కొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయి. కొందరు క్రమశిక్షణ లేకుండా విచ్చలవిడిగా వాహనాలను నడుపుతున్నారు. దీనివల్ల రోడ్లపై ప్రమాదాలు అధికమవుతున్నాయి. వేగాన్ని కట్టడి చేయడానికి ప్రభుత్వం పాయింట్ల విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. అది ఆరంభశూరత్వంగా మిగిలిపోరాదు. ప్రధాన రహదారుల్లో సీసీ కెమెరాల ద్వారా నియంత్రణ చర్యలు తీసుకున్న అధికారులు, నివాస ప్రాంతాల్లోనూ ఆ తరహా చర్యలు తీసుకోవాలి. ప్రమాదభరితంగా దూసుకెళ్లే వాహనాల సమాచారాన్ని ప్రజలు అందజేయడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి. సమాచారం అందజేసినవారి వివరాలను గోప్యంగా ఉంచాలి.

- కులకర్ణి బాబురావు, జెక్లేరు, మహబూబ్‌నగర్‌జిల్లా

లోపలి దీపం

చిమ్మచీకట్లో నడుస్తున్నప్పుడు దారి కనిపించదు. అప్పుడే దీపం అవసరమేమిటో గుర్తుకొస్తుంది. అలాగే జీవితం అంధకారమయంగా మారినప్పుడు దిక్కు తోచదు. ఎటువెళ్లాలో ఒక పట్టాన తెలియదు. ఏ ఆలోచనా తట్టదు. అప్పుడూ దీపమే కావాలి. హృదయంలో వెలిగే దీపమది. అదే 'జ్ఞాన దీపం'!

లోకంలో భౌతికంగా కాంతులీనే దీపాలకు ఆది, అంతం ఉంటాయి. మనిషిలో అంతర్లీనంగా వెలిగే దీపానికి ముగింపు ఉండదు. అది నిరంతరం వెలుగుతూనే ఉంటుంది.

'జ్ఞానోదయం పొందినవారికి ఏ ఆస్తులూ ఉండవు. అయినా, వారు ఎప్పుడూ ఆనందంగానే ఉంటారు. అదెలా సాధ్యం' అని గురువును శిష్యుడు ప్రశ్నించాడు. అప్పుడు ఆయన అతణ్ని వెంట తీసుకొని ఒక విగ్రహం వద్దకు వెళ్లాడు. దాన్ని చూపిస్తూ 'ఈ విగ్రహం నీకు కనిపిస్తోందా' అని అడిగాడు. అందుకు శిష్యుడు 'అవును' అని బదులు పలికాడు. కొంత సేపటికి బాగా చీకటి పడింది. అప్పుడు మళ్ళీ శిష్యుణ్ని గురువు అడిగాడు- 'ఇప్పుడూ కనిపిస్తోందా' అని! అందుకు అతడు 'కనిపిస్తోంది' అని బదులిచ్చాడు. ఇంతకూ అది రేడియో ధార్మిక లోహంతో తయారుచేసిన బుద్ధుడి విగ్రహం. అందుకే అంతటి చీకట్లోనూ కాంతులు విరజిమ్ముతూ స్పష్టంగా కనిపిస్తోంది. ఏ దీపం అవసరం లేకుండానే, ఆ ప్రతిమ ప్రకాశించడాన్ని చివరికి శిష్యుడు గమనించాడు. దానిలోని అంతరార్థాన్ని గ్రహించాడు.

పగలు, రాత్రి- సుఖదుఃఖాలకు ప్రతీకలు. సుఖం కలిగినప్పుడు సంతోషించడం, అది లేనప్పుడు దుఃఖించడం అతి సామాన్యులు చేసే పని. ప్రాజ్ఞులు అలా కాదు. వారు రాత్రింబగళ్లూ కనిపించే రేడియో ధార్మిక విగ్రహంలా ఉంటారు. సుఖదుఃఖాల్లోనూ ఒకే తీరుతో (ఆనందం) వ్యవహరిస్తారు. జ్ఞానసిద్ధి పొందినవారిని 'బుద్ధుడు' అంటారు. అతడు ఎప్పుడూ వెలుగులోనే ఉంటాడు. చీకటి అతడి దరి చేరదు. అజ్ఞానం అంటే, చీకటి. జ్ఞానం అంటే, వెలుగు. వెలుగు ఉన్నచోట చీకటికి తావు లేదు. అజ్ఞానం వల్లనే దుఃఖం కలుగుతుంది. జ్ఞానంతో అది తొలగిపోతుంది.

చీకటి వెలుగులు- ప్రకృతి సహజాతాలు. అవి వస్తాయి, పోతాయి. కేవలం ప్రాకృతిక వెలుగు మీదనే ఆధారపడితే, పరాధీనులై మిగిలిపోతారు. సహజమైన వెలుగు వచ్చేంత వరకు, వారు చీకట్లో జీవనం గడపాల్సి వస్తుంది. మనిషి తానే ఒక వెలుగైతే, స్వతంత్రుడిగా మారతాడు. జ్ఞానం పట్ల ప్రేమ పెంచుకోవడం వల్లనే, మానవుడు విద్యుద్దీపాన్ని కనుగొన్నాడు.

జ్ఞానం అనేది రెండు ముఖాలున్న నాణెం వంటిది. ఒక ముఖంతో బయటకు చూస్తే, విజ్ఞాన ఫలితంగా కొత్తవాటిని కనిపెట్టే శాస్త్రవేత్త అవుతాడు. మరో ముఖంతో లోపలికి చూసుకుంటే, జీవన రహస్యాలు విప్పిచెప్పగల తత్వవేత్తగా ఉంటాడు. అందువల్లే పశ్చిమ దేశాలు వైజ్ఞానికంగా ఎదిగాయి. భరతఖండం ఆధ్యాత్మిక శిఖరంగా ఉన్నతీకరణ చెందింది. ప్రపంచం దృష్టిని ఎంతగానో ఆకర్షించింది.

అజ్ఞానం అనే చీకటి వల్లే అరిషడ్వర్గాలు మనసులోకి చేరతాయి. అల్లకల్లోలాన్ని, గందరగోళాన్ని అవి సృష్టిస్తాయి. ఫలితంగా మనసు దుఃఖానికి లోనవుతుంది.

చీకటి తొలగాలంటే వెలుగు కావాలి. జ్ఞానం వెలుగుతున్న దీపం వంటిది. 'ఇంట్లో దీపం వెలుగుతుంటే, అక్కడికి ఏ దొంగా వెళ్లడు' అని గౌతమ బుద్ధుడు బోధించేవారు. జ్ఞానోదయం పొందిన వ్యక్తి విషయంలోనూ అంతే! 'లోపలి దీపం' వెలిగించుకున్న మనిషి మనసులోకి అరిషడ్వర్గాలకు చెందిన ఏ చోరుడూ ప్రవేశించలేడు.

గాలి వీస్తున్నప్పుడు దీపం వెలగదు. పరిపరి విధాలుగా సంచరించే మనసు, వీచే గాలి వంటిది. అలాంటి నిలకడ లేని మనసులో ఆత్మజ్యోతి ప్రకాశించదు. ధ్యాన సాధనతో మనసును ఉన్నతీకరించుకోవాలి. మానవ జీవితం పెట్టుబడి వంటిది. దానికి రాబడి- లోపలి దీపం వెలగడమే!

– మునిమడుగుల రాజారావు



అంతర్యామి

పాదరక్షల కోర్సులు.. లక్షణమైన కొలువులు

- హైదరాబాద్‌లో ప్రారంభమైన ఎఫ్‌డీడీఐ ప్రాంగణం
- 50 మందికి నైపుణ్య శిక్షణ షురూ
- వచ్చే ఏడాది నుంచి కోర్సులు
- దేశంలోనే అత్యంత ప్రాధాన్య సంస్థగా గుర్తింపు పొందిన ఎఫ్‌డీడీఐ
- ఇందులో శిక్షణ పొందిన వారందరికీ ఉద్యోగాలు


శిక్షణకు ఉపయోగించే అధునాతన యంత్రాలు

ఆకారపు మల్లేశం
ఈనాడు - హైదరాబాద్

దేశంలో అత్యంత ప్రాధాన్య సంస్థగా గుర్తింపు పొందిన జాతీయ పాదరక్షల ఆకృతి, అభివృద్ధి సంస్థ(ఎఫ్‌డీడీఐ) హైదరాబాద్ ప్రాంగణం ప్రారంభమైంది. 50 మంది అభ్యర్థులకు నైపుణ్య శిక్షణ కోర్సులను మొదలుపెట్టారు. భారీ డిమాండ్ ఉన్న పాదరక్షలు, తోలు ఉత్పత్తుల మార్కెట్‌కు రాజమార్గంగా.. తెలంగాణలో తోలు పరిశ్రమలకు ఊతమిచ్చేదిగా భావించే ఎఫ్‌డీడీఐపై 'ఈనాడు' ప్రత్యేక కథనం

నోయిడాలోని ఎఫ్‌డీడీఐ ప్రాంగణం.. అక్కడ బాటా, బిర్లా, రిలయన్స్, ల్యాండ్‌మార్క్, నైకి, షాహి, సమర్థ్, అర్మానీ వంటి 41 ప్రసిద్ధ పాదరక్షల కంపెనీల ప్రతినిధులు ప్రాంగణ నియామకాలు చేపడుతున్నారు. గ్రాడ్యుయేట్, పీజీ కోర్సుల అభ్యర్థులందరికీ ఉద్యోగాలు లభించాయి. నోయిడా విద్యార్థి షాగుణ్‌కు రూ.24 లక్షల ప్యాకేజీ లభించింది. ఇలా దేశవ్యాప్తంగా అన్ని ఎఫ్‌డీడీఐ ప్రాంగణాల్లో 100శాతం నియామకాలు జరుగుతున్నాయి. ఈ అవకాశం త్వరలో హైదరాబాద్‌కూ రానుంది. ఈ సంస్థకు ఇప్పటి వరకు దేశంలో 11 ప్రాంగణాలుండగా 12వ కేంద్రం హైదరాబాద్‌లో ఏర్పాటైంది. గచ్చిబౌలిలో సకల వసతులతో ఎఫ్‌డీడీఐ ప్రాంగణం ప్రారంభమైంది. ఇక్కడ 50 మంది అభ్యర్థులకు నైపుణ్య శిక్షణ కోర్సులను ఆరంభించారు. త్వరలోనే గ్రాడ్యుయేట్, పీజీ కోర్సులు ప్రారంభమవనున్నాయి.

విశిష్ట శిక్షణ సంస్థ

ఎఫ్‌డీడీఐ జాతీయ ప్రాధాన్యం గల సంస్థ(ఐఎన్ఐ)గా ఇటీవలే గుర్తింపు పొందింది. అంటే ఐఐటీ, ఐఐఎం, ఎన్ఐటీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల సరసన చేరింది. పాదరక్షలు, ఇతర తోలు ఉత్పత్తుల ఆకృతి, అభివృద్ధిపై అత్యుత్తమ బోధన, శిక్షణ, పరిశోధన సంస్థగా దీనికి హోదా కల్పించింది. కేంద్ర పరిశ్రమల శాఖ నోయిడా కేంద్రంగా 1986లో ఎఫ్‌డీడీఐని ఏర్పాటు చేసింది. దేశవ్యాప్తంగా ఏటా 2000 మంది శిక్షణ పొందుతున్నారు. శిక్షణ పూర్తవక ముందే ప్రముఖ కంపెనీలు ప్రాంగణ నియామకాల్లో వారిని ఎంపిక చేస్తున్నాయి. ఎఫ్‌డీడీఐ పూర్వ విద్యార్థులు పదిమంది ప్రస్తుతం ప్రఖ్యాత కంపెనీలకు సీఈవోలుగా ఉన్నారు. ఎఫ్‌డీడీఐని హైదరాబాద్‌లోనూ ప్రారంభించాలని కేంద్రం మూడేళ్ల కిందట నిర్ణయించింది. గచ్చిబౌలిలోని లిడ్‌క్యాప్ ప్రాంగణంలో దీనికి రాష్ట్ర ప్రభుత్వం 15 ఎకరాలు కేటాయించింది. రూ.100 కోట్లతో అధునాతన భవన సముదాయాన్ని నిర్మించారు. 100 గదులు, పరిపాలన భవనం, తరగతి గదులు, వర్క్‌షాపు, ఆడిటోరియం నిర్మించారు. కంప్యూటర్ ప్రయోగశాల, యువతీ యువకులకు వేర్వేరు వసతిగృహాలు, సిబ్బంది క్వార్టర్లను నిర్మించారు.

నైపుణ్య కోర్సు ప్రారంభం

ప్రతిష్ఠాత్మక హైదరాబాద్ ఎఫ్‌డీడీఐలో నైపుణ్య శిక్షణ కోర్సులు ప్రారంభమయ్యాయి. తెలంగాణ తోలు ఉత్పత్తుల పారిశ్రామిక ప్రోత్సాహక సంస్థ(లిడ్‌క్యాప్) అన్ని జిల్లాల నుంచి ఎంపిక చేసిన 50 మంది అభ్యర్థులకు ఇందులో నేరుగా ప్రవేశాలు కల్పించారు.


గచ్చిబౌలిలోని ఎఫ్‌డీడీఐ ప్రాంగణం

రెండు రకాల శిక్షణ

ఈ సంస్థలో సంప్రదాయ కోర్సులకు తోడు నైపుణ్య శిక్షణ కూడా ఇస్తారు. హైదరాబాద్‌లో ప్రారంభించిన ఎఫ్‌డీడీఐలో తొలి ఏడాది రెండు రకాల కోర్సులుంటాయి.

బ్యాచిలర్ ఇన్ లెదర్, ఆక్సెసరీ డిజైన్– నాలుగేళ్ల వ్యవధి– 60 సీట్లు

బ్యాచిలర్ ఇన్ రిటైల్, ఫ్యాషన్ మర్చండైజ్– నాలుగేళ్లు– 30 సీట్లు

అఖిలభారత నైపుణ్య పరీక్ష ద్వారా సీట్లను భర్తీ చేస్తారు. ఇంటర్ పూర్తయిన 25ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులు. డిసెంబరులో ప్రవేశ ప్రకటన వెలువడుతుంది. మేలో పరీక్ష జరుగుతుంది. జులైలో తరగతులు ప్రారంభిస్తారు. 2019 నుంచి లెదర్ గూడ్స్ అండ్ ఆక్సెసరీ డిజైన్ కోర్సును ప్రారంభిస్తారు. అప్పటి నుంచి రెండేళ్ల పీజీ కోర్సులు కూడా ప్రారంభమవుతాయి. దీంతో పాటు పాదరక్షలు, తోలు ఉత్పత్తుల పరిశ్రమలకు అవసరమైన సలహాలు, మెళకువలను కూడా ఈ ప్రాంగణం అందిస్తుంది. ఎఫ్‌డీడీఐల్లో 2000 సీట్లు ఉండగా 20 లక్షల మంది వరకు ప్రవేశ పరీక్షలు రాస్తున్నారు. విదేశీయులూ ఇక్కడ ప్రవేశాల కోసం వస్తున్నారు.

ఆధునిక పద్ధతుల్లో..

పాదరక్షలు, తోలు ఉత్పత్తుల ఆకృతి, తయారీపై అత్యంత ఆధునిక పద్ధతుల్లో శిక్షణ ఇస్తారు. ఇందుకోసం ఇటలీనుంచి యంత్రాలు దిగుమతి చేసుకున్నారు. థియరీతో పాటు యంత్రాల ద్వారా శిక్షణ తరగతులు ఉంటాయి. అభ్యర్థులు పాదరక్షలు, తోలు ఉత్పత్తుల పరిశ్రమలను సందర్శించి, శిక్షణ పొందుతారు. ఈ రంగంలోని నిపుణులు వచ్చి శిక్షణ ఇస్తారు. ఇక్కడ యాక్షన్, ప్యూమా, నైకి, బాటా, ల్యాండ్‌మార్క్, ఇంపాక్టివా, లైఫ్‌స్టైల్ తదితర సంస్థల పాదరక్షల ఆకృతులకు సంబంధించి యువతకు శిక్షణ ఇస్తారు.

తోలు ఉత్పత్తులకు ఊతం

దేశంలో చిన్న, మధ్యతరహా తోలు ఉత్పత్తుల సంస్థలు 1890 వరకు ఉన్నాయి. తెలంగాణలో 120 ఉన్నాయి. ఎఫ్‌డీడీఐ వల్ల తోలు ఉత్పత్తుల రంగంలో తెలంగాణ బాగా అభివృద్ధి చెందే అవకాశముంది. రాష్ట్రంలోని ఆర్మూర్, మల్లెమడుగు, స్టేషన్ ఘన్‌పూర్, మందమర్రి, జినుకల, రుక్మాపూర్‌ల్లో తోలు సమూహాలు; దుద్దెడ, దండేపల్లి, జమ్మికుంట, పోలేపల్లిల్లో మినీ పార్కులు; కొమ్మెపల్లి, మాడుపల్లి, ఎల్లారెడ్డిల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆర్మూర్‌లో తోలు ఉత్పత్తుల పార్కుకు రూ.10 కోట్లు మంజూరయ్యాయి. ఎఫ్‌డీడీఐలో శిక్షణ పొందిన అభ్యర్థులకు రుణ సాయం అందించి పెద్దఎత్తున పరిశ్రమలు స్థాపించాలని ప్రభుత్వం భావిస్తోంది.

అవకాశాలు అపారం..

ప్రస్తుతం భారీగా డిమాండ్ ఉన్న కోర్సుల్లో పాదరక్షల ఆకృతి, తయారీ చాలా ముఖ్యమైంది. దేశంలో ఏటా రూ.8 లక్షల కోట్ల మేరకు పాదరక్షలు, తోలు ఉత్పత్తుల మార్కెట్ ఉంది. తెలంగాణలో రూ.25 వేల కోట్ల మేరకు ఉంది. దేశవ్యాప్తంగా తోలు ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు పెద్ద సంఖ్యలో ఏర్పాటవుతున్నాయి. వాటిల్లోనూ ఉపాధి, ఉద్యోగాలు లభిస్తాయి. సొంతంగానూ పరిశ్రమలను స్థాపించుకోవచ్చు.

వచ్చే ఏడాది నుంచి పూర్తి స్థాయిలో..



– అరుణ్‌కుమార్ గైక్వాడ్, ఎఫ్‌డీడీఐ కేంద్రం ఇన్‌ఛార్జి

దేశంలో నూటికి నూరు శాతం ప్రాంగణ నియామకాలు జరిపే సంస్థ ఎఫ్‌డీడీఐ ఒక్కటే. ఇందులో శిక్షణ పొందే అభ్యర్థులకు నెలకు రూ. లక్ష అంతకంటే ఎక్కువ వేతనం లభిస్తోంది. కంపెనీలు పోటీ పడి ఎంపిక చేస్తున్నాయి. వచ్చే ఏడాది నుంచి ఇది పూర్తి స్థాయిలో పని చేస్తుంది. డిసెంబరులో ప్రవేశాల ప్రకటన వస్తుంది. అత్యంత ప్రతిభావంతులైన వారికే ప్రవేశం లభిస్తుంది.

సొంతంగా పరిశ్రమ స్థాపిస్తా



– చాలక్ అశ్విన్, శిక్షణార్థి

ఉప్పల్‌కు చెందిన మా నాన్న పాదరక్షల వ్యాపారంలో ఉన్నారు. ఈ రంగంలో మంచి భవిష్యత్తు ఉందని నైపుణ్య శిక్షణ కోర్సులో చేరా. సొంతంగా పరిశ్రమను స్థాపిస్తా.


మనకు గర్వకారణం..



– పి.విజయ్, హైదరాబాద్

దేశంలోనే పేరున్న సంస్థ హైదరాబాద్‌లో ఉండడం మనకు గర్వకారణం. ఇందులో శిక్షణకు ఎంపికవడం ఆనందాన్నిచ్చింది. దీన్ని సద్వినియోగం చేసుకుంటా.

మంచి ఉద్యోగం చేస్తా



– అనిల్, గోదావరిఖని

ఇతర కోర్సుల కంటే ఎఫ్‌డీడీఐ కోర్సులకు అధిక డిమాండ్ ఉందని ఇందులో చేరా. శిక్షణ పూర్తయ్యాక మంచి కంపెనీలో చేరతా.

సద్వినియోగం చేసుకుంటాం



– కృష్ణ, లిడ్‌క్యాప్ జనరల్ మేనేజర్

ఎఫ్‌డీడీఐని ప్రభుత్వపరంగా ప్రోత్సహిస్తున్నాం. 15ఎకరాల భూమిని ఉచితంగా ఇచ్చాం. నిరుద్యోగ యువతకు ఇందులో శిక్షణ ఇప్పించి, వారిద్వారా తోలుఉత్పత్తుల పార్కుల్లో పరిశ్రమలను స్థాపిస్తాం.

దేశంలోని ఎఫ్‌డీడీఐ ప్రాంగణాలు	
	నోయిడా, కోల్‌కతా, చెన్నై, పుర్సత్‌గంజ్, రోహతక్, చింద్వారా, జోధ్‌పూర్, అంకిలేశ్వర్, బానూర్, గుణ, పట్నా, హైదరాబాద్


చిన్నారి నిత్య

వయసు రెండేళ్లు.. బరువు 20 కిలోలు

ఊబకాయంతో బాధపడుతున్న చిన్నారి నిత్య

కొత్తగూడ, న్యూస్‌టుడే: రెండేళ్ల వయసుకే 20 కిలోల బరువుతో ఓ చిన్నారి బాధపడుతోంది. ఆమెకు వైద్యం అందించేందుకు తల్లిదండ్రులకు ఆర్థిక స్థోమత లేక ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గుంజేడుకు చెందిన దేవరబోయిన వీరన్న, స్రవంతిలకు ఇద్దరు సంతానం. వీరి రెండో కుమార్తె నిత్యకు ప్రస్తుతం రెండేళ్లు నిండి మూడో ఏడు ప్రారంభమైంది. పుట్టినప్పుడు రెండున్నర కిలోల బరువున్న నిత్య ప్రస్తుతం ఇరవై కిలోల బరువుతో కదల్లేని స్థితిలో మంచానికే పరిమితమైంది. ఆరు నెలల వయస్సు నుంచి నిత్య క్రమంగా బరువు పెరుగుతూ వస్తోంది. తల్లిదండ్రులు కూలీలు. ఆర్థిక స్థోమత అంతంత మాత్రమే. ఆరునెలల క్రితం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యులకు చూపించారు. వైద్యులు పలు రకాల పరీక్షలు చేసి వారం పాటు పరిశీలించారు. ఎలాంటి మార్పు రాకపోవడంతో ఇంటికి పంపారు. చిన్నారి ఊబకాయం తగ్గుదలలో ఎలాంటి మార్పు ఉండదని భావించిన తల్లిదండ్రులు ఆర్థిక స్థోమత లేక కార్పొరేట్ ఆసుపత్రులకు తీసుకెళ్లలేదు. ఆ చిన్నారి కదల్లేని స్థితిలో ఉండటం, తల్లిదండ్రులు కూలి పనికి వెళుతుండటంతో కాపలాగా నిత్య తాతను ఇంటివద్దే ఉంచి పర్యవేక్షిస్తున్నారు. ఆర్థిక స్థోమత లేకపోవడంతో మెరుగైన వైద్యసేవల కోసం నిత్యను ఆసుపత్రులకు తీసుకెళ్లలేక పోతున్నామని తల్లిదండ్రులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. ఎవరైనా ఆపన్న హస్తం అందించి నిత్య ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరచాలని ప్రాధేయపడుతున్నారు.

ఎన్డీఏలో చేరనున్న ఏఐఏడీఎంకే

దిల్లీ: తమిళనాడుకు చెందిన ఏఐఏడీఎంకే త్వరలో ఎన్డీఏ కూటమిలో చేరనుందని భాజపా సీనియర్ నాయకుడు ఒకరు చెప్పారు. చేరడం ఖాయమని, సమయమే ఖరారు కావాల్సి ఉందని తెలిపారు. ఎన్డీఏలో చేరారంటే సహజంగానే ప్రభుత్వంలో చేరుతారు కదా అని వ్యాఖ్యానించారు. ఆ పార్టీ నేత టి.టి.వి. దినకరన్ నేతృత్వంలో దాదాపు 20 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేయడంపై ప్రస్తావిస్తూ అది పార్టీ అంతర్గత వ్యవహారమని, దాని వల్ల పళనిస్వామి ప్రభుత్వానికి ముప్పేమీ లేదని అన్నారు. లోక్‌సభలో 37 మంది, రాజ్యసభలో 13 మంది సభ్యులు ఉన్న ఏఐఏడీఎంకే ఇప్పటివరకు పలు సందర్భాల్లో ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించింది.

మరమగ్గాలకు మంచి రోజులు

- రాష్ట్రవ్యాప్తంగా 68 వేల ఆధునికీకరణ
- రెట్టింపు కానున్న ఉత్పత్తి
- తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం
- త్వరలో సీఎం చేతుల మీదుగా ప్రారంభం

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణలో నేత కార్మికుల కష్టాలు తీరబోతున్నాయి. వారి మగ్గాలకు కొత్త సొబగులు రాబోతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మరమగ్గాలన్నింటినీ ఆధునికీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా త్వరలోనే దీనిని ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో మొత్తం లక్ష మరమగ్గాలుండగా అందులో 68 వేలు కార్మికులవి. మరికొన్ని వ్యాపారుల వద్ద ఉన్నాయి. మొత్తం మరమగ్గాల్లో 38 వేలు సిరిసిల్లలో ఉండగా, మిగిలినవి ఇతర జిల్లాల్లో పనిచేస్తున్నాయి. రెండు దశాబ్దాలుగా కార్మికులు వీటినే వినియోగిస్తున్నారు. కేవలం ఒకేరకం వస్త్రం దీనిపై తయారవుతుంది. వీటిపై శ్రమభారం ఎక్కువే. నేత కార్మికుల సమస్యలపై ప్రభుత్వం అధ్యయనం చేసినప్పుడు పాత మగ్గాలే ప్రధాన సమస్యగా తేలింది. ఆ శాఖ మంత్రి కేటీఆర్ వాటిని స్వయంగా పరిశీలించారు. మగ్గాల్లో సమూల మార్పులు చేయాలని భావించారు. దీనికి అనుగుణంగా ప్రతిపాదనలు చేసివ్వాలని అధికారులకు సూచించారు. అధికారులు సిద్ధం చేసిన పతిపాదనలను సీఎం కేసీఆర్‌కు కేటీఆర్ సమర్పించారు. దీనికి ముఖ్యమంత్రి అనుమతించారు.


సిరిసిల్లలోని మరమగ్గాలు

నవీకరణ ఇలా

రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన మగ్గాలను ఈపథకం కింద చేరుస్తారు. వాటి నవీకరణ బాధ్యతలను ఈరంగంలో పేరొందిన కంపెనీలకు ఇస్తారు. ఒక్కో మగ్గం నవీకరణకు రూ.40 వేలుగా అంచనా వేశారు. ఇందులో సగం రాష్ట్రప్రభుత్వం ఇస్తే మిగిలిన సగాన్ని కేంద్రం నుంచి సాయంగా పొందాలని భావిస్తున్నారు. ఈ పథకం కింద నేత కార్మికులను దరఖాస్తులు చేయాల్సిందిగా ఆహ్వానిస్తారు. వాటిని అధికారుల బృందం తనిఖీ చేసి నవీకరణకు అనుమతిస్తుంది. దీనికింద కార్మికులకు మాత్రమే అవకాశం కల్పిస్తారు. ఒక్కొక్కరికి గరిష్ఠంగా 8మగ్గాలను నవీకరిస్తారు. వ్యాపారులకు ఈ పథకం వర్తించదు. వచ్చే నెలలో దీన్ని ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది.

సాంకేతిక నైపుణ్యంతో

మరమగ్గాలలో ఎన్నో మార్పులు వచ్చాయి. సాంకేతిక నైపుణ్యాన్ని జత చేసి, పాతమగ్గాల రూపురేఖలను మారుస్తారు. దారం తెగితే ఆ సమాచారం అలారం ద్వారా తెలుస్తుంది. ఉత్పత్తి వేగం పెరుగుతుంది. ప్రస్తుతం మగ్గాలపై తెలుపురంగు వస్త్రం మాత్రమే తయారవుతోంది. ఇకపై అన్ని రంగులతో తయారు చేయవచ్చు. విద్యుత్ అంతరాయాల్లేకుండా చూస్తారు. దీంతోపాటు సౌర విద్యుత్ ఫలకాలను అమరుస్తారు. ఈమగ్గాలను మహిళలూ నడపవచ్చు. మరమగ్గాలలో నవీకరణ నేత కార్మికులకు సౌకర్యంగా, లాభదాయకంగా ఉంటుందని ప్రభుత్వవర్గాలు భావిస్తున్నాయి.

తాజా కూరగాయలతో ఆరోగ్యం

- తెలంగాణ ఉద్యాన మహోత్సవాన్ని ప్రారంభించిన మంత్రి పోచారం

ఈనాడు, హైదరాబాద్: తాజా కూరగాయలు, పండ్లతో ఆరోగ్యం సమకూరుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. అందుకే తెలంగాణ ప్రభుత్వం.. తాజా కూరగాయలను అందించడానికి కృషి చేస్తోందని, పండించుకునే విధానాన్నీ నేర్పుతోందని చెప్పారు. ఇటీవల రైతు బజార్లతో పాటు.. మన కూరగాయల దుకాణాలను అందుబాటులోకి తెచ్చి.. పంట పొలాల నుంచి నేరుగా వినియోగదారుడికి అందిస్తున్నామన్నారు. ఆదివారం హుస్సేన్‌సాగర్ చెంతన నెక్లెస్ రోడ్డులో రాష్ట్ర ఉద్యానశాఖ ఏర్పాటు చేసిన 'తెలంగాణ ఉద్యాన మహోత్సవం-2017'ను పోచారం ప్రారంభించారు. 133 స్టాళ్లతో.. 25 ప్రభుత్వ.. ప్రభుత్వేతర సంస్థలు ప్రదర్శనలో పాలుపంచుకున్నాయి. కూరగాయల సాగు.., సేంద్రియ ఎరువుల వాడకం, సాగు పనిముట్లతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన ఈనెల 31 వరకూ ఉంటుంది. మంత్రి మాట్లాడుతూ రైతుల ఆత్మహత్యలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలనేది తమ లక్ష్యమన్నారు. ఈ దిశగా కూరగాయల పంటకు రాష్ట్రప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోందన్నారు. నగరాల్లో స్థలాభావం వల్ల.. మిద్దెపైన పంటలు పండించుకునేందుకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వడమే కాకుండా.. సగం ధరకు కూరగాయల సాగుకు పనిముట్లు, ఎరువు, విత్తనాలను అందిస్తున్నామన్నారు. నగరంతో పాటు రాష్ట్రానికి అవసరమైన కూరగాయలు, పండ్లను ఇక్కడే పండించుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలోని 10,800 రెవెన్యూ గ్రామాలను 3,600 యూనిట్లుగా విభజించి సెప్టెంబరు 1 నుంచి 9 వరకూ గ్రామ రైతు సమన్వయ సంఘాలను, 10 నుంచి 14లోగా మండల రైతు సమన్వయ సంఘాలను ఏర్పాటు చేస్తామన్నారు. తర్వాత సదస్సులను ఏర్పాటుచేసి కూరగాయల సాగుకు ప్రోత్సహిస్తామని చెప్పారు. రైతు సమగ్ర సర్వే వివరాలను పూర్తిస్థాయిలో పరిశీలించి సమన్వయకర్త, ఏఈవో సంతకాలతో కూడిన రికార్డు ఆధారంగా వచ్చే ఏడాది మే 15నాటికి ఎకరాకు రూ.4 వేలు నగదును రైతుల ఖాతాలోకి బదిలీ చేస్తామన్నారు. రెండు పంటలు పండించే ఉద్యాన రైతులకు ఏడాదికి రూ.8 వేలు నగదు అందుతుందని మంత్రి చెప్పారు. కార్యక్రమంలో శాసనసభ్యులు మదన్‌మోహన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ లోక భూమారెడ్డి, మాజీ డిప్యూటీ స్పీకర్ హరీశ్వర్‌రెడ్డి, వ్యవసాయశాఖ కార్యదర్శి సి.పార్థసారథి, ఉద్యానశాఖ కమిషనర్ ఎల్.వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.


'తెలంగాణ ఉద్యాన మహోత్సవం–2017'ను ప్రారంభించిన అనంతరం ఓ స్టాల్‌లో దానిమ్మ పండ్లను ఆసక్తిగా పరిశీలిస్తున్న మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి. చిత్రంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి పార్థసారథి తదితరులు

తుది పరిష్కారం దిశగా..

- నేడు ఉద్యోగుల విభజనపై సమావేశం
- కేంద్ర కార్యదర్శి సమక్షంలో ఇరు రాష్ట్రాల సీఎస్‌ల భేటీ

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణల మధ్య ఉద్యోగుల కేటాయింపులపై తుది దఫా సమావేశం సోమవారం తెలంగాణ సచివాలయంలో జరగనుంది. కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాలశాఖ కార్యదర్శి అజయ్‌మిత్తల్ సమక్షంలో రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు దినేష్‌కుమార్, ఎస్పీ సింగ్ భేటీ కానున్నారు. ఉద్యోగుల విభజనపై మూడేళ్లుగా జరుగుతున్న చర్చలు ఒక కొలిక్కి వచ్చాయి. ఉద్యోగుల విభజన కోసం నియమించిన కమలనాథన్ కమిటీ ఈ ప్రక్రియను ముగించింది. ఆ తర్వాత కొన్ని చిన్న సమస్యలు మిగిలిపోయాయి. కొన్ని కోర్టు కేసులూ అపరిష్కృతంగా ఉన్నాయి. కమలనాథన్ కమిటీ గడువు ముగిసిన తర్వాత కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇరు రాష్ట్రాల మధ్య చర్చలు జరుగుతున్నాయి. గత రెండు సమావేశాలు దిల్లీలో జరిగాయి. తాజా సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నారు. దీనికి కేంద్ర కార్యదర్శి మిత్తల్ హాజరవుతున్నారు. ఈ సమావేశంలో మిగిలిన అంశాలన్నింటికీ పరిష్కారం లభిస్తుందని అంచనా వేస్తున్నారు. ఇటీవల స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో జరిగిన తేనీటి విందులో రెండు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు, కేసీఆర్‌లతో గవర్నర్ నరసింహన్ సమావేశమై ప్రధానంగా ఉద్యోగుల విభజన గురించి మాట్లాడారు. ఇరురాష్ట్రాలు సామరస్యంగా అన్ని సమస్యలు పరిష్కరించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈనేపథ్యంలో మిగిలిన అంశాలపై సోమవారం సమావేశంలో స్పష్టత వచ్చే వీలుంది. ఇప్పటికే ఇరు రాష్ట్రాల మధ్య పరస్పర బదిలీలకు నిర్ణయించారు. విద్యుత్, పోలీసు.. మరికొన్ని శాఖల్లో కొంత వివాదం ఉండగా దీనిపైనా ఏకాభిప్రాయం కుదురుతుందని అంచనా వేస్తున్నారు.

కాలుష్యం నుంచి ప్రజలను రక్షించేందుకే పర్యటనలు: రేణుక

కొత్తగూడెం(సింగరేణి), న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా ఉన్న పరిశ్రమలను పరిశీలించి, అవి విడుదల చేస్తున్న వ్యర్థాలతో ప్రజలు అనారోగ్యం పాలుకాకుండా తీసుకొనే చర్యలను కేంద్రానికి నివేదిస్తామని శాస్త్ర, సాంకేతిక, పర్యావరణ, అటవీ పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ రేణుకాచౌదరి వెల్లడించారు. అందుకోసమే తాము వివిధ పరిశ్రమలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఆమె 13మంది కమిటీ సభ్యులతో కలిసి కొత్తగూడెం ఏరియాలోని గౌతంఖని ఉపరితలగనిని, సమీపంలో సింగరేణి అభివృద్ధి చేస్తున్న అడవిని సందర్శించారు. ఆమె మాట్లాడుతూ.. ఆహారకల్తీపై తగిన చర్యలకు కేంద్రానికి సిఫార్సు చేస్తామన్నారు. భారజల, ఐటీసీ కర్మాగారం గోదావరిని కలుషితం చేస్తున్నట్లు తమకు ఫిర్యాదులందాయని వీటిని సోమవారం పరిశీలిస్తామని చెప్పారు. పర్యావరణాన్ని కలుషితం చేస్తున్న పరిశ్రమల మూసివేత చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు. సుజాతనగర్ నుంచి జీకే ఉపరితలగనిని చేరుకొన్న కమిటీ వ్యూపాయింట్ నుంచి గనిని సందర్శించింది. అనంతరం సింగరేణి ఛైర్మన్ ఎన్.శ్రీధర్‌తో రేణుకాచౌదరి చర్చించారు.


రేణుకాచౌదరికి పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న సింగరేణి సీఎండీ శ్రీధర్

నార్త్ సౌత్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్స్ ఫర్ ఎక్సలెన్స్

గత 28 సంవత్సరాలుగా నార్త్ సౌత్ ఫౌండేషన్ (ఎన్ఎస్ఎఫ్) చురుకైన పేద విద్యార్థులను వారి గరిష్ఠ సామర్థ్య స్థాయినందుకునేలా చేయటం ద్వారా మానవ కృషిలో నైపుణ్యాన్ని ప్రోత్సహిస్తున్నది. యుఎస్ఎ ప్రధాన స్థావరంగా పనిచేస్తున్న ఎన్ఎస్ఎఫ్ కుల, మత, లింగ, వర్గ, ప్రాంతాలతో నిమిత్తం లేకుండా ఎన్నో సంవత్సరాలుగా అసాధారణ ప్రతిభగల పేద విద్యార్థులకు 20,000కు పైగా స్కాలర్‌షిప్‌లు మంజూరు చేసింది. భారతదేశంలోని 18 రాష్ట్రాలలో ఎన్ఎస్ఎఫ్ శాఖలు విస్తరించి ఉన్నాయి. ఇది ఒక సమాన అవకాశాన్నిచ్చే నిధి.

ప్రస్తుత సంవత్సరం దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన అత్యంత పేద విద్యార్థులను గుర్తించటానికి ఏకరీతి అర్హత నియమావళితో 3,000 స్కాలర్‌షిప్‌లను అందించటానికి ఎన్ఎస్ఎఫ్ ప్రణాళిక రచన చేస్తున్నది. పరిమిత నిధుల కారణంగా అత్యంత అర్హులైన విద్యార్థులు మాత్రమే స్కాలర్‌షిప్‌లకు పరిగణించబడతారు.

ఇటీవల పబ్లిక్ పరీక్షలో విశేష ప్రతిభ కనపర్చి, పై చదువులు చదివే స్థోమత లేని విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించటానికి వారి నుండి ఎన్ఎస్ఎఫ్ దరఖాస్తులను కోరుతున్నది. ఈ స్కాలర్‌షిప్‌ల కొరకు అర్హత నియమావళిలో దిగువ తెలిపినవి చేరియున్నాయి: అభ్యర్థులు వారి రాష్ట్రంలో 10వ లేదా 12వ తరగతి లేదా సిఇటి/జెఇటి ర్యాంకులలో టాప్ 10%లో ఉండాలి మరియు ప్రభుత్వ (లేదా ఎయిడెడ్) కళాశాలల్లో ఇంజనీరింగ్, మెడిసిన్, డెంటల్, వెటెరినరీ, ఫార్మసీ, అగ్రికల్చర్ లేదా పాలిటెక్నిక్‌లో ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశం పొంది ఉండాలి మరియు వారి వార్షిక కుటుంబ ఆదాయం రూ. 90,000 లోపు ఉండాలి. ప్రభుత్వ లేదా ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల నుండి వచ్చిన విద్యార్థులకు మరియు ఇతర స్కాలర్‌షిప్‌లకు అర్హులుకాని విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. షార్ట్‌లిస్ట్ చేయబడిన అభ్యర్థులు తుది ఎంపిక కొరకు వారి తల్లిదండ్రులతోపాటు ఇంటర్వ్యూ చేయబడతారు. పరిగణించబడేందుకు విద్యార్థులు తప్పనిసరిగా **http://www.northsouth.org/ app6/Login.aspx** నందు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయవలెను.

అవసరమైన డాక్యుమెంట్లతోపాటు ప్రింటెడ్ దరఖాస్తు ఫారం కాపీని (ఎ) తెలంగాణ రీజియన్ కొరకు డి. సీతారామయ్య, రూమ్ 219-220, 2వ అంతస్తు, మోడల్ హౌస్, పంజగుట్ట, హైదరాబాద్, టి.ఎస్. 500082 (ఫోన్: 040-23356368)వారికి లేదా (బి) ఆంధ్రప్రదేశ్ రీజియన్ కొరకు ప్రసాద్ చౌదరి చిట్టూరి, 33-7-10, సూర్యాలయం వీధి, తణుకు, ప.గో.జిల్లా, ఆం.ప్ర. 534211 (మొబైల్ 9959056004)వారికి మెయిల్ చేయవచ్చును. దరఖాస్తుల దాఖలుకు గడువు తేది సెప్టెంబర్ 17, 2017.

స్థలదాతలు: ఈనాడు

రైతు సమన్వయ సమితులకు శ్రీకారం

- సెప్టెంబర్ 9లోగా గ్రామ, మండల, జిల్లా స్థాయుల్లో ఏర్పాటు
- జిల్లాలకు ఇన్‌ఛార్జి మంత్రుల నియామకం
- నోడల్ అధికారులుగా కలెక్టర్లు
- వచ్చే ఏడాది వానాకాలం, యాసంగిలో ఎకరానికి రూ.4 వేలు
- వ్యవసాయ శాఖ ఉత్తర్వులు

ఈనాడు - హైదరాబాద్

వచ్చే ఏడాది వానాకాలం (ఖరీఫ్) సీజన్ నుంచి రైతులకు ఎకరానికి రూ.4 వేలు ఇచ్చే పథకానికి కీలక అడుగు పడింది. ఈ పథకం అమలులో భాగంగా గ్రామ, మండల, జిల్లా స్థాయిలో రైతు సమన్వయ సమితి (ఆర్‌ఎస్‌ఎస్)లను వచ్చే నెల 9లోగా ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ వ్యవసాయశాఖ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రస్థాయి సమితి ఏర్పాటుకు గడువును నిర్ణయించలేదు. ఈ పనులు శరవేగంగా జరగాలని ప్రభుత్వం పట్టుదలగా ఉండటంతో ఆదివారం మధ్యాహ్నం ఆఘమేఘాల మీద ఉత్తర్వుల దస్త్రాన్ని ఫాంహౌస్‌లో ఉన్న సీఎం కేసీఆర్ వద్దకు పంపి ఆమోదం పొంది సాయంత్రానికల్లా ఉత్తర్వును వెలువరించారు. ఇందులో ముఖ్యాంశాలు..

- వచ్చే ఏడాది వానాకాలం, యాసంగి (రబీ) సీజన్లలో సాగుచేసే సాధారణ, ఉద్యాన పంటలకు ఎకరానికి రూ.4 వేలు చొప్పున రైతు బ్యాంకు ఖాతాలో వ్యవసాయ శాఖ జమ చేస్తుంది. విత్తనాలు, ఎరువుల కొనుగోలు ఇతర ఖర్చులకు ఈ సొమ్ము రైతుకు ఉపయోగపడుతుంది.
- ఇప్పటికే ఇంటింటికి తిరిగి సేకరించిన రైతుల సమగ్ర సర్వే వివరాలను ఇందుకు తీసుకుంటారు. ఈ సర్వేలో వివాదాలున్న భూములపై రెవెన్యూ, వ్యవసాయశాఖలు పరిశీలించి వచ్చే నెల 15 నుంచి డిసెంబరు 15 వరకూ గ్రామసభలు నిర్వహించి ప్రజల సమక్షంలో పరిష్కరిస్తారు.
- వ్యవసాయానికి యోగ్యం కాని, సాగు చేయని భూములకు, తీవ్ర వివాదాలున్న భూములకు రూ.4 వేలు ఇవ్వరు.
- ఈ పథకం అమలుకు జిల్లా స్థాయిలో కలెక్టర్, రాష్ట్ర స్థాయిలో వ్యవసాయ కమిషనర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు.
- ఒకే పంటను ఎక్కువ మంది రైతులు సాగు చేసే విధానాన్ని నియంత్రించేందుకు 'పంటల కాలనీ' విధానాన్ని ప్రోత్సహిస్తారు.
- పంటలకు మద్దతు ధర ఇప్పించేందుకు రూ.500 కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తారు.
- గ్రామస్థాయిలో ఏర్పాటు చేసే ఆర్‌ఎస్‌ఎస్‌లో 15, మండల, జిల్లా స్థాయిల్లో 24, రాష్ట్రస్థాయిలో 42 మంది రైతులు సభ్యులుగా ఉంటారు. వీరందరినీ నామినేటెడ్ విధానంలో ప్రభుత్వమే నియమిస్తుంది.
- ప్రతి ఆర్‌ఎస్‌ఎస్ నియామకంలో కొన్ని నిబంధనలు పాటించాలి. తప్పనిసరిగా గ్రామ నివాసి అయి సాగు చేసే రైతునే గ్రామ ఆర్‌ఎస్‌ఎస్‌లో నియమిస్తారు. ప్రతి గ్రామ సమితిలో అన్నివర్గాలకు ప్రాతినిధ్యంతోపాటు 3వ వంతు మంది మహిళలుండాలి.
- జిల్లా ఇన్‌ఛార్జులుగా నియమితులైన మంత్రులు అన్ని సమితుల సభ్యులు, సమన్వయకర్త పేర్లను ప్రతిపాదిస్తారు. వీరు చెప్పిన వారినే నియమిస్తారు.

ఇన్‌ఛార్జి మంత్రులు వీరే..

మంత్రి పేరు	జిల్లాలు
పోచారం శ్రీనివాసరెడ్డి	నిజామాబాద్, కామారెడ్డి
కడియం శ్రీహరి	జనగాం, వరంగల్ (అర్బన్, రూరల్)
ఈటల రాజేందర్	కరీంనగర్, పెద్దపల్లి
కె.తారక రామారావు	రాజన్న సిరిసిల్ల, జగిత్యాల
టి.హరీశ్‌రావు	సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి
జోగు రామన్న	ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్
ఇంద్రకరణ్‌రెడ్డి	నిర్మల్, మంచిర్యాల
మహేందర్‌రెడ్డి	రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్
జగదీశ్‌రెడ్డి	నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి
తుమ్మల నాగేశ్వరరావు	భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం
జూపల్లి కృష్ణారావు	నాగర్‌కర్నూలు, వనపర్తి, జోగులాంబ గద్వాల
లక్ష్మారెడ్డి	మహబూబ్‌నగర్
చందూలాల్	జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్



పట్నాలోని గాంధీమైదాన్‌లో నిర్వహించిన 'భాజపా భగావో, దేశ్ బచావో' ర్యాలీలో పాల్గొన్న ప్రజలు



పట్నాలోని గాంధీమైదాన్‌లో నిర్వహించిన 'భాజపా భగావో, దేశ్ బచావో' ర్యాలీలో పాల్గొన్న లాలు ప్రసాద్‌యాదవ్, శరద్‌యాదవ్

వచ్చే ఎన్నికల్లో భాజపాను ఓడించాలి

- పట్నా సమావేశంలో విపక్షనేతల వినతి

పట్నా

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో భాజపాను ఓడించాలని పలువురు ప్రతిపక్ష నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం ఇక్కడ ఆర్జేడీ ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శనలో వివిధ పార్టీల నేతలు మాట్లాడుతూ భాజపాను తొలగించే రోజులు ప్రారంభమయ్యాయని అన్నారు. ఈ ప్రదర్శనలో ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌తో పాటు, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, కాంగ్రెస్ నాయకుడు గులాం నబీ ఆజాద్, జేడీ(యు) తిరుగుబాటు నేత శరద్ యాదవ్‌లు పాల్గొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ, ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ, మాజీ ప్రధాని దేవెగౌడలు రాలేకపోవడంతో వారి ప్రసంగాలను ప్రసారం చేశారు. ఈ సమావేశానికి బీఎస్పీ అధినేత మాయావతి రాలేదు. మమతా బెనర్జీ వచ్చారన్న కారణంతో సీపీఎం ప్రతినిధులు ఎవరూ హాజరుకాలేదు. ఎన్సీపీ, నేషనల్ కాన్ఫరెన్స్, డీఎంకే, కేరళ కాంగ్రెస్, ఆర్ఎల్‌డీ, సీపీఐ, జేఎంఎం, జేవీఎం, జేడీ(ఎస్), అస్సాంకు చెందిన ఏఐయూడీఎఫ్, ఆర్ఎస్పీ, సీపీఐ(ఎంఎల్) పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

లాలూ ప్రసాద్ యాదవ్ తన ప్రసంగంలో బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్‌పై విమర్శలు గుప్పించారు. నీతీశ్ ముఖ్యమంత్రి పదవికి తగరని, కానీ గతంలో ములాయంసింగ్, శరద్‌యాదవ్‌లు ఒత్తిడి తేవడంతోనే ఆయనను ముఖ్యమంత్రిని చేయడానికి అంగీకరించానని చెప్పారు. అయితే ఆయన మహాకూటమిని విడచిపెట్టి భాజపాలో చేరారని విమర్శించారు. శరద్ యాదవ్ మాట్లాడుతూ మహాకూటమి ఏర్పాటుకు తాను ప్రయత్నాలు చేస్తునే ఉంటానని, ఈసారి 125 కోట్ల మంది ప్రజలతో కూటమి ఏర్పాటు చేస్తానని చెప్పారు. గులాం నబీ ఆజాద్ ప్రసంగిస్తూ బిహార్ ప్రజలు ఇచ్చిన ఓట్లను నీతీశ్ భాజపాకు అమ్మేశారని విమర్శించారు. భాజపాను ఓడిస్తానంటూ లాలూ కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ శంఖం పూరించారు. ఊపిరి బిగబట్టి ఏకబిగిన శంఖం ఊదడం వేదికపై ఉన్న నేతలను ఆశ్చర్యపరిచింది.

ప్రదర్శన విఫలం: భాజపా

మమతా బెనర్జీ మినహా మిగిలిన అగ్రనేతలు ఎవరూ రాకపోవడంతో ప్రదర్శన విఫలమయిందని భాజపా సీనియర్ నేత, బిహార్ ఉపముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోదీ విమర్శించారు. ఆర్జేడీ గతంలో నిర్వహించిన అన్ని ప్రదర్శనలకన్నా ఇదే పేలవంగా ఉందంటూ ట్వీట్ చేశారు.

ఫొటోషాప్ చిత్రంతో.. లాలూపై విమర్శల వర్షం

పట్నా: 'లాలూ ముందు ఎవ్వరూ నిలబడలేరు. గాంధీ మైదాన్‌కు వచ్చి మీకు వీలైనంత మందిని లెక్కపెట్టుకోండి'అంటూ ఆర్జేడీ నాయకుడు లాలూ ప్రసాద్ ట్విటర్‌లో పంచుకున్న ఫొటో ఆయనపై విమర్శల వర్షం కురిపించింది. దీన్ని అధికారిక ట్విటర్ ఖాతాలో లాలూనే పోస్ట్‌చేశారు. అయితే ర్యాలీకి వచ్చిన వారిని "ఫొటోషాప్"లో ఎక్కువగా చేసి చూపించినట్లు దీనిలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. దీంతో ఆయన పోస్ట్‌చేసిన కొద్ది నిమిషాల్లోనే విమర్శలు వెల్లువెత్తాయి. కొందరు లాలూ కుంభకోణాలను ఉటంకిస్తూ చెణుకులు విసిరారు. మరికొందరైతే... 'అందరూ ఒకే లాంటి వస్త్రాలు ధరిస్తారా? కచ్చితంగా ఇది ఫొటోషాపే', 'లాలూను ద్వేషించేవారే దీన్ని ఫొటోషాప్ అని చెబుతారు. కానీ ఇది నిజం. ఇందులో దక్షిణాఫ్రికా, ఉగాండా లాంటి దేశాలకు చెందినవారూ కనిపిస్తున్నారు. జాగ్రత్తగా చూడండి', 'మనిషికి రూ.2000 ఇస్తే భారీగా వస్తారు. లాలూ మాత్రం రూ.2,000 ఇచ్చి ఫొటోషాప్ చేయించినట్లుంది' అంటూ లాలూను తూర్పారబట్టారు. ఇంకొందరైతే ఇంతకంటే మెరుగ్గా, ఎవరూ గుర్తుపట్టకుండా ఫొటోషాప్ చేసిన చిత్రాలనూ పోస్ట్‌చేశారు.

శరద్ యాదవ్‌పై అనర్హత వేటు వేయండి

- రాజ్యసభ ఛైర్మన్‌కు లేఖ రాయనున్న జేడీ(యు)

దిల్లీ

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందున శరద్ యాదవ్‌పై అనర్హత వేటువేయాలని కోరుతూ రాజ్యసభ ఛైర్మన్ ఎం.వెంకయ్య నాయుడుకు లేఖ రాయనున్నామని జేడీ(యు) ముఖ్య ప్రధాన కార్యదర్శి కె.సి.త్యాగి తెలిపారు. పార్టీ ఆదేశాలను ధిక్కరించి ఆయన ఆదివారం ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారని చెప్పారు. రాజ్యాంగంలోని షెడ్యూల్-10 ప్రకారం పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా వేరే పార్టీ ప్రదర్శనలో పాల్గొంటే.. అది పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా విడచిపెట్టడం కిందకే వస్తుందని తెలిపారు. గతంలో కెప్టెన్ జై నారాయణ్ నిషాద్, ఉపేంద్ర కుశ్వాహాలను ఇదే కారణాలతో సభ్యత్వం నుంచి తొలగించారని గుర్తుచేశారు. శరద్ యాదవ్ గత ఏడాది రాజ్యసభకు ఎన్నికకాగా, ఆయన పదవీ కాలం 2022 వరకు కొనసాగనుంది.

శరద్ యాదవ్‌కు హెచ్చరిక లేఖ

బిహార్ రాజకీయాల్లో జోక్యం చేసుకుంటున్నందుకు, జాతి వ్యతిరేక శక్తులతో చేతులు కలిపినందుకు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరిస్తూ శరద్ యాదవ్‌కు లేఖ వచ్చింది. తన ఇంటికి పోస్టు ద్వారా వచ్చిన ఆ లేఖను ఆయన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్లారు.

జీఎం ఆహారోత్పత్తుల ప్రభావంపై పరిశోధనలేవీ?

- వాటిపై లేబుళ్లు అతికించాలి
- పార్లమెంటరీ స్థాయీసంఘం సిఫార్సులు

ఈనాడు, హైదరాబాద్: 'తాము కొనుగోలు చేసే ఆహారోత్పత్తుల వివరాలను తెలుసుకోవడం ప్రతీ పౌరుడి హక్కు. ముఖ్యంగా జన్యుమార్పిడి (జీఎం) పంటలతో ఉత్పత్తి చేసిన ఆహారంపై ఆ వివరాలను ముద్రించి మాత్రమే విక్రయించాలి. ఇప్పటికే ఈ విషయంలో చాలా ఆలస్యం జరిగింది' అని పార్లమెంటరీ స్థాయీసంఘం స్పష్టం చేసింది. 'జన్యుమార్పిడి పంటలు - పర్యావరణంపై ప్రభావం' అనే అంశంపై ఈ సంఘం విడుదల చేసిన తాజా నివేదికలో ప్రజలు, పశువులు, కోళ్లు, చేపలకు జీఎం ఆహారోత్పత్తులను ఆహారంగా ఇస్తున్న తీరుపై పలు వ్యాఖ్యానాలు చేసింది. నివేదికలోని ముఖ్యాంశాలు..

- జీఎం పంటల సాగును వాణిజ్యపరంగా అనుమతించే ముందు వీటినుంచి తయారయ్యే ఆహారోత్పత్తులు ప్రజల ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే కోణంలో అధ్యయనం జరగాలి.
- యూపీలోని ఇజ్జత్‌నగర్ భారత పశువైద్య పరిశోధన సంస్థలో ఏడాది వయసున్న 36 మేకలకు 90 రోజులు, నాగపూర్‌లోని జాతీయ పత్తి పరిశోధన కేంద్రంలో 6మేకలకు 4నెలలు బీటీపత్తి విత్తనాల దాణాను ఇచ్చి పరీక్షించగా మార్పులేమీ లేవు.
- హరియాణాలోని కర్నాల్ పాడి పరిశోధన కేంద్రంలో, ముంబయిలోని కేంద్ర మత్స్య పరిశోధన సంస్థలో, రాజస్థాన్‌లోని అవికానగర్ గొర్రెల, ఉన్ని పరిశోధన కేంద్రంలో ఈ తరహా పరీక్షలు జరిగాయి. ఇలాంటి ప్రయోగాలు ఎలా చేయాలో కేంద్ర పశుసంవర్ధక, మత్స్యశాఖలు శాస్త్రీయమైన మార్గదర్శకాలు విడుదల చేయాలి.
- జీఎం పంటల దాణా తింటే పశువుల్లో సంతానలేమి, రోగ నిరోధకశక్తి తగ్గడం, అంతర్గత అవయవాల్లో మార్పులు, జీర్ణకోశ సమస్యలు వంటి సమస్యలున్నట్లు పలువర్గాలు వెల్లడిస్తున్నాయి.
- ఈ అంశంపై పూర్తిస్థాయిలో పరిశోధనలు చేపట్టేందుకు కేంద్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి శాఖలు, ఐసీఏఆర్ సంస్థలతో కలిసి కార్యాచరణ చేపట్టాలి.

సిగరెట్ అలవాటుకు కారణమయ్యాడని సహచరుడ్ని చంపాడు

దిల్లీ: సిగరెట్ అలవాటు చేసి గొంతు క్యాన్సర్ రావడానికి కారణమయ్యాడని తన సహచరుణ్ని చంపాడో వ్యక్తి. దిల్లీలో జరిగిన ఈ ఘటన వివరాల్లోకెళితే.. ముస్తఖీమ్ అహ్మద్, ఇనాయత్ దిల్లీలోని ఓ హోటల్‌లో వంటవాళ్లుగా పనిచేస్తున్నారు. వీరిద్దరిలో ఇనాయత్ పని మెరుగ్గా ఉండడంతో యజమాని మెప్పు పొందాడు. ఇది నచ్చని నిందితుడు అహ్మద్ సిగరెట్, గంజాయి తీసుకోవడం ప్రారంభించాడు. ఈ క్రమంలో అతను గొంతు క్యాన్సర్ బారిన పడ్డాడు. దీనికితోడు అహ్మద్ పని తీరు మెరుగుపర్చుకోకపోవడంతో యజమాని పనిలో నుంచి తొలగించాడు. వీటన్నింటికీ కారణం ఇనాయత్ అని భావించిన నిందితుడు అతినిపై అక్కసు పెంచుకున్నాడు. తన స్వస్థలమైన ఉత్తర్‌ప్రదేశ్‌లోని అమ్రోహాకు వెళ్లి పిస్తోలు కొని, గురి చూసి కాల్చేందుకు సాధన కూడా చేసాడు. అనంతరం దిల్లీకి తిరిగి వచ్చి ఇనాయత్‌ను కాల్చి చంపాడు. పోలీసులు నిందితుణ్ని అదుపులోకి తీసుకున్నారు. తనకు సిగరెట్ అలవాటు చేసింది మృతుడేనని నిందితుడు ఆరోపించాడు.

అఫ్గాన్‌లో కారు బాంబు పేలి 13 మంది మృతి

కాబూల్: అఫ్గానిస్థాన్‌లోని హెల్మాండ్ ప్రావిన్స్‌లో జిల్లా కేంద్రమైన నవాలో ఆదివారం కారు బాంబు పేలి 13 మంది మరణించారు. 18 మంది గాయపడ్డారు. మరణించిన వారిలో అఫ్గాన్ సైనికులతో పాటు, సామాన్య పౌరులు కూడా ఉన్నారు. ఇందుకు బాధ్యత వహిస్తూ ఏ సంస్థ ప్రకటన చేయలేదు.

జమిలి ఎన్నికలు మేలు

(మొదటి పేజీ తరువాయి)

వ్యవహరిస్తుంది. ఏ సమయంలో ఏది చేయాలన్న విషయమై 2018 మార్చి నాటికి కాలపట్టికను తయారు చేయాల'ని సూచించింది.

ప్రధాని, ప్రణబ్‌ల అభిప్రాయమూ ఇదే..

ప్రధాని నరేంద్ర మోదీతో పాటు, అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ జమిలి ఎన్నికలపై మొగ్గు చూపిన నేపథ్యంలో నీతి ఆయోగ్ సిఫార్సు ప్రాధాన్యం సంతరించుకొంది. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవ సందేశంలో ప్రణబ్ ముఖర్జీ మాట్లాడుతూ 'ఎన్నికల సంస్కరణలపై నిర్మాణాత్మక చర్చలు జరగాల్సి ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఏకకాలంలో జరిగేవి. మళ్లీ ఆ విధానాన్ని అనుసరించాల్సి ఉంది. దీనిపై ఎన్నికల సంఘం రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరపాల'ని పేర్కొన్నారు. ఫిబ్రవరిలో లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ ప్రసంగించిన ప్రధాని మోదీ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. 'జమిలి ఎన్నికల వల్ల మాతో పాటు అందరికీ కొంత నష్టం జరుగుతుంది. అయితే పార్టీలు దీన్ని రాజకీయ సంకుచిత దృష్టితో చూడకూడదు. నిరంతరం ఎన్నికలు జరుగుతున్నందు వల్ల వ్యయం పెరుగుతోంది. 2009 లోక్‌సభ ఎన్నికల్లో వ్యయవం రూ.1100 కోట్లు ఉంటే, 2014 నాటికి అంది రూ.4000 కోట్లకు పెరిగింది. ఉపాధ్యాయులు సహా కోటి మందికిపైగా ప్రభుత్వోద్యోగులు ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటున్నారు. దీనివల్ల ముఖ్యంగా విద్యారంగానికి తీవ్రమైన నష్టం జరుగుతోంది. దేశ శత్రువులు సవాళ్లు విసురుతున్న సమయంలోనే భద్రతా బలగాలను ఎన్నికల కోసం మళ్లించవలసి వస్తోంద'ని పేర్కొన్నారు. ఈ సమస్యలను అధిగమించడానికి ఏకకాల ఎన్నికలే మార్గమని సూచించారు. నీతి ఆయోగ్‌దీ ఇదే అభిప్రాయం కావడం గమనార్హం.

ప్రచ్ఛన్న నిరుద్యోగతే ప్రధాన సమస్య

అర్హతలకు తగినవి కాకుండా ఏదో ఒక ఉద్యోగం చేసే ప్రచ్ఛన్న నిరుద్యోగతే నేటి ప్రధాన సమస్య అని నీతి ఆయోగ్ పేర్కొంది. ఉత్పాదకతను గణనీయంగా పెంచే, మంచి వేతనాలు లభించే ఉద్యోగాలపై దృష్టి సారించాల్సి ఉందని సూచించింది. దేశంలో ఉద్యోగాలు సృష్టించని ఆర్థికాభివృద్ధి జరుగుతోందన్న అభిప్రాయం సరికాదని తెలిపింది. ఉద్యోగాలు వస్తున్నాయని, కానీ అవి అర్హతకు తగినవి కాదని పేర్కొంది. ప్రస్తుతం నిరుద్యోగం సమస్య కాదని, అర్హతలకు తగిన ఉద్యోగం ఇవ్వని ప్రచ్ఛన్న నిరుద్యోగతే సమస్య అని వివరించింది. తీర ప్రాంత ఉద్యోగ మండళ్ల (కోస్టల్ ఎంప్లాయిమెంట్ జోన్-సీఈజడ్)లు ఏర్పాటు చేసే కార్మిక శక్తిని అధికంగా ఉపయోగించే చైనాలోని బహుళజాతి సంస్థలు దేశానికి వచ్చే అవకాశం ఉందని అభిప్రాయపడింది. ఇటీవల వస్త్ర పరిశ్రమలో ఉద్యోగులకు నిర్దిష్ట కాలపరిమితిని విధించారని, మిగిలిన పరిశ్రమల్లోనూ దీనిని అమలు చేయాల్సి ఉందని తెలిపింది. ఇందుకోసం చట్టాల్లో తగిన మార్పులు చేయాలని సూచించింది.

ట్రాఫిక్ చలాన్ల కోసం ప్రత్యేక కోర్టులు

కిందిస్థాయి న్యాయస్థానాలపై భారం తగ్గించడంలో భాగంగా ట్రాఫిక్ చలాన్ల కేసుల కోసం ప్రత్యేకంగా కోర్టులు ఏర్పాటు చేయాలని సూచించింది. ఈ కోర్టులను నిర్వహించడానికి న్యాయ కోర్సుల విద్యార్థులను నియమించాలంటూ 2014లో లా కమిషన్ చేసిన సిఫార్సులను ప్రస్తావించింది. ట్రాఫిక్ ఉల్లంఘించిన వారు న్యాయస్థానానికి వచ్చి జరిమానా చెల్లించాలన్న నిబంధనను రద్దు చేసి, ఆన్‌లైన్ ద్వారా చెల్లించే అవకాశం కలిగించాలని సూచించింది.

భూగర్భ జలాల నిల్వలపై అధ్యయనం చేయాలి: భూగర్భ జలాలను సక్రమంగా వాడుకోవడంతో పాటు, వాటి నిల్వలను పెంచే విధంగా చర్యలు తీసుకోవడంపై 2018లోగా అధ్యయనం చేయించాలని నీతి ఆయోగ్ సిఫార్సు చేసింది. దేశంలో జలవనరుల సామర్థ్యం ఎంతో కూడా తెలుసుకోవాలని సూచించింది.

బడ్జెట్ కేటాయింపుల్లో మార్పులు చేయండి

ప్రస్తుతం ఒక సంవత్సరాన్ని దృష్టిలో పెట్టుకొని బడ్జెట్‌లో కేటాయింపులు జరుపుతున్నారని, అలా కాకుండా ఒక మధ్య తరహా కాలాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. దీని వల్ల కేటాయింపులపై సమీక్షలకు అవకాశం కలుగుతుందని పేర్కొంది.

పునరుత్పాదక ఇంధనంపై దృష్టి

2019-20 నాటికి 100 గిగా వాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని ఉత్పాదన చేయాలని సూచించింది. అప్పుడే 2020 నాటికి 175 గిగావాట్ల ఉత్పాదన చేయాలన్న లక్ష్యం సాధ్యమవుతుందని తెలిపింది. ఘనవ్యర్థాలను సద్వినియోగం చేసుకోవడానికి ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యంలో విద్యుత్తు ఉత్పాదన కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించింది. దీని కోసం 'వేస్ట్ టు ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా'ను నెలకొల్పాలని సిఫార్సు చేసింది.

ఐఎస్ ఉగ్రవాదులపై ఇరాకీ సేనల విజయం

టల్ అఫర్: ఇరాకీ సేనలు ఆదివారం ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఉగ్రవాదులపై విజయం సాధించాయి. అమెరికా ఆధ్వర్యంలోని సంకీర్ణ దళాలు, స్థానిక పౌర సైన్యం సాయంతో ఉగ్రవాదులను టల్ అఫర్ నగరం నుంచి తరిమికొట్టాయి. ఇరాక్‌లో ఐఎస్ ఉగ్రవాదులకు పట్టున్న పట్టణ ప్రాంతాల్లో చివరిది ఇదే కావడం గమనార్హం. ఈ నగరం నుంచి జిహాదీ ఉగ్రవాదులను తరిమివేస్తామని గత వారంలోనే సైనికాధికారులు ప్రకటించారు. నగరంలోని మొత్తం 29 ప్రాంతాలు సైన్యం ఆధీనంలోకి వచ్చాయి. యుద్ధ ట్యాంకులపై నుంచి ఇరాక్ జాతీయ జెండాలను ఊపుతూ, విజయ చిహ్నాలు చూపిస్తూ సైనికులు నగరంలో ఊరేగింపు జరిపారు. ఉత్తర ఇరాక్‌లో మోసుల్ నగరానికి, సిరియా సరిహద్దుకు మధ్యలో ఉన్న ఈ నగరం ఉగ్రవాదులకు కీలక స్థావరంగా ఉండేది. ఈ విజయం ఇచ్చిన స్ఫూర్తితో ఇక్కడికి 15 కి.మీ. దూరంలోని అల్ అయాదియ్ పట్టణాన్ని స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వ దళాలు భావిస్తున్నాయి. దీంతో ఉగ్రవాదుల చేతిలో ఉన్న ప్రాంతాల్లో 70% తిరిగి ప్రభుత్వ పరమయ్యాయని అధికారవర్గాలు తెలిపాయి.

హింసను సహించం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు పిలుపునిచ్చారు. జన్‌ధన్ యోజన వంటివాటిని పేద ప్రజల సాధికారత కోసమే తీసుకువచ్చామని చెప్పారు. సెప్టెంబరు అయిదో తేదీన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం జరగనున్న విషయాన్ని ప్రస్తావిస్తూ- ఈ సందర్భంగా ప్రజలంతా ఒక ప్రతినబూనాలని కోరారు. రూపాంతరీకరణను బోధించడానికి, సాధికారతపై విద్యావంతుల్ని చేయడానికి, నాయకత్వం వహించడాన్ని నేర్పించడానికి ప్రతిజ్ఞ తీసుకోవాలని చెప్పారు. వేల ఏళ్లుగా భారత్‌కు ఘనమైన సాంస్కృతిక వారసత్వం ఉందనీ, మనం చేసుకునే పండుగలు దానిని చాటుతాయనీ తెలిపారు. వంటకాలు, జీవనశైలి, వస్త్రధారణలకే ఇది పరిమితం కావనీ, అనేక వృత్తుల రూపంలో కనిపిస్తుంటుందనీ చెప్పారు.

ముస్లిం సేవకుల స్పందన ఓ ఉత్తేజపూరిత ఉదాహరణ

ఇటీవల గుజరాత్‌లో వరదలు వెల్లువెత్తినప్పుడు జమాత్-ఉలేమా-ఎ-హింద్‌కు చెందిన సేవకులు 22 దేవాలయాలను, రెండు మసీదులను శుభ్రం చేసిన తీరు మన ఐక్యతకు ఓ అద్భుతమైన, ఉత్తేజపూరిత ఉదాహరణ అని ప్రధాని పేర్కొన్నారు. 'మన సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక ఘటనల్ని చూస్తే ఏడాదిలో ఉత్సవంతో సంబంధంలేని రోజంటూ ఒకటీ ఉండదేమో. హిందువుల పండగలన్నీ ప్రకృతి పంచాంగంతో నేరుగా ముడిపడినవే. ముఖ్యంగా రైతులు, మత్స్యకారులతో అనుసంధానమైన పండగలు మనకు ఎక్కువ. జైనులు జరుపుకొన్న 'సంవత్సరి'తో పాటు దేశవ్యాప్తంగా జరుగుతున్న గణేశ్ చతుర్థి, ఓనం, నవరాత్రి (గుజరాత్), దుర్గాపూజ (బెంగాల్), ఈద్-ఉల్-జుహా సందర్భంగా జాతికి నా శుభాకాంక్షలు. క్షమాగుణం, అహింస, సోదరభావాలకు సంవత్సరి పండుగ ఓ ఉదాహరణ. క్షమాగుణం గొప్ప వ్యక్తుల గుణమని మహాత్మాగాంధీ ఏనాడో చెప్పారు. 'క్షమా వీరస్య భూషణం'- అంటే క్షమించడమే వీరులకు అలంకారమని అర్థం. క్షమించేవాడు శౌర్యుడు' అని ప్రధాని చెప్పారు. క్షమించేవారు, దానిని స్వీకరించేవారు కూడా దేవుడి ఆశీస్సులు పొందుతారన్నారు.

పండగలు... పరిశుభ్రతకు చిహ్నాలు కావాలి

'ఐక్యత, సమానత్వం, సమైక్యతలకు గణేష్ చతుర్థి వేడుకలు నిదర్శనం. ప్రేమ, సామరస్యత, కొత్త ఆశలు రేకెత్తించి, నూతన విశ్వాసాన్ని ప్రోది చేయడంలో ఓనం వేడుక ఉపకరిస్తుంది. గుజరాత్‌లో జరిగే నవరాత్రి, బెంగాల్‌లో దుర్గా పూజ వేడుకలు ప్రధాన పర్యాటక ఆకర్షణలుగా నిలుస్తాయి. విశ్వాసం, నమ్మకాలకు పండుగలు చిహ్నాలు. నవ భారతంలో మనం వాటిని పరిశుభ్రతకు చిహ్నాలుగానూ మార్చుకోవాలి' అని మోదీ పిలుపునిచ్చారు. పండుగలతో విడదీయరాని అనుబంధాన్ని ఏర్పరచడం ద్వారా పరిశుభ్రతకు పెద్ద పీట వేయాలన్నారు. జన్‌ధన్‌యోజనలో 30 కోట్ల కొత్త కుటుంబాలు రూ.65వేల కోట్లను జమ చేశాయని చెప్పారు. ఈ పథకంతో పాటు, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమాయోజన, సురక్షా బీమా యోజన, ముద్రా యోజన వంటివి పేదలకు కలిగిస్తున్న లబ్ధి గురించి సర్వేల్లో వెల్లడైన వాస్తవాలు ఉత్తేజభరితంగా ఉన్నాయని ప్రధాని చెప్పారు. జేబులో రూపే కార్డు ఉంటే హుందాతనం పెరిగినట్లుగా పేదవాడు భావిస్తున్నాడన్నారు.

ప్లే స్టేషన్లో కాదు... మైదానాల్లో ఆడండి...

కంప్యూటర్ ప్లే స్టేషన్లో కాకుండా నిజమైన క్రీడామైదానాల్లోకి యువకులు వచ్చి చెమట చిందించి ఆడాలని ప్రధాని కోరారు. ఈ నెల 29న జరగనున్న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ప్రస్తావన తీసుకువచ్చారు. ప్లే స్టేషన్‌తో పోలిస్తే క్రీడా మైదానం ఎంతో ముఖ్యమైనదని గుర్తించాలని సూచించారు. కంప్యూటర్లో 'ఫిఫా' ఆడినా, మైదానంలో ఫుట్‌బాల్, క్రికెట్ వంటివి ఆడితే ఆ మజాయే వేరుగా ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రఖ్యాత హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ గొప్పతనాన్ని ప్రధాని ప్రస్తావించారు. 'గతంలో కుటుంబంలో పిల్లలు ఆడుకునేందుకు బయటకు వెళ్తుంటే ఎన్నింటికి తిరిగి వస్తావని తల్లులు మొదటగా అడిగేవారు. ఇప్పుడు పిల్లలు ఇంటికి వస్తూనే కార్టూన్ ఛానళ్లకో, మొబైల్ గేమ్స్‌కో అతుక్కుపోతుంటే ఎప్పుడు బయటకు వెళ్తావని తల్లులు అరవాల్సి వస్తోంది. కాలం అంతగా మారిపోయింది' అని మోదీ వివరించారు. క్రీడా ప్రతిభను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఒక పోర్టల్‌ను సోమవారం ప్రారంభించనుందని చెప్పారు. క్రీడా ప్రావీణ్యం ఉన్న పిల్లలెవరైనా తమ వివరాలు, లేదా వీడియోను ఈ పోర్టల్‌ద్వారా పంపిస్తే, ఎంపిక చేసినవారికి క్రీడల మంత్రిత్వశాఖ శిక్షణ ఇస్తుందని చెప్పారు. అక్టోబరు 6 నుంచి జరగబోయే ప్రపంచ కప్ ఫుట్‌బాల్ (ఫిఫా) పోటీలను ఆస్వాదించాలని పిలుపునిచ్చారు.

'నూతన భారత్' కోసం పనిచేయండి

- అధికారులకు మోదీ పిలుపు

దిల్లీ: 2022 కల్లా 'నూతన భారత్'ను నిర్మించేందుకు స్పష్టమైన లక్ష్యాలు ఏర్పరుచుకుని.. కృషి చేయాలని అధికార యంత్రాంగానికి ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రభుత్వ అదనపు కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులతో ఆదివారం ఆయన సంభాషించారు. ఈ సందర్భంగా వ్యవసాయం, తాగునీరు, విద్య, వస్తు ఉత్పత్తి రంగం, అంతర్గత భద్రత, సౌర విద్యుత్, ఆవిష్కరణలు, పాలనలో సమష్టి కృషి తదితర అంశాలకు సంబంధించి అధికారులు తమ అనుభవాలను ప్రధానితో పంచుకున్నారు. భారత్‌లో ప్రస్తుతం వైద్య పరికరాల తయారీకి తగిన వాతావరణం సృష్టించేందుకు ప్రాధాన్యతనివ్వాలని మోదీ వ్యాఖ్యానించారు. కొత్త చట్టాలను రూపొందిన కొద్దీ.. పాత చట్టాలను సమీక్షించాలని, అవసరమైతే రద్దు చేయాలని చెప్పారు. దేశంలో బాగా వెనుకబడిన 100 జిల్లాలు.. అభివృద్ధి సూచీల్లో జాతీయ సగటును అందుకునేలా ప్రత్యేకంగా కృషి చేయాలని అన్నారు. 'నూతన భారత్'కు సంబంధించి అధికారులతో ప్రధాని సంభాషణ కార్యక్రమం ఏర్పాటు చేయడం ఇది మూడోసారి.

గ్రహం అనుగ్రహం

28-8-2017 సోమవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం
వర్ష రుతువు; భాద్రపద మాసం; శుక్ల పక్షం
సప్తమి: రా. 12-34 తదుపరి అష్టమి
విశాఖ నక్షత్రం: రా. 9-23 తదుపరి అనూరాధ
అమృతఘడియలు: ఉ. 11-49 నుంచి 1-34 వరకు
వర్జ్యం: రా. 1-45 నుంచి 3-31 వరకు
దుర్ముహూర్తం: మ. 12-27 నుంచి 1-17 వరకు
తిరిగి మ. 2-57 నుంచి 3-47 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ. 5-48; సూర్యాస్తమయం: సా. 6-16

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	21.7	31.8
మహబూబ్‌నగర్	23.0	30.0
హైదరాబాద్	23.0	30.2
కరీంనగర్	23.0	34.0
కర్నూలు	23.1	30.1
ఖమ్మం	24.0	30.0
హన్మకొండ	25.0	32.0
సూర్యాపేట	25.0	34.5
రామగుండం	25.6	30.8
తిరుపతి	26.2	33.0
నిజామాబాద్	27.0	32.0

వసుంధర

ఏదయినా ఒక వస్తువు.. అనుకున్న సమయం కన్నా ముందే పనిచేయడం మానేస్తే.... ఏం చేస్తాం.. మూలన పెట్టేస్తాం.. లేదా బయట పడేస్తాం.. అదే మన శరీరంలోని అండాశయాల పనితీరు ముందుగానే ఆగిపోతే... వాటిని పూర్తిగా తొలగించలేం.. అలాగని వదిలేయలేం.. మరెలా అంటే... మరమ్మతు చేయాల్సిందే. ఆ సమస్య పేరు ప్రిమెచ్యూర్ ఒవేరియన్ ఫెయిల్యూర్ అయితే.. దానికి చేసే మరమ్మతే హార్మోన్లు అందివ్వడం. ఇంతకీ ఈ సమస్య ఎందుకు, ఎవరిలో ఎదురవుతుందో చూద్దాం...

అండాశయాలు మొరాయిస్తే...



స్త్రీ జీవితంలో అండాశయాల పనితీరుకు ఎంతో ప్రాముఖ్యం ఉంటుంది. పిల్లలు పుట్టడానికి అవసరమైన అండాలూ, స్త్రీ శారీరక మానసిక ఆరోగ్యానికి అవసరమైన హార్మోన్లూ.. అన్నీ అండాశయాల నుంచే తయారవుతాయి. ఆ అండాశయాల పనితీరు యాభైఏళ్ల తరవాత ఆగిపోతుంది. అదే సహజంగా మెనోపాజ్ వచ్చే దశ. అదే అంతకన్నా ముందే.. అంటే నలభైఅయిదేళ్లకన్నా ముందే ఆగిపోతే ఆ పరిస్థితిని ప్రిమెచ్యూర్ ఒవేరియన్ ఫెయిల్యూర్ అంటారు. ఈ మధ్య కాలంలో చాలామందిలో కనిపిస్తోంది సమస్య. ఈ పరిస్థితి కొత్తగా తలెత్తిందా.. లేదా అవగాహన పెరగడం వల్ల మనం అండాల సంఖ్య ఎంతుందో ముందుగానే తెలుసుకుంటున్నామా... అంటే. . రెండూ సరైన సమాధానాలే. అండాల నిల్వ ఎప్పుడయితే తరిగిపోతుందో అప్పుడు ఆ స్త్రీకి పిల్లలు పుట్టే అవకాశం బాగా తగ్గిపోతుంది. అలాగే మెనోపాజ్ దశకూడా ముందుగానే వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

కారణాలు అనేకం..

యాభై సంవత్సరాలకు ఆగిపోవాల్సిన నెలసరులు ముందుగానే ఆగిపోవడానికి కారణాలు కొన్ని ఉంటాయి.

- పుట్టుకతోనే అండాశయాల్లో అండాల కుదుళ్ల (ఫాలికల్స్) తక్కువగా ఉండటం, మామూలుగా కన్నా ఎక్కువగా కరగడం, సంఖ్య బాగానే ఉన్నా.. వాటి పనితీరు సరిగ్గా లేకపోవడం.. కొన్నిరకాల చికిత్సలు కూడా ఇందుకు ప్రధాన కారణం కావచ్చు. పుట్టుకతోనే అండాల నిల్వ తక్కువగా ఉండటానికి కారణం అండాశయాల పనితీరులో లోపాలు ఉండటం. పాపాయిలో అండాల తయారీకి ప్రధానకారణమైన థైమస్ అనే గ్రంథి సరిగ్గా పనిచేయకపోవడం..
- అండాలు త్వరగా నశించిపోవడానికి క్రోమోజోములకు సంబంధించిన లోపాలు ఉండొచ్చు. అలాగే చికెన్‌పాక్స్, గవదబిల్లలు వంటి వైరల్ ఇన్‌ఫెక్షన్లు, క్షయ వంటి బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లు, వ్యాధినిరోధక వ్యవస్థలో లోపాల(ఆటో ఇమ్యూన్ డిసీజెస్)తోనూ అండాలు త్వరగా నశించిపోతాయి.
- కొన్నిసార్లు ఏదయినా కారణం వల్ల అండాశయాలు తొలగించినా, క్యాన్సర్ చికిత్సలో భాగంగా రేడియోషన్, కీమోథెరపీ చికిత్సలు తీసుకుంటున్నా ఈ సమస్య ఎదురుకావచ్చు.

> అండాశయాల పనితీరు ఆడపిల్ల తల్లి గర్భంలో ఉన్నప్పుడే మొదలవుతుంది. అప్పుడే అండాలు తయారవుతాయి. 20 వారాల గర్భస్థ శిశువులో 60 నుంచి 70 లక్షల వరకూ లేత అండాలు ఉంటాయి. వీటి సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చి... ఆ పాప పుట్టేసరికి పది నుంచి ఇరవై లక్షలవరకూ మిగులుతాయి. అమ్మాయి పుష్పవతి అయ్యేసరికి 3 లక్షలు మాత్రమే ఉంటాయి. పునరుత్పత్తి వయసులో నాలుగు వందల నుంచి ఐదు వందలవరకూ మాత్రమే విడుదల అవుతాయి. ఈ అండాల సంఖ్య బాగా తగ్గినప్పుడు, పూర్తిగా లేనప్పుడు మెనోపాజ్ వస్తుంది. నెలసరులు ఆగిపోతాయి.

ఎలా గుర్తించొచ్చు...

- నెలసరి ఆగిపోవడం, రక్తస్రావం బాగా తక్కువ కావడం, బాగా ఆలస్యంగా కావడం దీనికి మొదటి కారణం అని చెప్పొచ్చు.
- ఒళ్లు వేడిగా అనిపించడం, బాగా చెమటలు పట్టడం, గుండెదడా, శక్తిలేనట్లు తేలిగ్గా అలసిపోయినట్లు అనిపించడం, ఏకాగ్రత లేకపోవడం, నిద్ర సరిగ్గా పట్టకపోవడం.
- కలయిక పట్ల ఆసక్తి లేకపోవడం.. కలయిక సమయంలో జననేంద్రియాలు బాగా పొడిబారిపోయినట్లు ఉండటం, నొప్పి.. వంటివి ఇతర ప్రధాన లక్షణాలు.
- బరువు పెరగడం.. విపరీతమైన ఒత్తిడీ, అండాశయాల్లో నీటి తిత్తులు... మిగతా హార్మోన్ల సమస్యలు.. నెలసరి ఆగిపోవడానికి ఇతర కారణాలు.

నెలసరి రావడంలేదు అనగానే చిన్నవయసు స్త్రీలు మొదట ఊహించేది గర్భమే. కాబట్టి ముందు దాన్ని నిర్ధరించుకోవాలి. నెలసరి నాలుగు నెలల వరకూ రాకపోతే.. ఆలస్యం చేయకుండా వైద్యుల్ని సంప్రదించాలి. అండాశయాలు సరిగ్గా పనిచేస్తున్నాయో లేదో తెలుసుకునేందుకు ప్రత్యేకంగా పరీక్షలు చేస్తారు. ముందుగా ట్రాన్స్‌వజైనల్, అల్ట్రాసౌండ్ స్కాన్ చేస్తారు. అండాశయాల్లో యాంట్రల్ ఫాలికల్ కౌంట్ (ఏఎఫ్‌సీ), అండాశయాల పరిమాణం తెలుసుకునేందుకు ఒవేరియన్ వాల్యూమ్ వంటివీ చూస్తారు.

- గర్భాశయం లోపలి పొర మందం కొలవడం ద్వారా అండాశయాల పనితీరును కొంతవరకూ గ్రహించొచ్చు. సందేహం వస్తే... అదనంగా హార్మోన్ల పరీక్షా చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ఎఫ్ఎస్‌హెచ్ (ఫాలిక్యులర్ స్టిమ్యులేటింగ్ హార్మోను) చేయించుకోవాల్సి ఉంటుంది. ఈస్ట్రోజెన్ హార్మోను, యాంటీ మూలేరియన్ హార్మోను.. పరీక్షల ద్వారా దాదాపుగా కచ్చితమైన నిర్ధరణ వస్తుంది. అండాలు తక్కువగా ఉంటే ఎఫ్ఎస్‌హెచ్ బాగా పెరుగుతుంది. ఈస్ట్రోజెన్, యాంటీముల్లేరియన్ హార్మోన్లు తగ్గుతాయి. అవసరాన్ని బట్టి మధుమేహం, థైరాయిడ్ పరీక్షా చేయాల్సి ఉంటుంది. మరీ చిన్నవయసులో నెలసరి నిలిచిపోతే.. క్రోమోజోముల పరీక్షా చేస్తారు.

ఎలాంటి సమస్యలు....

- ముందుగానే నెలసరి ఆగిపోతే... ఎదురయ్యే మొదటి సమస్య సంతానసాఫల్యత బాగా తగ్గిపోవడం. దానివల్ల గర్భం రావడం కష్టమవుతుంది. ఈ కాలంలో ఒత్తిడీ, ఆటో ఇమ్యూన్‌జబ్బులూ, థైరాయిడ్, మధుమేహం వల్ల చాలామంది స్త్రీలల్లో ఈ సమస్య చూస్తున్నాం. ఇటువంటి వారికి పిల్లల కోసం చికిత్స చేసేటప్పుడు సంవత్సరాల తరబడి ఆలస్యం చేయకూడదు. ఉన్న అండాలు పూర్తిగా తరిగిపోకుండానే గర్భం కోసం చికిత్స చేస్తారు. లేదంటే దాత నుంచి అండాలు సేకరించి టెస్ట్‌ట్యూబ్ పద్ధతిని ఎంచుకోవాల్సి ఉంటుంది.
- ముప్పై, ముప్పైఅయిదులోనే నెలసరులు ఆగిపోతే... యాభైల్లో రావాల్సిన మెనోపాజ్ లక్షణాలు ఈ చిన్న వయసులోనే వస్తాయి. రక్తంలో కొవ్వుస్థాయులు పెరగడం, అధిక రక్తపోటూ, గుండెజబ్బులూ, ఆస్టియోపోరోసిస్, జననాంగ ఇన్‌ఫెక్షన్లూ, కలయికలో విపరీతమైన అసౌకర్యం, మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు.. ఎక్కువగా కనిపిస్తాయి. వీటన్నింటితోపాటూ ఒళ్లునొప్పులూ, ఏకాగ్రత లేకపోవడం, చర్మంపై ముడతలూ, జుట్టు ఊడిపోవడం, కళ్లు, పళ్ల ఆరోగ్యంలో తేడా.. వంటివీ ఎదురవుతాయి.

చికిత్స...

నలభై కన్నా ముందే ఈ సమస్య ఎదురైతే హెచ్ఆర్‌టీ చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. అంటే హార్మోన్లను మాత్రల రూపంలో సూచిస్తారు. ముఖ్యంగా ఈస్ట్రోజెన్ హార్మోను తీసుకోవాల్సి ఉంటుంది. (ఆ స్త్రీకి గర్భాశయం ఉంటే గనుక ప్రొజెస్టరాన్ కూడా సూచిస్తారు). హార్మోను మాత్రలతో రొమ్ము, గర్భాశయక్యాన్సర్లూ, సిరల్లో రక్తం గడ్డకట్టడం, స్ట్రోక్ వంటి సమస్యలు వస్తాయని భయపడతారు. అందులో కొద్దిగా వాస్తవం ఉన్నా.. చాలా అరుదుగానే అలాంటి సమస్యలు ఎదురవుతాయి. పదివేల మంది మహిళలు హార్మోన్లు తీసుకుంటే అందులో ఎనిమిదిమందికి మాత్రమే ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతాయి. కాబట్టి దీర్ఘకాలికంగా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడం కోసం వాటిని వాడటమే మంచిది. వాటిని సహజ మెనోపాజ్ దశ వరకూ వచ్చేవరకూ వాడి, మానేయొచ్చు.



డాక్టర్ వై. సవితాదేవి
గైనకాలజిస్ట్
ఫోన్: 04066667611

చినుకు తడికి చెదరకుండా..

ఎంతో ఇష్టంగా చేసుకున్న అలంకరణ... వర్షానికి తడిసి కరిగిపోతే! చూడ్డానికి ఏం బాగుంటుంది? వర్షానికి తడిసినా చెదిరిపోని అలంకరణ కోసం కొన్ని చిట్కాలున్నాయి. అవేంటో తెలుసుకుందాం!

కళ్లకు: కనురెప్పలకు వేసుకునే ఐలైనర్, కాటుకా, పెన్సిల్, మస్కారా వంటి వాటిని వాటర్ ప్రూఫ్ తరహా వాటినే ఎంచుకోవాలి. వర్షపు చినుకులకు తడిసినా అలంకరణ చెదరకుండా ఉంటుంది. వర్షాకాలం అలంకరణ కోసం లేతరంగుల కంటే గాఢమైన వర్ణాలనే ఎంచుకోవాలి. కనురెప్పలపై వేసేందుకు ముదురు గులాబీ, లేదా నారింజ వర్ణాలను ఎంచుకుంటే మంచిది.



ప్రైమర్ తప్పనిసరి: అలంకరణ అనగానే మనకు ముందుగా గుర్తొచ్చేది ఫౌండేషన్. కానీ వర్షాకాలంలో దాని జోలికి వెళ్లకపోవడమే మంచిది. ఒక వేళ వేసినా ఎంత తక్కువ వేస్తే అంతమంచిది. ఏమాత్రం ఎక్కువయినా తడిసినప్పుడు ప్యాచులుగా కనిపించి చూడ్డానికి ఏమాత్రం బాగుండదు. ఈ ఇబ్బంది రాకుండా ఉండాలంటే మాయిశ్చరైజర్ రాసుకున్న తర్వాత కొద్దిగా ప్రైమర్‌ని కూడా రాయాలి. అప్పుడు ఫౌండేషన్ ముఖానికి అతికి ఉండటమే కాదు... ముఖం జిడ్డుగా కూడా అనిపించదు.

పౌడర్ వద్దు: ఈ కాలంలో పౌడర్ల రూపంలో ఉంటే అలంకరణ ఉత్పత్తుల కన్నా... క్రీం రూపంలో ఉండే వాటినే ఎంచుకోవాలి. లేదా లిప్‌చీక్‌ను కొద్దిగా చెక్కిళ్లపై వేసుకుంటే ముఖం ఆకర్షణీయంగా ఉంటుంది. వర్షానికి తడిసినా మీ ముఖం మరింత మెరుపుని సంతరించుకుంటుంది.

పెదవులకు: ఈ రంగుల్నీ గాఢమైన వర్ణాలనే ఎంచుకోవాలి. అలాగే లిప్‌స్టిక్ వేసుకునే ముందు అదే వర్ణంలో ఉండే పెన్సిల్‌తో పెదవులకు అవుట్‌లైన్ వేసుకోవాలి. ఆ తరువాతే రంగు వేసుకోవాలి. అంతేకాదు.. పెదాలపైన వేసిన లైన్‌కు లైట్‌గా పౌడర్ అద్దితుడిచేయాలి. దీంతో అవుట్‌లైన్ విడిగా కనిపించకుండా చక్కగా కలిసిపోతుంది.

కాగితంపూలతో రికార్డు..

కళ మనలో సృజనాత్మక ఆలోచనలని పెంచుతుంది. ఒత్తిడినీ తగ్గిస్తుంది. అంతేనా అంటే అంతకు మించి కళతో రికార్డుల మీద రికార్డులు కూడా సృష్టించవచ్చని నిరూపించారు హైదరాబాద్‌కి చెందిన కవిత జోష్రీ, శివాలీ జోష్రీ..



క్విల్లింగ్ తెలుసుగా! కాగితాన్ని గుండ్రంగా చుడుతూ చేసే కళ ఇది. ఇలా క్విల్లింగ్ చేసిన రంగురంగుల కాగితాలతో వివిధరకాల పువ్వులను చూడముచ్చగా తయారుచేశారీ తల్లీకూతుళ్లు. అయితే ఏదో సరదాకి ఒకటీరెండూ కాదు సుమీ! ఏకంగా ఏడువేల పదకొండు (7,011) క్విల్లింగ్ పూలను అల్లి ప్రపంచరికార్డును కొట్టేశారు. గతంలో కూడా ఇలాంటి రికార్డు ఒకటి ఉన్నా అది 6,241 పూలకే పరిమితం అయ్యింది. హైదరాబాద్‌కు చెందిన ఈ తల్లీకూతుళ్లకు ఇలా రికార్డులు బద్దలు కొట్టడం కొత్తేం కాదు. గతంలో కూడా మూడు నెలలపాటు శ్రమించి 1,251 కాగితం బొమ్మలను తయారుచేసి గిన్నీస్‌రికార్డును సాధించారు. ఏడాదిలోనే ఇది రెండో రికార్డు. ఇందుకోసం రోజుకి తొమ్మిది నుంచి పది గంటల పాటు కష్టపడి అయిదు నెలల్లో ఈ పూలని తయారుచేశారు.



నజరానా

మొక్క వాడిపోయినప్పుడు... కొద్దిగా చక్కెర కలిపిన నీళ్లను మొక్క మొదట్లో వేయండి. తిరిగి తాజాగా మారుతుంది.

ఫ్రైడ్ ఇడ్లీ తిందామా!



ట్యూటర్ వసుంధర
శ్రీదేవి, హోటల్ మేనేజిమెంట్ నిపుణురాలు

? ఈ మధ్యకాలంలో ఇంట్లో ఇడ్లీలు ఎక్కువగా మిగిలిపోతున్నాయి.వాటితో ఉప్మా కాకుండా మరేదైనా టిఫిన్‌ని తయారు చేసుకోవచ్చా.. - ప్రమిద, హైదరాబాద్

✔ మిగిలిపోయిన ఇడ్లీలతో మనం రకరకాల పదార్థాలు తయారుచేసుకోవచ్చు. వాటిల్లో మసాలా ఇడ్లీ, ఫ్రైడ్ ఇడ్లీలు బాగుంటాయి. పిల్లలకూ బాగా నచ్చుతాయి.



చాలామంది మసాలా ఇడ్లీని ఎక్కువగా ఇష్టపడతారు. దీని తయారీ విధానం కూడా చాలా సులువుగా ఉంటుంది. ముందుగా మిగిలిపోయిన ఇడ్లీలను చిన్న చిన్న ముక్కలుగా కోసి పక్కన పెట్టుకోవాలి. కడాయిని పొయ్యిమీద పెట్టి కొంచెం నూనె వేసి అరచెంచా చొప్పున ఆవాలూ, జీలకర్రా, చెంచా అల్లంవెల్లుల్లి ముద్దా, సన్నగా తరిగిన ఉల్లిపాయా, రెండు పచ్చిమిర్చి ముక్కలు వేసి వేయించుకోవాలి. తరవాత ఓ కప్పు తరిగిన టొమాటో ముక్కలూ, తగినంత ఉప్పూ, పసుపూ, కారం వేసి టొమాటోలు మెత్తగా అయ్యేవరకూ వేయించుకోవాలి. ఒక వేళ ఇడ్లీలు నిన్నటివి అయితే ఫ్రిజ్‌లో పెడతాం కాబట్టి గట్టిగా ఉంటాయి. కాబట్టి టొమాటోలు ఉడికాక గ్లాసు నీళ్లు పోయాలి. ఇందులో ఇందాక కోసి పెట్టుకున్న ఇడ్లీ ముక్కలను వేసి బాగా కలపాలి. ఇది కొంచెం గ్రేవిలా ఉంటుంది. చివరగా అర చెంచా పావుబాజీ మసాలా కూడా కలుపుకోవాలి. అదే ఇడ్లీ తాజా అయితే నీళ్లు పోయకుండా వేయించుకోవచ్చు. చివర్లో కొద్దిగా నిమ్మరసం, సన్నగా తరిగిన కొత్తిమీర వేసుకుంటే.... మసాలా ఇడ్లీ రెడీ.



ఫ్రైడ్ ఇడ్లీ: ఇడ్లీని ఇలా కూడా చేసుకోవచ్చు. ఎండుమిర్చీ, జీలకర్రా, కరివేపాకు, వెల్లుల్లీ, కొద్దిగా మిరియాలూ... వీటన్నింటినీ మిక్సీలో వేసుకుని మరీ మెత్తగా కాకుండా పొడి చేసుకోవాలి. బాణలిలో కాస్త నూనె వేసి ఇడ్లీలను రెండు వైపులా బంగారు వర్ణం వచ్చేలా వేయించుకుని పక్కన పెట్టుకోవాలి. అదే బాణలిలో మరికొంచెం నూనె వేసి ఆవాలూ, మినపప్పూ, కరివేపాకు వేసుకుని వేయించుకోవాలి. ఇందాక తయారు చేసుకున్న పొడిని వేసి కాసేపు వేయించుకోవాలి. వేయించి పక్కన పెట్టుకున్న ఇడ్లీ ముక్కలను కూడా వేసి బాగా వేయించుకుంటే చాలు. దీని రుచి మరికాస్త పెరగాలంటే కొద్దిగా ఉప్పుతోపాటు ఆమ్‌చూర్ పొడి చల్లుకోవచ్చు. ప్రత్యేకమైన రుచి రావాలంటే ఒక చెంచా సాంబారుపొడినీ వేసుకోవచ్చు. దీన్ని స్నాక్‌లా తినాలంటే సాంబారు పొడి బదులు చాట్ మసాలా చల్లుకోవచ్చు ఇది కరకరలాడుతూ ఉండాలనుకుంటే పాన్‌లో ఎక్కువగా నూనె తీసుకుని ఇడ్లీ ముక్కలను గారెల్లా వేయించుకుని తీసుకోవాలి. డీప్ ఫ్రై చేసుకున్న ఇడ్లీ ముక్కలను టిష్యూ పేపర్‌పై తీసుకోవాలి. పుట్నాల పప్పు పొడీ, కరివేపాకు పొడీ, సాంబారు పొడీ వేయించిన ఇడ్లీ ముక్కలపై చల్లుకుంటే చాలు.

సరదాగా వెళ్లా... సాధించుకొచ్చా...



అందం అంటే... అంతర్గత సౌందర్యమే అన్నది ఆమె మాట.... అదే ఆమెను అందాలపోటీల్లో కిరీటం అందుకునేలా చేసింది... డాక్టర్ చదువుదామనుకుని ఇంజినీరింగ్‌వైపు వచ్చి... ఇప్పుడు అందాల కిరీటం అందుకున్న ఆమే జొన్నలగడ్డ మానస. మిస్ ఏషియా పసిఫిక్-2017 టైటిల్ విజేతగా నిలిచిన ఆమె ఇటువైపు ఎలా వచ్చిందో వివరిస్తోందిలా...

మిస్ ఏషియా పసిఫిక్ 2017 తుది పోటీలకు ఎంపికకావడం, వాటిల్లో నేను టైటిల్‌ని గెలుచుకోవడం కలలా జరిగిపోయింది. సరిగ్గా ఐదు నెలల క్రితం వరకూ ఆ పోటీల గురించీ నాకు అవగాహన లేదు. కానీ ఇప్పుడు నేను టైటిల్ గెలుచుకోవడం నాకే చాలా ఆశ్చర్యంగా ఉంది. ప్రస్తుతం హైదరాబాద్ గీతమ్స్ యూనివర్శిటీలో బీటెక్ మూడో ఏడాది చదువుతున్న నేను అసలు ఈ వైపు ఎలా వచ్చానంటే... నేను పుట్టింది హైదరాబాద్‌లోనే. నాన్న ఐటీ ప్రొఫెషనల్. ఆయనకు సొంత కంపెనీ ఉంది. అమ్మ ఫ్యాషన్ డిజైనర్. నేను పుట్టగానే అమెరికా వెళ్లిపోయాం. మళ్లీ నేను తొమ్మిదోతరగతిలో ఉండగా హైదరాబాద్‌కి వచ్చేశాం. నాన్న, తమ్ముడూ అక్కడికీ, ఇక్కడికీ తిరుగుతూ ఉంటారు. . నాకున్న మరో ఆసక్తి వైద్యరంగం. అందుకే ఎలాగైనా డాక్టర్ కావాలనుకునేదాన్ని. కానీ బాగా ఆలోచించుకుని చివరకు ఇంజినీరింగ్ రంగాన్ని ఎంచుకున్నా.

పదిలో ఫ్యాషన్ క్వీన్‌ని... చిన్నప్పటి నుంచీ చక్కగా తయారవడం నాకిష్టం. అమ్మకి కూడా నన్ను అంతే అందంగా తయారుచేయాలనుకునేది. బహుశ అదే నాకు ఫ్యాషన్లపై ఇష్టాన్ని పెంచిందనుకుంటా. అమెరికా నుంచి ఇక్కడికి తిరిగి వచ్చాక మెరీడియన్ స్కూల్లో చేరా. వీడ్కోలు వేడుకలో జరిగిన ఫ్యాషన్‌వాక్‌లో మిస్ మెరీడియన్‌గా కిరీటం అందుకున్నా. అది ఉత్సాహం ఇచ్చినా మళ్లీ చదువుల్లో పడిపోయా. అప్పుడనే కాదు... మొదటి నుంచీ నేను చదువులో టాపర్‌ని. అమెరికాలో అయితే బోలెడు స్కాలర్‌షిప్‌లూ అందుకున్నా. తిరిగి బీటెక్ గీతమ్స్‌లో చేరాక స్వాగతోత్సవ వేడుకల్లో "మిస్ గీతమ్స్" టైటిల్‌ని సాధించా. అప్పుడే అమ్మ ఫ్రెండ్ ఒకరు తను డైరెక్ట్ చేస్తోన్న లఘుచిత్రంలో నటించమని అడిగారు. అది సుమ కనకాల గారు నిర్మించిన "దడేట్" లఘు చిత్రం. ఆ తరవాత కొన్ని అవకాశాలు వచ్చినా చదువు కోసం కాదనుకున్నా. ఓ రోజు అమ్మ స్నేహితులు ఒకరు ఫోన్ చేసి 'మిస్ ఏషియా పసిఫిక్ అందాల పోటీల ఎంపికలు జరుగుతున్నాయి. మీ అమ్మాయి ప్రయత్నించొచ్చు కదా' అని చెప్పారట. దాంతో అమ్మ 'సరదాగా ప్రయత్నించు...' అని నాకు చెప్పింది. అలా ఈ పోటీలు జరుగుతోన్న ఆడిషన్స్‌కి వెళ్లా. మొదటి రెండు దశల్నీ సులభంగా దాటుకుని ఫైనల్స్‌కి చేరుకున్నాను.

ఆరుదేశాల నుంచి పద్నాలుగుమంది.. ఆసియా దేశాలైన థాయిలాండ్, ఇండియా, శ్రీలంక వంటి ఆరు దేశాల పోటీదారుల నుంచి పద్నాలుగు మంది తుది పోటీలకు చేరుకున్నారు. వారితో పోటీపడి ఆరుగురు చివరి దశకు వచ్చాం. చివరకు టైటిల్ నాకు వచ్చింది. నిజానికి ఈ అందాల పోటీల్లో అందంతోపాటూ అనేక అంశాలు గమనిస్తారు. ఈ టైటిల్ నాకు రావడానికి కారణం ఏంటో తెలుసా... పబ్లిక్ స్పీకింగ్ స్కిల్స్, డ్యాన్స్‌లే. దీనికోసం నా జీవనశైలిని మార్చుకున్నా. రోజూ నలభై ఐదు నిమిషాల పాటు వ్యాయామం చేశా. వాటిల్లో గుండెకు సంబంధించిన కఠిన వ్యాయామాలతోపాటూ మరికొన్నీ ఉన్నాయి నోరూ కట్టేసుకోవాల్సిన పరిస్థితి. కానీ అప్పుడప్పుడూ నాకిష్టమైన పిజా, చాక్లెట్‌లు తినడంలేదని బాధపడేదాన్ని. చివరకు 'అందం అంటే...' అనే ప్రశ్నే నన్ను విజేతను చేసింది. దానికి ఒక్కొక్కరూ ఒక్కో సమాధానం చెబితే.. నేను మాత్రం 'అందరిలోనూ అందం ఉంటుందనీ, దాన్ని గుర్తించాల్సిన పని మనదేననీ... నిజానికి అది బయటకు కనిపించేది చాలా తక్కువ శాతం' అని చెప్పా. అంతే కాదు...' భవిష్యత్తులో నీ లక్ష్యం ఏంటి' అని అడిగినప్పుడు అనాథలకు ఆశ్రయం ఏర్పాటు చేయాలనుకుంటున్నాని వివరించా. అదే నన్ను ఈ రోజు విజేతగా నిలిపింది. నాకు వచ్చిన బెస్ట్ కాంప్లిమెంట్...మానసలో ఇంత మార్పు ఎలా సాధ్యమయ్యిందన్న సందేహం మా ఇంట్లోవాళ్లు ఆశ్చర్యపోయారు.

ఏ డెనిమ్ వేస్తున్నారు!

డెనిమ్ దుస్తులు వేసుకుంటే దాంతోపాటే హుందాతనం జోడవుతుంది. అవసరానికి అనుగుణంగా విభిన్న తరహాల్లో ఆ వస్త్రాలు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి. వాటినీ ఒకసారి ప్రయత్నించి చూడండి.



కుర్తాలు: కేవలం డెనిమ్ చొక్కాలు మాత్రమే కాదు.. కుర్తాలూ ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. విభిన్న డిజైన్లలో లభిస్తున్నాయి. నీలి రంగుతో పాటు గోధుమ, నలుపు కలయికలోనూ ఇవి దొరుకుతున్నాయి. మోకాలి పొడవుండే డెనిమ్ కుర్తాలు ఎంచుకున్నప్పుడు మడమవరకూ ఉండే లెగ్గింగ్ చక్కగా నప్పుతుంది. అయితే స్ట్రెయిట్ కట్ లేదా అంబ్రెల్లా రకాల్లో ఉన్నవి ఎంచుకుంటుంటే నడుం దగ్గర చిన్న ఫ్యాన్సీ బెల్ట్ పెట్టుకుంటే సరిపోతుంది. అలాగే అంబ్రెల్లా కుర్తాలకు తాడులాంటి బెల్ట్ రకాన్ని ఎంచుకుని నడుం బాగంలో ముందువైపు ముడి వేసుకుంటే అందంగా కనిపిస్తారు. కాస్త సన్నగా ఉన్నవారు కాలర్ ఉన్న వాటిని వేసుకుంటే లావుగా కనిపిస్తారు. అలాగే డెనిమ్ జంప్‌సూట్‌లు కూడా సందర్భాన్ని బట్టి ఎంచుకోవచ్చు. మామూలు డెనిమ్ ప్యాంట్లమీదకి తెలుపు లేదా నలుపు రంగు టాప్ వేసుకుని దానిమీద బోలిరోను వేసుకుంటే ఆ అందమే వేరు.

డిజైన్లు: కొన్ని రకాల డెనిమ్ టాప్‌లపై ఎంబ్రాయిడరీ తరహా డిజైన్లు అందుబాటులో ఉంటాయి. ఎలాంటి ప్రింట్లూ, పనితనం లేని వర్క్ లేని మ్యాక్సీ డ్రెస్సులు ఎంచుకున్నప్పుడు వాటిమీద కాస్త పొట్టిగా ఉండే డెనిమ్ జాకెట్లు బాగుంటాయి. కాస్త సన్నగా ఉన్నవారు అసిమెట్రికల్ డెనిమ్ కుర్తాలు ఎంచుకోవచ్చు. లేయర్డ్ దుస్తులు వేసుకోవాలనుకుంటే, ముందువైపు చీలిక ఉండే.. కుర్తా ఎంచుకొని దాని కిందకు పలాజోకానీ, మామూలు ప్రింటు ఉన్న స్కర్టు గానీ వేసుకుంటే చూడచక్కగా కనిపిస్తారు.


యాక్సెసరీలు: డెనిమ్ వస్త్రాలమీదకు పెద్ద అలంకరణ అవసరం లేదు. జుట్టు చిన్నగా ఉంటే చిన్న క్లిప్ పెట్టుకుని వదిలేయొచ్చు. పొడవు జుట్టున్న వారు పోనీటెయిల్‌ను ప్రయత్నించొచ్చు. చిన్నచిన్న దిద్దులూ, సన్నని చోకర్లు బాగుంటాయి. డెనిమ్ ప్యాంట్లు ఎంచుకున్నప్పుడు వాటిమీదకు బూట్లూ, స్నీకర్స్, లోఫర్స్, శాండిల్స్ సరిపోతాయి. ముఖ్యంగా స్నేహితులతో కలిసి పార్టీలకు వెళ్లినప్పుడు, సాయంత్రం వేళల్లో జరిగే చిన్నపాటి పుట్టినరోజు లాంటి వేడుకలకు డెనిమ్ వస్త్రాలు బాగా కనబడతాయి.

బ్యాక్టీరియా లేకుండా...

మన ఇల్లు పైకి ఎంత శుభ్రంగా ఉన్నా సరే... బ్యాక్టీరియా మన ఇంట్లో ఎక్కడో ఒక చోట నివాసం ఏర్పాటు చేసుకుంటుంది. దాంతో ఇంట్లో పిల్లల దగ్గర నుంచి పెద్దవాళ్ల వరకూ అనారోగ్యాలు పాలవుతుంటారు. అందుకే ఎక్కడ బ్యాక్టీరియా ఉంటుందో కనిపెట్టేస్తే.. ఆయా ప్రాంతాల్లో శుభ్రత పాటించొచ్చు కదా!

- **వంటింట్లో వాడే స్పాంజి:** వంటింటి గట్టుని తుడవడానికి మనలో చాలా మంది స్పాంజి దగ్గర పెట్టుకుంటాం. వాటిల్లో లెక్కలేనన్ని క్రిములు పేరుకుపోయి ఉంటాయి. అందుకే వారానికోసారి బ్లీచింగ్ కలిపిన నీటిలో వేస్తే దానిలోని క్రిములు నశిస్తాయి.
- తలుపులకుండే హ్యాండిళ్లు, లిఫ్ట్ బటన్లు బ్యాక్టీరియా ఉండే ప్రాంతాలే. జలుబులూ, జ్వరాలు వ్యాపించే ఈ కాలంలో...డిస్‌ఇన్‌ఫెక్టెడ్ వైప్స్ దొరుకుతాయి. వాటిని ఆ వైప్స్‌తో తుడవడం మేలు.
- మాసిపోయిన బట్టలు వేసే బుట్టల్ని అలానే వదిలేయొద్దు. అడుగున ఉన్న బట్టలు కూడా తీసేసి వారానికోసారి డిస్‌ఇన్‌ఫెక్ట్ స్ప్రే చల్లితే చెమటా, మురికి కారణంగా పేరుకున్న బ్యాక్టీరియా నశిస్తుంది.
- స్మార్ట్‌ఫోన్లూ, రిమోట్‌కంట్రోల్, ట్యాబ్‌లపై బ్యాక్టీరియా పేరుకోవడానికి ఆస్కారం ఎక్కువ. ఇలా కాకూడదంటే... వారానికి ఒక్కసారైన ఆల్కహాల్ ఆధారిత ద్రవంతో ఫోన్‌తెరని శుభ్రం చేయాలట.
- సంగీతం వింటూ జిమ్‌లో వ్యాయామాలు చేసే అలవాటు ఉందా? అయితే మీ ఇయర్‌ఫోన్స్ విషయంలో జాగ్రత్త. చెమట కారణంగా బోలెడు బ్యాక్టీరియా పేరుకుని ఉంటుంది. అందుకని పైనున్న సిలికాన్ తొడుగులని సబ్బునీళ్లలో వేయండి.

32000 స్థాయే కీలక నిరోధం!



సమీక్ష: దేశీయ సంస్థాగత మదుపర్ల కొనుగోళ్ల అండతో గత వారం మన మార్కెట్ స్వల్ప లాభాలతో ముగిసింది. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో వారాన్ని మార్కెట్ స్తబ్దుగానే ప్రారంభించింది. దేశంలో పావు వంతు ప్రాంతంలో వర్షాభావ పరిస్థితి నెలకొందంటూ వాతావరణ శాఖ వెల్లడించిన నివేదికతో, సెంటిమెంటు దెబ్బతింది. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 37 శాతం పెరిగి 1040 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయనే నివేదికతో తిరిగి మార్కెట్ లాభాల బాట పట్టింది. మ్యూచువల్ ఫండ్ సంస్థల ఈక్విటీ కొనుగోళ్లు 26 శాతం పెరిగి రూ. 35,045 కోట్లకు చేరాయనే నివేదికా ఇందుకు దోహదం చేసింది. అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా సాగినా, ఇటీవలి నష్టాల నేపథ్యంలో విలువ తగ్గిన దిగ్గజ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో దేశీయంగా సానుకూల ధోరణి కొనసాగింది. కీలక పరిణామలేవీ లేకపోవడంతో సూచీలు ఒక శ్రేణికి లోబడి చలించాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీన ప్రక్రియ వేగవంతానికి చర్యలను ప్రభుత్వం ముమ్మరం చేయడం ఆఖర్లో మార్కెట్ రాణింపునకు తోడ్పడింది. దీంతో వారం మొత్తం మీద సెన్సెక్స్ 72 (0.23%) పాయింట్లు లాభపడి 31596 వద్ద ముగిసింది. నిఫ్టీ 20 (0.2%) పాయింట్లు పెరిగి 9857 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఎఫ్ఐఐలు నికరంగా రూ. 5,281 కోట్ల విలువైన షేర్లు విక్రయించారు. మ్యూచువల్ ఫండ్ల నికర కొనుగోళ్లు రూ. 2,628 కోట్లుగా నమోదయ్యాయి. ఆరోగ్య సంరక్షణ, బ్యాంకింగ్, లోహ రంగాల షేర్లు రాణించగా.. విద్యుత్, మన్నికైన వినియోగ వస్తువులు, వాహన షేర్లు డీలాపడ్డాయి.

లాభపడిన, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 1:1గా నమోదు కావడం.. మార్కెట్లో స్థిరీకరణను సూచిస్తోంది.

ఈవారంపై అంచనా: రెండు వారాలుగా సెన్సెక్స్ 31100- 32000 శ్రేణిలో చలిస్తోంది. ఈ శ్రేణి నుంచి బయటపడితేనే సమీపకాలంలో సూచీ ఏ దిశలో కదలాడుతుందనే విషయంపై స్పష్టత వస్తుంది. ఒకవేళ 32000 స్థాయిని మించితే సెన్సెక్స్ మరింత ముందుకెళుతుందని భావించొచ్చు. మరోవైపు సూచీకి 60 రోజుల చలన సగటైన 31580 వద్ద తక్షణ మద్దతు లభించే అవకాశం ఉంది.


ప్రభావిత అంశాలు: దేశీయ, అంతర్జాతీయ పరిణామాలు ఈవారం మార్కెట్‌కు దిశానిర్దేశం చేస్తాయి. ముఖ్యంగా 31న వెలువడే జీడీపీ గణాంకాల ప్రభావం మన మార్కెట్‌పై ఉంటుంది. అదే రోజు ఎఫ్అండ్ఓ డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు తీరిపోనుండటంతో సూచీలు ఒడుదొడుకులకు లోనుకావచ్చు. ఇదే వారం వాహన విక్రయాల గణాంకాలు వెలువడనున్నాయి. ఈ గణాంకాల ఆధారంగా ఆయా వాహన కంపెనీల షేర్లు కదలాడుతాయి. అంతర్జాతీయ పరిణామాల విషయానికొస్తే.. 30న వెలువడే అమెరికా జీడీపీ గణాంకాలపై మదుపర్లు దృష్టి సారిస్తారు. అదే సమయంలో భారత్, చైనా, జపాన్, అమెరికాల పీఎంఐ తయారీ గణాంకాలను కూడా గమనిస్తారు. ఎఫ్ఐఐలు, డీఐఐల పెట్టుబడులు, రూపాయి కదలికలు, అంతర్జాతీయ చమురు ధరల ప్రభావమూ మార్కెట్‌పై ఉంటుంది.

తక్షణ మద్దతు: 31379, 31128, 30680; **తక్షణ నిరోధం:** 31937, 32235, 32502

సమీపకాలంలోనూ సెన్సెక్స్‌కు 32000 స్థాయే కీలక నిరోధంగా కనిపిస్తోంది.

– సతీశ్ కంతేటి, జెన్ మనీ

ఈనాడు బిజినెస్



కోడిగుడ్లు

27వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	355	వరంగల్	357
చిల్లరగా (ఒక గుడ్డు)	4.15	విశాఖపట్నం	362
బెంగళూరు	382	చెన్నై	397
28న		చిత్తూరు	390
విజయవాడ/గోదావరి	359	నమక్కల్	387

అప్రమత్తతే అసలైన రక్షణ

- బహుముఖ ముప్పు పొంచి ఉంది
- అపార మానవ వనరులే మన బలం
- పరిశోధన అభివృద్ధి కార్యక్రమాలు భారత్‌కు
- రక్షణ, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ



ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ చేతుల మీదగా నావిక దళానికి ఎల్ఆర్ఎస్ఏఎంను అందిస్తున్న దృశ్యం. చిత్రంలో మిధానీ సీఎండీ దినేశ్ కుమార్, రక్షణ మంత్రి శాస్త్ర సలహాదారు సతీశ్ రెడ్డి, వైస్ అడ్మిరల్ కరమ్‌వీర్ సింగ్, డీఆర్‌డీఓ ఛైర్మన్ క్రిస్టోఫర్, బీడీఎల్ సీఎండీ ఉదయ్ భాస్కర్ తదితరులు.

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత భౌగోళిక, రాజకీయ పరిస్థితుల్లో భారత్‌కు బహుముఖ ముప్పు పొంచి ఉందని, వీటిని ఎదుర్కోడానికి ఎప్పుడు సిద్ధంగా ఉండడమే ఉత్తమ రక్షణ విధానమని రక్షణ, ఆర్థిక, కంపెనీ వ్యవహారాల మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. ప్రపంచంలోనే అనేక ఉత్తమ సంప్రదాయాలను పాటిస్తున్న భారత రక్షణ దళాలపై ప్రజలకు విశ్వాసం ఉన్నప్పటికీ.. అవాంఛనీయ పరిస్థితులు ఎదుర్కోడానికి రక్షణ దళాలకు అవసరమైన మద్దతు వ్యవస్థలను (సపోర్ట్ సిస్టమ్) అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉపరితలం నుంచి ఆకాశంలోని లక్ష్యంపై ప్రయోగించే దూరశ్రేణి క్షిపణిని (ఎల్ ఆర్ ఎస్ఏఎం) రక్షణ మంత్రి జైట్లీ చేతుల మీదుగా భారత నావిక దళానికి భారత్ డైనమిక్స్ (బీడీఎల్) అందజేసింది. ఈ కార్యక్రమంలో జైట్లీ మాట్లాడారు. ఎల్‌ఆర్ఎస్ఏఎంను ఇజ్రాయెల్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇండస్ట్రీస్‌తో కలిసి రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) రూపొందించి అభివృద్ధి చేసింది. ఈ క్షిపణులను బీడీఎల్ తయారు చేస్తోంది. మొదట విడతగా 4 క్షిపణులను అందజేసింది. గత రెండు, మూడు దశాబ్దాల్లో భారత్ ఉన్నత విద్యా రంగంలో నాణ్యమైన విద్య అందించే విద్యా సంస్థల నెట్‌వర్క్‌ను విస్తరించగలిగిందని, వైద్యం.. శాస్త్ర పరిశోధనా రంగం ఏదైనా భారత మేధావులు లేని అభివృద్ధి చెందిన దేశమేదీ నేడు ప్రపంచంలో లేదని జైట్లీ పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునే తత్వం భారతీయులకు ఉందన్నారు. 'భారత్‌లో అపార మానవ వనరులు ఉన్నాయి. ఇవి దేశీయ అవసరాలనే కాక ఇతర దేశాల అవసరాలను కూడా తీర్చగలవు. ఇతర దేశాలతో పోలిస్తే తక్కువ వ్యయానికే భారత మానవ వనరులు అందుబాటులో ఉన్నాయి. అందువల్లనే అనేక పెద్ద కంపెనీలు తమ పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలను భారత్‌కు తరలిస్తున్నాయని' అరుణ్ జైట్లీ అన్నారు. విదేశీ భాగస్వామితో దేశీయ కంపెనీలు రక్షణ రంగంలో పెట్టుబడులు పెట్టాలని కోరుతున్నామని జైట్లీ అన్నారు. రక్షణ పరికరాల తయారీలో స్వయం సమృద్ధి సాధించడమే కాక మిత్ర దేశాలకు వాటిని సరఫరా చేయగల స్థాయికి భారత్ ఎదగాలని ఆకాంక్షిస్తున్నామని చెప్పారు.

ఇబ్రహీంపట్నంలో తయారీ..

ఇబ్రహీంపట్నంలో కొత్తగా ఏర్పాటు చేసిన రాకెట్ మోటార్ స్టాటిక్ టెస్ట్ సదుపాయంలో కొత్తగా అభివృద్ధి చేసిన క్షిపణులను తయారు చేస్తారు. 48 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఈ సదుపాయాన్ని అరుణ్ జైట్లీ లాంఛనంగా ప్రారంభించారు. మధ్య స్థాయి క్షిపణుల అత్యాధునిక వ్యవస్థలను తయారు చేయడానికి, పరీక్షించడానికి ఇబ్రహీంపట్నంలో రెండో విడత సదుపాయాల అభివృద్ధిని బీడీఎల్ చేపట్టింది. 632 ఎకరాల్లో రూ. 522 కోట్ల వ్యయంతో ఈ సదుపాయాలను అభివృద్ధి చేయనుంది. దీనికి మంత్రి భూమి పూజ చేశారు. బీడీఎల్ భానూర్ యూనిట్‌లో 'అస్త్రా' క్షిపణుల తయారీ సదుపాయాన్ని కూడా జైట్లీ ప్రారంభించారు. మిధానీలో నవీకరణ ప్రాజెక్టును ప్రారంభించారు. సమగ్ర క్షిపణి వ్యవస్థల అభివృద్ధి ప్రాజెక్టులో బీడీఎల్ అంతర్గత భాగమని, క్షిపణుల తయారీలో బీడీఎల్ కీలక పాత్ర పోషిస్తోందని రక్షణ శాఖ కార్యదర్శి (రక్షణ ఉత్పత్తి) అశోక్ కుమార్ గుప్తా తెలిపారు. దేశీయ కంపెనీలు తయారు చేసే రక్షణ పరికరాలను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, కార్బన్ ఫైబర్స్ వంటి ప్రత్యేక లోహాల వ్యాపారంలోకి మిధానీ అడుగు పెట్టనుందని గుప్తా వివరించారు. ఈ కార్యక్రమంలో బీడీఎల్ సీఎండీ, వి.ఉదయ్ భాస్కర్, డీఆర్‌డీఓ ఛైర్మన్ ఎస్.క్రిస్టోఫర్, మిధానీ సీఎండీ దినేశ్ కుమార్ లిఖి, రక్షణ మంత్రి శాస్త్ర సలహాదారు సతీశ్ రెడ్డి, వైస్ చీఫ్ ఆఫ్ నావెల్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ కరమ్‌వీర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

జియో ఫోన్ల ప్రీబుకింగ్ నిలిపివేత

దిల్లీ: 4జీ చౌక ఫోన్ జియోఫోన్‌ల ప్రీ బుకింగ్‌ను రిలయన్స్ జియో తాత్కాలికంగా నిలిపివేసింది. 'లక్షల మంది జియో ఫోన్‌ను బుక్ చేసుకున్నారు. తిరిగి ప్రీబుకింగ్స్ ఎప్పుడు మొదలవుతాయో త్వరలో తెలియజేస్తాం' అనే సందేశాన్ని జియో తన వెబ్‌సైట్‌లో ఉంచింది. 24న ప్రీబుకింగ్‌ను రిలయన్స్ జియో ప్రారంభించింది. సంస్థ వెబ్‌సైట్, మైజియో యాప్, రిలయన్స్ జియో విక్రయశాలల్లో రూ. 500 చెల్లించడం ద్వారా జియోఫోన్‌ను బుక్ చేసుకునే అవకాశాన్ని కల్పించింది. ఫోన్ అందుకునే సమయంలో మరో రూ. 1,000 చెల్లించాల్సి ఉంటుంది. 36 నెలలు వినియోగించుకున్నాక, ఫోన్‌ను తిరిగి కంపెనీకి ఇస్తే, రూ. 1500 వాపసు ఇస్తారు. ఇప్పటివరకు బుక్‌చేసుకున్న వారికి సెప్టెంబరు రెండో వారంలో ఫోన్లు అందించడానికి కంపెనీ సన్నాహాలు చేస్తోంది.

మళ్లీ మారుతీదే హవా

టాప్-10లో ఏడు మోడళ్లు ఈ దిగ్గజానివే

దిల్లీ: ప్రయాణికుల వాహన అమ్మకాల్లో మారుతీ సుజుకీ రికార్డులు కొనసాగుతున్నాయి. జులైలో దేశీయంగా అత్యధిక అమ్మకాలు సాధించిన 10 మోడళ్లలో, మారుతీ సుజుకీ మోడళ్లు 7 చోటు దక్కించుకున్నాయి. వాహన తయారీ దారుల సంఘం (సియామ్) నివేదిక ప్రకారం జులై అమ్మకాల్లో మారుతీ ఆల్టో అగ్రస్థానంలో నిలవగా, బాలెనో, వ్యాగన్‌ఆర్, బ్రెజా, సిఫ్ట్ తొలి ఐదింటిలో చోటు సంపాదించాయి. 8, 9 స్థానాల్లోనూ మారుతీ మోడళ్లే ఉన్నాయి.

జులైలో ప్రయాణ వాహనాల అమ్మకాలు

స్థానం	కంపెనీ	మోడల్	అమ్మకాలు (యూనిట్లలో)
1.	మారుతీ సుజుకీ	ఆల్టో	26,009
2.	మారుతీ సుజుకీ	బాలెనో	19,153
3.	మారుతీ సుజుకీ	వ్యాగన్‌ఆర్	16,301
4.	మారుతీ సుజుకీ	విటరా బ్రెజా	15,243
5.	మారుతీ సుజుకీ	స్విఫ్ట్	13,738
6.	హ్యుందాయ్	ఐ10	12,002
7.	హ్యుందాయ్	ఎలైట్ ఐ20	11,390
8.	మారుతీ సుజుకీ	సెడాన్ డిజైర్	11,187
9.	మారుతీ సుజుకీ	సెలెరియో	11,087
10.	హ్యుందాయ్	క్రెటా	10,556

గ్యాస్ ఉత్పత్తికి నూతన సాంకేతికత

రిలయన్స్, బీపీ ప్రణాళిక

దిల్లీ: బంగాళా ఖాతంలోని కేజీ డీ-6 క్షేత్రంలో, అత్యంత లోతైన బావుల నుంచి గ్యాస్‌ను ఉత్పత్తి చేసేందుకు అధునాతన సాంకేతికత అయిన ఫ్లోటింగ్ సిస్టమ్‌ను వినియోగించాలని రిలయన్స్ ఇండస్ట్రీస్, ఆ సంస్థ భాగస్వామి బీపీ (బ్రిటన్) నిర్ణయించాయి. ప్రస్తుతం గ్యాస్‌ను ఉత్పత్తి చేస్తున్న ధీరూభాయ్ 1,3 బావులతో పోలిస్తే, మరో 2,000 మీటర్ల లోతున కొత్త నిక్షేపాలు కనుగొన్నారు. అక్కడ 0.988 లక్షల కోట్ల ఘనపు అడుగుల నిక్షేపాలున్నాయని అంచనా. ఈ గ్యాస్‌ను ఉపరితలానికి చేర్చేందుకు, ఫ్లోటింగ్ ప్రొడక్షన్ స్టోరేజ్ విధానాన్ని వాడాలని, అనంతరం శుద్ధి చేసి, పైపులైను ద్వారా తరలించాలన్నది సంయుక్త సంస్థ ప్రణాళిక. 2018 మధ్యవరకు ఇందుకు పెట్టుబడులు పెట్టే అవకాశం వీరికి ఉంది. కొత్తగా కనుగొన్న మూడు క్షేత్రాల్లో కలిపి రోజుకు 30-35 మిలియన్ స్టాండర్డ్ ఘనపు అడుగుల గ్యాస్‌ను, 4-5 ఏళ్ల పాటు ఉత్పత్తి చేయవచ్చని సంస్థ తెలిపింది. ఈ క్షేత్రాలపై రూ. 40,000 కోట్ల పెట్టుబడి ప్రణాళికలను సంయుక్త సంస్థ వెల్లడించిన సంగతి విదితమే.

కార్లపై అదనపు సెస్‌కు ఈ వారంలో ఆర్డినెన్స్

దిల్లీ: జీఎస్‌టీ 28 శాతానికి అదనంగా విలాసవంత, ఎస్‌యూవీ, మధ్యస్థాయి, పెద్దకార్లపై సెస్‌ను 15 శాతం నుంచి 25 శాతానికి పెంచుతూ కేంద్ర మంత్రి వర్గం ఈ వారం ఆర్డినెన్స్ తీసుకువచ్చే అవకాశాలు ఉన్నాయి. సెస్ పెంపునకు ఇప్పటికే జీఎస్‌టీ మండలి నిర్ణయం తీసుకున్న సంగతి విదితమే. ఇందుకు అనుగుణంగా జీఎస్‌టీ 2017 చట్టంలోని సెక్షన్ 8లో సవరణలు చేయాల్సి ఉంది. కేంద్ర మంత్రివర్గం ఈ వారంలో సదరు ఆర్డినెన్స్ తీసుకురానున్నదని ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. దీనిపై రోడ్డు, రవాణా, రహదారులు, భారీ పరిశ్రమల శాఖల అభిప్రాయాలు తీసుకోనున్నట్లు ఆ అధికారి తెలిపారు. ఆర్డినెన్స్‌కు 6 మాసాల్లోగా పార్లమెంటు ఆమోదం పొందాల్సి ఉంటుంది. సెస్ పెంపు ఎప్పటి నుంచి అమల్లోకి వచ్చేది సవరణల అనంతరం జీఎస్టీ మండలి ప్రకటిస్తుంది. తదుపరి జీఎస్టీ సమావేశం సెప్టెంబరు 9న హైదరాబాద్‌లో జరగనుంది.

నందన్ నీలేకని 2-3 ఏళ్లయినా ఉండాలి

ఇన్ఫీ మాజీ సీఎఫ్ఓ వి.బాలకృష్ణన్



దిల్లీ: ఇన్ఫోసిస్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సహ వ్యవస్థాపకులు నందన్ నీలేకని రెండు, మూడేళ్లయినా కొనసాగాలని సంస్థ మాజీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) వి.బాలకృష్ణన్ ఆకాంక్షించారు. అప్పుడే అధికార మార్పిడి ప్రక్రియ సాఫీగా సాగుతుందని పేర్కొన్నారు. వృత్తి నిపుణులకు కంపెనీ బాధ్యతలు అప్పగించే ప్రక్రియ విఫలం కాకూడదంటే, నీలేకని ఆధ్వర్యం వహించాలని ఆకాంక్షించారు. '2014లో పెద్ద ప్రయోగమే జరిగింది. వృత్తి నిపుణులతో కూడిన బోర్డు కంపెనీ నిర్వహణ బాధ్యతలు స్వీకరించింది. వ్యవస్థాపకుల స్థానంలో కొత్త ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) వచ్చారు. అయితే బోర్డు సరిగా వ్యవహరించనందున, ఆ ప్రయోగం విఫలమైంది. ఈసారి మళ్లీ అలాంటి తప్పు జరక్కూడదు. అందుకే నీలేకని 2-3 ఏళ్లు ఛైర్మన్‌గా ఉండాలి. బోర్డును పునర్నియమించాలి. కొత్త సీఈఓను తీసుకురావాలి. కొంతకాలం పర్యవేక్షించాలి. భవిష్యత్తులో నీలేకని తప్పుకోవాలంటే, ముందుగా మంచి ఛైర్మన్‌ను ఎంపిక చేయాలి. అప్పుడే బోర్డు సురక్షిత వ్యక్తి చేతుల్లో ఉన్నట్లు అవుతుంది. ప్రతి సమస్యకు పరిష్కారం కనుగొనాలి' అని బాలకృష్ణన్ పేర్కొన్నారు. 'పనాయా సంస్థను కొనుగోలు చేయడంపై న్యాయ, ఆడిట్ సంస్థలు ఇచ్చిన నివేదికలపై ఇన్ఫోసిస్ స్థిర అభిప్రాయానికి రావాలి. విచారణ నివేదికలను బహిరంగ పరచాలి' అని కోరారు. సహ ఛైర్మన్‌గా ఉండి, స్వతంత్ర డైరెక్టరుగా మారిన రవి వెంకటేశన్ బోర్డు నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు.

నాకు ఆసక్తి లేదు: 'ఇన్ఫోసిస్ సీఈఓగా వచ్చేందుకు, బోర్డులో ప్రాతినిధ్యం వహించేందుకు నాకు ఆసక్తి లేదు. నేను వెంచర్ ఫండ్ నడుపుతున్నా. అయితే అశోక్ వేమూరి, బీజీ శ్రీనివాస్, మోహన్‌దాస్ పాయ్ వంటి సంస్థ మాజీ దిగ్గజాలు ఉన్నారు' అని బాలకృష్ణన్ వివరించారు.

చమురు అమ్మడమే మంచిది!

కమొడిటీస్ ఈ వారం

బంగారం, వెండి



పసిడి అక్టోబరు కాంట్రాక్టు గత వారం రూ. 29,125 వద్ద ప్రారంభమైంది. చివరకు 0.14% లాభంతో రూ. 29,167 వద్ద ముగిసింది. ఈవారం కాంట్రాక్టుకు కొంత సానుకూల ధోరణి కనిపిస్తోంది. ఐరోపా కేంద్రీయ బ్యాంక్ అధ్యక్షుడు మారియో ప్రసంగం ప్రభావం కాంట్రాక్టుపై ఉంటుంది. శుక్రవారం వెలువడే అమెరికా వ్యవసాయేతర ఉద్యోగ గణాంకాల కోసం కూడా మదుపర్లు ఎదురుచూస్తారు. ఈ నేపథ్యంలో పెరిగినప్పుడల్లా అమ్మే వ్యూహంతో వెళ్లడం మంచిది. వెండి డిసెంబరు కాంట్రాక్టు రూ. 39,490 వద్ద ఆరంభమై 0.4% లాభంతో రూ. 39,464 వద్ద స్థిరపడింది. ఈవారం కూడా వెండి కాంట్రాక్టు ఒడుదొడుకుల మధ్య కదలాడొచ్చు. కమొడిటీ రంగానికి సంబంధించి అనుకోని సంఘటనలు చోటుచేసుకుంటే మినహా కాంట్రాక్టు ప్రతికూలంగా కదలాడే అవకాశం ఉంది.

ప్రాథమిక లోహాలు




ఈవారం సాంకేతికంగా చూస్తే రాగి నవంబరు కాంట్రాక్టుకు రూ. 442- 446 వరకు అమ్మకాల ఒత్తిడి ఎదురయ్యే అవకాశం ఉంది. సీసం సెప్టెంబరు కాంట్రాక్టు ఈవారం రూ. 147 దిగువకు వస్తే మరింత అమ్మకాల ఒత్తిడికి లోనై రూ. 143 వరకు దిగిరావచ్చు. జింక్ సెప్టెంబరు కాంట్రాక్టు రూ. 195 దిగువన ట్రేడ్ కాకుంటే సానుకూలంగా చలించి రూ. 202 వరకు పెరిగే అవకాశం ఉంది. ఈ స్థాయి వద్ద లాభాలు స్వీకరించడం ఉత్తమం. అల్యూమినియం సెప్టెంబరు కాంట్రాక్టు రూ. 130.40 కింద చలించకుంటే బలహీనత కొనసాగే అవకాశం ఉంది. నికెల్ సెప్టెంబరు కాంట్రాక్టు ఈవారం కూడా సానుకూలంగా కనిపిస్తుంది. లాంగ్ పొజిషన్లను అట్టేపెట్టుకోవడం మేలు.

గతవారం పొజిషన్లు ఇలా

కమొడిటీ (కాంట్రాక్టు)	ప్రారంభం (రూ.లలో)	ముగింపు (రూ.లలో)	వృద్ధి/(క్షీణత) (శాతంలో)
రాగి (నవంబరు)	422.80	433.30	2.48
సీసం (సెప్టెంబరు)	153	148.45	(2.97)
జింక్ (సెప్టెంబరు)	203	196.10	(3.40)
అల్యూమినియం(సెప్టెం)	133.65	132.05	(1.20)
నికెల్(సెప్టెంబరు)	715	733.70	2.56
ముడి చమురు (సెప్టెం)	3,104	3,060	(1.43)
సహజ వాయువు (సెప్టెం)	189.40	187.70	(0.9)
సీపీఓ (ఆగస్టు)	509.60	521	2.24
ధనియాలు (సెప్టెంబరు)	4,829	4,987	3.27
పసుపు (సెప్టెంబరు)	7,414	7,406	(0.11)

ఇంధన రంగం



ముడి చమురు సెప్టెంబరు ఫ్యూచర్స్ కాంట్రాక్టు రూ. 3008 దిగువన చలిస్తే మరింత అమ్మకాల ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉంది. అందువల్ల ప్రస్తుత స్థాయిల వద్ద కాంట్రాక్టును అమ్మడం మంచిది. సహజ వాయువు సెప్టెంబరు కాంట్రాక్టు ఈవారం కూడా డీలాపడే అవకాశం ఉంది. రూ. 193.40 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకొని పెరిగినప్పుడల్లా అమ్మే వ్యూహంతో ముందుకెళ్లాలి. ముడి పామోలిన్ నూనె (సీపీఓ) ఆగస్టు కాంట్రాక్టు గత మూడు వారాల మాదిరే ఈవారం కూడా రాణించే అవకాశం ఉంది.

వ్యవసాయ ఉత్పత్తులు



ధనియాలు సెప్టెంబరు కాంట్రాక్టు జోరు ఈవారం కూడా కొనసాగే అవకాశం ఉంది. అందువల్ల లాంగ్ పొజిషన్లు అట్టేపెట్టుకోవడం మేలు. పసుపు సెప్టెంబరు కాంట్రాక్టు ఈవారం రూ. 7,652 ఎగువన కదలాడకుంటే బలహీనత కొనసాగొచ్చు. అందువల్ల షార్ట్ సెల్ పొజిషన్లు కొనసాగించడం మేలు.


– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

ఇన్ఫీకి.. మార్కెట్‌కు.. లాభాలే!


స్టాక్ మార్కెట్ ఈ వారం

- బోర్డులోకి నీలేకని రాకతో సానుకూలతలు
- ర్యాలీ వచ్చినప్పుడల్లా కొంత దిద్దుబాటు
- 9700-9950 శ్రేణిలో నిఫ్టీ కదలికలు
- బ్యాంకింగ్, టెలికాం షేర్లకు ప్రతికూలతలు


స్టాక్ మార్కెట్లు ఈ వారం లాభాలు పంచవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. అధిక స్థాయిల వద్ద విక్రయాలు తోసిపుచ్చలేమని వారంటున్నారు. ఈనెల 31న వెలువడే జీడీపీ గణాంకాలూ కీలకం కానున్నాయి. నిఫ్టీ ఈ వారం 9700-9950 శ్రేణిలో కదలాడవచ్చని సాంకేతిక విశ్లేషకులు చెబుతున్నారు. ఇటీవలి సంస్థాగత మదుపర్ల గణాంకాలను బట్టి చూస్తే ప్రతి ర్యాలీ సమయంలో విక్రయాలు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇన్ఫోసిస్ షేర్లు సూచీలకు దిశానిర్దేశం చేసే అవకాశం ఉంది. బోర్డులోకి నీలేకని తిరిగి వచ్చిన నేపథ్యంలో ఈ షేరుకు లాభాలురావచ్చన్న అంచనాలున్నాయి. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..



బ్యాంకింగ్: ప్రతికూల ధోరణితో కదలాడవచ్చు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో విలీనాల విషయంలో ప్రభుత్వం చేసే ప్రకటన కోసం మదుపర్లు ఎదురు చూస్తున్నారు. ఈ వారం నిఫ్టీ బ్యాంక్ సూచీకి 24,200 వద్ద మద్దతు లభించవచ్చని అంటున్నారు. మధ్య స్థాయి (మిడ్‌క్యాప్) బ్యాంకు షేర్లలో కొంత ఒత్తిడి కనిపించవచ్చు.




ఐటీ: మదుపర్ల కళ్లన్నీ ఇన్ఫోసిస్‌పైనే ఉండొచ్చు. నీలేకని రాక నేపథ్యంలో ఈ వారం ఈ కంపెనీ షేర్లు 6% దాకా పెరగవచ్చని అంచనా. టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌లపైనా మదుపర్లు దృష్టి సారించే అవకాశం ఉంది. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ రూ. 850-900 మధ్య, టెక్ మహీంద్రా రూ. 400-450 మధ్య కదలాడవచ్చు. మధ్య స్థాయి ఐటీ షేర్లయిన జెన్సార్ టెక్నాలజీస్, ఇక్లర్క్స్ సర్వీసెస్, టేక్ సొల్యూషన్స్, పర్సిస్టెంట్ సిస్టమ్స్‌లపైనా మార్కెట్ కన్నేయవచ్చు.




ఔషధ: ఈ రంగ షేర్లలో కొనుగోళ్లు కనిపించవచ్చు. సన్ ఫార్మా ఇండస్ట్రీస్ రూ. 525 దిశగా పెరగొచ్చు. కేడిలా హెల్త్‌కేర్‌కు రూ. 510 వద్ద నిరోధం ఎదురుకావొచ్చు. లుపిన్, సిప్లాలు వరుసగా రూ. 1060; రూ. 585 దిశగా పయనించవచ్చు. ప్రస్తుతానికి ఈ రంగానికి ఎటువంటి సానుకూలతలూ కనిపించడం లేదని.. చాలా సవాళ్లు ఎదురవుతుండడం ఇందుకు నేపథ్యమని విశ్లేషకులు అంటున్నారు.




యంత్రపరికరాలు: ఎల్ అండ్ టీ మినహా మిగతా యంత్ర పరికరాల షేర్లన్నీ నష్టాల పాలు కావొచ్చు. వార్షిక సాధారణ సమావేశం(ఏజీఎమ్)లో ఎల్ అండ్ టీ యాజమాన్యం చేసిన సానుకూల వ్యాఖ్యల నేపథ్యంలో ఆ షేరుకు లాభాలు రావొచ్చు. సీజీ పవర్ దీర్ఘకాలంలో రాణించొచ్చు. ఈ కంపెనీ షేరుకు రూ. 92 వద్ద నిరోధం; రూ. 70 వద్ద మద్దతు లభించొచ్చు.



ఎఫ్ఎమ్‌సీజీ: హెచ్చుతగ్గులకు లోను కావొచ్చు. స్వల్పకాలంలో ప్రస్తుత స్థాయిల వద్దే స్థిరీకరణకు గురి కావొచ్చు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ వంటివి టోకు, రిటైల్ ట్రేడింగ్ వర్గాలపై చూపిన ప్రభావం సమీప కాలంలో తగ్గే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. హెచ్‌యూఎల్ రూ. 1150-1204; ఐటీసీ రూ. 274-287 మధ్య కదలాడవచ్చు. డాబర్ ఇండియా రూ. 290 స్థాయిని పోగొట్టుకుంటే మరింత నష్టపోవచ్చు. బ్రిటానియా రూ. 4120-4310 మధ్య చలించొచ్చు.



చమురు: ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌లు ఈ వారం తక్కువ శ్రేణిలో సానుకూలంగా చలించొచ్చని అంచనాలున్నాయి. వారం రోజులుగా దిద్దుబాటుకు గురైన ఈ రంగం పుంజుకునే అవకాశం ఉంది. అంతర్జాతీయ ముడి చమురు ధరల కదలికలకు అనుగుణంగా ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియా షేర్లు ట్రేడ్ అవ్వొచ్చు. డాలరు-రూపాయి మారక విలువ ప్రభావం కూడా కనిపించవచ్చు.



టెలికాం: రిలయన్స్ జియో ఉచిత ఫోన్లకు వచ్చిన అద్భుత స్పందన ప్రభావం టెలికాం షేర్లపై కనిపించవచ్చు. ఈ రంగంపై ప్రతికూల ధోరణిని ఇక్రా కొనసాగిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో టెలికాం రంగ ఆదాయాలు రూ. 2.4 లక్షల కోట్లకు పరిమితం కావొచ్చని అంచనా వేస్తోంది. స్పెక్ట్రమ్ చెల్లింపుల గడువును 10 ఏళ్లకు బదులుగా.. 16 ఏళ్లకు పెంచడం కొంత ఊరటనిచ్చే అంశం. ఆర్‌కామ్ రూ. 22-24 మధ్య; ఐడియా రూ. 87.30-92 మధ్య కదలాడవచ్చు.



వాహన: మారుతీ సుజుకీ వంటి దిగ్గజ సంస్థలు రాణించొచ్చన్న అంచనాల మధ్య చాలా వరకు ఇతర వాహన షేర్లు కూడా పెరిగే అవకాశం లేకపోలేదు. మహీంద్రా అండ్ మహీంద్రా స్వల్పకాలంలో బలహీనతలను కనబరచవచ్చు. రూ. 1340 స్థాయికి చేరొచ్చని ముంబయికి చెందిన ఓ విశ్లేషకుడు అంచనా వేశారు. మారుతీ రూ. 7720 దిశగా పెరగవచ్చని; టీవీఎస్ మోటార్ కూడా రూ. 610 దాకా వెళ్లవచ్చంటున్నారు.



సిమెంటు: ఈ వారం సిమెంట్ షేర్లు స్థిరీకరణకు గురికావొచ్చు. వర్షాల సీజనులో సిమెంటుకు గిరాకీ తక్కువగా ఉంటుందన్న విషయం తెలిసిందే. రెరా అమలు, కొన్ని రాష్ట్రాల్లో ఇసుకపై వివాదాల నేపథ్యంలో ధరలు తగ్గాయి. అయితే మధ్యకాలం నుంచి దీర్ఘకాలానికి ఈ రంగంపై సానుకూలతలు ఉన్నట్లు చెబుతున్నారు. ఏసీసీ రూ. 1764-1806; అంబుజా సిమెంట్స్ రూ. 270-279 స్థాయిలో చలించొచ్చు.



లోహ: లోహ, గనుల తవ్వక కంపెనీలు ఈ వారం ఊగిసలాటకు గురికావొచ్చు. లండన్ మెటల్ ఎక్స్ఛేంజీలో అల్యూమినియం ధరలు బలంగా ఉన్నందున, హిందాల్కో ఇండస్ట్రీస్ షేర్లు లాభాలు కొనసాగించొచ్చు. టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌లపై మదుపర్ల దృష్టి పడొచ్చు. ఈ రెండూ ఒత్తిడిలో ఉన్న ఆస్తులను విక్రయిస్తుండడమే ఇందుకు నేపథ్యం.



గాంధీ ఆసుపత్రిలో ఓపీ చిట్టీ తీసుకునేందుకు బారులు తీరి నిరీక్షిస్తున్న రోగులు

సర్కారు వైద్యం.. సకాలంలో కష్టం

- వైద్యులు ఎప్పుడొస్తారో.. ఎప్పుడెళ్తారో తెలియదు
- సొంత క్లినిక్‌లు, కార్పొరేట్ విధుల వైపే ఎక్కువమంది మొగ్గు
- కొందరైతే ఆసుపత్రికి రాకుండానే వచ్చినట్లుగా హాజరు నమోదు
- పర్యవేక్షణ లేక అన్నిచోట్లా ఇదే తీరు
- ‘ఈనాడు’ క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడి

ఇటీవల ఆరోగ్య శాఖలో పదోన్నతుల ప్రక్రియ సందర్భంగా గైనకాలజీ వైద్యనిపుణురాలు ఒకరు ఆరోగ్య మంత్రిని కలవడానికి సచివాలయానికి వచ్చారు. హైదరాబాద్‌లో పోస్టింగ్ ఇవ్వాలని కోరుతూ దరఖాస్తుపత్రంతోపాటు తన విజిటింగ్ కార్డు కూడా మంత్రికి ఇచ్చారు. ఆ కార్డులో వైద్యురాలి పేరు, హోదా, ఎక్కడ అందుబాటులో ఉంటారో సమాచారం ఉంది. వాటితోపాటు మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 9 గంటల వరకూ ఓ ప్రైవేటు నర్సింగ్‌హోంలో అందుబాటులో ఉంటానని ముద్రించి ఉంది. ప్రభుత్వ వైద్యురాలై ఉండి, ఇక్కడ పనిచేయాల్సిన సమయంలో ప్రైవేటు సేవల్లో ఉంటానని కార్డుపైనే ముద్రించుకోవడం, దాన్ని నేరుగా మంత్రికే ఇవ్వడంతో మంత్రి సహా ఉన్నతాధికారులు నివ్వెరపోయారు. ప్రభుత్వ వైద్యులు విధులు ఎగ్గొట్టి ప్రైవేటు బాటపడుతున్నారనడానికి ఇదో ఉదాహరణ.

ఈనాడు, హైదరాబాద్, యంత్రాంగం

కొన్ని నెలల కిందట నిలోఫర్ ఆసుపత్రిలో వైద్యవిద్య సంచాలకులు రాత్రి పూట ఆకస్మిక తనిఖీ చేశారు. విధుల్లో ఉండాల్సిన సహాయ ఆచార్యులు లేరు. హాజరైనట్లు సంతకం చేసి.. పీజీ వైద్యులకు విధులు అప్పగించి ఆ సహాయ ఆచార్యులు బయటకెళ్లారు. నిత్యం ఇదే తంతు కొనసాగుతుందని తేలడంతో ఆ వైద్యుణ్ని బదిలీ చేశారు. తర్వాత పైరవీలు చేసుకొని ఆ వైద్యుడు తిరిగి నిలోఫర్‌లోనే చేరిపోయాడు. కేవలం పీజీ వైద్యవిద్యార్థులపై పిల్లల ఆరోగ్యాన్ని వదిలేసి వైద్యులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారనేది గమనార్హం.

- ఉస్మానియా ఆసుపత్రిలో పనిచేసే వైద్యుడొకరు ఓ పేరున్న కార్పొరేట్ ఆసుపత్రిలోనూ పని చేస్తుంటారు. ఉదయాన్నే వెళ్లి కార్పొరేట్‌లో శస్త్రచికిత్సలు చేసి మళ్లీ ప్రభుత్వ ఆసుపత్రికొస్తున్నారు. కార్పొరేట్ ఆసుపత్రిలో పొద్దున చికిత్స పొందిన రోగికి అత్యవసర వైద్యం అవసరమైతే ప్రభుత్వాసుపత్రిలో సేవలు వదిలేసి అక్కడికి పరుగులుపెడుతున్నారు. దీంతో ప్రభుత్వ వైద్యంలో రోగులకు సేవలు దక్కడం లేదు.

ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యులు ఎంత అందుబాటులో ఉంటున్నారో చెప్పడానికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. అత్యధిక మంది ప్రభుత్వ వైద్యులు ఆసుపత్రులకు ఆలస్యంగా వచ్చి, త్వరగా వెళ్లిపోతున్నారు. పీహెచ్‌సీలు మొదలుకొని ప్రాంతీయ, జిల్లా ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్యుల్లో అత్యధిక మంది సొంత దవాఖానాలు పెట్టుకుని వాటిపైనే దృష్టిపెడుతుండడం సర్వసాధారణంగా మారింది. పట్టణాలు, నగరాల్లో అయితే ఏదో ఒక కార్పొరేట్ ఆసుపత్రుల్లో మారు కొలువుచేస్తూ ఏకాస్త సమయం చిక్కినా అక్కడ వాలిపోతున్నారు. మరోవైపు వైద్యుడు వస్తే చికిత్స చేయించుకుందామని నిరుపేదలు ప్రభుత్వాసుపత్రుల్లో నిలువుకాళ్లమీద నిరీక్షిస్తూనే ఉన్నారు.

అందరి సంతకాలూ ఒక్కరే

ఉస్మానియా, గాంధీ, నిజామాబాద్, ఎంజీఎం తదితర ఆసుపత్రుల్లో కొన్ని విభాగాల వైద్యుల సంతకాలను ఆయా విభాగాల పీజీ వైద్యుడొక్కరే పెట్టేస్తున్నారు. దీంతో ఉదయం 9 గంటలకు రావాల్సిన వైద్యులు కొందరు 10, 11 గంటలకూ వస్తున్నారు. ఆసుపత్రి ముఖం చూడని వైద్యుల సంతకాలు కూడా పెట్టేస్తుండడం దారుణం. సంతకాల పుస్తకాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే రెండు ఆంగ్ల అక్షరాలతో పొట్టి సంతకం ఉంటుంది. ఒకే పెన్ను, ఒకే తరహా రాతతో సంతకాలన్నీ కనిపిస్తాయి. ఇవన్నీ ఆసుపత్రి సూపరింటెండెంట్లకు తెలిసినా తమకెందుకొచ్చిన గొడవ అని మిన్నకుండిపోతున్నారు.

బయోమెట్రిక్‌ను భ్రష్టుపట్టించారు

ఆసుపత్రుల్లో గాడితప్పిన వైద్యుల సమయపాలన చక్కదిద్దేందుకు ప్రభుత్వం రెండేళ్ల కిందట ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల్లో బయోమెట్రిక్ విధానాన్ని ప్రారంభించింది. నెలరోజుల పాటు దీన్ని పక్కాగా అమలు చేయడంతో 95 శాతం మంది వైద్యుల హాజరు పెరిగింది. తర్వాత బయోమెట్రిక్ విధానాన్ని ప్రభుత్వ వైద్యులు తీవ్రంగా వ్యతిరేకించారు. సంబంధిత పరికరాలను కొందరు ఉద్దేశపూర్వకంగానే పగలగొట్టేశారన్న విమర్శలున్నాయి. దీంతో బయోమెట్రిక్ మూణ్నాళ్ల ముచ్చటగా ముగిసింది. వైద్యులు మళ్లీ ఇష్టారాజ్యంగా వచ్చివెళుతున్నారు.

రాత్రి విధులూ డుమ్మా

బోధనాసుపత్రుల్లో ప్రతి విభాగంలోనూ సంబంధిత సహాయ ఆచార్యులు రాత్రిపూట విధులు నిర్వహించాలి. చాలాచోట్ల వీరు పీజీ వైద్యులపై భారం వేసి ఇళ్లకెళిపోతున్నారు. జిల్లా, ప్రాంతీయ ఆసుపత్రుల్లో అయితే మధ్యాహ్నం ఒంటిగంటకే బాధ్యతలన్నీ ఒక్క వైద్యుడికి అప్పగించేస్తున్నారు. ఆ ఒక్కరే మర్నాడు ఒంటిగంట వరకూ సేవలందిస్తుంటారు. వైద్యుల మధ్య ఈ అంతర్గత అవగాహన ఒప్పందం వల్ల ఒక్కో వైద్యుడికి 10-15 రోజులకు గానీ రాత్రి విధులు నిర్వహించనక్కర్లేదు. కొందరు వైద్యులు దీర్ఘకాలంగా విధులకు హాజరు కాకపోయినా ఎవరికీ తెలియకుండా నడిపించేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రాంతీయ ఆసుపత్రులు, సామాజిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యులు సమీప పట్టణాలు, నగరాల నుంచి రోజూ వచ్చిపోతున్నారు. విధినిర్వహణ కంటే రాకపోకలకే ఎక్కువ సమయం వెచ్చిస్తున్నారు.

లొసుగులే అవకాశంగా..

- 8 యూనిట్లున్న ఒక విభాగంలో కేవలం ఒక్క యూనిట్ వైద్యులు మాత్రమే రోగుల సేవల్లో ఉంటారు.
- ఒక్కో రోజు ఒక్కో యూనిట్ పనిచేసినా వారానికి కూడా మళ్లీ తమ వంతు రాదు. ఆ ఒక్కరోజు కూడా చాలామంది ఆచార్యులు, సహ ఆచార్యులు ఓపీలకు హాజరు కావడంలేదు. హాజరైనా ఒకటి రెండు గంటలే ఓపీలో ఉండి వెళ్లిపోతున్నారు.
- మిగిలిన యూనిట్ల వైద్యులపై ఆ మాత్రం పర్యవేక్షణ కూడా లేదు.
- తమకు సంబంధించిన వార్డుల్లో రోగులను నిత్యం పరీక్షించడంలో అధిక శాతం ఆచార్యులు హాజరు కావడంలేదు. ఇక్కడా కింది స్థాయి వైద్యులే ప్రధాన పాత్ర పోషిస్తున్నారు.
- ఎంబీబీఎస్ విద్యార్థులకు పాఠాలు బోధించడానికి కూడా ఆచార్యులు, సహ ఆచార్యుల్లో ఎక్కువమంది రావడం లేదు. ఎక్కువ విభాగాల్లో సహాయ ఆచార్యులే తరగతులు తీసుకుంటున్నారు.
- ఈ వ్యవహారాలను పర్యవేక్షించాల్సిన ప్రధానాచార్యులు, సూపరింటెండెంట్లు ఉత్సవ విగ్రహాల్లా ఉంటున్నారనే విమర్శలున్నాయి.

ఎలా చక్కదిద్దాలి?

- ఓపీ సేవలను కచ్చితంగా మధ్యాహ్నం 2 గంటల వరకూ నిర్వహించాలి.
- అన్ని స్థాయుల వైద్యులూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విధిగా విధులు నిర్వర్తించాలి.
- ఓపీలో కేవలం ఒక్క యూనిట్‌తో పరిమితం కాకుండా విభాగంలో యూనిట్ల సంఖ్యను బట్టి ఓపీ సేవల్లో మరిన్ని యూనిట్ల వైద్యులను నియమించాలి.
- తద్వారా రోజుల తరబడి వేచిచూడాల్సిన అవసరం లేకుండా త్వరగా ఓపీ సేవలందుతాయి.
- బయోమెట్రిక్ విధానం ద్వారా హాజరును పర్యవేక్షించాలి.

అంతమంది వైద్యులున్నా..

- తెలంగాణలోని బోధనాసుపత్రుల్లో సాధారణంగా ఒక్కో విభాగంలో 3 నుంచి 8 యూనిట్ల వరకూ ఉన్నాయి.
- జనరల్ మెడిసిన్ విభాగాన్ని తీసుకుంటే గాంధీ వైద్యకళాశాలలో 8 యూనిట్లున్నాయి. మొత్తం విభాగానికి ఒక అధిపతితో పాటు ఒక్కో యూనిట్‌లో ఒక ఆచార్యులు, ఒక సహ ఆచార్యులు, ఇద్దరు నుంచి ముగ్గురు చొప్పున సహాయ ఆచార్యులున్నారు. ఇద్దరు సీనియర్ రెసిడెంట్లు ఉంటారు. అంటే ఒక్కో యూనిట్‌లో ఆరేడుగురు వైద్యులున్నారు. మొత్తం జనరల్ మెడిసిన్ విభాగంలో సుమారు 50 మంది వైద్యులుంటారు. వీరు కాకుండా పీజీ వైద్యవిద్యార్థులూ ఉంటారు. వీటిల్లో సుమారు 30 శాతం ఖాళీలున్నా కనీసం 35 మంది జనరల్ మెడిసిన్ వైద్యులైనా ఉంటారు.
- కానీ రోజూ కేవలం ఒక్క యూనిట్ వైద్యులు మాత్రమే ఓపీలో ఉంటారు.
- గాంధీ ఆసుపత్రిలో నిత్యం జనరల్ మెడిసిన్ ఓపీకి సుమారు 200 మంది వస్తుంటే వీరిని 6-7 మంది వైద్యులు పరీక్షిస్తుంటారు.
- మిగిలిన యూనిట్ల వైద్యులు ఓపీ వైపు కన్నెత్తి చూడరు. కొన్ని యూనిట్ల వైద్యులు ఎంబీబీఎస్ విద్యార్థులకు, మరికొందరికి పీజీ వైద్యవిద్యార్థులకు మార్గదర్శన తరగతులు బోధించాలి.
- ఇంకొన్ని యూనిట్ల వైద్యులు తమ వార్డుల్లో రోగులను పరీక్షిస్తారు.
- సాధారణంగా అన్ని బోధనాసుపత్రుల్లోనూ, ప్రతి విభాగంలోనూ ఇదే విధానం కొనసాగుతోంది.

ప్రభుత్వానికి నిఘా వర్గాలిచ్చిన నివేదికలోని ముఖ్యాంశాలు

- అత్యధిక ప్రభుత్వ వైద్యులు విధులకు సక్రమంగా హాజరుకావడం లేదు. సొంత ఆసుపత్రుల్లో పనిచేయడానికి మొగ్గు చూపుతున్నారు.
- ప్రభుత్వ వైద్యులు సొంతంగా ప్రైవేటు ఆసుపత్రులను నిర్వహిస్తున్నా పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది.
- కామారెడ్డి జిల్లా జక్రాన్‌పల్లి, ధార్‌పల్లి పీహెచ్‌సీల్లో వైద్యులు తమ పని సమయంలో సొంత ఆసుపత్రుల్లో పనిచేస్తున్నారు.
- కొందరు తిరిగి సాయంత్రానికొచ్చి హాజరు పుస్తకంలో సంతకాలు పెడుతున్నారు.
- వైద్యుల్లో సమయపాలన లోపించడం వల్ల రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.
- గాంధీ ఆసుపత్రిలో ఎక్కువ మంది వైద్యులు తీరిగ్గా 11, 12 గంటలకొచ్చి మధ్యాహ్నం 1-2 గంటలకు వెళ్లిపోతున్నారు.
- కొందరు సీనియర్ వైద్యులు తరచూ విధులకు డుమ్మా కొట్టి ప్రైవేటు క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు. వారి పని పీజీ వైద్యవిద్యార్థులు చేయాల్సి వస్తోంది.
- కొందరు సీనియర్ వైద్యులు రోగులతో ప్రవర్తించే విధానం సరిగ్గా లేదు. రోగులు అభద్రతకు లోనవుతున్నారు.


సాయంత్రం వరకూ చూడాలి



నా మనవరాలికి ఆరోగ్యం బాగోలేకపోతే ఎంజీఎంకు వచ్చాం. గంటల తరబడి వేచిచూస్తేగానీ డాక్టర్ చూడలేదు. పరీక్షలు రాశారు. వాటి కోసం వెళ్తే సమయం అయిపోయింది. వైద్యుడికి చూపించాలంటే మూడ్రోజులు పడుతోంది. ఏ రోజు రిపోర్టులు ఆ రోజు వచ్చేలా చేయాలి. వైద్యులు కూడా సాయంత్రం వరకూ చూస్తే దూరప్రాంతాల నుంచి వచ్చే వారికి మేలు జరుగుతుంది.

–రహత్ పర్వీన్, పాపయ్యపేట, వరంగల్

పొద్దున వస్తేనే వైద్యం



మా నాన్నను ఆసుపత్రికి తీసుకొచ్చాను. పొద్దున 11.30కే వైద్యులేరు. దూరప్రాంతాల నుంచి వచ్చి చీటి రాయించుకునేసరికే సమయం అయిపోతోంది. వైద్యులు వెళ్లిపోతున్నారు. పొద్దున వచ్చి పడిగాపులు పడితేనే చికిత్స లభిస్తుంది. 12 గంటలు దాటితే నర్సులే వైద్యం చేస్తున్నారు.

–రమేశ్, సిమ్లానాయక్ తండా, నిజామాబాద్.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలే



కొందరు వైద్యులు విధులను సక్రమంగా నిర్వర్తించకుండా ఎగనామం పెడుతున్నట్లు మా దృష్టికీ వచ్చింది. కచ్చితంగా నిర్దేశిత సమయంలోపు హాజరు పుస్తకంలో సంతకాలు చేయనివారి సమాచారాన్ని ఎప్పటికప్పుడూ మాకు తెలియజేయాలని ఇప్పటికే ఆదేశాలిచ్చాం. ముఖ్యంగా వైద్యవిద్యార్థులకు తరగతులు తీసుకోకపోవడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాం. నిబంధనలు పాటించనివారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

–డాక్టర్ రమేశ్‌రెడ్డి, వైద్యవిద్య సంచాలకులు.

తప్పనిసరిగా విధులు నిర్వర్తించాలి



రాత్రిపూట విధులు నిర్వర్తించే సహాయ ఆచార్యులు మధ్యాహ్నం 2 గంటలకే బాధ్యతలు వస్తున్నారు. దీంతో మిగిలిన వైద్యులందరూ వెంటనే వెళ్లిపోతున్నారు. అంటే రెండు పనిగంటలు తగ్గిపోయి నట్లే. రాత్రి విధుల వైద్యుడు సాయంత్రం 4 గంటలకు వస్తే వైద్యులందరు అప్పటి వరకూ ఉంటారు. ఆసుపత్రికొచ్చిన సమయాన్ని, వెళ్లే సమయాన్ని కచ్చితంగా నమోదు చేయాలి. ప్రతి వార్డులోనూ ఆ యూనిట్ అధిపతి, ఇతర వైద్యులు, నర్సుల పేర్లను ప్రదర్శించాలి. ఫిర్యాదు పెట్టెను తప్పనిసరిగా ఉంచాలి

–డాక్టర్ సుదర్శన్‌రెడ్డి, నిలోఫర్ ఆసుపత్రి విశ్రాంత సూపరింటెండెంట్

డిగ్రీ వద్దు జూనియరే ముద్దు!

పాత స్థానాలకు వచ్చేందుకు పదోన్నతి అధ్యాపకుల ఆసక్తి

ఈనాడు, హైదరాబాద్: పదోన్నతులపై ఏడాది క్రితం జూనియర్ కళాశాలల నుంచి డిగ్రీ కళాశాలల అధ్యాపకులుగా చేరిన వారు పాత స్థానాలకే వెళ్తున్నారు. ఇప్పటికే 40 మందికి పైగా అధ్యాపకులు జూనియర్ కళాశాలల్లో చేరారు. గతేడాది జులైలో 382 మంది జూనియర్ అధ్యాపకులు డిగ్రీ అధ్యాపకులుగా పదోన్నతి పొందారు. యూజీసీ వేతనాలైనా పెరుగుదలలో పెద్ద వ్యత్యాసం కనిపించడం లేదన్న అంచనాకు వారు వస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్లకు ఒకసారి పీఆర్‌సీ ఇస్తుండగా, కేంద్ర ప్రభుత్వం(యూజీసీ)లో పదేళ్లకోసారి ఇస్తారు.

మరోవైపు జూనియర్ కళాశాలల్లో రెండు పేపర్లకు రెండు పిరియడ్లు బోధిస్తే చాలు. ఇక్కడే ఉంటే ప్రిన్సిపాల్‌గా, జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారిగా పదోన్నతి పొందవచ్చు. డిగ్రీ మూడేళ్ల కోర్సు అయినందునా మొత్తం నాలుగు పిరియడ్లు బోధించాలి. రాష్ట్రంలో 132 డిగ్రీ కళాశాలలే ఉండటంతో సొంత ఊర్లకు దూరంగా పనిచేయాల్సి వస్తోంది. ఇక న్యాక్ గ్రేడ్ కోసం ప్రతి ఐదేళ్లకు అధిక పని తప్పదు. సెమిస్టర్ విధానం కావడంతో ఆరు నెలలకు పరీక్షలు, మూల్యాంకనం తదితర పనులు తప్పని పరిస్థితి. దీనికితోడు కళాశాల విద్యాశాఖ ఇప్పటివరకు యూజీసీ వేతనం వర్తించేలా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించకపోవడంతో వెనక్కి వెళ్లిపోతున్నారు. ఒకవేళ పాఠశాల ఉపాధ్యాయులకు జూనియర్ కళాశాల అధ్యాపకులుగా పదోన్నతి ఇస్తే ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ అవుతాయని, ఆ లోపు వెళ్తే పాతస్థానంలో ఉండొచ్చని పదోన్నతిపై డిగ్రీ అధ్యాపకులుగా వచ్చిన వారు ముందుచూపుతో వ్యవహరిస్తున్నారు. పదోన్నతి పొందిన రెండేళ్లలో రివర్షన్ వెళ్లవచ్చన్న నిబంధన ఉండటంతో మరికొందరూ వెళ్లొచ్చని చెబుతున్నారు. దీనిపై ప్రభుత్వ డిగ్రీ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. యూజీసీ వేతనాల వర్తింపుపై ఇటీవలే విద్యాశాఖ కమిషనర్‌తో మాట్లాడామని, త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించనున్నారని చెప్పారు.

పెరుగుతున్న వరకట్న వేధింపుల కేసులు

- కౌన్సెలింగ్, రాజీ మార్గాలతోనే పరిష్కారం
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు వ్యాఖ్యలు

విజయవాడ – న్యూస్‌టుడే



కార్యశాలలో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు

సమాజంలో కుటుంబ వ్యవస్థకు ప్రత్యేక స్థానం ఉందని, వైవాహిక జీవితం అనుబంధాలతో ముడిపడి ఉంటుందని, పంతాలకు పోకుండా సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకున్ననాడే కుటుంబం అన్యోన్యంగా ఉంటుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. ఆదివారమిక్కడ భారతీయ న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) ఆధ్వర్యంలో దివంగత సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భగవతి, న్యాయకోవిదుడు పద్మనాభ రెడ్డి స్మారకార్థం క్రిమినల్ లా, కుటుంబ వ్యవస్థపై జరిగిన కార్యశాలకు ముఖ్య అతిథిగా జస్టిస్ లావు నాగేశ్వరరావు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జస్టిస్ భగవతి అనేక తీర్పుల ద్వారా సమాజంలో మార్పులకు నాంది పలికారని చెప్పారు. న్యాయ కోవిదుడు పద్మనాభ రెడ్డితో ప్రత్యేక అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పద్మనాభ రెడ్డి పేదవారి కోసం అనేక కేసులు ఉచితంగా వాదించారని, వారి మార్గం భావితరాలకు అనుసరణీయమన్నారు. సెక్షన్ 304బి ప్రకారం వరకట్న వేధింపుల మరణం, వివాహం అయిన ఏడేళ్ల లోపు భార్య చనిపోతే అది వేధింపుల మరణంగా భావించే చట్టం, గృహహింస చట్టం ఇలా అనేక చట్టాలు మహిళల రక్షణ కోసం ఉన్నాయని, ప్రస్తుతం నిర్భయ కేసు ద్వారా మహిళలకు ప్రత్యేక చట్టం చేసిన సంగతిని గుర్తుచేశారు. ప్రస్తుత సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో ప్రజల మనోభావాల్లో మార్పులు సంభవిస్తున్నాయని, ఈ మార్పులు కుటుంబ వ్యవస్థను ప్రభావితం చేస్తున్నాయన్నారు. భార్యభర్తలు ఏమైనా సమస్యలు తలెత్తినప్పుడు ఇరువురు కలసి సరిదిద్దుకోవాలని, అలాకాకుండా పంతాలకు, పట్టింపులకు పోవడం వల్ల కుటుంబ వ్యవస్థ దెబ్బతిని దాని ప్రభావం పిల్లలపై పడుతుందన్నారు. కొన్ని సర్వేల రిపోర్టు ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో భార్యభర్తల వేధింపుల కేసులు ఎక్కువయ్యాయని చెప్పారు. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. భార్య భర్త నుంచి బయటకు వెళ్లగానే అనేక కేసులు భర్తపై పెడుతున్నారని వాటి ద్వారా మనస్పర్థలు పెరుగుతున్నాయని తెలిపారు. రాజీ మార్గాల ద్వారా ఇరువురు సమస్యలను పరిష్కరించుకోవాలని చెప్పారు. న్యాయమూర్తులు ఆ కేసుల్లో కౌన్సిలింగ్ నిర్వహించి భార్యాభర్తలు కలిసే విధంగా చేయాలని సూచించారు. ఐఏఎల్ కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.లక్ష్మణరావు, ఏసీబీ న్యాయస్థానం న్యాయమూర్తి ఎం.వెంగయ్య, సుప్రీంకోర్టు న్యాయవాదులు ఆర్.ఎ. చీమా, జితేంద్రశర్మ, రాష్ట్ర ఐఏఎల్ ప్రధాన కార్యదర్శులు బొమ్మగాని ప్రభాకర్, సి.మురళీధరన్, వై.ఎస్ లోహిత్, బార్ కౌన్సిల్ సభ్యులు ముప్పాళ్ల సుబ్బారావు, వైజాగ్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కె.ఎస్. సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలిపే హక్కును హరిస్తున్నారు

మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి వీఎస్ కృష్ణ



ఆదిలాబాద్, న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు నిరసన తెలిపే హక్కును హరిస్తూ.. స్వేచ్ఛ మీద ఆంక్షలు విధిస్తున్నాయని మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి వీఎస్ కృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఆదిలాబాద్‌లో జరిగిన మానవ హక్కుల వేదిక ఉమ్మడి జిల్లా ఆరో మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులపై అమానుషంగా వ్యవహరిస్తూ వారిని కనీసం మనుషులుగా పరిగణించడం లేదన్నారు. పారిశ్రామికవేత్తలకు, కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చే ప్రణాళికలను ప్రభుత్వాలు తయారు చేస్తున్నాయని ఆరోపించారు. సెప్టెంబర్ 14, 15 తేదీల్లో మంచిర్యాలలో ఉభయ రాష్ట్రాల మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సోయం బాపురావు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తన దోషుల్ని కఠినంగా శిక్షించాలి

- కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ



హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి దత్తాత్రేయ

నారాయణగూడ, న్యూస్‌టుడే: నకిలీ విత్తనాలను అరికట్టడానికి సమగ్ర చట్టం తీసుకొచ్చేందుకు కేంద్రంలో విస్తృతంగా చర్చ జరుగుతోందని కేంద్ర కార్మికశాఖ మంత్రి బండారు దత్తాత్రేయ తెలిపారు. భారతీయ కిసాన్ సంఘ్-తెలంగాణ (బీకేఎస్-టి) ఆధ్వర్యంలో రైతు దినోత్సవం, బలరామ జయంతి ఉత్సవాలను నారాయణగూడలోని కేశవ స్మారక ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. బీకేఎస్ రాష్ట్రాధ్యక్షుడు పర్యాద అంజిరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో దత్తాత్రేయ ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. పెట్టుబడి పెరగడం, రాబడి తగ్గిపోవడంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన చెందారు. దేశవ్యాప్తంగా అన్నదాతల పరిస్థితులను పరిశీలించిన ప్రధాని మోదీ.. వారికి ఇబ్బందులూ లేకుండా ఉండేందుకు సమగ్ర కార్యాచరణను రూపొందించే పనిలో ఉన్నారన్నారు. రైతులు నష్టపోతోంది నకిలీ విత్తనాలతోనేనని ప్రభుత్వం గుర్తించిందన్నారు. తెలంగాణలో ప్రాంతీయ సేంద్రియ వ్యవసాయ కేంద్రం(రీజినల్ ఆర్గానిక్ ఫార్మ్ సెంటర్) ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ ఈఆర్‌సీ సభ్యులు హెచ్.శ్రీనివాసులు మాట్లాడుతూ వ్యవసాయబోర్లకు ఉన్న ఆటోస్టార్టర్లను తొలగిస్తే విద్యుత్‌ను పొదుపు చేసిన వారవుతారన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత కార్యవాహ ఎక్కా చంద్రశేఖర్, బీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పి.వెంకట్‌రెడ్డి, ప్రచార కార్యదర్శి బి.మల్లారెడ్డి పాల్గొన్నారు.

విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరపాలి

- ‘నిజాం సర్కరోడ’ చిత్రానికి అవరోధాలు కల్పించొద్దు
- భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్

ఈనాడు–హైదరాబాద్: తెలంగాణ విమోచన దినోత్సవం విషయంలో తెరాస ప్రభుత్వం గత పాలకుల్లా వ్యవహరిస్తోందని, ఇకనైనా దృక్పథం మార్చుకోకుంటే ప్రజలు గుణపాఠం చెబుతారని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. ఉద్యమసమయంలో సెప్టెంబరు 17ను అధికారికంగా నిర్వహిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక సీఎం కేసీఆర్ మాటమార్చారని విమర్శించారు. ‘నిజాం సర్కరోడ’ చిత్రబృందాన్ని భాజపా సినిమా విభాగం ఆధ్వర్యంలో లక్ష్మణ్ ఆదివారమిక్కడ సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. నిజాంకు వ్యతిరేకంగా పోరాడినవారి చరిత్రను వెలుగులోకి తీసుకువస్తామని.. త్వరలో ‘తెలంగాణ విమోచన’ పేరుతో యాత్ర చేస్తానని తెలిపారు. ‘నిజాం సర్కరోడ’ చిత్రం విడుదలకు ఆటంకాలు కల్పించడం సినీపరిశ్రమలో మంచి పరిణామం కాదన్నారు. ఎమ్మెల్సీ రామచంద్రరావు మాట్లాడుతూ.. ఈ సినిమాకు భాజపా మద్దతు ఉంటుందన్నారు. నిర్మాత, చిత్రబృందం మాట్లాడుతూ సినిమా విడుదలకు థియేటర్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు.

30న మరో విడత ఎంబీబీఎస్ కౌన్సెలింగ్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యకళాశాలల్లో కన్వీనర్ కోటా కింద ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో మూడో విడత ప్రవేశాల ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. రెండో విడత ప్రవేశాల ప్రక్రియ అనంతరం మిగిలిన 84 ఎంబీబీఎస్, 283 బీడీఎస్ సీట్లకు వెబ్‌ఆప్షన్లను ఆహ్వానించారు. ఇందులో 10 వరకూ ప్రభుత్వ కళాశాలల సీట్లు. ఆదివారం అర్ధరాత్రే సీట్ల కేటాయింపు సమాచారాన్ని కాళోజీ ఆరోగ్య వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారని వర్సిటీవర్గాలు తెలిపాయి. సీట్లు పొందిన విద్యార్థులు కళాశాలల్లో చేరడానికి ఈనెల 29 సాయంత్రం 4 గంటల వరకూ గడువు నిర్ణయించారు. అప్పటికీ ఎవరైనా చేరకపోతే.. ఎంబీబీఎస్ సీట్ల వరకూ 30వ తేదీ ఉదయం మరోదఫా ప్రవేశాల ప్రక్రియ నిర్వహించాలని నిర్ణయించినట్లు కాళోజీ వర్సిటీ ఉపకులపతి కరుణాకర్‌రెడ్డి తెలిపారు. వెబ్‌ఆప్షన్ల ద్వారా కాకుండా ఇప్పటి వరకూ సీట్లు పొందని విద్యార్థులను నేరుగా కౌన్సెలింగ్ ఆహ్వానించి, హాజరైన విద్యార్థుల్లో నీట్ ర్యాంకుల ప్రాతిపదికన ప్రతిభావంతులకు సీట్ల కేటాయింపు జరుపుతామన్నారు. ఈనెల 31తో ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియ ముగియనుండడంతో ఇదే ఆఖరి కౌన్సెలింగ్‌గా భావించాల్సి ఉంటుందన్నారు. వచ్చే నెల 10 వరకూ బీడీఎస్ వైద్యవిద్య ప్రవేశాల ప్రక్రియకు గడువు ఉండడంతో.. ఆ కోర్సుకు మాత్రం మరో దఫా వెబ్‌ఆప్షన్ల ద్వారా కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఉపకులపతి చెప్పారు.

సీట్లు మిగిలితే కళాశాలకే..: నేరుగా విద్యార్థులను ఆహ్వానించి సీట్ల కేటాయింపు జరిపిన అనంతరం సీట్లు మిగిలితే.. కళాశాల తమ ఇష్టానుసారంగా భర్తీ చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. యాజమాన్య(బి), ప్రవాస భారతీయ(సి) కోటా సీట్లకు తుది విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. యాజమాన్య కోటాలో సీట్లన్నీ భర్తీ కాగా, ప్రవాస భారతీయ కోటా సీట్లు మాత్రం సుమారు 80 మిగిలినట్లు తెలుస్తోంది. మిగిలిన సీట్లను ఇప్పుడు కళాశాలలే ఇష్టానుసారంగా భర్తీ చేసుకోవచ్చు.

బంగారు బిస్కెట్ల పట్టివేత

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: దుబాయి నుంచి అక్రమంగా తీసుకువస్తున్న రూ.36.86 లక్షల విలువైన బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నట్లు శంషాబాద్ విమానాశ్రయం కస్టమ్స్ అధికారులు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఆదివారం దుబాయి నుంచి విమానాశ్రయంలో దిగాడు. కస్టమ్స్ అధికారులు అతని అట్టపెట్టెను తనిఖీ చేయగా అందులో కన్వర్టర్ కనిపించింది. దానిలో 1233 గ్రాముల 3బంగారు బిస్కెట్లను గుర్తించారు. ప్రయాణికుడిని అదుపులోకి తీసుకొని బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. విచారణ కోసం హైదరాబాద్ కస్టమ్స్ ప్రధాన కార్యాలయానికి తరలించారు. దుబాయిలో తనకు పరిచయమున్న ఓ ఏజెంట్ కన్వర్టర్ లోపలి భాగంలో రాగి తీగలను తొలగించి అందులో బిస్కెట్లు పెట్టాడని ప్రయాణికుడు వెల్లడించినట్లు అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



శంషాబాద్ విమానాశ్రయంలో స్వాధీనం చేసుకున్న బంగారు బిస్కెట్లు

ఉమ్మడి పౌరస్మృతిపై వచ్చే ఏడాది నాటికి లా కమిషన్ నివేదిక!

దిల్లీ: “ఉమ్మడి పౌరస్మృతి”పై లా కమిషన్ తన నివేదికను వచ్చే ఏడాదికి ప్రభుత్వానికి సమర్పించే అవకాశముందని లా కమిషన్‌కు చెందిన ఓసీనియర్ కార్యనిర్వాహకులు వెల్లడించారు. భారత్‌లో ‘ఉమ్మడి పౌరస్మృతి’ని ప్రవేశపెట్టవచ్చా పరిశీలించాలని కమిషన్‌ను గత జూన్‌లో న్యాయ మంత్రిత్వశాఖ కోరింది. ‘తలాక్’ అంశాన్ని సుప్రీంకోర్టు ధర్మాసనం పరిశీలిస్తున్న సమయంలో లా కమిషన్ ఉమ్మడి పౌరస్మృతిపై నిదాన వైఖరిని అనుసరించాలని నిర్ణయించుకుంది. తలాక్‌పై తీర్పు ఉమ్మడి పౌరస్మృతిపై నివేదిక తయారీకి మార్గదర్శకంగా ఉంటుందని లా కమిషన్ భావించిందనే అభిప్రాయం కూడా ఉంది.

ఈనాడు సినిమా

ఇద్దరం ఒకే అమ్మాయిని ప్రేమించాం



కృష్ణ, నికేత్, నాగచైతన్య, రానా, కీరవాణి, సాయి కొర్రపాటి, కార్తికేయ, రాజమౌళి తదితరులు

"నాగచైతన్య కథల్ని ఎంపిక చేసుకొనే పద్ధతి నాకు నచ్చింది. సినిమా సినిమాకీ సంబంధం లేకుండా వైవిధ్యమైన కథల్ని ఎంచుకొంటున్నాడు"అన్నారు ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి. నాగచైతన్య కథానాయకుడిగా నటించిన చిత్రం 'యుద్ధం శరణం'. లావణ్య త్రిపాఠి కథానాయిక. రజని కొర్రపాటి నిర్మాత. కృష్ణ ఆర్.వి.మారిముత్తు దర్శకుడు. శ్రీకాంత్ కీలక పాత్ర పోషించారు. వివేక్ సాగర్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని గీతాలు ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. తొలి సీడీని ఎమ్.ఎమ్.కీరవాణి ఆవిష్కరించారు. ఎస్.ఎస్.రాజమౌళి స్వీకరించారు. అనంతరం రాజమౌళి మాట్లాడుతూ "మా ఆవిడకు ఏ కథా ఓ పట్టాన నచ్చదు. నా సినిమాల్నీ విమర్శిస్తుంటుంది. అలాంటి తనకి 'యుద్ధం శరణం' కథ బాగా నచ్చింది. అప్పుడే అర్థమైంది.. ఈ చిత్రం మంచి విజయం సాధిస్తుందని. ఓ రోజు సెట్‌కి వెళ్లా.. అక్కడ ఓ కుటుంబం అంతా కలసి పండగ చేసుకొంటున్నట్టు అనిపించింది. శ్రీకాంత్ గెటప్ బాగుంది. 'పరిగెడుతున్న ప్రతి ఒక్కడూ పారిపోతున్నట్టు కాదు' అనే డైలాగ్ బాగా నచ్చింది. దాంతో ఈ సినిమాపై మరింత నమ్మకం పెరిగింది. వివేక్ సాగర్ పాటలు ఆకట్టుకొన్నాయి. ఓ సామాన్యుడు హీరోగా ఎలా మారాడన్న నేపథ్యంలో తీస్తున్న కథ ఇది. తప్పకుండా మంచి విజయాన్ని అందుకొంటుంద"న్నారు. నాగచైతన్య మాట్లాడుతూ "దాదాపు అంతా కొత్తవాళ్లే పనిచేశారు. కొత్తవాళ్లతో సినిమా చేయడానికి ఏ నిర్మాతా సాహసించరు. కానీ సాయి కొర్రపాటి కొత్తతరాన్ని ప్రోత్సహిస్తుంటారు. ఆయన వల్లే ఈ సినిమా సాధ్యమైంది. కృష్ణ నేనూ మంచి మిత్రులం. ఇద్దరం ఒకేరోజు పుట్టిన రోజు జరుపుకొంటాం. ఎనిమిదో తరగతిలో ఒకే అమ్మాయిని ప్రేమించాం. అయితే ఆ యుద్ధంలో నేనే గెలిచా. సెప్టెంబరు 8న ఈ చిత్రం రాబోతోంది. ఈ యుద్ధంలో మాత్రం దర్శకుడిగా తాను గెలవాలి. దర్శకుడిగా తను మరిన్ని మంచి సినిమాలు చేయాల"న్నారు. రానా మాట్లాడుతూ "దర్శకుడు, కథానాయకుడి మధ్య అనుబంధం ఉంటే కచ్చితంగా మంచి సినిమానే వస్తుంది. చైతూ - కృష్ణ ఇద్దరూ మంచి మిత్రులు. వాళ్లు తప్పకుండా హిట్ సినిమానే తీస్తారు. సాధారణంగా నాకు స్వార్థం ఎక్కువ. అయితే.. చైతూ దగ్గర మాత్రమే నేను స్వార్థంగా ఆలోచించను. తన సినిమా అంటే నా సినిమా కంటే బాగా ఆడాలని కోరుకొంటా" అన్నారు. "ఈ చిత్రబృందంలో ప్రతి ఒక్కరూ నాకు తెలుసు. వాళ్లు పడిన కష్టం కూడా తెలుసు. అందుకు తగిన ఫలితం వస్తుందన్న నమ్మకం ఉంద"న్నారు డి.సురేష్‌బాబు. "'పెళ్లి చూపులు'లో వివేక్ సాగర్ అందించిన పాటలు, నేపథ్య సంగీతం నాకు బాగా నచ్చాయి. ఈ సినిమా తనకి మంచి పేరు తీసుకురావాల"న్నారు కీరవాణి. "చైతూ ప్రోత్సాహంతోనే నేనిక్కడ ఉన్నా. నా వెంట నిలిచిన చిత్రబృందానికీ, నా కుటుంబ సభ్యులకూ కృతజ్ఞతలు" అన్నారు దర్శకుడు.

పంచ్ డైలాగ్స్

ఎవడైనా కొడితే పళ్లు రాలుతాయి...
వీడు కొడితే ఏంటిరా కళ్లు రాలుతున్నాయ్!
చిత్రం: ఖైదీ నంబర్ 150
- పంపినవారు: పెంకి శ్రీహర్షిత, కొప్పర, కొత్తవలస, శ్రీకాకుళం



అల్లు అర్జున్

రామోజీ ఫిలింసిటీలో బన్నీ ఫైటింగులు

అల్లు అర్జున్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'నా పేరు సూర్య - నా ఇల్లు ఇండియా'. అను ఇమ్మానియేల్ కథానాయిక. వక్కంతం వంశీ దర్శకుడు. శిరీష శ్రీధర్ నిర్మాత. అర్జున్, శరత్‌కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం రామోజీ ఫిలింసిటీలో చిత్రీకరణ జరుగుతోంది. రామ్ - లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోరాట దృశ్యాల్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ "కథలో ఈ యాక్షన్ ఘట్టానికి చాలా ప్రాధాన్యం ఉంది. రామ్ లక్ష్మణ్ చాలా వైవిధ్యంగా, స్టైలిష్‌గా ఈ ఫైట్ కంపోజ్ చేశారు. టైటిల్‌కి మంచి స్పందన వచ్చింది. అల్లు అర్జున్ కెరీర్‌లోనే గుర్తుండిపోయే చిత్రం అవుతుంది. వచ్చే ఏడాది ఏప్రిల్ 27న ఈ చిత్రాన్ని విడుదల చేస్తామ"న్నారు. విశాల్ శేఖర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి కూర్పు: కోటగిరి వెంకటేశ్వరరావు, పాటలు: రామజోగయ్య శాస్త్రి, ఛాయాగ్రహణం: రాజీవ్ రవి, సమర్పణ: నాగబాబు

జై జవాన్... జై కిసాన్...
ఇద్దరిద్దరే మొనగాళ్లు మీరు
మీరు లేనిదే దేశమ్ము లేదు
పసిడి పంటలు పండించెదవు నీవు
మన స్వతంత్రము నిలబెట్టదవు నీవు
జాతికెల్లా అన్నదాతవు నీవు
మాతృభూమికి ప్రాణదాతవు నీవు

గీతం: పాలబుగ్గల చిన్నదాన్ని...
చిత్రం: జై జవాన్, రచన: దాశరథి
- పంపినవారు: సి.నరసింహులు, తాడిపత్రి

గీతోపదేశం

చిరునామా: సినిమా డెస్క్,
ఈనాడు కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ, అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రంగారెడ్డి జిల్లా- 501512



అలీ, ఎ.కోదండరామిరెడ్డి, పూరి జగన్నాథ్, మోహన్‌బాబు, శ్రియ, బాలకృష్ణ, వి.ఆనంద్‌ప్రసాద్

అన్నగారి లక్షణాల్ని పుణికి పుచ్చుకొన్నారు!

- పూరి జగన్నాథ్

"పరిశ్రమపై ఆధారపడి చాలామంది బతుకుతున్నారు. అందుకే నాణ్యత విషయంలో రాజీపడకుండా వేగంగా సినిమాలు చేస్తున్నా" అన్నారు బాలకృష్ణ. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'పైసా వసూల్'. శ్రియ, ముస్కాన్ కథానాయికలు. పూరి జగన్నాథ్ దర్శకుడు. వి.ఆనంద్‌ప్రసాద్ నిర్మాత. అనూప్ రూబెన్స్ స్వరాలు సమకూర్చారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో పాటల విజయోత్సవం జరిగింది. మోహన్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై చిత్రబృందానికి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ "పరిశ్రమలో సాధారణంగా ఎవరినీ కలవను. కానీ నాకు మోహన్‌బాబు గారి కుటుంబంతో చనువు ఎక్కువ. ఆయన ఈ వేడుకకి రావడం ఆనందంగా ఉంది. ఈ సినిమాతో ఎన్నో మంచి అనుభవాలున్నాయి. పూరితో ఎప్పట్నుంచో సినిమా చేయాలనుకొన్నా. కానీ కాస్త ఆలస్యమైంది. సినిమాల్లో పాత్రలు ఇమేజ్‌కి అడ్డొస్తే అది ఒక సవాల్‌లాంటిది. 'గౌతమీపుత్ర శాతకర్ణి' తర్వాత ఎలాంటి సినిమా చేయాలనేది పరీక్షలా మారింది. రకరకాల సినిమాలు చేయడం నాకు ఇష్టం. సినిమాకీ సినిమాకీ ఎక్కువ సమయం తీసుకోను. ఏదైనా వేడి వేడిగా వడ్డించాల్సిందే. పూరితో నా కెమిస్ట్రీ బాగా కుదిరింది. పని తప్ప మరో ఆలోచన తెలియదు" అన్నారు. పూరి జగన్నాథ్ మాట్లాడుతూ "బాలయ్యతో ఈ సినిమాలో పాట పాడించాను. ఇప్పుడు ఎక్కడికెళ్లినా అదే వినిపిస్తోంది. ఇలాంటి హీరోని నేను ఇప్పటివరకు చూడలేదు. ఉదయం 6గంటలకే సెట్‌కి వచ్చేస్తారు. మోహన్‌బాబుగారు కూడా అంతే. ఇద్దరూ అన్నగారి లక్షణాల్ని పుణికి పుచ్చుకొన్నారు. సెట్‌లో సహాయ దర్శకుడిగా, డ్యాన్స్ మాస్టర్‌గా కూడా పనిచేస్తుంటారు బాలయ్య. సెప్టెంబరు 28న రావాల్సిన సినిమాని ముందే తీసుకొస్తున్నామ"న్నారు. వి.ఆనంద్‌ప్రసాద్ మాట్లాడుతూ "మొదటిసారి పూరి జగన్నాథ్‌తో పనిచేశారు బాలకృష్ణ. మొదటిసారి పాట పాడారు. మొదటిసారి వాళ్ల నాన్నగారి స్టెప్పులు వేశారు. ఇవన్నీ ఈ సినిమాతోనే సాధ్యమైనందుకు ఆనందంగా ఉంది. పూర్తి మాస్ మసాలా సినిమా ఇది" అన్నారు.

మోహన్‌బాబు మాట్లాడుతూ "పెద్దవాడిగా సినిమా అభిమానులకి ఓ విషయం చెబుతా. వాళ్లు కొన్ని ట్వీట్లు చేస్తుంటారు. అది మంచిది కాదు. బాలయ్య ఓ చరిత్ర సృష్టించాడు. సిల్వర్ జూబ్లీ, గోల్డెన్ జూబ్లీలు డబ్బిచ్చి ఆడించలేరు. బాలకృష్ణ పలు రికార్డులు సృష్టించాడన్నది నిజం. ప్రతి సినిమాలోనూ ఒక వైవిధ్యం చూపిస్తుంటాడు. ఇందులోని ఒక పాటలో అన్నయ్య ఎన్టీఆర్‌ని అనుకరిస్తూ డ్యాన్స్ చేశాడన్నారు. అదెలా చేశాడో చూడాలి. అన్నయ్యని అనుకరించడం ఎవరివల్లా కాదు. ఆ పాటని చూస్తా. నచ్చకపోతే బాలయ్యకి ఫోన్ చేసి చెబుతా. 'మామా ఏక్ పెగ్‌లా...' అంటూ పాట పాడాడు బాలయ్య. ఆ మామ ఎవరో మాకు అర్థం కాలేదు. చంద్రబాబు నాయుడికి మద్యం సేవించే అలవాటు లేదు. మరి అలా ఎందుకు పాడారో తెలుసుకోవాలని ఉంది. పూరి అంటే నాకు ఇష్టం. చాలా తొందరగా సినిమాలు తీసే దర్శకుల్లో ఆయన ఒకరు.



సెల్ఫీ దిగుతున్న కైరాదత్, ఛార్మి, శ్రియ

'పైసా వసూల్' సామన్యమైన టైటిల్ కాదు. ఈ ఏడాది ఈ సినిమా గొప్ప విజయం సాధించాలి" అన్నారు. శ్రియ మాట్లాడుతూ "ఈ సినిమా చాలా ప్రత్యేకం. బాలకృష్ణగారితో మూడోసారి కలిసి నటించా. ఆయన్నుంచి చాలా నేర్చుకోవచ్చ"ని చెప్పింది. ఛార్మి మాట్లాడుతూ "దేనికైనా రెడీ అనే తత్వం బాలకృష్ణది. బాలయ్య లేకపోతే సెట్‌లో మాకు వినోదం ఉండేది కాద"ని చెప్పింది. కార్యక్రమంలో ఎ.కోదండరామిరెడ్డి, అలీ, ప్రసన్నకుమార్, కైరాదత్, ముస్కాన్, భాస్కర భట్ల రవికుమార్, పులగం చిన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



సెట్లో సందడి

అబ్బో... 'రోబో'

శంకర్ ఆలోచనలు మామూలుగా ఉండవు. హాలీవుడ్ స్థాయిలో ఆలోచిస్తారాయన. సాంకేతికతను పట్టి... దానికి తనదైన సృజన జోడించి వెండి తెరపై మాయాజాలం చేయడంలో ఆయన తరవాతే ఎవరైనా. 'జీన్స్'లో 'కన్నులతో చూసేదీ గురువా..' పాట గుర్తుంది కదా? అందులో అస్థిపంజరాల చేత బ్రేక్ డాన్స్ చేయించి ఆహా అనిపించారు. ఏడు ప్రపంచ అద్భుతాలు ఒకే పాటలో చూపించి అబ్బురపరిచారు. అక్కడి నుంచి సినిమా సినిమాకీ సాంకేతిక నైపుణ్య స్థాయి పెరుగుతూనే వచ్చింది. 'రోబో'తో అది పతాక స్థాయికి చేరింది. 'చూపించడానికి ఇంకేం లేదు' అనుకోకుండా ఇప్పుడు ఆ చిత్రానికి సీక్వెల్ తెరకెక్కిస్తున్నారు. శంకర్ ఆలోచనలకు, రజనీ మాసిజం తోడైతే ఇక చెప్పేదేముంది? 'శివాజీ', 'రోబో' సినిమాలే అందుకు సాక్ష్యాలు. ఇప్పుడు '2.ఓ' ఇంకెన్ని సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.

ప్రేమే అని తెలిసేలోపు...

దిలీప్, శ్రావణి ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్న చిత్రం 'తొంగి తొంగి చూడమాకు చందమామ'. రాజ్ బాల, కార్తిక్ అయినాల, అపర్ణ, బేబీ అక్షర ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆనంద్ కానుమోలు దర్శకత్వం వహిస్తున్నారు. ఎ.ఎం.రెడ్డి నిర్మాత. త్వరలోనే రెండో షెడ్యూల్ చిత్రీకరణ మొదలవుతుంది. దర్శకుడు మాట్లాడుతూ "ఒక కాలనీలో జరిగే ప్రేమకథ ఇది. తమ మధ్య ఉన్నది ప్రేమే అని తెలిసేలోపు ఓ జంటకి ఎదురైన అనుభవాలు ఎలాంటివన్నది ఆసక్తికరం. ప్రేమ కథా చిత్రాల్లో ఓ కొత్త ప్రయత్నమిది. పరస్పరం ప్రేమని తెలుపుకోవడంతోనే కథ పూర్తి కావడం ఈ సినిమా ప్రత్యేకత. ఒక మంచి ప్రేమ కథతో పాటు, జబర్దస్త్ బృందం కలిసి చేసే సందడి ప్రేక్షకులకు హాస్యాన్ని పంచి పెడుతుంది. డిసెంబరులో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అన్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: శ్రీనివాస్ విన్నకోట, సంగీతం: హరి గౌర, మాటలు: తిరుమల నాగ్, పాటలు: బాలాజీ, కళ: రమేష్

ప్రేమికుడి 'ఇగో'



సిమ్రన్, ఆశిష్ రాజ్

ఆశిష్ రాజ్, సిమ్రన్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఇగో'. సుబ్రమణ్యం దర్శకుడు. విజయ్ కరణ్, కౌశల్ కరణ్, అనిల్ కరణ్ నిర్మాతలు. రెండు షెడ్యూల్స్ పూర్తయ్యాయి. దర్శకుడు మాట్లాడుతూ "ఇందు, గోపీ అనే ఇద్దరి కథ ఇది. 'ఇగో' నేపథ్యంలో సాగుతుంది. ఎవరి ఇగో.. ఎవరి జీవితాల్ని ఎలాంటి మలుపు తిప్పిందో చూపిస్తున్నాం. కథానాయకుడి పాత్ర కొత్తగా ఉంటుంది. వినోదం, ప్రేమ, యాక్షన్.. వీటన్నింటికీ స్థానం ఉంది. సంభాషణలు ఆకట్టుకొంటాయి. త్వరలో గోదావరి తీరంలో మూడో షెడ్యూల్‌ని మొదలెడతాం. ఫస్ట్‌లుక్‌నీ విడుదల చేస్తామ"న్నారు. దీక్షాపంత్, రావు రమేష్, పోసాని, పృథ్వీ, గౌతంరాజు, భద్రం తదితరులు నటిస్తున్నారు. సంగీతం: సాయికార్తీక్



కాజల్

విమర్శకురాలే మేలుచేస్తోంది!

నాకు నేనే పెద్ద విమర్శకురాల్ని అంటోంది కాజల్ అగర్వాల్. నా తప్పొప్పులు వేరొకరి కంటే నాకే బాగా తెలుస్తుంటాయని చెబుతోంది కాజల్. కల్యాణ్‌రామ్‌తో కలిసి 'ఎమ్.ఎల్.ఎ'లో నటించడంతో పాటు, త్వరలోనే 'క్వీన్' రీమేక్ కోసం రంగంలోకి దిగబోతోంది. కెరీర్ పరంగా ఉత్తమ దశలో ఉన్నానని చెబుతోంది కాజల్. ఆ విషయం గురించి మాట్లాడుతూ "విజయాలు నాకు కొత్త కాదు కానీ... ఇటీవల నేను పోషిస్తున్న పాత్రలు నటిగా తృప్తినిస్తున్నాయి. ఒక మంచి పాత్ర చేయడంతో లభించే తృప్తి, పది విజయాల కంటే గొప్ప అనుభూతినిస్తుంది. అందుకే ఈ దశ నాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది. నటిగా నాకున్న అనుభవమే ఉత్తమమైన పాత్రల్ని ఎంపిక చేసుకొనేందుకు కారణమవుతోంది. కథల ఎంపికలో ఎక్కువగా ఆలోచించకుండా, నా మనసు ఏం చెబితే అదే వింటుంటా. చేసిన పాత్రని తెరపై చూసుకోగానే ఎక్కడెక్కడ ఇంకా బాగా నటించాల్సిందో అర్థమైపోతుంటుంది. ఒక కథని వింటున్నప్పుడూ అంతే. మొత్తంగా నాలోని విమర్శకురాలు నా కెరీర్‌కి ఎంతో మేలు చేస్తోంద"ని చెప్పింది కాజల్.




సాయి ధన్సిక

వారెవా... 'వాలుజడ'

సాయి ధన్సిక ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'వాలుజడ'. నవీన్ సంజయ్, నానా పటేకర్ ప్రధాన పాత్రలు పోషించారు. రమణ మల్లం దర్శకుడు. సింహ వాహిని నాగరాజు నిర్మాత. ఫస్ట్‌లుక్‌ని హైదరాబాద్‌లో కాజల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న చిత్రమిది. పేరులానే సృజనాత్మకంగా ఉంటుంది. యదార్థ సంఘటనలే ఈ కథకు ఆధారం. సగం సినిమా పూర్తయింది. సెప్టెంబరులో మరో దఫా చిత్రీకరణ మొదలెడతామ"న్నారు. రాధన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: సిద్ధార్థ రామస్వామి, కూర్పు: ప్రవీణ్


ఏ విషయాన్నైనా కళ్లారా చూస్తే కానీ నమ్మకూడదంటారు. కానీ షారుఖ్ ఖాన్‌ను ఏ యాంగిల్లో చూసినా ఆయన వయసు 50 దాటిందంటే నమ్మలేం. ఐదు పదుల వయసులోనూ 'జబ్ హ్యారీ మెట్ సెజల్' లాంటి రొమాంటిక్ ప్రేమకథ చిత్రాల్లో నటించగల ఛరిష్మా షారుఖ్ సొంతం. ఈ వయసులోనే ఇలా ఉన్నారంటే... ఇక ఆ వయసులో ఎలా ఉండేవారో అంటూ ఊహల టైమ్ మెషిన్ ఎక్కేసి యవ్వనంలో ఉన్న షారుఖ్‌ను చూద్దామని బయల్దేరుతున్నారా? అంత ప్రయాస ఎందుకు... ఒక్కసారి ఆర్యన్ ఖాన్‌ను చూస్తే సరి. మీ కోరిక తీరిపోతుంది. ఇంతకీ ఆర్యన్ ఖాన్ ఎవరంటారా? షారుఖ్ ముద్దుల తనయుడు. జూనియర్ ఎస్ఆర్‌కే ముచ్చట్లు ఇవీ.

పోలికల్లోనే కాదు... ప్రతిభలోనూ సాటి!



ఆర్యన్, షారుఖ్

ఇప్పుడిప్పుడే ఇరవయ్యో పడిలో అడుగుపెట్టబోతున్నాడు ఆర్యన్. తరచుగా పార్టీల్లో తన స్నేహితులతో కలసి సందడి చేసే ఆర్యన్ బయట మాత్రం పెద్దగా కనిపించడు. మీడియాకు సాధ్యమైనంత దూరంగా ఉంటాడు. ఈమధ్య షారుఖ్‌తో కలసి ఎయిర్‌పోర్ట్‌కు వచ్చిన ఆర్యన్‌ను చూసి మీడియా కెమెరాలు ఫ్లాషుల వర్షం కురిపించాయి. ఆ ఫొటోల్లో ఆర్యన్‌ను చూసి అచ్చు గుద్దినట్లు షారుఖ్‌లాగే ఉన్నాడంటూ అభిమానులు మురిసిపోతున్నారు. వారిద్దరి ముఖాలను జత చేస్తూ తీర్చిదిద్దిన ఓ ఫొటోను వారు ఆన్‌లైన్‌లో తెగ షేర్ చేసుకుంటున్నారు. అందులో చూస్తే షారుఖ్, ఆర్యన్ తండ్రీకొడుకులు కాదు... కవలలేమో అనిపించేంతగా వారి మధ్య పోలికలుండటం విశేషం.



● ఆర్యన్ కూడా సినిమాల్లోకి వస్తాడంటూ అభిమానులు చర్చించుకుంటున్నారు. ఆర్యన్‌కూ అటువైపు ఆసక్తి ఉన్నట్లుంది. అందుకే అమెరికాలో ఫిలిం మేకింగ్ కోర్సు చేస్తున్నాడు. అయితే ఆర్యన్ కోరిక తెరపై హీరోగా పరిచయమవడమా లేక తెర వెనుక సాంకేతిక నిపుణుడిగా పనిచేయడమా అన్నది ఇంకా తెలియదు. షారుఖ్ మాత్రం తనయుడిపై పూర్తి భరోసాతో ఉన్నారు. "ఆర్యన్ నాతో భవిష్యత్ కలల గురించి చర్చిస్తుంటాడు. నాకన్నా ఉన్నత స్థాయికి చేరాలన్నది వాడి కోరిక. అది తప్పక నెరవేర్చుకుంటాడ"ని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు షారుఖ్.

● నిజానికి ఆర్యన్ తెర పరిచయం ఎప్పుడో జరిగిపోయింది. షారుఖ్ నటించిన 'కభీ ఖుషీ కభీ ఘమ్'లో ప్రారంభ సన్నివేశాల్లో వచ్చే పాటలో చిన్నప్పటి షారుఖ్‌గా కనిపించాడు బుల్లి ఆర్యన్. ఆ తర్వాత 'కభీ అల్విదా న కెహనా'లో ఓ సన్నివేశంలో సాకర్ ఆటగాడిగా నటించినా.. ఎడిటింగ్‌లో ఆ సీన్‌ను తొలగించాల్సివచ్చింది.

● పోలికల్లోనే కాదు... ప్రతిభలోనూ తండ్రికి తగ్గ తనయుడనిపించుకున్నాడు ఆర్యన్. 'హమ్ హై లా జవాబ్' అనే యానిమేషన్ చిత్రంలో తేజ్ అనే పాత్రకు గాత్రమందించాడు ఆర్యన్. ఇందులో షారుఖ్ కూడా ఓ పాత్రకు గాత్రదానం చేశారు. తొలి చిత్రంతోనే తన గాత్రానికిగాను ఆర్యన్ పురస్కారం అందుకోవడం గమనార్హం.

● ఆటలపైనా ఆర్యన్‌కు ఆసక్తి ఎక్కువే. తైక్వాండోలో మంచి పట్టుంది. మహారాష్ట్ర తైక్వాండో పోటీల్లో పాల్గొని ఛాంపియన్‌గా నిలిచాడు.

● అమితాబ్ బచ్చన్ మనవరాలు నవ్య నవేలీ నందా, ఆర్యన్ మధ్య మంచి అనుబంధం ఉందని, వారిద్దరూ కలిసి నటించే అవకాశముందని మీడియాలో వినిపిస్తుంటుంది.

భయం గుప్పిట హరియాణా

- గుర్మీత్‌సింగ్ శిక్షపై నేడే నిర్ణయం

చండీగఢ్: ఉద్రిక్తకర పరిణామాలతో తల్లడిల్లుతున్న హరియాణా ఇంకా భయం గుప్పిట్లోనే ఉంది. డేరా సచ్ఛా సౌధా అధినేత గుర్మీత్ రామ్ రహీంసింగ్‌ను అత్యాచారం కేసుల్లో దోషిగా ప్రకటించిన సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం... అతనికి ఎంత శిక్ష విధించేదీ సోమవారం ప్రకటించనుంది. మధ్యాహ్నానికి తీర్పు వస్తుందని భావిస్తున్నారు. ఆ వెంటనే హింస మొదలై కొన్ని రోజుల వరకు కొనసాగవచ్చని నేర పరిశోధన విభాగం (సీఐడీ) హెచ్చరించింది. భద్రతపరమైన సమస్యలు రాకుండా రోహ్‌తక్ నగర శివార్లలోని సునారియావద్దనున్న కారాగారాన్నే న్యాయస్థానంగా చేసుకుని, తీర్పును వెలువరించనున్న విషయం తెలిసిందే. దీని నిమిత్తం సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి జగ్‌దీప్‌సింగ్... న్యాయస్థాన సిబ్బందితో కలిసి వాయుమార్గంలో అక్కడకు చేరుకునేందుకు హైకోర్టు ఆదేశానుసారం ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేసింది. శుక్ర-శనివారాల్లో డేరా అనుచరులు పాల్పడిన విధ్వంస, భీతావహకాండను దృష్టిలో పెట్టుకుని అసాధారణ భద్రత ఏర్పాట్లు చేసినట్లు పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఆదివారం కొత్తగా ఎలాంటి దుస్సంఘటనలు చోటు చేసుకోలేదు. రైళ్ల రాకపోకల్ని పునరుద్ధరించగలిగారు. వదంతులు వ్యాప్తి చెందకుండా అడ్డుకోవడంలో భాగంగా రాష్ట్రమంతటా మంగళవారం ఉదయం 11.30 గంటల వరకు అంతర్జాల సేవల్ని స్తంభింపజేస్తున్నారు. డేరా ప్రధాన కార్యాలయానికీ ఇది వర్తిస్తుంది. శిక్ష గురించి ప్రకటించిన తర్వాత ఈ కార్యాలయంలో సోదాలు నిర్వహించే అవకాశం ఉంది.

ఎటు చూసినా బలగాలే

సునారియాలో ఎటు చూసినా భద్రత బలగాలే మోహరించి ఉన్నాయి. 144 సెక్షన్ కింద నిషేధాజ్ఞలు కొనసాగుతున్నాయి. హరియాణా, పంజాబ్‌లలో అన్ని విద్యాసంస్థల్నీ సోమవారం కూడా మూసివేస్తారు. అల్లర్లలో మృతిచెందిన వారి సంఖ్య 36 నుంచి 38కి పెరిగిందనీ, మృతులందరి గుర్తింపు పూర్తయిందనీ హరియాణా డీజీపీ బి.ఎస్.సంధు తెలిపారు. హింసకు సంబంధించి 52 కేసుల్లో 926 మందిని అరెస్టు చేసినట్లు ఆయన విలేకరుల సమావేశంలో చెప్పారు.





పంజాబ్, హరియాణా హైకోర్టు ఆదేశాల మేరకు గురుగ్రామ్‌లోని సెక్టార్ 50లో గల డేరా సచ్ఛా సౌధా ఆశ్రమంలో సోదాలు నిర్వహిస్తున్న జిల్లా అధికారులు ★ గుర్మీత్ రామ్ రహీం సింగ్ మద్దతుదారుల ఆందోళన కారణంగా సిర్సాలో అగ్నికి ఆహుతైన వాహనాలు

సింగ్‌ను ఖైదు చేసిన కారాగారం చుట్టూ బహుళ అంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వివరించారు. తీర్పు వెలువడ్డాక ఎవరైనా ఇబ్బందులు సృష్టించాలని ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకోక తప్పదన్నారు. డేరా ప్రధాన కేంద్రం ఉన్న సిర్సా మినహా మిగిలిన అన్నిచోట్లా కర్ఫ్యూ ఎత్తివేశామని చెప్పారు. 103 డేరా కేంద్రాలను మూసివేయించామనీ, వీటి నుంచి భారీ ఎత్తున ఆయుధాలు, లాఠీలు, ఇంధనం సీసాలు, గొడ్డళ్లు, కొడవళ్లు, 66 పెప్పర్ స్ప్రేలు, వాహనాలు స్వాధీనం చేసుకున్నామనీ తెలిపారు.

పోలీసులు సహా ఏడుగురిపై రాజద్రోహం కేసులు

కీలకంగా నిలిచే డేరా అనుచరులిద్దరిపై రాజద్రోహం, హత్యాయత్నాల కింద రెండు కేసుల్ని నమోదు చేసినా వాటి గురించి మంగళవారం హైకోర్టుకు నివేదిక సమర్పించాల్సి ఉండడంతో పోలీసులు వివరాలు చెప్పడం లేదు. ఈ అభియోగాలు ఎదుర్కొంటున్నవారిలో అయిదుగురు పోలీసులూ ఉండడం విశేషం. గుర్మీత్‌ను దోషిగా ప్రకటించిన తర్వాత కోర్టు వెలుపల హరియాణా పోలీసులతో తగాదా పడినవారిలో అతని భద్రత దళంలోని పోలీసులు కూడా ఉన్నారు. ఇప్పుడు వారిపైనా రాజద్రోహం కేసు నమోదయింది. డేరాకు ఉన్న స్థిర, చరాస్తుల వివరాలను హైకోర్టు ఆదేశాల మేరకు సేకరించాల్సి ఉండడంతో వాటిపై పంజాబ్, హరియాణా అధికార వర్గాలు దృష్టి సారించాయి. వీరి ఖాతాల వివరాలను సమర్పించాల్సిందిగా బ్యాంకుల్ని అధికారులు కోరారు.

కర్ఫ్యూలోనూ అవిశ్రాంత సేవలు

సిర్సా (హరియాణా): ఒకపక్క కర్ఫ్యూతో ఆంక్షలున్నా హరియాణాలోని సిర్సాలో భద్రత బలగాలకు, సైనికులకు, పోలీసులకు, ప్రసార మాధ్యమాలవారికి సమయానికి ఆహార పొట్లాలు సరఫరా చేస్తూ కొంతమంది స్వచ్ఛంద సేవకులు అందరినీ ఆకట్టుకుంటున్నారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి వీరు వంటలకు ఉపక్రమించి, మోటారు బైకులపై, ట్రాక్టర్లపై అన్ని ప్రాంతాలకు వెళ్తూ సేవలందిస్తున్నారు. మొత్తం 120 సేవా సంస్థలు దీనిలో పాల్గొంటున్నాయి. ఇచ్చే గుణానికి మారుపేరైన సిర్సాలో ఈ దాతృత్వాన్ని చూసి భద్రత బలగాలు అబ్బురపడుతున్నాయి. అవసరమైన వారికి ఆహారం అందించడానికి 'రోటీ బ్యాంకు'ను కూడా ప్రారంభించారు.

దిల్లీలో హైఅలర్ట్

దిల్లీ: డేరా సచ్ఛా సౌధా అధిపతి గుర్మీత్‌సింగ్‌కు పడే శిక్ష గురించి సోమవారం న్యాయస్థాన నిర్ణయం వెలువడనున్న నేపథ్యంలో దిల్లీలో పోలీసులు అత్యంత అప్రమత్తత (హై అలర్ట్) ప్రకటించారు. నిఘాను తీవ్రతరం చేశారు. కీలక ప్రాంతాల్లో అదనపు బలగాలు మోహరించారు. ఈశాన్య దిల్లీ సహా పలుచోట్ల కవాతు నిర్వహించారు.

బాంబు భుజాన పెట్టుకుని కిలో మీటరు పరుగెత్తాడు

భోపాల్: అదో ప్రభుత్వ పాఠశాల. విద్యార్థులంతా తరగతులకు హాజరై పాఠాలు వింటున్న వేళ ఒక్కసారిగా కలకలం. కారణం పాఠశాల ప్రాంగణంలో బాంబు. పోలీసులకు సమాచారం అందడంతో హుటాహుటిన అక్కడికి వచ్చారు. కానీ, వచ్చినవారిలో బాంబు నిర్వీర్యం చేసే నిపుణులు లేరు. అలాంటి విపత్కర పరిస్థితిలో, అసమాన ధైర్యం ప్రదర్శించారు కానిస్టేబుల్ అభిషేక్ పటేల్. దాదాపు పదికిలోలు ఉన్న ఆ బాంబును అమాంతం భుజాలపైకి ఎత్తుకుని వేగంగా కిలోమీటరు దూరం పరుగెత్తారు. జనసంచారం లేని ప్రాంతంలో దాన్ని విడిచిపెట్టారు. తన సాహసంతో 400 మంది చిన్నారులను ప్రాణాపాయం నుంచి తప్పించారు. రోమాలు నిక్కబొడిచే ఈ సంఘటన సినిమా సన్నివేశం కాదు. మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో ఇటీవల జరిగిన వాస్తవ సంఘటన. చిటోర్ గ్రామంలోని స్థానిక ప్రభుత్వ పాఠశాల ప్రాంగణానికి వెనుక భాగంలో బాంబు ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. పాఠశాలకు చేరుకున్న పోలీసుల్లో ప్రత్యేకంగా బాంబు నిర్వీర్యం చేసే నిపుణులు లేరు. దీంతో కానిస్టేబుల్ అభిషేక్ పటేల్(40) తన ధైర్యసాహసాలతో బాంబును ప్రజలకు దూరంగా తీసుకెళ్లారు. ఎందరో విద్యార్థుల ప్రాణాలను కాపాడారు. దీనిపై అభిషేక్ స్పందిస్తూ.. బాంబును కనుగొన్న మరుక్షణం ప్రజలకు వీలైనంత దూరం తీసుకెళ్లాలని అనుకున్నానని చెప్పారు. ఒక వేళ బాంబు పేలి ఉంటే చుట్టుపక్కల 500 మీటర్ల వరకూ విధ్వంసం జరిగేదని ఆయన వివరించారు. బాంబు ఆ ప్రదేశానికి ఎలా వచ్చిందనే దానిపై దర్యాప్తు జరుపుతున్నామని పోలీసు అధికారి సంజయ్ సక్సేనా తెలిపారు. అసమాన తెగువ ప్రదర్శించిన అభిషేక్ పటేల్‌ను ఆ రాష్ట్ర ఉన్నతాధికారులు ప్రశంసించారు.

ఆధార్ వ్యవస్థ సురక్షితం: ఉడాయ్

దిల్లీ: 'ఆధార్' వ్యవస్థ సురక్షితమని, సమాచారాన్ని అనధికారికంగా ఇతరులు తీసుకోవడం సాధ్యం కాదని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (ఉడాయ్) స్పష్టం చేసింది. ఆధార్ సమాచారం అమెరికా ప్రభుత్వ నిఘా సంస్థ సీఐఏ చేతికి చిక్కిందా అంటూ వికీలీక్స్ ట్వీట్ చేసిన నేపథ్యంలో ఈ వివరణ ఇచ్చింది. వేలిముద్రలను సేకరించే విధానాన్ని దేశంలోనే అభివృద్ధి చేశామని, వీటిని భద్రపరచడానికి పటిష్ఠమైన విధానం ఉందని తెలిపింది. వేలిముద్రలను సేకరించే పరికరాలను సరఫరా చేసిన అమెరికాకు చెందిన 'క్రాస్ మ్యాచ్' సంస్థ.. సీఐఏకు కూడా పరికరాలను సరఫరా చేసిందని, అందువల్ల ఆధార్ సమాచారం సీఐఏకు అందే అవకాశం ఉందని వికీలీక్స్ తెలిపింది. పరికరాలను క్రాస్ మ్యాచ్ ఒక్కటే సరఫరా చేయలేదని, ఇతర సంస్థల నుంచీ తీసుకున్నట్టు పేర్కొంది. పలు దశల్లో విస్తృతమైన పరీక్షలు నిర్వహించిన తరువాతే వీటిని స్వీకరించినట్టు వివరించింది. అందువల్ల సమాచారాన్ని అక్రమంగా తీసుకోవడానికి అవకాశమే లేదని స్పష్టం చేసింది.

ట్రంప్ సైబర్ భద్రతా సలహాదారుల మూకుమ్మడి రాజీనామా

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు చెందిన సైబర్ భద్రతా బృందంలోని ఏడుగురు సభ్యులు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. వీరిలో భారత సంతతికి చెందిన డేటా సైంటిస్ట్ డి.జె.పాటిల్ కూడా ఉన్నారు. చాలా ముఖ్యమైన జాతీయ భద్రతా అంశాలను ట్రంప్ విస్మరిస్తున్నారని వారు ఆరోపించారు. జాతీయ మౌలికవసతుల సలహా మండలి (ఎన్ఐఏసీ)గా పిలిచే ఈ కమిటీ పరిధిలోకి జాతీయ సైబర్ భద్రత అంశం వస్తుంది. సైబర్ భద్రతకు సంబంధించి ట్రంప్ సర్కారు విధానం లోపభూయిష్టంగా ఉందని వారు పేర్కొన్నారు. అనేక ఆందోళనలను విస్మరిస్తున్నారని తెలిపారు. "అమెరికన్లందరూ ఆధారపడ్డ కీలక వ్యవస్థలకు పొంచి ఉన్న సైబర్ భద్రత ముప్పులపై సరిగా దృష్టి సారించడంలేదు. మన ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియకు ఆధారభూతమైన వ్యవస్థలపై ప్రభావం చూపుతున్న ముప్పులపైనా శ్రద్ధ వహించడంలేదు" అని వారు సామూహికంగా పంపిన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. అసహనం, జాతివిద్వేష మూకల హింసను ఖండించడంలోనూ ట్రంప్ విఫలమయ్యారని తెలిపారు. ఈ సభ్యులందరినీ మునుపటి అధ్యక్షుడు బరాక్ ఒబామా నియమించారు. ట్రంప్ ప్రభుత్వంలో ఇప్పటికే అనేక మంది కీలక అధికారులు రాజీనామాలు చేశారు. ఎన్ఐఏసీ సభ్యులకు ముందు మరో రెండు కమిటీలు కూడా తప్పుకొన్నాయి.

ట్రంప్.. సమాజానికి ఓ పెను ముప్పు

ప్రముఖ మోడల్, టీవీవ్యాఖ్యాత పద్మాలక్ష్మి



థింపు(భూటాన్): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను 'సమాజానికి ఓ పెను ముప్పు'గా ప్రముఖ రచయిత్రి, మోడల్, టీవీ వ్యాఖ్యాత పద్మాలక్ష్మి అభివర్ణించారు. ట్రంప్ తన పదవి ప్రతిష్ఠను దిగజారుస్తున్నారని ఆమె ఆదివారం నాడిక్కడ పేర్కొన్నారు. "ఆయన మన సమాజానికే పెను ముప్పు అని అనుకుంటున్నాను. అత్యంత గౌరవప్రదమైన ఆ పదవి పరువును దిగజార్చకుండా చూసేందుకు ఆయనను నిలువరించేందుకు శాయశక్తులా ప్రయత్నించాను...'అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మనిషి మౌలిక హుందాతనానికే ట్రంప్ ఓ ప్లేగు వ్యాధిలా పరిణమించారన్నారు. తనకు తెలిసినంతవరకూ ఆయనకు సిద్ధాంతాలంటూ ఏమీ లేవన్నారు. కేవలం డొనాల్డ్‌ట్రంప్ సిద్ధాంతం ఒక్కటే తెలుసాయనకు...అది అత్యంత ఆపాయకరమైనది అంటూ ఆమె వ్యాఖ్యానించారు. పద్మాలక్ష్మి అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో హిల్లరీ క్లింటన్ తరఫున ప్రచారం చేసిన విషయం ఈ సందర్భంగా గమనార్హం. ఇక్కడ నిర్వహిస్తున్న సాహితీ ఉత్సవంలో భాగంగా జరిగిన ఒక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.

'భారత జవాను అసత్యారోపణల వీడియోతో ఐఎస్ఐ దుష్ప్రచారం'

దిల్లీ: భారత సైన్యంలో ఆహార నాణ్యతపై ఓ జవాను అసత్య ఆరోపణలు చేసిన వీడియోతో.. పాకిస్థాన్ గూఢచర్య సంస్థ ఐఎస్ఐ దుష్ప్రచారానికి పాల్పడిందని సరిహద్దు భద్రత దళం (బీఎస్ఎఫ్) డైరెక్టర్ జనరల్ కేకేశర్మ చెప్పారు. భారత జవాన్లను ఆందోళనపరిచేందుకు.. సామాజిక మాధ్యమాల్లో ఆ వీడియోను ఐఎస్ఐ విపరీతంగా ప్రచారం (వైరల్) చేసేందుకు ప్రయత్నించిందని పేర్కొన్నారు. సదరు అసత్య ఆరోపణలు చేసిన తేజ్ బహదూర్ యాదవ్ అనే జవానును.. విచారణ అనంతరం ఇటీవల విధుల నుంచి బీఎస్ఎఫ్ తొలగించింది. ఇటు ఈ ఘటన తర్వాత ఇలాంటి అసత్య ప్రచారాల నిగ్గు తేల్చి, వాస్తవాలను వెల్లడించేందుకు ఓ వ్యవస్థను సిద్ధం చేసినట్లు శర్మ తెలిపారు. ఏదైనా సమస్య తలెత్తినప్పుడు జవాన్లు దాన్ని బాధ్యతాయుతంగా పైఅధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. తాము జవాన్లకు అందించే ఆహారం రుచి, శుచిలో ఇంటి భోజనాన్ని తలపించేలా ఉంటుందని.. అనుమానాలున్న ఎవరైనా ముందస్తుగా సమాచారం ఇవ్వకుండానే శిబిరాలను సందర్శించి ఆహారాన్ని పరీక్షించవచ్చని స్పష్టం చేశారు.

మునుపటి మెరుపు దాడుల వివరాల్లేవు: సైన్యం

దిల్లీ: గత ఏడాది సెప్టెంబర్ 29కి ముందు తాము జరిపిన మెరుపు దాడుల (సర్జికల్ స్ట్రైక్స్)కు సంబంధించి ఎలాంటి వివరాలూ అందుబాటులో లేవని సైనిక కార్యకలాపాల డైరెక్టరేట్ జనరల్ (డీజీఎంవో) తెలిపింది. సమాచార హక్కు చట్టం కింద 'పీటీఐ' వార్తా సంస్థ దాఖలు చేసిన ఒక దరఖాస్తుపై ఈ మేరకు బదులిచ్చింది. 2016 సెప్టెంబర్ 29న డీజీఎంవో చేసిన ప్రకటనలో పేర్కొన్న 'మెరుపు దాడి'.. భారత సైనిక చరిత్రలో మొట్టమొదటిసారిగా జరిపిన చర్యా అని పీటీఐ తన దరఖాస్తులో ప్రశ్నించింది. 2004 నుంచి 2014 మధ్య ఇలాంటి దాడులను సైన్యం నిర్వహించిందా అని తెలుసుకోగోరింది. ఈ దరఖాస్తును రక్షణ మంత్రిత్వశాఖ.. సమీకృత ప్రధాన కార్యాలయాని (సైన్యం)కి పంపింది. ఈ కార్యాలయం దీన్ని డీజీఎంవోకు పంపి.. స్పందన తెలియజేయాలని సూచించింది. ఈ మేరకు డీజీఎంవో బదులిచ్చింది.

రాజ్‌భవన్‌కు చేరిన తమిళనాడు రాజకీయం

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడు ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ప్రభుత్వాన్ని బలపరీక్షకు ఆదేశించాలని కోరుతూ డీఎంకే కీలక నేతలు గవర్నర్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. శాసనసభ ప్రతిపక్ష ఉపనేత, డీఎంకే నాయకుడు దురైమురుగన్, కరుణానిధి తనయ, రాజ్యసభ సభ్యురాలు కనిమొళి అధ్యక్షతన ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఆదివారం ఉదయం 10.30 గంటలకు చెన్నైలోని గిండిలో ఉన్న రాజ్‌భవన్ చేరుకున్నారు. డీఎంకే నేతలతో పాటు మిత్రపక్షాలైన కాంగ్రెస్, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ ఎమ్మెల్యేలు రాజ్‌భవన్‌కు వెళ్లినవారిలో ఉన్నారు.

నాడు రాముడు చేసిన పనినే నేడు 'ఇస్రో' చేస్తోంది!

- రాకెట్లకు రామబాణాలతో పోలిక
- శబరి ఇచ్చిన ఫలాలు తినడం 'సోషల్ ఇంజినీరింగ్'
- గుజరాత్ సీఎం రూపానీ వ్యాఖ్యలు

అహ్మదాబాద్: "భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ' (ఇస్రో) రాకెట్లను గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్‌రూపాని శ్రీరాముడి బాణాలతో పోల్చారు. గతంలో శ్రీరాముడు చేసిన పనులనే ఇప్పుడు 'ఇస్రో' చేస్తోందన్నారు. ఇక్కడి ఓ విద్యాసంస్థ స్నాతకోత్సవంలో ఆదివారం ఆయన మాట్లాడారు. భారత్-శ్రీలంక మధ్య రామసేతు నిర్మాణం(ఇతిహాసాల్లో పేర్కొన్న) గురించి కూడా ఆయన ప్రస్తావించారు. అదంతా కూడా శ్రీరాముడి ఇంజినీరింగ్ నైపుణ్య ఫలితమేనన్నారు. నాటి ఇంజినీర్ల సాయంతో ఆయన సేతు నిర్మాణం చేశారని ముఖ్యమంత్రి రూపాని పేర్కొన్నారు.

'శ్రీరాముడి ప్రతి బాణం కూడా ఓ క్షిపణే. గతంలో రాముడు చేసిన పనిని ఇప్పుడు 'ఇస్రో' చేస్తోంద(రాకెట్ల ప్రయోగం)ని' ఆయన పునరుద్ఘాటించారు. అలనాడు శ్రీరాముడి వద్ద రామసేతు నిర్మాణం కోసం పనిచేసిన ఇంజినీర్ల ప్రతిభను ఊహించుకోవాలన్నారు. నాటి సేతు నిర్మాణంలో చివరకు ఉడతలు కూడా తమ వంతు కృషి చేశాయన్నారు. రాముడు నాడు కన్న కలను అప్పటి ఇంజినీర్లు సాకారం చేశారంటూ గుజరాత్ ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. ఇదంతా కూడా సాంకేతిక ఇంజినీరింగ్ ప్రతిభ అని పేర్కొన్నారు. ఇక, లక్ష్మణుడి కోసం హనుమంతుడు సంజీవని పర్వతాన్ని తీసుకురావడం అనేది 'మౌలిక వసతుల అభివృద్ధి'కి ఉదాహరణ అని పేర్కొన్నారు. శబరి రుచి చూసి ఇచ్చిన ఫలాలను శ్రీరాముడు ఆరగించడాన్ని 'సోషల్ ఇంజినీరింగ్'గా అభివర్ణించారు. సర్వమత సమానత్వానికి ప్రతీక అన్నారు. శబరి ఇచ్చిన ఫలాలను తినడం ద్వారా ఆయన నాడు గిరిజనుల అభిమానాన్ని చూరగొన్నాడన్నారు. సుగ్రీవుడిని, హనుమంతుడిని...ఇతర వానరసైన్యాన్ని ఒక్క గొడుగుకిందకు చేర్చడం కూడా శ్రీరాముడి 'సోషల్ ఇంజినీరింగ్' కౌశలానికి ప్రతీక అని గుజరాత్ ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. 'ఇస్రో'కు చెందిన ఇక్కడి స్పేస్ అప్లికేషన్ కేంద్రం సంచాలకులు తపన్‌మిశ్రా కూడా ఈ స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఐఐటీలు, కేంద్రీయ వర్సిటీల్లో దేశభక్తి రాక్ షోలు

దిల్లీ: ఐఐటీలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులు త్వరలో దేశభక్తి సంగీతంలో ఓలలాడనున్నారు. ఇందుకోసం ప్రత్యేక రాక్ బ్యాండ్‌లు.. ఈ విద్యా సంస్థల ప్రాంగణాలను సందర్శించనున్నాయి. ఈ మేరకు కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ ఆదేశాలు జారీ చేసింది. 'యే ఇండియా కా టైమ్ హై' పేరిట నిర్వహించబోయే ఈ కార్యక్రమం కోసం దాదాపు డజను బ్యాండ్లను గుర్తించారు. ఇందుకోసం ఒక ప్రైవేటు వినోద కార్యక్రమాల సంస్థ సాయాన్ని ప్రభుత్వం తీసుకుంది. సదరు బ్యాండ్ సభ్యులు దేశభక్తి గేయాలను.. ముఖ్యంగా బాలీవుడ్‌లో వచ్చిన పాటలను ఆలపించనున్నారు. ఈ ఏడాది.. భారత్‌కు స్వాతంత్ర్యం సిద్ధించి 70 ఏళ్లు పూర్తికావడంతో పాటు క్విట్ ఇండియా ఉద్యమానికి 75 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

రెండు నెలల్లోనే... పెట్రోలు ధర రూ.6 పెంపు

- డీజిలుపై రూ.3.6 వడ్డింపు
- రోజువారి మార్పులతో కనబడని వ్యత్యాసం

దిల్లీ

రోజువారీగా ధరల్లో మార్పులతో గత రెండు నెలల్లోనే పెట్రోలు ధర రూ.6 పెరిగింది. ప్రస్తుతం గత మూడేళ్లలో గరిష్ఠ స్థాయికి చేరింది. మరోవైపు డీజిల్ సైతం లీటరుకు రూ.3.67 పెరిగింది. గత నాలుగు నెలల్లో ఇదే గరిష్ఠ ధర. 2014 ఆగస్టు ద్వితీయార్థంలో పెట్రోలు ధర రూ.70.33 వరకూ వెళ్లింది. ప్రస్తుతం దేశ రాజధానిలో పెట్రోలు ధర (రూ.69.04) దీనికి సమీపంలోనే ఉంది. డీజిలు సైతం రూ.57.03 పలుకుతోంది. ప్రతినెలా ఒకటి, 16వ తేదీల్లో చమురు ధరలను సవరించే 15ఏళ్లనాటి పద్ధతిని గత జూన్‌లో పక్కన పెట్టేసిన సంగతి తెలిసిందే. జూన్ 16 నుంచి రోజూ ఉదయం ఆరు గంటలకు ధరలను సవరిస్తున్నారు. జులై మూడో తేదీ వరకూ ధరలు తగ్గుతూ వచ్చినా.. అనంతరం పెరుగుదల బాటపట్టాయి. జూన్ 16న దిల్లీలో లీటరు పెట్రోలు ధర రూ.65.48గా ఉండేది. జులై 2నాటికి ఇది రూ.63.06కు తగ్గింది. ఆ తర్వాత నాలుగు సార్లు మినహా ధరలు పెరుగుతూనే వచ్చాయి. తగ్గిన నాలుగుసార్లు నామమాత్రంగా రెండు నుంచి తొమ్మిది పైసలు తగ్గడం గమనార్హం. మరోవైపు డీజిలుదీ ఇదే పరిస్థితి. జూన్ 16న లీటరు ధర రూ.54.49గా ఉండేది. జులై రెండు నాటికి ఇది 53.36కు తగ్గింది. అనంతరం మధ్యమధ్యలో తగ్గుతూ పెరుగుతూ.. మొత్తంగా రూ.3.67 పెరిగింది. 'ఇదివరకు లీటరు ధరలో ఒకేసారి రూ.2 నుంచి రూ.3 వరకు పెరుగుదల కనిపించినప్పుడు.. అందరూ ఈ ప్రభావాన్ని గమనించేవారు. ప్రస్తుతం రోజూ పైసా నుంచి 15 పైసలు మధ్య పెరుగుతుండటంతో ఎవరూ పెద్దగా పట్టించుకోవట్లేదు'అని ఓ చమురు సంస్థ సీనియర్ అధికారి తెలిపారు. 'చాలాసార్లు అంతర్జాతీయ చమురు ధరలు వారం రోజులపాటు పడిపోతుంటాయి. తర్వాత మెల్లగా పెరుగుతుంటాయి. దీంతో 15 రోజులకు ఓసారి దేశీయంగా ధరలు సవరించేటప్పుడు పెద్దగా ప్రభావం కనిపించేదికాదు. లేదా స్వల్ప మార్పులు ఉండేవి'అని తెలిపారు. రోజూ ధరలు సవరించడమంటే అంతర్జాతీయ చమురు ధరలు, విదేశీ మారకపు విలువలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ధరల్లో మార్పులు చేయడమన్నమాట. ఇది వరకు 15 రోజులకోసారి ధరల్లో సగటు పెరుగుదల/తగ్గుదల ప్రకారం మార్పులు చేసేవారు. ఈ పద్ధతిని ఏప్రిల్ 1, 2002లో మొదలుపెట్టారు. అయితే ఇది పూర్తిగా అమలులోకి వచ్చింది జూన్ 2010 (పెట్రోలు), అక్టోబరు 2014 (డీజిలు)లలోననే చెప్పాలి.

బార్‌కోడ్‌తో యుద్ధ వాహనాలు

- ప్రారంభించిన రక్షణ మంత్రి జైట్లీ

సంగారెడ్డి టౌన్, పటాన్‌చెరు - న్యూస్‌టుడే: మన దేశ భౌగోళిక స్వరూపం దృష్ట్యా రక్షణ రంగంలో ఎల్లప్పుడూ సర్వసన్నద్ధంగా ఉండటమే మనకు అత్యుత్తమ రక్ష అని రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. ఇందులో భాగంగా మన బలగాలకు కావాల్సిన సామర్థ్యాలన్నింటినీ ఎప్పటికప్పుడు సమకూర్చుకోవాలన్నారు. సైన్యం అవసరాలకు అనుగుణంగా బార్‌కోడ్‌తో రూపొందించిన అత్యాధునిక బీఎంపీ-2 వాహనాలను సైన్యానికి అందించే కార్యక్రమాన్ని ఆదివారం సంగారెడ్డి జిల్లా కంది మండలం ఎద్దుమైలారంలోని ఆయుధ కర్మాగారంలో జైట్లీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ వాహనంపై ఉన్న బార్‌కోడ్ ఆధారంగా వాహనం ఉత్పత్తికి సంబంధించిన పూర్తి సమాచారం తెలిసిపోతుంది. ఈ సందర్భంగా పరిశ్రమలోని పలు విభాగాలను మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో డిఫెన్స్ ప్రొడక్షన్ సెక్రటరీ ఎ.కె గుప్తా, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డు ఛైర్మన్ బాజపాయి, సభ్యులు ఎ.వి. శ్రీవాస్తవ్, ఓడీఎఫ్ జీఎం భరత్‌సింగ్ పాల్గొన్నారు.

బీడీఎల్ పరిశ్రమలో: పటాన్‌చెరు మండలం భానూరులోని బీడీఎల్ పరిశ్రమను జైట్లీ సందర్శించారు. అక్కడ అస్త్ర క్షిపణి ప్రాజెక్టు భవనాన్ని ప్రారంభించారు. ఐదు మెగావాట్ల సౌరశక్తి విద్యుత్తు కేంద్రంతోపాటు పలు భవనాలను ప్రారంభించారు. సుదూర లక్ష్యాలను ఛేదించగల క్షిపణిని ఆయన నౌకాదళానికి అప్పగించారు. అన్ని రకాలుగా ఆయుధాలు స్థానికంగా ఉత్పత్తి అయ్యేటట్టు ఏర్పాట్లు చేశామని



బార్‌కోడెడ్ బీఎంపీ-2 యుద్ధ వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ

అధికారులతో జైట్లీ చెప్పినట్టు తెలిసింది. కంచన్‌బాగ్ బీడీఎల్‌లో బీడీఎల్, మిధాని సంస్థల ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్లు ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు.

'జీఎస్టీ సమస్యలు పరిష్కరించండి'

ఈనాడు, హైదరాబాద్: చింతపండుపై గతంలో పన్ను ఉండేది కాదని, జీఎస్టీలో 12శాతం పన్ను విధించడం వల్ల అమ్మకందారులకు సమస్యతోపాటు కొనుగోలుదారులకు భారంగా మారిందని, ఈ అంశాన్ని పరిష్కరించాలని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీని కేంద్ర కార్మికశాఖమంత్రి దత్తాత్రేయ కోరారు. తెలంగాణలో పత్తి, పసుపు, మిరప వంటి వాణిజ్య పంటల కొనుగోలులోనూ జీఎస్టీతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. హైదరాబాద్ పర్యటన అనంతరం దిల్లీకి బయల్దేరిన జైట్లీకి ఆదివారం సాయంత్రం బేగంపేట విమానాశ్రయంలో వీడ్కోలుపలికారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ జీఎస్టీ అంశాలను జైట్లీ దృష్టికి తీసుకెళ్లారు.

జన్‌ధన్, ఆధార్, చరవాణులతో.. సామాజిక విప్లవం: జైట్లీ

దిల్లీ: "జన్‌ధన్ యోజన, ఆధార్, చరవాణులు" కలిసి ఓ సామాజిక విప్లవాన్ని తీసుకొచ్చాయని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చెప్పారు. వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) ఏకీకృత విపణిని సృష్టించినట్లే... ఈ మూడూ కలిసి (జామ్) "ఏకీకృత ఆర్థిక, డిజిటల్ వేదిక"ను సిద్ధంచేశాయని వ్యాఖ్యానించారు. '100 కోట్లు-100 కోట్లు-100 కోట్లు లక్ష్యానికి మన దేశం చేరువలో ఉంది. అంటే వంద కోట్ల ఆధార్ నంబర్లు వంద కోట్ల బ్యాంకు ఖాతాలు, వంద కోట్ల చరవాణులతో అనుసంధానించడమన్నమాట. ఇది పూర్తయితే దేశం మొత్తం ఆర్థిక, డిజిటల్ విప్లవంలో పాలుపంచుకున్నట్లవుతుంది'అని ఆయన వివరించారు. ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన (పీఎంజేడీవై) తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఫేస్‌బుక్‌లో ఆదివారం ఆయన స్పందించారు. 'జీఎస్‌టీ.. "ఒక పన్ను, ఒక విపణి, ఒక భారత్" కల సాకారం చేసినట్టే.. పీఎంజేడీవై, జామ్ విప్లవాలు భారతీయులందరినీ ఒకే ఆర్థిక, డిజిటల్ వేదికపైకి తీసుకురాగలవు. దీనికి అవతల ఎవరూ ఒంటరిగా మిగిలిపోయే అవకాశముండదు'అని చెప్పారు.

అక్షరాలా నెలకు నాలుగులక్షల రూపాయలు!

- భరణంగా భర్త చెల్లించాల్సిన మొత్తం
- బడా వ్యాపారవేత్త కేసులో కోర్టు ఉత్తర్వు

దిల్లీ: నిర్లక్ష్యంగా వదిలిపెట్టేసిన భార్యకు...మైనర్ కుమార్తెకు నెలనెలా భరణం కింద రూ.నాలుగు లక్షలను చెల్లించాల్సిందిగా ఓ బడా వాణిజ్యవేత్తను దిల్లీ మెజిస్ట్రేటు కోర్టు ఆదేశించింది. ఔను! సరిగ్గానే చదివారు....ఆ భర్త అక్షరాలా నాలుగు లక్షల రూపాయలను తననుంచి విడిగా ఉంటున్న భార్యకు, బిడ్డకు కలిపి భరణంగా ఇకపై ప్రతినెలా చెల్లించాలి. అంతేకాదు, భరణం మొత్తంగా నిర్ధారించిన నాలుగు లక్షల రూపాయలతో పాటూ ఏటా 15 శాతం చొప్పున ఆ మొత్తాన్ని పెంచుకుంటూ వెళ్లాలని ప్రిన్సిపల్ జడ్జి నరోత్తం కౌశల్ స్పష్టం చేశారు. పెళ్లాం, బిడ్డలను గాలికి వదిలేసిన ఆ భర్త సుసంపన్నుడైన వ్యాపారవేత్త. అతడు ఓ వాణిజ్య పత్రిక ప్రచురించిన 'సూపర్ రిచ్' వ్యాపారుల జాబితాలో కూడా చోటు చేసుకున్నాడు. అతడు వెయ్యికోట్ల రూపాయల వ్యాపార సామ్రాజ్యానికి అధిపతి. పైగా, అతడి వార్షిక ఆదాయం కూడా పెరుగుతూ వస్తోందన్నారు. ఈ నేపథ్యంలోనే ఏటా 15శాతం పెంచుతూ పోవాలని కూడా ఆ భర్తను ఆదేశించారు. 2008లో అత్తగారింట్లో నుంచి తనను వెళ్లగొట్టేశారనీ...చిన్న బిడ్డ ఉందంటూ ఆమె భరణం కోసం హైకోర్టులో పిటిషన్ వేసుకున్నారు. ఇలా ఎన్నో మలుపులు తిరిగిన ఈ కేసు చివరకు సుప్రీంకోర్టుకు చేరింది. 2014లో సంబంధిత ట్రయల్ కోర్టుకే ఈ అంశాన్ని సుప్రీంకోర్టు తిప్పి పంపేసింది.



కోల్‌కతాలోని కుమర్‌తులిలో బాహుబలి 'ప్రభాస్' మట్టి బొమ్మను తయారుచేస్తున్న కళాకారుడు

సైన్యం చేతికి అధునాతన క్షిపణి

- 2020 నాటికల్లా ఎంఆర్‌శామ్
- ఆకాశంలో 70 కి.మీ. దూరంలోని లక్ష్యాన్ని నేలకూల్చగల సామర్థ్యం


దిల్లీ: భారత సైన్యం ఏళ్ల తరబడి సాగించిన నిరీక్షణ ఫలించబోతోంది. శత్రువుల యుద్ధవిమానాలు, క్షిపణులు, పోరాట హెలికాప్టర్లు, డ్రోన్లు, నిఘా విమానాలను నేలకూల్చే అధునాతన క్షిపణి 2020 నాటికల్లా మన అమ్ముల పొదిలో చేరబోతోంది. ఉపరితలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించగల ఈ మధ్యంతర శ్రేణి అస్త్రాని (ఎంఆర్‌శామ్)కి 70 కిలోమీటర్ల పరిధి ఉంటుంది.

ఇజ్రాయెల్‌కు చెందిన ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ (ఐఏఐ) భాగస్వామ్యంతో భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) ఈ క్షిపణులను ఉత్పత్తి చేస్తుంది. ఇందుకోసం రెండు సంస్థల మధ్య రూ.17వేల కోట్ల విలువైన ఒప్పందం కుదిరింది. దీనికింద 40 ఫైరింగ్ యూనిట్లు, 200 క్షిపణులు అందుతాయి. ప్రస్తుతం ఎంఆర్‌శామ్‌లు వైమానిక దళం, నౌకాదళం వద్ద ఉన్నాయి. సైన్యానికి అందే క్షిపణులు అధునాతనమైనవి. అన్నిరకాల వాతావరణ పరిస్థితుల్లో పనిచేస్తాయి. కీలక ప్రాంతాలకు గగనతల రక్షణను కల్పించడంలో ఇవి తోడ్పడతాయి. తొలివిడత ఎంఆర్‌శామ్ వ్యవస్థ మూడేళ్లలో సిద్ధమవుతుందని ఓ అధికారి పేర్కొన్నారు.

ప్రస్తుత భద్రతా సవాళ్ల దృష్ట్యా తన గగనతల లక్ష్యఛేదన సామర్థ్యం పెరగాల్సిన అవసరం ఉందని సైన్యం చాలా కాలంగా ప్రభుత్వానికి విన్నవిస్తూ వస్తోంది. ఇప్పటికే సైన్యం పలు అధునాతన క్షిపణులను సమకూర్చుకుంది. మే నెలలో బ్రహ్మోస్ క్రూయిజ్ క్షిపణికి సంబంధించిన భూతల దాడి వెర్షన్‌ను విజయవంతంగా పరీక్షించింది. ఇప్పటికే సైన్యంలో పలు బ్రహ్మోస్ రెజిమెంట్లు ఉన్నాయి. ఉపరితలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించగల ఆకాశ్ క్షిపణిని కూడా 2015లో సైన్యం సమకూర్చుకుంది. 25 కిలోమీటర్ల పరిధి కలిగిన ఈ అస్త్రం.. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందింది.


ఐఐటీల్లో పీజీ చేద్దామా?

ఐఐటీలు అనగానే చాలామంది బీటెక్ లేదా ఎంటెక్‌లకు సంబంధించినవిగా భావిస్తారు. అది సరి కాదు. జామ్ (జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ ఎంఎస్సీ)లో నెగ్గితే వివిధ ఐఐటీల్లో ఎంఎస్సీ, పీహెచ్‌డీ కోర్సుల్లో చేరవచ్చు. జామ్ ర్యాంకు ఆధారంగా ఐఐఎస్సీ బెంగళూరులో ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీకి ఇంటర్వ్యూ ఆధారంగా ప్రవేశం పొందవచ్చు. 2016 నుంచి జామ్ ర్యాంకుల ఆధారంగా ఎన్ఐటీల్లోనూ ప్రవేశం పొందే వీలును కల్పించారు. ఈ పరీక్ష తీరుతెన్నులు తెలుసుకుందాం!



ఈ ఏడాది జామ్‌ను ఐఐటీ-బాంబే నిర్వహిస్తోంది. ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ప్రవేశపరీక్షను ఆన్‌లైన్ ద్వారా (కంప్యూటర్ ఆధారిత పరీక్ష) మాత్రమే రాయాలి. పరీక్షకేంద్రాలు: తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, వరంగల్, విజయవాడ, విశాఖపట్నం.

గత సంవత్సరం కొత్తగా ఐఐటీ పట్నా కూడా జామ్ పరిధిలోకి వచ్చింది. గత ఏడాది నుంచి ఐఐటీ రూపర్ ఎంఎస్సీ మేథమేటిక్స్, కెమిస్ట్రీ, ఫిజిక్స్‌లో ఎంఎస్సీ-పీహెచ్‌డీ ఇంటిగ్రేటెడ్ కోర్సును అందిస్తోంది.



ఎస్. కిరణ్‌కుమార్
డైరెక్టర్, కెమ్‌బయోసిస్ కోచింగ్ సెంటర్

గత ఏడాది నుంచి ఐఐటీ జామ్ పరీక్ష విధానంలో కొన్ని ముఖ్యమైన మార్పులు చేశారు. కంప్యూటర్ అప్లికేషన్స్, జియోఫిజిక్స్ పరీక్ష పేపర్లను తొలగించారు. ఫిజిక్స్ టెస్ట్ పేపర్‌లో వచ్చిన ర్యాంకు ఆధారంగా జియోఫిజిక్స్‌లో ప్రవేశం పొందవచ్చు.

ఎంసీఏ, ఎంటెక్ ఇన్ జియోలాజికల్ టెక్నాలజీ, ఎంటెక్ ఇన్ జియోఫిజికల్ టెక్నాలజీ కోర్సులను గత విద్యా సంవత్సరం నుంచి రద్దు చేశారు.

జామ్‌లో గమనించాల్సింది- ఐఐఎస్సీ బెంగళూరు, ఐఐటీ బాంబే, ఐఐటీ కాన్పూర్‌ల్లో ఇంటిగ్రేటెడ్ కోర్సులకు ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు. సాధారణంగా ఇంటర్వ్యూల్లో సబ్జెక్టుకు సంబంధించిన ప్రశ్నలను అడుగుతారు. కాబట్టి సిలబస్‌ను అనువర్తిత, ప్రాక్టికల్ ధోరణిలో క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి.

గత సంవత్సరం నుంచి ఐఐటీ భువనేశ్వర్ కెమిస్ట్రీ, జియాలజీ, మేథ్స్, ఫిజిక్స్‌ల్లో ఎంఎస్సీ- పీహెచ్‌డీ డ్యూయల్ ప్రోగ్రామ్‌ను అందిస్తోంది. అలాగే ఐఐటీ గాంధీనగర్ ఎంఎస్సీ కెమిస్ట్రీ, మేథ్స్ ప్రోగ్రామ్‌లను అందిస్తోంది. ఇంకా ఐఐటీ ఇండోర్ ఎంఎస్సీ కెమిస్ట్రీ, ఫిజిక్స్‌లను అందిస్తోంది.

ఐఐటీ ముంబయి కెమిస్ట్రీలో ఎంఎస్సీ పీహెచ్‌డీ డ్యూయల్ ప్రోగ్రామ్‌ను అందిస్తోంది. ఎంఎస్సీ ఫిజిక్స్-ఎంటెక్ మెటీరియల్ సైన్స్, నానోటెక్నాలజీ కోర్సులను కూడా గత ఏడాది నుంచే ప్రవేశపెట్టారు.

ఎవరు అర్హులు?

అభ్యర్థులు తాము ప్రవేశం కోరుకుంటున్న కోర్సు సబ్జెక్టులనుబట్టి ప్రవేశపరీక్షలో రాయాల్సిన టెస్ట్ పేపర్లుంటాయి. ఐఐటీలో బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, జియాలజీ, మేథమేటిక్స్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టుల్లో వైవిధ్యమైన పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఖరగ్‌పూర్, కాన్పూర్, బాంబే, దిల్లీ, మద్రాస్, రూర్కీ, హైదరాబాద్, భువనేశ్వర్, గాంధీనగర్, రూపర్ ఐఐటీల్లో జనరల్, ఓబీసీ విద్యార్థులకు 55% మార్కులు తప్పనిసరి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే 50% మార్కులను కలిగివుండాలి.

ఐఐఎస్సీలో ప్రవేశానికి జనరల్, ఓబీసీ విద్యార్థులు బీఎస్సీలో 60% మార్కులు కలిగివుంటే అర్హులు. ఎస్సీ, ఎస్టీవారికి 50% మార్కులుండాలి.

ఎంఎస్సీ బయోటెక్నాలజీ పరీక్షకు ఏదైనా సైన్స్ గ్రాడ్యుయేట్‌లతోపాటు అగ్రికల్చర్, ఫార్మసీ, ఇంజినీరింగ్, మెడిసిన్ విద్యార్థులు కూడా అర్హులే.

ఎంఎస్సీ కెమిస్ట్రీ పరీక్షకు 10+2లో మేథ్స్ కలిగిన విద్యార్థులు మాత్రమే ఐఐటీ, ఐఐఎస్సీలో అడ్మిషన్ పొందడానికి అర్హులు. కానీ ఎన్ఐటీలో పొందడానికి బీఎస్సీ బయాలజీ విద్యార్థులూ అర్హులే.

ఎంఎస్సీ మేథమేటిక్స్‌కు బీఎస్సీలో మేథ్స్ కలిగినవారు మాత్రమే అర్హులు.

ఎంఎస్సీ ఫిజిక్స్‌కు బీఎస్సీలో ఫిజిక్స్ కలిగినవారు మాత్రమే అర్హులు.

పరీక్ష విధానం

ఈ ఏడాది జామ్‌ను 7 టెస్ట్ పేపర్లలో నిర్వహిస్తున్నారు. బయోలాజికల్ సైన్స్ (బీఎల్), బయో టెక్నాలజీ (బీటీ), కెమిస్ట్రీ (సీవై), జియాలజీ (జీజీ), మ్యాథమేటిక్స్ (ఎంఏ), మ్యాథమేటికల్ స్టాటిస్టిక్స్ (ఎంఎస్), ఫిజిక్స్ (పీహెచ్). ప్రవేశపరీక్షను ఆన్‌లైన్‌లో (కంప్యూటర్ ఆధారిత పరీక్ష) మాత్రమే రాయాల్సి ఉంటుంది. ఒక్కో టెస్ట్ పేపర్ రాయడానికి 3 గంటల సమయాన్ని కేటాయిస్తారు. ఒక్కో పేపర్‌లో మొత్తం 60 ప్రశ్నలకు సమాధానాలను రాయాలి. చాయిస్ ఉండదు. 100 మార్కుల వెయిటేజీ ఉంటుంది. ఒక్కో టెస్ట్ పేపర్‌లో ప్రశ్నలను మూడు విభాగాలుగా విభజించారు.

1. మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు (ఎంసీక్యూ)
2. మల్టిపుల్ సెలెక్ట్ ప్రశ్నలు (ఎంఎస్‌క్యూ)
3. న్యూమరికల్ సమాధాన ప్రశ్నలు (ఎన్ఏపీ)

ఒక్కో టెస్ట్ పేపర్‌ను ఎ, బి, సి అని మూడుగా విభజించారు.

సెక్షన్-ఎ: దీనిలో మొత్తం 30 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలుంటాయి. అన్నింటికీ సమాధానం రాయాలి. ప్రతి ప్రశ్నకూ నాలుగు సమాధానాలు. సరైన దాన్ని కంప్యూటర్‌లో సెలెక్ట్ చేయాలి. ఈ విభాగంలో ఒక్కో ప్రశ్నకు ఒకటి లేదా రెండు మార్కుల వెయిటేజీ ఉండవచ్చు. తప్పు సమాధానాలకు రుణాత్మక మార్కులున్నాయి. ఒక మార్కు ప్రశ్నలకు 1/3, రెండు మార్కులవాటికి 2/3 రుణాత్మక మార్కులుంటాయి.

జామ్ - 2018: ముఖ్యమైన తేదీలు
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఆరంభం: సెప్టెంబరు 5, 2017
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ముగింపు: అక్టోబరు 10, 2017
జామ్ పరీక్ష తేదీ: ఫిబ్రవరి 11, 2017

సెక్షన్-బి: దీనిలో మొత్తం 10 మల్టిపుల్ సెలెక్ట్ ప్రశ్నలుంటాయి. అన్నింటికీ సమాధానాలను రాయాల్సివుంటుంది. ఇచ్చిన నాలుగింటిలో ఒకటి కంటే ఎక్కువ సరైన సమాధానాలు ఉంటాయి. వాటిని కంప్యూటర్‌లో సెలెక్ట్ చేయాలి. ఒక్కో విభాగంలో ఒక్కో ప్రశ్నకు 2 మార్కుల వెయిటేజీ ఉంటుంది. వీటికి రుణాత్మక, పాక్షిక మార్కులుండవు.

సెక్షన్-సి: దీనిలో మొత్తం 20 న్యూమరికల్ సమాధాన ప్రశ్నలుంటాయి. అన్నింటికీ సమాధానాలు రాయాలి. ఒక్కో ప్రశ్నకు 1 లేదా 2 మార్కుల వెయిటేజీ ఉండవచ్చు. వీటికి సమాధానాలను వాస్తవ సంఖ్యల రూపంలో కంప్యూటర్‌లో నమోదు చేయాలి. ఈ ప్రశ్నలకు రుణాత్మక మార్కులుండవు.

మాధ్యమం

ప్రశ్నపత్రం ఇంగ్లిష్ మాధ్యమంలోనే ఉంటుంది.

ఎంఎస్సీ బయోటెక్నాలజీ సబ్జెక్టును ఐఐటీ బాంబే, రూర్కీ, ఐఐటీ ఇండోర్‌లు మాత్రమే అందిస్తున్నాయి. కాబట్టి బయోటెక్నాలజీ సబ్జెక్టుకు పోటీ ఎక్కువ.

ఐఐటీ బాంబే 2007 నుంచి ఎనర్జీలో ఎంఎస్సీ, పీహెచ్‌డీ డ్యూయల్ ప్రోగ్రామ్‌ను అందిస్తోంది. ఐఐటీ ఖరగ్‌పూర్ 2009 నుంచి కెమిస్ట్రీ, జియోలాజికల్ సైన్స్, మేథమేటిక్స్, జియోఫిజిక్స్, ఫిజిక్స్‌ల్లో ఎంఎస్సీ, పీహెచ్‌డీ, డ్యూయల్ ప్రోగ్రామ్‌ను అందిస్తోంది.

ఐఐటీ హైదరాబాద్ ఎంఎస్సీ కెమిస్ట్రీ, మేథమేటిక్స్, ఫిజిక్స్ కోర్సులను అందిస్తోంది. ఐఐటీ బాంబే 2012 నుంచి ఎంఎస్సీ-పీహెచ్‌డీ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్ ఇన్ బయోటెక్నాలజీ, ఎంఎస్సీ- పీహెచ్‌డీ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్ ఇన్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఇంజినీరింగ్, ఎంఎస్సీ-పీహెచ్‌డీ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్ ఇన్ ఆపరేషన్ రిసర్చ్ మొదలైన కోర్సులను ప్రవేశపెట్టింది.

సిలబస్ వేరుగా ఉంటుందా?

ఐఐటీ సిలబస్, మన డిగ్రీ కోర్సుల సిలబస్ ఒకటేనా? వేర్వేరుగా ఉంటుందా? అనే సందేహం చాలామంది విద్యార్థులకు ఉంటుంది. జామ్‌కు సంబంధించి సిలబస్‌ను రూపొందించేటప్పుడు ఐఐటీలు దేశవ్యాప్తంగా బోధనలో ఉన్న అంశాలను పరిగణనలోకి తీసుకుంటాయి. అయినప్పటికీ కొన్ని టాపిక్‌లు తేడా ఉండవచ్చు. అందుకని ముందుగా జామ్ సిలబస్‌ను ఇంటర్‌నెట్ ద్వారా స్వీకరించి తరువాత తాము చదివే సిలబస్‌తో పోల్చుకుని చూసుకోవాలి. కొత్త టాపిక్స్ ఏమైనా ఉంటే వాటికి సంబంధించిన మెటీరియల్‌ను కూడా సేకరించి చదవాలి. సబ్జెక్టును విశ్లేషణాయుతంగా చదవడం, అన్వయింపు విధానం వచ్చి ఉండాలి.

ఫైనలియర్ విద్యార్థులకు మార్చిలో బీఎస్సీ పరీక్షలుంటాయి. కాబట్టి ఇప్పటి నుంచే కొంత సమయం (5-6 గంటలు) జామ్ ఎగ్జామ్ సబ్జెక్టుకు కేటాయించాలి. రోజుకు కొంత సమయం మాదిరి ప్రశ్నపత్రాలను సాధన చేయాలి.

గత నాలుగు సంవత్సరాల నుంచి జామ్‌ను ఫిబ్రవరిలో నిర్వహిస్తున్నారు. ఫైనలియర్ విద్యార్థులకు సమయ వ్యవధి తక్కువగా ఉంది కాబట్టి, సబ్జెక్టులోని ముఖ్యమైన అంశాలపై పూర్తిగా దృష్టి సారించాలి. సీట్ల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని నిరుత్సాహపడకుండా చదవాలి. 'కావల్సింది ఒక్క సీటే' అన్నది గమనించాలి. ఆశావహదృక్పథంతో సబ్జెక్టుపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలి.

సబ్జెక్టు అభివృద్ధి పరచుకోవడం కోసం రిఫరెన్స్ పుస్తకాలతోపాటు నమూనా ప్రశ్నపత్రాలను సాధన చేయాలి. గత 3 సంవత్సరాల జామ్ పేపర్లు వెబ్‌సైట్‌లో ఉన్నాయి. ఆ రకంగా కొన్ని మోడల్ పేపర్లను సాధన చేసుకోవచ్చు.

మీడియం గురించి భయం వద్దు

గ్రామీణ ప్రాంతాల్లో చదివిన తెలుగు మాధ్యమం విద్యార్థులు మీడియం సమస్య గురించి ఎక్కువగా భయపడాల్సిన అవసరం లేదు. తెలుగు మీడియం విద్యార్థులు కూడా ఏటా ఈ ప్రవేశపరీక్షలో ఎక్కువగా ఉత్తీర్ణతను సాధిస్తున్నారు. గతంలో మాదిరిగా వ్యాసరూప ప్రశ్నలు ఈ సంవత్సరం లేకపోవడం ఇలాంటివారికి సానుకూలాంశం. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కంప్యూటర్ ఆధారిత ప్రశ్నలను ఎక్కువగా సాధన చేయాలి. డిగ్రీలో సాధించిన మార్కుల శాతం గురించి ఎక్కువగా ఆలోచించకుండా అర్హత కలిగినవారందరూ ఈ ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు.

సబ్జెక్టును ఇష్టపడి చదవాలి. సానుకూల దృక్పథంతో కృషిచేస్తే ర్యాంకు సాధించవచ్చు. బీఎస్సీ మొదటి సంవత్సర విద్యార్థులు ఇప్పుడే ఏ సబ్జెక్టులో పీజీ చేయాలో నిర్ణయించుకుని ఆ సబ్జెక్టును విశ్లేషణతో చదవడం అలవాటు చేసుకోవాలి.

స్థానిక వర్సిటీల పీజీ ప్రవేశపరీక్షలతో పోలిస్తే ఐఐటీ జామ్‌లో పోటీ తీవ్రత శాతం కొంత తక్కువగానే ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని సరైన ప్రణాళికతో కృషి చేస్తే విజయం సాధించవచ్చు. ఈ ఐఐటీ జామ్ ప్రవేశపరీక్షలో ఏ సబ్జెక్టులోనైనా సాధారణంగా 60% స్కోరు చేయగలిగితే సీటు సాధించే అవకాశం గణనీయంగా ఉంది.

సన్నద్ధత ఏ విధంగా?

ఐఐటీ విద్యా విధానం సమగ్రం కాబట్టి ప్రవేశపరీక్ష కూడా ఆ స్థాయిలోనే ఉంటుంది. ప్రశ్నలన్నీ విద్యార్థుల విశ్లేషణ, తార్కిక సామర్థ్యాలను పరీక్షించేలా ఉండటం జామ్ ప్రత్యేకత.

ఐఐటీ-జేఈఈలో మన రాష్ట్ర విద్యార్థులు ఎక్కువ శాతం సీట్లను కైవసం చేసుకుంటున్నారు. కానీ ఐఐటీ జామ్‌లో పశ్చిమ్ బంగ విద్యార్థులు 50% పైగా సీట్లను సాధిస్తున్నారు. దీనికి కారణం ఆ విద్యార్థులు సంబంధిత సబ్జెక్టులో బీఎస్సీలో ఆనర్స్ కోర్సు చేస్తున్నారు. అందుకే సబ్జెక్టుమీద వారు ఎక్కువ పట్టు సాధిస్తున్నారు. మన విద్యార్థులు ఆనర్స్ చదివినవారిని దృష్టిలో ఉంచుకుని, సంబంధిత సబ్జెక్టును క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి.

జామ్ ప్రవేశపరీక్షను రాసేవారు 10+2 సిలబస్‌తో తమ సన్నద్ధతను మొదలుపెట్టాలి. అంటే మొదట ప్రాథమిక అంశాలను తెలుగు అకాడమీ, సీబీఎస్ఈ పుస్తకాలను రిఫర్ చేసి అభివృద్ధి చేసుకోవాలి. ఆపై బీఎస్సీ సిలబస్‌ను అంశాలవారీగా రిఫరెన్స్ పుస్తకాల ద్వారా సబ్జెక్టును క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి.



✦ **ఎంఎస్సి బయోలాజికల్ సైన్స్:** ఈ టెస్ట్ పేపర్‌ను 2013 నుంచి ప్రవేశపెట్టారు. ఈ టెస్ట్‌లో ర్యాంకు ఆధారంగా ఐఐఎస్సీ బెంగళూరులో బయోలాజికల్ సైన్స్, కెమికల్ సైన్స్‌ల్లో, ఐఐటీ బాంబే ఏఎస్సీ, పీహెచ్‌డీ డ్యూయల్ డిగ్రీ బయోటెక్నాలజీ కోర్సుల్లో ఇంటర్వ్యూ ఆధారంగా ప్రవేశం పొందవచ్చు. ఈ బయోలాజికల్ సైన్స్ టెస్ట్ పేపరులో ప్రశ్నలు మల్టిపుల్ చాయిస్ విధానంలో ఉంటాయి. బయోలాజికల్ సైన్స్ టెస్ట్ సిలబస్‌లో ఎక్కువశాతం బయాలజీ, కొంత మేథమేటిక్స్ సిలబస్ ఉంది. ముఖ్యంగా జనరల్ బయాలజీ, బేసిక్స్ ఆఫ్ బయోకెమిస్ట్రీ, బయోఫిజిక్స్, మాలిక్యులార్ బయాలజీ, మైక్రో బయాలజీ, సెల్ బయాలజీ, ఇమ్యునాలజీ, మేథమెటికల్ సైన్సెస్, మేథమెటికల్ ఫంక్షన్స్.

✦ **ఎంఎస్సీ బయోటెక్నాలజీ:** ఈ ఎంట్రన్స్‌లో ఎక్కువ సీట్లను ఎంపీసీ విద్యార్థులు కైవసం చేసుకుంటున్నారు. కాబట్టి బైపీసీ వారు బయాలజీ, కెమిస్ట్రీతోపాటు మేథమెటిక్స్, ఫిజిక్స్‌లపై ఎక్కువ దృష్టి పెట్టాలి. బీఎస్సీ సిలబస్ టాపిక్ వారీ రిఫరెన్స్ పుస్తకాల ద్వారా సబ్జెక్టును క్షుణ్ణంగా చదవాలి. బీఎస్సీలో మోడర్న్ బయాలజీ గ్రూపులను కలిగిన విద్యార్థులు బోటనీ, జువాలజీ సిలబస్‌ను కూడా చదవాలి.

బయోకెమిస్ట్రీ సిలబస్‌లో అమైనో ఆసిడ్స్ అండ్ ప్రొటీన్స్, కార్బోహైడ్రేట్ మెటబాలిజం, ఎంజైమ్స్, బయోకెమికల్ టెక్నిక్స్, సెల్ సిగ్నలింగ్ మొదలైన అంశాల నుంచి ఎక్కువ ప్రశ్నలను అడుగుతున్నారు. వీటిపై ఎక్కువ దృష్టిని కేంద్రీకరించాలి.

జెనెటిక్స్, మాలిక్యులార్ బయాలజీ సిలబస్‌లో డీఎన్ఏ ధర్మాలు, ఆర్‌డీఎన్ఏ టెక్నాలజీ, ట్రాన్స్‌లేషన్, ట్రాన్స్‌క్రిప్షన్ మొదలైన అంశాలపై అధిక దృష్టిసారించాలి.

ఆర్గానిక్ కెమిస్ట్రీలో రియాక్షన్ మెకానిజం, స్టీరియో కెమిస్ట్రీ, నేమ్‌డ్ రియాక్షన్స్, ఫిజికల్ కెమిస్ట్రీలో కెమికల్ కైనటిక్స్, థర్మోడైనమిక్స్ సంబంధిత అంశాలను బాగా చదవాలి. ఇన్ ఆర్గానిక్ కెమిస్ట్రీలో సంశ్లిష్ట సమ్మేళనాలు, అనలిటికల్ కెమిస్ట్రీ మొదలైనవి ముఖ్యం.

మేథమేటిక్స్‌లో మాత్రికలు, డెరివేటివ్స్, కాల్క్యులస్, వెక్టర్స్, త్రికోణమితి, కోఆర్డినేట్ జామెట్రీ సబ్జెక్టులను సాధన చేయాలి.

ఇతర ఎంట్రన్స్ సబ్జెక్టులు రాసే విద్యార్థుల కన్నా వీరు సన్నద్ధతకు ఎక్కువ సమయాన్ని కేటాయించాలి. ఫైనలియర్ విద్యార్థులు ఇప్పటినుంచి రోజూ 5-6 గంటలు సమయాన్ని తమకు అనుగుణంగా రూపొందించుకోవాలి.

✦ **ఎంఎస్సీ కెమిస్ట్రీ:** ఫిజికల్ కెమిస్ట్రీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ మీద ఎక్కువ దృష్టిని కేంద్రీకరించాలి. కెమిస్ట్రీతోపాటు మేథ్స్‌లో పేర్కొన్న బేసిక్ సిలబస్‌ను కూడా చదవాలి. ఆర్గానిక్ కెమిస్ట్రీలో జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, రియాక్షన్ మెకానిజం, స్టీరియో కెమిస్ట్రీ, నేమ్‌డ్ రియాక్షన్స్, రియోజెంట్స్, ఫిజికల్ కెమిస్ట్రీలో థర్మోడైనమిక్స్, కెమికల్ కెనటిక్స్, క్వాంటమ్ కెమిస్ట్రీ, ఎలక్ట్రో కెమిస్ట్రీ సంబంధిత అంశాలు ప్రధానం. ఇన్ ఆర్గానిక్ కెమిస్ట్రీ సంశ్లిష్ట సమ్మేళనాలు, అనలిటికల్ కెమిస్ట్రీ, రసాయన బంధం మొదలైనవి ముఖ్యం.

✦ **ఎంఎస్సీ ఫిజిక్స్:** ఫిజికల్ ఆప్టిక్స్, క్వాంటమ్ మెకానిక్స్, థర్మోడైనమిక్స్, ఎలక్ట్రానిక్స్- ఆసిలేషన్స్, వేవ్స్- ఆసిలేషన్స్, క్వాంటమ్, స్పెక్ట్రోస్కోపి, న్యూక్లియర్, అటామిక్ ఫిజిక్స్ హీట్, ఆప్టిక్స్, మోడరన్ ఫిజిక్స్ సంబంధిత సిలబస్‌ను అనువర్తిత ధోరణిలో చదవాలి.

✦ **ఎంఎస్సీ మేథమెటిక్స్:** మ్యాట్రిక్స్, డెరివేటివ్స్, కాల్క్యులస్, వెక్టర్స్, త్రికోణమితి, కోఆర్డినేట్ జామెట్రీ సబ్జెక్టులను బాగా సాధన చేయాలి. ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు ముందుగా ప్రవేశపరీక్ష మాదిరి ప్రశ్నపత్రం ఎలా ఉంటుందో తెలుసుకోవాలి. దాని ప్రకారం సన్నద్ధతను కొనసాగించాలి.

ఉపయోగపడే పుస్తకాలు

కెమిస్ట్రీ

Organic Chemistry : Clayden, Carey Sundberg Physical Chemistry : P.W.Atkins, K.L.Kapoor Inorganic Chemistry : J.D. Lee, Shriver & Atkins

బయాలజీ

Biochemistry : Voet & Voet, Albert Lehninger Microbiology : Prescott Cellbiology : Alberts, Lodish Molecular Biology : Weaver Immunology : Kuby

Genetics : Griffith, Suzuki Animal Physiology : Nielsen Plant Physiology : Teiz and Zeiger

మ్యాథ్స్

Algebra : Bhattacharya, Devid C Lay

Calculus : M.J.Strauss, H.Anton

Real Analysis : Shanti Narayan, Richard R Goldberg Differential Equations : Sastri SS, Collins P.J.

Complex Numbers : Murry R Spiegel Probability of Statistics : C.E.Weatherban, Das Gupta, Ray & Sharma

ఫిజిక్స్

Mechanics : D S Mathur, Daniel

Waves and Optics : D R Brown, N K Bajaj Electricity & Magnetism : D C Tayal, Edward M Purcell D John, Charles E Hecht

Kinetic Theory & Thermodynamics : Modern Physics : D.C. Pandey, B L Theraja

Solid State Physics : S.P. Singh, D.K. Bhattacharya

బీమా... బ్యాంకు ఉద్యోగాలు సన్నద్ధత ఒకటే

కొద్ది సంవత్సరాలుగా దేశంలో ఎక్కువ సంఖ్యలో ఉద్యోగావకాశాలను కల్పిస్తున్న ప్రభుత్వరంగ సంస్థల్లో బ్యాంకింగ్, బీమా రంగాలు ముందు వరుసలో ఉంటున్నాయి. క్రమం తప్పకుండా వీటిలో ఉద్యోగుల నియామకం జరుగుతోంది. ప్రస్తుతం ఓరియంటల్ ఇన్సూరెన్స్‌లో 300 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్‌లో 696 అసిస్టెంట్ల పోస్టులు భర్తీ కానున్నాయి. ఇప్పటికే ఐబీపీఎస్ నుంచి పీఓ, ఆర్ఆర్‌బీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఈ బీమా కొలువులకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. బ్యాంకు పరీక్షల తరహాలో ఉండటం వల్ల అదే సన్నద్ధత ఉపయోగపడుతుంది!



బీమా సంస్థల్లో డెవలప్‌మెంట్ ఆఫీసర్ల మాదిరి సేల్స్ ఒత్తిడి లేకుండా దాదాపుగా అంతర్గత పరిపాలనకు సంబంధించినవి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, అసిస్టెంట్ ఉద్యోగాలు. దీంతో వీటిపై అభ్యర్థులకు ఆసక్తి ఎక్కువగానే ఉంటుంది. చక్కటి జీతభత్యాలు, పదోన్నతులకు అవకాశాలుండే ఈ ఉద్యోగాలు పొందాలంటే ప్రణాళికాబద్ధమైన సన్నద్ధత అవసరం.

ఓరియంటల్ ఇన్సూరెన్స్ ఏఓ పోస్టులకు రెండంచెల్లో నిర్వహించే ఆన్‌లైన్ రాతపరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మొదటి అంచెలోని ప్రిలిమినరీలో ఉత్తీర్ణులైనవారికి మెయిన్ పరీక్ష ఉంటుంది. దీనిలో నెగ్గిన నిర్ణీత అభ్యర్థులకు (పోస్టుల సంఖ్యకు సుమారు 20 రెట్ల సంఖ్యలో) ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. మెయిన్, ఇంటర్వ్యూల్లో వచ్చిన మొత్తం మార్కుల ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది.



జి. హరిణి
RACE ఇన్‌స్టిట్యూట్

యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ అసిస్టెంట్ పోస్టులకు రెండంచెల ఆన్‌లైన్ రాతపరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మొదటి అంచెలోని ప్రిలిమినరీలో ఉత్తీర్ణులైనవారికి మెయిన్ పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్ష మార్కుల ఆధారంగా తుది ఎంపిక ఉన్నప్పటికీ దానికంటే ముందు ప్రాంతీయభాషా పరీక్ష (రీజనల్ లాంగ్వేజ్ టెస్ట్) ను నిర్వహిస్తారు. అభ్యర్థులకు తాము ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్రానికి సంబంధించిన ప్రాంతీయ భాషా పరిజ్ఞానం తప్పనిసరి.

ఎన్ని విభాగాలు? ఎన్ని మార్కులు?

ఈ రెండు పరీక్షల విధానం, సబ్జెక్టులు, సిలబస్ పూర్తిగా బ్యాంకు పరీక్షల మాదిరిగానే ఉంటుంది. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ల ప్రిలిమినరీ పరీక్ష ఐబీపీఎస్ పీఓ ప్రిలిమినరీ పరీక్షలాగే మూడు విభాగాలు, 100 మార్కులు. ఒక గంట వ్యవధిలో ఉంటుంది. మెయిన్ పరీక్ష (జనరలిస్ట్ పోస్టులు)లో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్, ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్‌లు ఒక్కోదానిలో 50 మార్కుల చొప్పున మొత్తం 200 మార్కులతో 2 గంటల వ్యవధితో ఉంటాయి. దీన్ని ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహిస్తారు. దీని తర్వాత 30 నిమిషాల వ్యవధితో ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించే డిస్క్రిప్టివ్ టెస్ట్ ఉంటుంది. దీనిలో 30 మార్కులతో లెటర్, ఎస్సే రైటింగ్‌లు ఉంటాయి.

అసిస్టెంట్ల ప్రిలిమినరీ పరీక్ష కూడా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ల ప్రిలిమినరీ పరీక్షలాగే ఉంటుంది. కానీ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ విభాగం బదులుగా న్యూమరికల్ ఎబిలిటీ ఉంటుంది. మెయిన్ పరీక్షలో ఒక్కోదానిలో 40 ప్రశ్నలు, 50 మార్కులతో మొత్తం 200 ప్రశ్నలు, 250 మార్కులతో అయిదు విభాగాలు- న్యూమరికల్ ఎబిలిటీ, రీజనింగ్, ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్, కంప్యూటర్ నాలెడ్జ్ ఉంటాయి. వీటిని సాధించడానికి 2 గంటల వ్యవధి ఉంటుంది.

సబ్జెక్టులు-అవగాహన

అన్నింటిలో కలిపి మొత్తం 5 విభాగాలున్నాయి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్: ఈ విభాగంలో సింప్లిఫికేషన్స్, అప్రాక్సిమేట్ వాల్యూస్, నంబర్ సిరీస్, డేటా సఫిషియన్సీ, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, అరిథ్‌మెటిక్ అంశాల నుంచి ప్రశ్నలుంటాయి. వీటితోపాటు పర్మ్యూటేషన్స్ అండ్ కాంబినేషన్స్, ప్రాబబిలిటీ నుంచి కూడా ప్రశ్నలుంటాయి.

ముఖ్యాంశాలు ఇవీ...

విషయం	ఓరియంటల్ ఇన్సూరెన్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు	యునైటెడ్ ఇండియా అసిస్టెంట్లు
పోస్టుల సంఖ్య	300	696
విద్యార్హతలు	జనరలిస్ట్ పోస్టులకు డిగ్రీ 60% (ఎస్సీ/ ఎస్టీ 55%) 31.07.2017 నాటికి	ఏదైనా డిగ్రీ (30.06.2017 నాటికి)
వయసు	21-30 ఏళ్లు (31.07.2017 నాటికి)	18-28 ఏళ్లు (30.06.2017 నాటికి)
దరఖాస్తు చివరి తేదీ	15.09.2017	28.08.2017
దరఖాస్తు ఫీజు	రూ.100 (ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూడీ) రూ.600 (ఇతరులు)	రూ.100 (ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూడీ) రూ.500 (ఇతరులు) జీఎస్టీ @ 18% అదనం
ఆన్‌లైన్ పరీక్ష తేదీ	22.10.2017(ప్రిలిమినరీ) 18.11.2017 (మెయిన్)	22.09.2017 (ప్రిలిమినరీ) 23.10.2017 (మెయిన్)

రీజనింగ్: సాధారణ అంశాలైన కోడింగ్- డీకోడింగ్, డైరెక్షన్స్, సీక్వెన్సెస్ అండ్ సిరీస్, బ్లడ్ రిలేషన్స్, సిలాజిజం, సీటింగ్ అరేంజ్‌మెంట్ మొదలైనవాటితోపాటు అనలిటికల్/ క్రిటికల్ రీజనింగ్ అంశాలైన స్టేట్‌మెంట్స్- అసంప్షన్స్/ కన్‌క్లూజన్స్/ కోర్సెస్ ఆఫ్ యాక్షన్స్/ ఇన్‌ఫరెన్సెస్, పజిల్ టెస్ట్, ఎలిజిబిలిటీ టెస్ట్, ఇన్‌పుట్-అవుట్‌పుట్ మొదలైనవాటి నుంచి ప్రశ్నలుంటాయి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్: ఈ విభాగం నుంచి స్పాటింగ్ ఎర్రర్స్, ఫిల్ ఇన్ ద బ్లాంక్స్, క్లోజ్ టెస్ట్, సెంటెన్స్ కరెక్షన్స్, రీ అరేంజ్‌మెంట్ ఆఫ్ సెంటెన్సెస్, రీడింగ్ కాంప్రహెన్షన్, సినానిమ్స్, యాంటనిమ్స్ మొదలైనవాటి నుంచి ప్రశ్నలుంటాయి. బేసిక్ గ్రామర్‌లో పట్టుంటే సగానికిపైగా ప్రశ్నలను తేలికగా గుర్తించవచ్చు.

జనరల్ అవేర్‌నెస్: గత 4, 5 నెలల నాటి వర్తమానాంశాల నుంచి సాధారణంగా ప్రశ్నలుంటాయి. ఆర్థిక, బీమా రంగాలకు సంబంధించిన విషయాలపై ప్రశ్నలు ఎక్కువ వస్తాయి. వీటితోపాటు ముఖ్యమైన సంఘటనలు, వ్యక్తులు, ప్రదేశాలు, పుస్తకాలు-రచయితలు, క్రీడలు మొదలైన వాటిపై కూడా ప్రశ్నలుంటాయి. బడ్జెట్, ఎకనామిక్ సర్వే, కేంద్ర ప్రభుత్వ పథకాలు, జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు మొదలైనవాటిని బాగా చూసుకోవాలి.

సిద్ధమయ్యేది ఇలా!

దాదాపుగా బ్యాంకు పరీక్షలు రాసే అభ్యర్థులే వీటిని కూడా రాస్తుంటారు. కాబట్టి వారికి ప్రత్యేకమైన సన్నద్ధత అవసరం లేదు. ప్రస్తుతం ఐబీపీఎస్ పీఓ, ఆర్ఆర్‌బీ, ఇన్సూరెన్స్ పరీక్షలు ఉన్నాయి. వీటన్నింటికీ ఒకటే సన్నద్ధత సరిపోతుంది. పరీక్ష జరిగే సమయం వరకు ఉండే వ్యవధిని అనుసరించి ఆలోగా వారి సన్నద్ధత పూర్తయ్యేలా చూసుకోవాలి.

అసిస్టెంట్ల ప్రిలిమినరీ పరీక్షకు నెలరోజుల వ్యవధి, మెయిన్ పరీక్షకు రెండు నెలల వ్యవధి ఉంది. అదేవిధంగా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ల ప్రిలిమినరీ పరీక్షకు రెండు నెలలు, మెయిన్ పరీక్షకు 3 నెలల వ్యవధి ఉంది. అభ్యర్థులు అయిదు సబ్జెక్టులకు బాగా సన్నద్ధమైతే అన్ని పరీక్షలూ బాగా రాయగలుగుతారు. బ్యాంకు, బీమా పరీక్షలన్నింటిలోనూ ముందుగా జరగబోయే పరీక్ష సమయంలోగా వారి సన్నద్ధత పూర్తవ్వాలి. ఆపై తర్వాతి పరీక్షకు లక్ష్యం నిర్దేశించుకోవాలి.

అయితే పరీక్ష విధానానికి తగ్గట్టుగా మాదిరి ప్రశ్నపత్రాల సాధన ఉండాలి. ఐబీపీఎస్ పీఓ, ఓరియంటల్ ఇన్సూరెన్స్ ఏఓ, యునైటెడ్ ఇండియా అసిస్టెంట్ల ప్రిలిమినరీ పరీక్షలు ఒకేలా ఉంటాయి. మెయిన్ పరీక్షల్లోనే మార్పు ఉంటుంది. అభ్యర్థులు వాటికి అనుగుణంగా సన్నద్ధమవ్వాలి.

పరీక్ష విధానం

ఓరియంటల్ ఇన్సూరెన్స్ ఏఓ
ప్రిలిమ్స్

పరీక్ష	ఏ పద్ధతి?	మార్కులు	సమయం
రీజనింగ్ ఎబిలిటీ	ఆబ్జెక్టివ్	35	1 గం.
క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్	ఆబ్జెక్టివ్	35	
ఇంగ్లిష్ లాంగ్వేజ్	ఆబ్జెక్టివ్	30	
మొత్తం		100	

★ యునైటెడ్ ఇన్సూరెన్స్ అసిస్టెంట్స్ ప్రిలిమినరీ కూడా ఇదే రకంగా ఉంటుంది. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ బదులు 'న్యూమరికల్ ఎబిలిటీ' అని ఉంటుంది. ప్రశ్నలూ, మార్కులూ, వ్యవధి అంతా ఆ తరహాలోనే ఉంటుంది.

మెయిన్ (జనరలిస్ట్స్)

పరీక్ష	తీరు	మార్కులు	సమయం
రీజనింగ్	ఆబ్జెక్టివ్	50	2 గంటలు
క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్	ఆబ్జెక్టివ్	50	
జనరల్ అవేర్‌నెస్	ఆబ్జెక్టివ్	50	
ఇంగ్లిష్ లాంగ్వేజ్	ఆబ్జెక్టివ్	50	
మొత్తం		200	
ఇంగ్లిష్ లాంగ్వేజ్ (ఎస్సే, లెటర్ రైటింగ్)	డిస్క్రిప్టివ్	30	30 నిమిషాలు

యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ అసిస్టెంట్స్
మెయిన్స్

పరీక్ష	తీరు	ప్రశ్నలు	మార్కులు	సమయం
రీజనింగ్	ఆబ్జెక్టివ్	40	50	2 గంటలు
న్యూమరికల్ ఎబిలిటీ	ఆబ్జెక్టివ్	40	50	
జనరల్ అవేర్‌నెస్	ఆబ్జెక్టివ్	40	50	
ఇంగ్లిష్ లాంగ్వేజ్	ఆబ్జెక్టివ్	40	50	
కంప్యూటర్ నాలెడ్జ్	ఆబ్జెక్టివ్	40	50	
మొత్తం		200	250	

నెట్ మెలకువలు ఇవిగో!

విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హత సాధించటానికీ, జేఆర్ఎఫ్ కోసం జాతీయస్థాయిలో అభ్యర్థులు రాసే పరీక్ష.. . యూజీసీ నెట్. నవంబర్ 5న జరగబోయే ఈ నేషనల్ ఎలిజిబిలిటీ పరీక్షను యూజీసీ తరఫున సీబీఎస్ఈ నిర్వహిస్తోంది. ఇటీవలే దీని ప్రకటన విడుదలైంది. ఈ పరీక్ష ప్రధాన అంశాలూ, తయారయ్యే విధానం తెలుసుకుందాం!

యూజీసీ నెట్‌ను మొత్తం 84 సబ్జెక్టుల్లో నిర్వహిస్తారు. జూనియర్ రిసర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్)కు ఎంపిక కావాలంటే 28 సంవత్సరాలు ఉండి, నెట్‌లో మంచి మార్కులు సాధించాల్సి ఉంటుంది. జేఆర్ఎఫ్‌కి ఎంపికైనవారికి 2 సంవత్సరాలపాటు నెలకు రూ.33,000 చొప్పున ఉపకార వేతనం ఇస్తారు. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, ఓబీసీ నాన్ క్రీమీలేయర్ అభ్యర్థులకు 5 ఏళ్ల వయసు మినహాయింపు ఉంటుంది. జేఆర్ఎఫ్‌కు మాత్రమే వయసు పరిమితి ఉంది. అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు గరిష్ఠ వయః పరిమితి లేదు. గత ఏడాది వరకు యూజీసీ నెట్‌ను ఏటా రెండుసార్లు నిర్వహించేవారు. ఈ ఏడాది నుంచి ఒకసారి మాత్రమే నిర్వహించనున్నారు.

దరఖాస్తు వివరాలు

అర్హతలు: పీజీలో కనీసం 55% మార్కులుండాలి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ (నాన్‌క్రీమీలేయర్), పీడబ్ల్యూడీ అభ్యర్థులైతే 50% కనీస మార్కులను సాధించాలి. పీజీ చదువుతున్నవారు కూడా దరఖాస్తు చేయవచ్చు. నెట్ ఫలితాలను ప్రకటించిన రెండేళ్లలోపు అర్హత పత్రాలు సమర్పిస్తే సరిపోతుంది.

ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.1000, ఓబీసీ (నాన్ క్రీమీలేయర్) రూ.500, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ వారు రూ.250 చెల్లించాల్సి ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తు చేయడానికి చివరితేదీ: సెప్టెంబరు 11.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:
ఆంధ్రప్రదేశ్- గుంటూరు, తిరుపతి, విశాఖపట్నం.
తెలంగాణ- హైదరాబాద్, వరంగల్.

పరీక్ష విధానం

మొత్తం 3 పేపర్లు ఉంటాయి.

పేపర్-1: బోధన, పరిశోధన సామర్థ్యాలు. అన్ని సబ్జెక్టులవారికీ ఒకేలా ఉంటుంది. 50 ప్రశ్నలుంటాయి. 100 మార్కులు. ప్రతి ప్రశ్నకు 2 మార్కులు. వ్యవధి 1.15 గం. (ఉదయం 9.30 గం. నుంచి 10.45 గం. వరకు).

ఈ పేపర్‌లో బోధన సామర్థ్యం, సహజ పరిశోధన సామర్థ్యం, బోధన పద్ధతులు, స్వభావం, బోధనోపకరణాలు, మూల్యాంకనం, పరిశోధన పద్ధతులు, విలువలు, సోపానాలు, రీడింగ్ కాంప్రహెన్షన్, ఒక వ్యాసం ఇచ్చి ప్రశ్నలు అడగడం, కమ్యూనికేషన్, ఐటీ, కంప్యూటర్ ప్రాథమికాంశాలు, రీజనింగ్, కోడింగ్ - డీకోడింగ్, నంబర్ సిరీస్, రక్తసంబంధాలు, క్లాసిఫికేషన్స్, డైరెక్షన్, లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, పర్యావరణ విద్య, ఉన్నత విద్యావ్యవస్థ, కరెంట్ అఫైర్స్‌పై ప్రశ్నలుంటాయి.

పేపర్-2: విద్యార్థి ఎంచుకున్న సబ్జెక్టు: దీని నుంచి 50 ప్రశ్నలుంటాయి. 100 మార్కులు. వ్యవధి- 1.15 గం. (ఉదయం 11.15 గం. నుంచి మధ్యాహ్నం 12.30గం. వరకు). ఎంపిక చేసుకున్న సబ్జెక్టుపై పీజీ స్థాయిలో ఉన్న అన్ని అంశాలపై ప్రశ్నలుంటాయి. సాధారణ స్థాయి నుంచి ఒక మాదిరి ప్రశ్నలు ఉంటాయి.

పేపర్-3: 75 ప్రశ్నలు ఇస్తారు. 150 మార్కులు. వ్యవధి 2 1/2 గం. (మధ్యాహ్నం 2గం. నుంచి 4.30 గం.). దీనిలోనూ అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్టుపైనే ప్రశ్నలుంటాయి. ఎక్కువగా సారాంశం ప్రకటన, మ్యాచింగ్, అనువర్తిత అంశాలపై ప్రశ్నలుంటాయి. సిలబస్‌లో పేర్కొన్న అంశాలపై డిగ్రీ, పీజీ స్థాయి ప్రామాణిక పుస్తకాలు చదవాలి. తగినవిధంగా నోట్స్ రాసుకుని సిద్ధమైతే అర్హత సాధించడం సులువే.



పై మూడు పేపర్లలో జనరల్ కేటగిరీ అభ్యర్థులు ప్రతీ పేపర్‌లో విడివిడిగా 40% మార్కులు సాధించాల్సి ఉంటుంది. ఓబీసీ (నాన్ క్రీమీలేయర్), పీబ్ల్యూడీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 35% మార్కులను సాధించాల్సి ఉంటుంది. పరీక్ష ఆఫ్‌లైన్‌లో బుక్‌లెట్ ప్రశ్నపత్రం, ఓఎంఆర్ షీటు విధానంలో ఉంటుంది. మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఉంటాయి. రుణాత్మక మార్కులుండవు. కాబట్టి అన్ని ప్రశ్నలకూ సమాధానాలు రాయవచ్చు.

యూజీసీ నెట్‌కు సన్నద్ధమయ్యేవారు సిలబస్‌ను కూలంకషంగా చదవాలి. గత ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే ఒక అవగాహన వస్తుంది. దరఖాస్తు చేసినవారి సంఖ్యను పట్టించుకోకూడదు. వారిలో అతి తక్కువమంది మాత్రమే సీరియస్ అభ్యర్థులుంటారు. ప్రామాణిక పుస్తకాలు అధ్యయనం చేస్తే విజయం తప్పనిసరి!

ఎన్ని మార్కులు అవసరం?

జేఆర్ఎఫ్‌కు గత సంవత్సరాల్లో వివిధ సబ్జెక్టులు, కేటగిరీల నుంచి 3200 మందిని ఎంపిక చేశారు. కేరళ హైకోర్టు తీర్పును అనుసరించి యూజీసీ నూతన మార్పుల విధానం ప్రకారం ఈసారి నుంచి మొత్తం హాజరైన అభ్యర్థుల్లో ఆయా సబ్జెక్టుల్లో అర్హత సాధించిన 6 శాతం మందిని అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హత, జేఆర్ఎఫ్ కింద ఎంపిక చేస్తారు.

గత సంవత్సరాల్లో జేఆర్ఎఫ్‌కు జనరల్ అభ్యర్థులు 350 మార్కులకు 230- 240 వరకు సాధించారు. రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకూ, జనరల్ అభ్యర్థులకూ 20 మార్కుల తేడా ఉండవచ్చు.

ఈ యూజీసీ నెట్‌కు సన్నద్ధమయ్యేవారు సిలబస్‌ను కూలంకషంగా చదవాలి. గత ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే ఒక అవగాహన వస్తుంది. దరఖాస్తు చేసినవారి సంఖ్య ఎంత పెద్దదైనా పట్టించుకోనక్కర్లేదు. వారిలో అతి తక్కువమంది మాత్రమే సీరియస్ అభ్యర్థులుంటారు. కాబట్టి ప్రామాణిక పుస్తకాలు ఎంచుకుని అధ్యయనం చేయాలి. ఈ రకంగా సాధన చేస్తే తప్పనిసరిగా విజయం సాధిస్తారు. ఎంపిక చేసుకున్న సబ్జెక్టుకు సంబంధించి ఇగ్నో, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీల పుస్తకాలు, టాటా మెక్ గ్రాహిల్స్, ఉపకార్, అరిహంత్ ప్రచురణలు ఉపయోగకరం.

అర్హులయినవారి శాతం

గత సంవత్సరాల్లో యూజీసీ నెట్ రాసినవారిలో అర్హత సాధించినవారి శాతాన్ని పరిశీలిద్దాం.

2015 జూన్ - 4.83%
2015 డిసెంబర్ - 4.96%
2016 జులై - 4.08%
2017 జనవరి - 3.99%

జేఆర్ఎఫ్‌కు 1% నుంచి 1.5% వరకు ఉండవచ్చు.



అప్పలనాయుడు పి.
వరుణ్ స్టడీ సెంటర్

Stem from... కారణమా? ఫలితమా?

ఇంగ్లిష్ రాతలో, సంభాషణల్లో phrasal verbs ను ఉపయోగించడం వల్ల భాష సహజంగా ఉంటుంది. ఈవారం కొన్నింటిని ఉదాహరణల సాయంతో నేర్చుకుందాం!



ఎం. సురేశన్

Kapil: After a lot of argument I brought Arun round to my point that he was wrong (చాలా వివాదం తరువాత అరుణ్‌ను ఎలాగో ఒప్పించాను, అతను తప్పని).

Kiran: What was the problem? (అసలు సమస్య ఏంటి?)

Kapil: He was arguing all the time that Sridhar's grandparents brought him up. But I told him that it was not so (అంతసేపూ అతను వాదిస్తూనే ఉన్నాడు, శ్రీధర్‌ను అతని తాత, బామ్మ పెంచారని. కానీ నేనతనికి చెప్పాను, అదేం కాదని).

Kiran: He always argues about things he does not know. He sticks to his point and thinks he is incorrigible (అతనికి తెలియని విషయాలను గురించి కూడా అతను వాదిస్తూనే ఉంటాడు. అతనెప్పుడూ అతని అంశాన్నే అంటిపెట్టుకుని ఉంటాడు, తాను తప్పు చేయనివాడినని అనుకుంటాడు).

Kapil: This tendency of his stems from his thinking that he is always right (తానెప్పుడూ ఒప్పే అనుకోవడం నుంచే ఈ ధోరణి అతనికి ఉంటుంది).

Kiran: His uncle brings to bear upon him his influence. He is very much attached to his uncle, and takes after him (అతని మామయ్య ప్రభావం ఉంది అతనిమీద. అతనికి వాళ్ల మామయ్య మీద చాలా అభిమానం, ఆయన్ను పోలి ఉంటాడు కూడా).

Kapil: He has not been exposed to the outside world. So, he thinks he is always right (అతనికి బయటి ప్రపంచం అంతగా తెలీదు. అందుకని తనెప్పుడూ ఒప్పే అనుకుంటాడు).

Kiran: That certainly is the problem, His uncle backs him up at every stage (అదీ అసలు సమస్య. వాళ్ల మామ అతన్ని ఎప్పుడూ సమర్థిస్తుంటాడు).

Kiran: Any way I am going to meet him now and I will tell him about it (నేనతన్ని ఇప్పుడు కలవబోతున్నాను, ఈ విషయం అతనికి చెప్తాను).

Kiran: Bye then (వస్తా మరి).

Notes:

1. Bring somebody up = Raise a child (పెంచడం)

2. Sticks to – the phrasal verb: Stick to = adhere to (అంటిపెట్టుకుని ఉండటం)

3. backs him up – original phrase: back somebody up = support (సమర్థించడం)

4. Takes after – original form: take after = resemble (పోలి ఉండటం)

5. Unaware = not know (తెలీకపోవడం)

6. tendency = likelihood of happening / have a particular characteristic (ధోరణి/ ఏదైనా చేయాలనే పట్టు)


Look at the following sentences from the conversation above:

1) A lot of argument brought Kiran round to my point.

2) This tendency of his stems from his thinking that he is always right.

3) His uncle brings to bear upon him his influence.

1) Brought Kiran round to my point –



original phrasal verb: Bring someone round = convince someone about your point = నచ్చజెప్పడం/ ఒప్పించడం

a) Anand: Aravind had been maintaining that Subhash was obstinate (సుభాష్ మొండివాడని అరవింద్ వాదిస్తూనే ఉన్నాడు).

Amrith: But My experience has been different. He is quite flexible and can be easily brought round to our point (కానీ అతనితో నా అనుభవం వేరే. అతను మనం చెప్పేది వింటాడు, మనం చెప్పేదాన్ని అతనికి సులువుగా నచ్చజెప్పవచ్చు).

b) Praneetha: Sudha feels that the dresses sold in that shop are expensive. But I have found it otherwise (ఆ షాపులో అమ్మే బట్టలు ఖరీదని సుధ అభిప్రాయం. కానీ నాకు దానికి వ్యతిరేకంగా అనిపించింది).

Lathaangi: Sudha is always like that. She can never be brought round to our point (సుధ ఎప్పుడూ అంతే. తననెప్పుడూ మనం ఒప్పించలేం).

2) stems from – original form: to stem from = be caused by something / be the result of something (ఏదైనా కారణమవడం/ దేని ఫలితమైనా అవడం)

a) Venkatsh: Our friend Jeevan is a failure in life (మన స్నేహితుడు జీవన్ జీవితంలో విఫలమయ్యాడు).

Bhaskar: By nature, he is lazy, and his failure stems from his laziness (సహజంగా అతను సోమరి, అందుకని అతని వైఫల్యాలకు కారణం అతని సోమరితనమే).

b) Ramamurthy: You know Mrs Charitha has been jailed on corruption charges? (నీకు తెలుసా? చరిత గారిని అవినీతి ఆరోపణలమీద జైల్లో పెట్టారు).

Raghava: I am not surprised. It stems from her corrupt nature (నాకేం అది ఆశ్చర్యంగా అనిపించడం లేదు. దానికి ఆమె అవినీతి స్వభావమే కారణం).

3) Bring to bear upon = influence / have an effect on (ప్రభావం కలిగి ఉండటం/ ఫలితం చూపించడం)

a) Ramana: You know the cause of his dismissal from the job? (నీకు వాడిని ఉద్యోగం నుంచి తొలగించడానికి కారణాలు తెలుసా?)

Raju: Yes, he brought to bear upon the investigators his contacts with the ministers. They were not, however influenced (ఆ, తెలుసు. మంత్రులతో తనకున్న సంబంధాలు/ పలుకుబడిని దర్యాప్తు చేసేవాళ్ల దృష్టికి తీసుకెళ్లాడు. కానీ వాళ్లేం దానివల్ల ప్రభావితం కాలేదు).

సోషల్ మీడియా మార్కెటింగ్‌లో..





1. మొబైల్ ఆప్ డెవలప్‌మెంట్
సంస్థ: పుల్లర్ లాజిస్టిక్స్
ప్రదేశం: వర్క్ ఫ్రం హోం
స్టైపెండ్: నెలకు రూ.3000
లింకు: internshala.com/ i/5313
గడువు: సెప్టెంబరు 5, 2017
అర్హత: పీహెచ్‌పీ, మైఎస్‌క్యూఎల్, ఆండ్రాయిడ్ నైపుణ్యాలు ఉన్నవారు.

2. బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)
సంస్థ: సాయి మార్కెటింగ్
ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ.6000
లింకు: internshala.com/ i/5314
గడువు: సెప్టెంబరు 5, 2017
అర్హత: సంబంధిత నైపుణ్యాలున్న విద్యార్థులూ, గ్రాడ్యుయేట్లూ.

3. నెట్ డెవలప్‌మెంట్
సంస్థ: గ్లాన్సా సొల్యూషన్స్
ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ.8000
లింకు: internshala.com/ i/5315
గడువు: సెప్టెంబరు 5, 2017
అర్హత: నెట్ నైపుణ్యాలున్నవారు.

4. హ్యూమన్ రిసోర్సెస్ (హెచ్ఆర్)
సంస్థ: ఏంజెల్ బ్రోకింగ్
ప్రదేశం: సికింద్రాబాద్, హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ.4000
లింకు: internshala.com/ i/5316
గడువు: సెప్టెంబరు 5, 2017
అర్హత: సంబంధిత నైపుణ్యాలున్న విద్యార్థులూ, గ్రాడ్యుయేట్లూ.

5. ఈ-కామర్స్ ఆపరేషన్స్
సంస్థ: ఆర్.ఆర్. లైఫ్‌స్టైల్స్
ప్రదేశం: బెంగళూరు
స్టైపెండ్: నెలకు రూ.10,000
లింకు: internshala.com/ i/5317
గడువు: సెప్టెంబరు 5, 2017
అర్హత: ఎంఎస్ ఆఫీస్, అకౌంటింగ్, ఇంగ్లిష్ నైపుణ్యాలున్నవారు.

6. మార్కెటింగ్
సంస్థ: ఫ్యాషన్‌పరీ
ప్రదేశం: విశాఖపట్నం, హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు
స్టైపెండ్: నెలకు రూ.5000
లింకు: internshala.com/ i/5318
గడువు: సెప్టెంబరు 21, 2017
అర్హత: ఎంఎస్ ఆఫీస్, ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ నైపుణ్యాలు ఉన్నవారు.

7. వెబ్ డెవలప్‌మెంట్
సంస్థ: Secureitalb
ప్రదేశం: వర్క్ ఫ్రం హోం
స్టైపెండ్: నెలకు రూ.5000
లింకు: internshala.com/ i/5325
గడువు: సెప్టెంబరు 5, 2017
అర్హత: పీహెచ్‌పీ, నోడ్.జేఎస్, పైథాన్ నైపుణ్యాలు ఉన్నవారు.

8. డిజిటల్ మార్కెటింగ్
సంస్థ: రాజనీతి మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్స్
ప్రదేశం: వర్క్ ఫ్రం హోం
స్టైపెండ్: నెలకు రూ.3000 నుంచి రూ.5000
లింకు: internshala.com/ i/5326
గడువు: సెప్టెంబరు 5, 2017
అర్హత: సోషల్ మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ నైపుణ్యాలు ఉన్నవారు.

9. సోషల్ మీడియా మార్కెటింగ్
సంస్థ: రిలీజ్‌మైఆడ్
ప్రదేశం: వర్క్ ఫ్రం హోం
స్టైపెండ్: నెలకు రూ.2500 నుంచి రూ.5000
లింకు: internshala.com/ i/5327
గడువు: సెప్టెంబరు 5, 2017
అర్హత: సోషల్ మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ నైపుణ్యాలు ఉన్నవారు

10. ఎడ్యుకేటర్ (క్యాట్ 2017)
సంస్థ: అన్‌అకాడమీ
ప్రదేశం: వర్క్ ఫ్రం హోం
స్టైపెండ్: నెలకు రూ.4000 నుంచి 6000
లింకు: internshala.com/ i/5329
గడువు: సెప్టెంబరు 5, 2017
అర్హత: టీచింగ్, ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ నైపుణ్యాలు ఉన్నవారు.

(మరిన్ని ఇంటర్న్‌షిప్‌ల కోసం www.eenadupratibha.net చూడండి...)

రెండు తెలుగు రాష్ట్రాల్లో విలువైన పని అనుభవం పొందేలా తోడ్పడటంతోపాటు స్టైపెండ్‌ను కూడా అందిస్తున్నాయి వివిధ సంస్థల ఇంటర్న్‌షిప్‌లు. ఈ వివరాలను ఇలా.. ప్రతివారం అందిస్తున్నాం.విద్యార్థులు తగిన విచారణ చేసుకుని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి!

- http://internshala.com

నర్సింగ్ పూర్తయింది, ఎంబీబీఎస్ చేయొచ్చా?



❋ ఎస్ఎస్‌సీ తర్వాత ఐటీఐ చేశాను. ప్రస్తుతం టెలికాం సంస్థలో ఉద్యోగం చేస్తున్నాను. డిప్లొమా చేయాలనుంది. పదోన్నతులకు ఏ డిప్లొమా సహకరిస్తుందో వివరించండి.
- కిషన్, కరీంనగర్


✤ మీరు ఐటీఐ ఏ విభాగంలో పూర్తిచేశారో తెలుపలేదు. టెలికాం రంగంలో ఏ విభాగంలో పనిచేస్తున్నారో కూడా తెలుపలేదు. టెలికాంలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, సిగ్నల్ వ్యవస్థ, టవర్స్ వంటి వివిధ విభాగాలున్నాయి. మీరు చేస్తున్న విభాగాన్ని బట్టి డిప్లొమా ఎంచుకోవాల్సి ఉంటుంది. ఐటీఐ పూర్తిచేసినవారు లేటరల్ ఎంట్రీ ద్వారా పాలిటెక్నిక్ కోర్సును నేరుగా రెగ్యులర్ విధానంలో చేరవచ్చు. టెలికాం రంగంలో ఉన్నారు కాబట్టి, ఈసీఈ స్పెషలైజేషన్‌ను ఎంచుకోవడం ఉపయోగకరం. దూరవిద్యలో పాలిటెక్నిక్ డిప్లొమా చేయడం వీలు కాదు. మీరు డిగ్రీ పూర్తి చేసినట్లయితే ఆ తర్వాత దూరవిద్యలో పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ టెలికాం మేనేజ్‌మెంట్ కోర్సును ఎంచుకోవచ్చు.

❋ దూరవిద్య ద్వారా ఎంఏ (పొలిటికల్ సైన్స్), రెగ్యులర్ విధానంలో ఎంబీఏ చేస్తున్నాను. నెట్ రాయాలనుకుంటున్నాను. కటాఫ్ మార్కుల వివరాలను తెలపండి. రెండు కోర్సులను ఒకే సంవత్సరంలో చేయడం వల్ల ఏమైనా సమస్యలుంటాయా?
- భుక్య రాములు, ఖమ్మం




✤ ఏవేని రెండు డిగ్రీ కోర్సులు కానీ, రెండు పీజీ కోర్సులు కానీ సమాంతరంగా ఒకే సంవత్సరంలో చేయకూడదు. అలా రెండు కోర్సులు అభ్యసించినా ఒక కోర్సును మాత్రమే క్లెయిం చేసుకోగలరు. నెట్ రాయాలనుకుంటున్నట్లు చెప్పారు కానీ, మీరు చదువుతున్న వాటిల్లో వేటిని రాయాలనుకుంటున్నారో తెలియజేయలేదు. సాధారణంగా నెట్ కటాఫ్ మార్కులు సంబంధిత పరీక్ష రాసే విద్యార్థుల సంఖ్య, వాళ్లు పొందే మార్కులనుబట్టి ఆధారపడి ఉంటాయి. యూజీసీ తాజా ఉత్తర్వుల ప్రకారం ఉత్తమంగా మార్కులు సాధించిన అత్యుత్తమమైన 6% మందిని ఉత్తీర్ణులుగా ప్రకటిస్తారు.

❋ డిగ్రీ (బీఎస్‌సీ) రెండో సంవత్సరంతో ఆపేశాను. దూరవిద్య ద్వారా కొనసాగించాలనుకుంటున్నాను. నేను సివిల్స్ రాయడానికి అర్హుడినేనా? **- ఎం. నవీన్ కుమార్,** నారాయణవరం



✤ ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు జాతీయస్థాయిలో నిర్వహించే సివిల్స్ రాయడానికి అర్హులు. మీరు డిగ్రీ పూర్తిచేస్తే ఈ పరీక్షను రాయడానికి అర్హులే. సన్నద్ధతను గురించి తెలుసుకోవాలనుకుంటే **www.eenadupratibha.net** వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. మీరు ముందుగా డిగ్రీని దూరవిద్య విధానంలోకి మార్పించుకుని రెండో సంవత్సరం నుంచి కొనసాగించవచ్చు. రెగ్యులర్ విధానం నుంచి దూరవిద్యకు డిగ్రీని మార్చుకుని కొనసాగించే వెసులుబాటు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం **(ANU)**, గుంటూరు; ఆంధ్ర విశ్వవిద్యాలయం , విశాఖపట్నం వంటివి కల్పిస్తున్నాయి. తగిన విచారణ చేసుకుని చదువును కొనసాగించండి.



❋ బీఎస్‌సీ (నర్సింగ్) నాలుగేళ్ల కోర్సు చేశాను. కానీ నాకు ఎంబీబీఎస్ చేయాలని ఉంది. వీలుంటుందా? **- ఎం. జోషి రాజు**



✤ ఎంబీబీఎస్ చేయదలచుకున్నవారు సీబీఎస్‌సీ వారు నిర్వహించే నీట్‌ను రాయవలసి ఉంటుంది. నీట్ జాతీయ స్థాయిలో ఎంబీబీఎస్‌లో చేరడానికి నిర్వహించే ప్రవేశపరీక్ష. కనిష్ఠ వయఃపరిమితి 17 ఏళ్లు కాగా సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం గరిష్ఠ వయఃపరిమితి లేదు. 10+2లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీల్లో 50% మార్కులతో ఉత్తీర్ణులైనవారు ఈ పరీక్షను రాయవచ్చు. దీనిలో వచ్చిన ర్యాంకును బట్టి దేశవ్యాప్తంగా ఉన్న కళాశాలల్లో సీటును పొందవచ్చు. మీరు 10+2లో బైపీసీ చదివుంటే మీకు అర్హత ఉన్నట్లే.



ప్రొ. బి. రాజశేఖర్
కెరియర్ కౌన్సెలర్

నీట్ సన్నద్ధతకు...



వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశానికి జాతీయస్థాయిలో నిర్వహించే నీట్ ప్రక్రియ ఒక పక్కన ఇంకా కొనసాగుతూనే ఉంది. మరో పక్క వచ్చే సంవత్సరం పరీక్ష కోసం అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. వీరి కోసం 'సెంగేజ్ లెర్నింగ్' అయిదు పుస్తకాలను విడుదల చేసింది. బయాలజీ, ఫిజిక్స్ సబ్జెక్టులను రెండు రెండు భాగాలుగా, కెమిస్ట్రీలోని రెండో భాగాన్ని వెలువరించారు. ఇందులో మౌలికాంశాలను సమగ్రంగా అందించేందుకు ప్రయత్నించారు. ప్రతి అధ్యాయం చివర విషయంపై అవగాహన పెంపొందించుకోడానికి ఉపయోగపడే బిట్లు, పరీక్ష కోణంలో తయారు చేసిన బిట్లు ఇచ్చారు. అధ్యాయాలవారీగా గత పరీక్షల్లో వచ్చిన ప్రశ్నలను జవాబులతో అందించారు. దీని వల్ల ఏయే అధ్యాయాల నుంచి ఎలాంటి ప్రశ్నలు వస్తున్నాయో అభ్యర్థులు అర్థం చేసుకొని తమ అధ్యయన ప్రణాళికలను రూపొందించుకోవచ్చు.

1) నీట్ బయాలజీ పార్ట్-1, పేజీలు: 689, ధర: రూ. 650
2) నీట్ బయాలజీ పార్ట్-2, పేజీలు: 469, ధర: రూ. 525
3) నీట్ ఫిజిక్స్ పార్ట్-1, పేజీలు: 967, ధర: రూ. 825
4) నీట్ ఫిజిక్స్ పార్ట్-2, పేజీలు: 945, ధర: రూ. 699
5) నీట్ కెమిస్ట్రీ పార్ట్-2, పేజీలు: 1529, ధర: రూ. 995

జవహర్ నవోదయ



జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో చేరాలంటే ప్రవేశ పరీక్ష రాయాలి. ఏటా జరిగే ఈ పరీక్షకు 2018లో తెలుగు రాష్ట్రాల నుంచి హాజరు కాబోయే అభ్యర్థుల కోసం 'వీజీఎస్ బుక్ లింక్స్' తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో రెండు పుస్తకాలను ప్రచురించింది. అప్పటివరకు అకడమిక్‌గా పరీక్షలు రాసిన విద్యార్థులు ఒక్కసారే ఒక ప్రవేశపరీక్షకు హాజరవడంలో ఉండే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ మెటీరియల్ రూపొందించారు. ముఖ్యంగా కొత్త విభాగం అయిన మనోసామర్థ్యానికి సంబంధించి చక్కటి ఉదాహరణలతో సమాచారం అందించారు. అలాగే గణితం, తెలుగు పేపర్ల కోసం కూడా ఇచ్చిన ముఖ్యాంశాలు, బిట్లు ఉపయోగకరంగా ఉన్నాయి. 2005 నుంచి 2017 వరకు జరిగిన పరీక్షల ప్రశ్నపత్రాలకు సమాధానాలు ఇచ్చారు. ఈ పుస్తకంతోపాటు అయిదు సెట్ల ప్రాక్టీస్ పేపర్లు ఉన్న అనుబంధాన్ని ఉచితంగా అందించారు.

1) 6వ తరగతి జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశపరీక్షా దర్శిని (తెలుగు మాధ్యమం) ధర: రూ. 189
2) జవహర్ నవోదయ విద్యాలయ ఎంటెన్స్ ఎగ్జామినేషన్ గైడ్ - క్లాస్-6 (ఇంగ్లిష్ మీడియం) ధర: రూ. 207

చిరునామా:
చదువు
ఈనాడు కార్యాలయం,
అనాజ్‌పూర్,
హయత్‌నగర్ మండలం,
రామోజీ
ఫిల్మ్‌సిటీ – 501512
e-mail:
edc@eenadu.net

సింధు శిఖరాన..!

ఛాంపియన్

7 ప్రపంచ బ్యాడ్మింటన్‌లో ఇప్పటివరకు భారత్ సాధించిన పతకాలు. 1983లో ప్రకాశ్ పదుకొనె తొలి పతకం అందుకున్నాడు. పురుషుల సింగిల్స్‌లో కాంస్యం నెగ్గాడు. ఆ తర్వాత 2011లో గుత్తా జ్వాల-అశ్విని పొన్నప్ప జోడీ మహిళల డబుల్స్‌లో కాంస్యం సొంతం చేసుకుంది. మహిళల సింగిల్స్‌లో 2013, 2014లో వరుసగా రెండేళ్లు కాంస్యం నెగ్గిన పి.వి. సింధు.. ఈ ఏడాది రజతంతో మెరిసింది. 2015లో రజతం గెలుచుకున్న సైనా ఈసారి కాంస్యంతో సరిపెట్టుకుంది.



నొజొమి ఒకుహర

"పూసర్ల వెంకట సింధు పేరును గుర్తుంచుకోండి. 22 ఏళ్ల ఈ అమ్మాయి ఈ తరానికి ఆదర్శం. సింధును చూసి దేశం గర్విస్తోంది. ఉత్కంఠభరిత ఫైనల్లో అసాధారణంగా పోరాడిన సింధు.. భారత్ క్రికెట్‌ను వదిలి బ్యాడ్మింటన్ చూసేలా చేసింది"

– వీరేంద్ర సెహ్వాగ్

"ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో నీ పోరాటం పట్ల గర్విస్తున్నాం. సింధు.. ఫైనల్లో చాలా బాగా ఆడావ్. అభినందనలు"

– ప్రధాని నరేంద్ర మోదీ



సింధూ.. సింధూ.. ఆదివారం దేశమంతా సింధు నామ జపం చేసింది! క్రికెట్లో టీమ్ ఇండియా.. శ్రీలంకపై సిరీస్ విజయాన్ని అందుకుంటున్నా.. తమకేం పట్టదన్నట్టుగా కోట్లాది కళ్లు బ్యాడ్మింటన్‌కు అతుక్కుపోయాయి.. దాదాపు రెండు గంటల ఉత్కంఠభరిత పోరాటాన్ని తనివితీరా ఆస్వాదించాయి..! ఫైనల్లో ఫలితం ప్రతికూలంగా ఉండొచ్చు గానీ భారత క్రీడా రంగంలో సింధు తెచ్చిన మార్పేమిటో చెప్పేందుకు ఈ ఒక్క ఉదాహరణ చాలు..!

ఈనాడు – హైదరాబాద్

ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఒక పతకం గెలిస్తేనే గొప్ప. రెండు పతకాలు సాధిస్తే అద్భుతమే. మరి మూడు పతకాలు గెలిస్తే.. సింగిల్స్‌లో మరెవరికీ సాధ్యంకాని ఈ ఘనతను అందుకుంది తెలుగమ్మాయి పూసర్ల వెంకట సింధు! ఒక్క ప్రపంచ ఛాంపియన్‌షిప్ మాత్రమే కాదు.. ఒలింపిక్స్.. ఉబెర్ కప్.. ఆసియా క్రీడలు.. ఆసియా ఛాంపియన్‌షిప్.. కామన్వెల్త్ క్రీడలు.. సూపర్ సిరీస్.. గ్రాండ్‌ప్రి గోల్డ్... ఇలా బ్యాడ్మింటన్‌లో ఉన్న ప్రతి టోర్నీలో పతకాలు.. టైటిళ్లతో సింధు తనదైన ముద్రవేసింది. 22 ఏళ్ళకే అనితరసాధ్యమైన అద్వితీయ ఘనతలతో అత్యున్నత స్థానానికి చేరుకుంది సింధు. ఇంత చిన్న వయసులో అన్ని ఘనతల్ని అందుకున్న క్రీడాకారిణి బహుశా సింధునే కావొచ్చు! మిగతా క్రీడల సంగతి అటుంచితే బ్యాడ్మింటన్ వరకైతే కచ్చితంగా సింధుదే అగ్రస్థానం. ప్రపంచ ఛాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్‌లో మూడు పతకాలు సాధించిన ఏకైక క్రీడాకారిణి సింధునే! ప్రపంచ మేటి ఆటగాడు లిన్ డాన్ (5 స్వర్ణాలు) తర్వాత సింగిల్స్‌లో అత్యధిక పతకాలు అందుకున్న ఘనత దక్కించుకుంది మన మ్మాయే. వరుసగా ఒలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఫైనల్స్‌కు చేరిన భారత షట్లర్ సింధునే.

భారత బ్యాడ్మింటన్ దిగ్గజం ప్రకాశ్ పదుకొనె ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో సాధించింది ఒక కాంస్యమే! ప్రకాశ్ వారసుడు పుల్లెల గోపీచంద్ ఆల్ ఇంగ్లాండ్ సూపర్ సిరీస్ టైటిల్ గెలిచాడు. ఐతే సింధు ఖాతాలో ఇప్పటికే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఒక రజతం, రెండు కాంస్యాలు.. ఒక సూపర్ సిరీస్ టైటిల్ ఉన్నాయి. వాటికి జతగా ఒలింపిక్స్ రజతం ఉండనే ఉంది. ఈలెక్కన దిగ్గజ ఆటగాడు ప్రకాశ్‌ను సింధు ఎప్పుడో దాటేసినట్లే! తన గురువు గోపీచంద్‌ను ఎప్పుడో అధిగమించినట్లే! ఒలింపిక్స్‌లో కాంస్యం.. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రజతం, కాంస్యం సాధించిన సీనియర్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్‌ను సైతం సింధు వెనక్కినెట్టేసినట్లే..! మొత్తంగా భారత బ్యాడ్మింటన్ చరిత్రలో సింధుది సరికొత్త అధ్యాయం. అత్యుత్తమ క్రీడాకారిణిగా సింధు పేరు చిరస్మరణీయం!

కొందరి ఆటలో నైపుణ్యం చూస్తాం. మరికొందరిలో క్రమశిక్షణ.. ఇంకొందరిలో అంకితభావం, పట్టుదల, పోరాటస్ఫూర్తి గమనిస్తాం. సింధు మాత్రం వీటన్నింటి కలబోత. నిరుడు ఒలింపిక్స్‌లో రజతం గెలిచాక సింధు స్థాయే మారిపోయింది. క్రికెటర్లతో సమానంగా (చాలా మంది కంటే ఎక్కువే) పేరు, డబ్బు వచ్చాయి. అయినా ఒక్కరోజు కూడా శిక్షణను ఎగ్గొట్టలేదు. ఒక్క సెషన్‌కు దూరమవలేదు. "ఒలింపిక్స్‌లో పతకం సాధించినా సింధులో మార్పేమీ లేదు. అందరి కంటే ముందే కోర్టులో ప్రత్యక్షమవుతుంది" అంటోన్న తండ్రి రమణ మాటలే సింధు నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనం.

సమకాలీన షట్లర్లలో సింధుది ప్రత్యేక స్థానం. స్థాయి. నైపుణ్యం పరంగా టాప్-10లో ఉండే క్రీడాకారిణుల్లో పెద్దగా తేడాలు లేకపోయినా ఫిట్‌నెస్‌లో సింధుది శిఖర స్థాయి. సింధు మాదిరి దూకుడుగా సుదీర్ఘంగా ఆడటం చాలామందికి సాధ్యంకాదు. మూడు గేమ్‌ల వరకు సాగే చాలామ్యాచ్‌ల్లో సింధుదే పైచేయి. ఆదివారం ఒకుహరతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌ను మినహాయిస్తే తన కెరీర్‌లో ఒక గంటకు పైగా సాగిన మ్యాచ్‌ల్లో మూడో గేమ్‌ను సగటున 12 నిమిషాల్లోనే ముగించడం సింధు సత్తాకు నిదర్శనం. గోపీచంద్ అకాడమీలో అమ్మాయిలు, అబ్బాయిలు కలిసి సాధన చేస్తుంటారు. అందులో కశ్యప్, శ్రీకాంత్, సాయిప్రణీత్, గురుసాయిదత్‌తో సహా అందరూ ఉంటారు. ప్రాక్టీసులో వీరంతా అలసిపోయిన సందర్భాలెన్నో! కానీ సింధు విషయంలో అలాంటి సందర్భం ఒక్కటీ ఉండదన్న రమణ మాటల్లో అతిశయోక్తి లేదు! అరుదైన స్ట్రోక్‌లు.. ఆల్‌రౌండ్ ఆట.. అద్వితీయమైన ఫిట్‌నెస్ కలగలిసిన సింధు బ్యాడ్మింటన్‌లో బాహుబలే!

ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్



పతకమే రజతం ఆట బంగారం!

- పోరాడి ఓడిన సింధు
- ఆఖరి వరకు పట్టువదలని తెలుగు తేజం
- జపాన్ అమ్మాయిని వరించిన విజయం

ఓటమిని కూడా సగర్వంగా భావించే సందర్భాలు ఎప్పుడో కానీ రావు! ఓడిన వాళ్లను కూడా విజేతలుగా కీర్తించే పెద్ద మనసు అన్నిసార్లూ రాదు! రజతాన్ని బంగారంలా భావించేంత సంతృప్తి అన్ని వేళలా కనిపించదు!

ఏడాది కిందట ఇలాంటి అపురూప దృశ్యాల్నే చూశాం! ఇలాంటి అరుదైన భావనలతో ఉద్వేగానికి లోనయ్యాం!

రియో ఒలింపిక్స్ మహా సంగ్రామంలో ఆమె అద్భుత ప్రదర్శనకు ముగ్ధులయ్యాం! ఆమె అసాధారణ పోరాటానికి సలాం కొట్టాం! ఓడినా.. వెన్నుతట్టాం! ఆమెకు భుజం కాశాం! ఆమెను ఓ విజేత లాగే అపూర్వ రీతిలో ఆదరించాం!

ఇప్పుడు వేదిక మారింది. టోర్నీ మారింది. ఇక్కడ రియోను మించిన పోరాటం.. అంతకు మించిన నైపుణ్యం.. అంతకుమించిన స్ఫూర్తి! కానీ చివరికి నిరాశే మిగిలింది! ఆమె ఓడింది!

కానీ ఆమెను పరాజితురాలిగా చూడగలమా! ఆ పోరాటాన్ని తక్కువ చేయగలమా! ఆమె ఆటను కొనియాడకుండా ఉండగలమా!

ఇద్దరూ గొప్పగా ఆడినా.. ఎవ్వరూ ఓడాల్సినవారు కాకపోయినా.. ఆట అన్నాక ఎవరో ఒకరు ఓటమి వైపు ఉండాల్సిందే! గెలుపు ముంగిట చిన్న తడబాటు.. సింధు ఓటమి లోకి నెట్టేసింది! ఆమెకు స్వర్ణాన్ని దూరం చేసింది!

రియోలోనే కాదు.. గ్లాస్గోలోనూ సింధు గెలిచింది రజతమే! కానీ అప్పుడూ.. ఇప్పుడూ ఆమె ఆట మాత్రం బంగారమే! స్వర్ణం గెలవకపోయినా మరోసారి కోట్లాది హృదయాల్ని గెలిచింది మన సింధు!

రియోలో మాదిరే ఇదీ సగర్వమైన ఓటమే.. సింధు ఇప్పుడూ విజేతే.. ఈ రజతమూ బంగారమే!

గ్లాస్గో

చూసే వాళ్లకే ఊపిరి ఆగిపోయేంత ఉత్కంఠ.. ఉద్వేగం..! మరి మైదానంలో వాళ్లెలా ఆడారో..! అది మ్యాచ్ కాదు.. యుద్ధమే! ఎందుకంటే ఓడితే ప్రాణం పోతుందా అన్నట్లే పోరాడారు ఆ ఇద్దరూ! ఎక్కడి నుంచి వచ్చిందో అంత కసి.. అంతటి పోరాట పటిమ.. అంతటి గెలుపు కాంక్ష! నువ్వెంతంటే నువ్వెంతన్నట్లు.. ఎందాకైతే అందాకన్నట్లు.. దాదాపు రెండు గంటల అపూర్వ పోరాటం! స్వేదం పారింది.. కేరింతల వర్షం కురిసింది.. శక్తిసామర్థ్యాలన్నీ హరించుకుపోయి ఇద్దరూ కోర్టులో తూలిపోయే పరిస్థితి. అయినా పోరాటం ఆపలేదు. ఈ ఆటలో ఇంత మజా ఉందా అనిపించేలా.. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కే వన్నె తెచ్చేలా తలపడి.. కలబడి.. పోరాడిన ఆ ఇద్దరూ విజేతలే! ఒకరు స్వర్ణ పతక విజేత.. మరొకరు అభిమానుల హృదయ విజేత!

తెలుగు తేజం పూసర్ల వెంకట సింధు మరోసారి అభిమానుల హృదయాల్ని గెల్చుకుంది. అసాధారణ రీతిలో.. అత్యంత హోరాహోరీగా సాగిన ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్ ఫైనల్లో ఆమె పోరాడి ఓడింది. ఆదివారం గంటా 50 నిమిషాల పాటు సాగిన పోరులో మూడో సీడ్ సింధు 19-21, 22-20, 20-22తో ఏడో సీడ్ నొజొమి ఒకుహర (జపాన్) చేతిలో పరాజయం చవిచూసింది. సింధు.. ఒకుహర ఒక్కో పాయింటు కోసం పోరాడిన తీరు అద్భుతం. అద్భుత నైపుణ్యానికి, పోరాటానికి చిరునామాలా నిలిచిన ఈ ఫైనల్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోవడం ఖాయం.

మ్యాచ్ ఆరంభంలో జోరు సింధుదే. కళ్లు చెదిరే స్మాష్‌తో ఆరో పాయింట్ (6-5) దగ్గర ఆమె ఆధిక్యంలోకి వచ్చింది. ర్యాలీలు ఆడుతూ క్రాస్‌కోర్ట్ స్మాష్‌లతో వరుసగా పాయింట్లు రాబట్టి 11-6తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. పొడగరి అయిన సింధు ఆ సానుకూలతను ఉపయోగించుకుని స్మాష్‌లు కొట్టింది. ఐతే ఒకుహర చురుగ్గా కదులుతూ షటిల్స్‌ను లాఘవంగా అవతలి కోర్టులోకి పంపించింది. 14 పాయింట్ల వద్ద స్కోరును సమం చేసిన ప్రత్యర్థి ఆధిపత్యం కనబరిచింది. 18-14తో తొలి గేమ్‌కు చేరువైంది. ఈ సమయంలో సింధు పుంజుకుని గేమ్‌ను 19-19తో ఉత్కంఠగా మార్చేసింది. ఐతే షటిల్‌ను నెట్‌కు ఆడటం.. బయటికి కొట్టడంతో వరుసగా రెండు పాయింట్లు జారవిడుచుకున్న సింధు 19-21తో తొలి గేమ్‌ను కోల్పోయింది. రెండో గేమ్ భిన్నంగా సాగింది. సింధు 9-3 ఆధిక్యం రాబట్టింది. ఐతే ఒకుహర పోరాడి 12 పాయింట్ల వద్ద సింధును అందుకుంది. ఇటు సింధు.. అటు ఒకుహర పాయింటు పాయింటుకు తీవ్రంగా శ్రమించారు. ఐతే క్రాస్‌కోర్ట్, డ్రాప్, స్మాష్‌లతో తన అస్త్రాలన్నీ ప్రయోగించిన సిధు 20-17తో రెండో గేమ్‌కు చేరువైంది. ఈ సమయంలో వరుసగా 3 పాయింట్లు రాబట్టిన ఒకుహర 20-20తో స్కోరును సమం చేసింది. ర్యాలీతో ప్రత్యర్థికి చెక్ పెట్టిన సింధు వరుసగా 2 పాయింట్లతో మ్యాచ్‌ను మూడో గేమ్‌కు తీసుకెళ్లింది.

ఒకుహర తేలికైన ప్రత్యర్థి కాదు. మా ఇద్దరి మధ్య మ్యాచ్‌లు ఎప్పుడూ సుదీర్ఘ ర్యాలీలతో కఠినంగానే సాగాయి. అందుకే ఫైనల్‌కు ముందు ఎలాంటి అవకాశాన్ని వదులుకోలేదు. కఠోర సాధన చేశాను. అయినా ఫలితం లేకపోయింది. ఈ రోజు నాది కాదంతే. మూడో గేమ్‌లో 20-20 వద్ద మ్యాచ్‌లో ఇద్దరికీ సమాన అవకాశముంది. స్వర్ణానికి చాలా చేరువుగా వచ్చినా ఆఖర్లో చేసిన తప్పిదం మ్యాచ్ స్వరూపాన్ని మార్చేసింది. ఫైనల్లో ప్రతి పాయింటు కోసం తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. అతిపెద్ద మ్యాచ్ ఇది. దురదృష్టవశాత్తు నేను విజయాన్ని అందుకోలేకపోయాను. మొత్తంమీద ఈ ప్రపంచ ఛాంపియన్‌షిప్ భారత్‌కు మంచి ఫలితాలనే అందించింది. రెండు పతకాలు గెలిచినందుకు దేశంలో అంతా గర్విస్తున్నారు. రజతం నాలో మరింత విశ్వాసాన్ని నింపుతుందనడంలో సందేహం లేదు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధిస్తాను.

- ఈనాడుతో పి.వి. సింధు

నిర్ణయాత్మక మూడో గేమ్ ఇద్దరి శక్తి సామర్థ్యాలకు పరీక్షగా నిలిచింది. పాయింటు పాయింటుకు కోర్టులోనే కూలబడిపోయే పరిస్థితికి వచ్చారు. అయినా పట్టు వదల్లేదు. 11-9తో సింధు ఆధిక్యంలోకి వెళ్లినా.. ఒకుహర వదల్లేదు. 15, 16, 17 పాయింట్ల వద్ద స్కోర్లు సమమవుతూ వచ్చాయి. 19-17తో సింధు విజయానికి 2 పాయింట్ల దూరంలో నిలిచింది. ఈ సమయంలో క్రాస్‌కోర్ట్ స్మాష్, డ్రాప్ షాట్లతో వరుసగా 3 పాయింట్లు సాధించిన ఒకుహర 20-19తో మ్యాచ్‌కు చేరువైంది. ఒక్క పాయింటు గెలిస్తే మ్యాచ్ ప్రత్యర్థిదే. అయినా సింధు పట్టు వదల్లేదు. ఒంట్లో ఓపిక లేకపోయినా సుదీర్ఘ ర్యాలీతో పాయింటు రాబట్టి మ్యాచ్‌పై ఆశలు నిలుపుకొంది. ఐతే ఆ తర్వాతి పాయింటునే సింధు నెట్‌కు ఆడటంతో ప్రత్యర్థికి మరో మ్యాచ్ పాయింట్ లభించింది. సింధును ర్యాలీ గేమ్‌తో కోర్టు నలువైపులా తిప్పిన అద్భుతమైన డ్రాప్‌షాట్ ఆడింది. అప్పటికే బాగా అలసిపోయిన సింధు ముందుకు వంగి షటిల్‌ను అందుకోలేకపోయింది. అంతే.. సింధుకు మ్యాచ్ దూరమైంది.

వారెవా.. ఆ ర్యాలీ

సింధు, ఒకుహర ఇద్దరికీ 22 ఏళ్లే. కెరీర్‌లో మంచిదశలో ఉన్నారు. ఇంకేం.. బ్యాడ్మింటన్ అభిమానులకు వారి పోరు కనువిందే అయింది. ఇద్దరి మధ్య సాగిన సుదీర్ఘ ర్యాలీలు మ్యాచ్‌కే ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రెండో గేమ్‌లో సింధు 21-20తో ఆధిక్యంలో ఉన్న సమయంలో సింధు, ఒకుహర మధ్య ఒక ర్యాలీ 73 షాట్ల పాటు సాగడం విశేషం. ఈ ర్యాలీలో సింధు నెగ్గడంతో మ్యాచ్ మూడో గేమ్ వరకు వెళ్లింది. తొలి గేమ్‌లో 31.. రెండో గేమ్‌లో 43, 33.. మూడో గేమ్‌లో 42 షాట్ల ర్యాలీలు ఉర్రూతలూగించాయి. చివరి గేమ్ ఒక్కటే 50 నిమిషాలు సాగడం విశేషం.

జపాన్ చిరుత

ఈ ప్రపంచ ఛాంపియన్‌షిప్ ప్రదర్శనతో ఒకుహర పేరును అంత సులువుగా మరిచిపోలేరు. సింధుతో ఫైనల్‌కు ముందు ఈ జపాన్ చిరుత రెండు మూడు గేమ్‌ల మ్యాచ్‌లు ఆడటం.. అవి రెండూ గంటన్నర, గంటంబావు వ్యవధుల్లో సాగడం గమనార్హం. అలాంటి స్థితిలో సింధు లాంటి బలమైన ప్రత్యర్థిని నిలువరించిన తీరు అమోఘం. నిరుడు రియో ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలుస్తుందని భావించిన ఒకుహర గాయం కారణంగా స్థాయికి తగ్గట్లు ఆడలేకపోయింది. సెమీస్‌లో సింధు చేతిలో ఓడి కాంస్యంతో సరిపెట్టుకుంది. ఒకుహర అత్యుత్తమ ర్యాంకు 3.



పతకాలతో సింధు, సైనా



మ్యాచ్ అనంతరం కోచ్ గోపీచంద్, తల్లి విజయ, చాముండిలతో సింధు

సింధు, సైనాకు బాయ్ నజరానా

దిల్లీ: ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో రజతం నెగ్గిన పి.వి. సింధుకు, కాంస్యం గెలిచిన సైనా నెహ్వాల్‌కు భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) నజరానా ప్రకటించింది. సింధుకు రూ. 10 లక్షలు, సైనాకు రూ. 5 లక్షలు ఇవ్వనున్నట్లు బాయ్ అధ్యక్షుడు హిమంత బిస్వా శర్మ చెప్పాడు.



అక్సెల్‌సన్

లిన్ డాన్‌కు షాక్

పురుషుల సింగిల్స్ విజేత అక్సెల్‌సన్

గ్లాస్గో: ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో అత్యధికంగా ఆరు స్వర్ణాలు నెగ్గిన షట్లర్‌గా నిలవాలనుకున్న చైనా దిగ్గజం లిన్ డాన్ కల నెరవేరలేదు. ఆరో టైటిల్ వేటలో లిన్ డాన్ విఫలమయ్యాడు. డెన్మార్క్ ఆటగాడు విక్టర్ అక్సెల్‌సన్ అతడికి షాకిచ్చాడు. ఆదివారం పురుషుల సింగిల్స్ ఫైనల్లో మూడో సీడ్ విక్టర్ 22-20, 21-16తో వరుస గేమ్‌ల్లో ఏడో సీడ్ లిన్ డాన్‌ను ఓడించాడు. మొత్తం మీద ఏడు సార్లు ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఫైనల్ చేరిన లిన్ ఐదుసార్లు విజేతగా నిలిచాడు.



50 కి 50

- ఎదురులేని మేవెదర్
- ప్రొబాక్సింగ్‌లో సరికొత్త రికార్డు

లాస్ వెగాస్

21 ఏళ్ల కెరీర్‌లో ఓటమెరుగని ధీరుడు ఫ్లాయిడ్ మేవెదర్ ప్రొ బాక్సింగ్‌లో సరికొత్త రికార్డు నెలకొల్పాడు. అజేయంగా 50 విజయాలు సొంతం చేసుకున్న తొలి బాక్సర్‌గా అతడు చరిత్ర సృష్టించాడు. రెండేళ్ల క్రితం వీడ్కోలు పలికి.. మనసు మార్చుకున్న మేవెదర్ (అమెరికా)కు కెరీర్ 50వ మ్యాచ్‌లోనూ ఎదురులేకుండా పోయింది. కెరీర్ తొలి మ్యాచ్ ఆడిన కానర్ మెక్‌గ్రెగర్ (ఐర్లాండ్) గట్టి పోటీనే ఇచ్చినప్పటికీ అతడు.. మేవెదర్ పంచ్‌లకు తాళలేకపోయాడు. మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో మంచి రికార్డున్న మెక్‌గ్రెగర్ ఆరంభ రౌండ్లలో మేవెదర్‌కు సవాల్ విసిరాడు. రెండేళ్ల తర్వాత పునరాగమనం చేసిన ఫ్లాయిడ్ తొలి మూడు రౌండ్లలో ఆచితూచి ఆడాడు. ఆ సమయంలో ఎదురుదాడి చేసిన మెక్‌గ్రెగర్ ప్రత్యర్థిపై కొన్ని పదునైన పంచ్‌లు విసిరాడు కూడా. ఐతే నాలుగో రౌండ్ నుంచి మేవెదర్ దాడికి దిగడంతో మెక్‌గ్రెగర్ రక్షణాత్మకంగా మారక తప్పలేదు. 40 ఏళ్ల అమెరికా బాక్సర్ మెక్‌గ్రెగర్‌పై వరుసపెట్టి పంచ్‌లతో విరుచుకుపడ్డాడు. ఏడో రౌండ్లో మేవెదర్ విసిరిన కుడిచేతి పంచ్ నుంచి కోలుకుని మళ్లీ పోటీపడటానికి మెక్‌గ్రెగర్‌కు చాలా సమయమే పట్టింది. ఐతే పదో రౌండ్లో అతడి పోరాటానికి తెరపడింది. మేవెదర్ కుడి చేతి పంచ్‌కు దెబ్బతిన్న అతడు.. పంచ్‌ల నుంచి తప్పించుకునేందుకు రింగ్ చుట్టూ పరుగెత్తాడు. ఆ సమయంలో మేవెదర్ ఎడం చేతితో ఇచ్చిన పంచ్‌కు తాళ్లపై నిస్సహాయంగా పడ్డాడు. మరో హుక్‌కు మెక్‌గ్రెగర్ నిస్సహాయ స్థితికి చేరడంతో రిఫరీ మ్యాచ్‌ను నిలిపేసి.. మేవెదర్‌ను విజేతగా ప్రకటించాడు. ప్రొబాక్సింగ్ కెరీర్‌లో అజేయంగా అత్యధిక విజయాలు సాధించిన బాక్సర్‌గా మేవెదర్ రికార్డు నెలకొల్పాడు. దిగ్గజ బాక్సర్ రాకీ మార్సియానో (49-0) పేరిటున్న రికార్డును తిరగరాశాడు. ఈ విజయంతో మేవెదర్ దాదాపుగా రూ. 1500 కోట్లు ఖాతాలో వేసుకోగా.. కానర్ మెక్‌గ్రెగర్‌కు దాదాపుగా రూ. 447 కోట్లు దక్కాయి. ఇక తాను మళ్లీ పోటీపడనని, ఇదే తన ఆఖరి మ్యాచ్ అని మేవెదర్ మ్యాచ్ అనంతరం స్పష్టం చేశాడు.

ఛాంపియన్

బంగ్లా 260 ఆలౌట్

ఢాకా: ఆస్ట్రేలియాతో తొలి టెస్టు మ్యాచ్‌లో బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 260 పరుగులకు ఆలౌటైంది. ఆదివారం టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్నబంగ్లా.. కమిన్స్ (3/63), లియాన్ (3/79), అగర్ (3/46) ధాటికి నిలువలేకపోయింది. ఓపెనర్ తమీమ్ ఇక్బాల్ (71), షకిబ్ అల్ హసన్ (84) రాణించకపోతే ఆ జట్టు మరింత తక్కువ స్కోరుకే ఆలౌటైయ్యేది. బదులుగా ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో ఆట ఆఖరికి 9 ఓవర్లలో 18 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. వార్నర్ (8), ఖవాజా (1), లియాన్ (0) ఔట్ కాగా.. రెన్‌షా (6), కెప్టెన్ స్టీవ్ స్మిత్ (3) క్రీజులో ఉన్నారు.

బెంగాల్ జోరు

ముంబయి: ప్రొకబడ్డీ లీగ్‌లో బెంగాల్ వారియర్స్ హవా కొనసాగుతోంది. ఆదివారం ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో బెంగాల్ 32-26 తేడాతో బెంగళూరు బుల్స్‌ను ఓడించింది. సుర్జీత్ సింగ్ 8 టాకిల్ పాయింట్లతో బెంగాల్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. మరోవైపు రోహిత్ కుమార్ (7) పోరాటం బెంగళూరుకు విజయాన్ని అందించలేకపోయింది. గత నాలుగు మ్యాచ్‌ల్లో బెంగాల్‌కు ఓటమి ఎదురుకాలేదు. ఉత్కంఠభరితంగా సాగిన మరో మ్యాచ్‌లో దిల్లీ దబాంగ్ 33-32తో యు ముంబాను ఓడించింది. మిరాజ్ షేక్ 11 పాయింట్లతో దిల్లీకి విజయాన్ని అందించాడు. యు ముంబా కెప్టెన్ అనూప్ కుమార్ కూడా 11 పాయింట్లు సాధించాడు గానీ జట్టును గెలిపించలేకపోయాడు. యు ముంబాకు ఇది వరుసగా నాలుగో ఓటమి.

క్వార్టర్‌ఫైనల్లో అమిత్

హాంబర్గ్: ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో అమిత్ ఫంగల్ క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లాడు. లైట్ ఫ్లై వెయిట్ విభాగంలో 21 ఏళ్ల అమిత్.. ఏడో సీడ్ కార్లోస్ క్విపో (ఈక్వెడార్)కు షాకిచ్చాడు. తనకంటే మెరుగైన ర్యాంక్ కలిగిన బాక్సర్‌పై అమిత్ వరుస పంచ్‌లు విసిరి తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించాడు. పూర్తిగా ఏకపక్షంగా మారిన ఈ మ్యాచ్‌లో జడ్జీలు అమిత్‌ను విజేతగా ప్రకటించారు.

పోరాడుతున్న ఇంగ్లాండ్

లీడ్స్: వెస్టిండీస్‌తో రెండో టెస్టులో ఇంగ్లాండ్ పోరాడుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో 169 పరుగుల ఆధిక్యం సమర్పించుకున్న ఇంగ్లాండ్ ఆదివారం మూడో రోజు ఆట ముగిసేసరికి రెండో ఇన్నింగ్స్‌లో 3 వికెట్లకు 171 పరుగులు చేసింది. కెప్టెన్ రూట్ (45), డి.జె. మలన్ (21) క్రీజులో ఉన్నారు. ప్రస్తుతం ఇంగ్లాండ్ 2 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఐతే వెస్టిండీస్ ముందు ఎంత లక్ష్యం ఉంచుతుందనేదే ఆసక్తికరం. ఓవర్‌నైట్ స్కోరు 329/5తో ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన వెస్టిండీస్ 427 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 258 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే.


వికెట్లు తీస్తున్నా.. ఎవరో ఒకరు బాదేస్తుంటే లంక మాత్రం ఏం చేస్తుంది! నిస్సహాయంగా భారత విజయాన్ని చూడడం తప్ప!! మూడో వన్డేలోనూ కథ మారలేదు.. 61 పరుగులకే 4 వికెట్లు తీసి సంబరపడిన లంక బౌలర్లను ఏడిపిస్తూ.. ఓపెనర్ రోహిత్‌శర్మ (124 నాటౌట్; 145 బంతుల్లో 16×4, 2×6) సెంచరీతో చెలగడంతో మరో రెండు వన్డేలు మిగిలుండగానే కోహ్లి సేన సిరీస్‌ను 3-0తో కైవసం చేసుకుంది. రోహిత్‌తో పాటు ధోని (67 నాటౌట్; 86 బంతుల్లో 4×4, 1×6) కీలక ఇన్నింగ్స్‌తో మరోసారి ఫినిషర్ పాత్ర పోషించాడు. మొదట బుమ్రా ధాటికి లంక 50 ఓవర్లలో 9 వికెట్లకు 217 పరుగులకే పరిమితం కాగా.. లక్ష్యాన్ని భారత్ 45.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

హిట్‌మ్యాన్ హోరాహోరీతం

హిరోహితం

- సెంచరీతో మెరిసిన రోహిత్‌శర్మ
- రాణించిన ధోని, బుమ్రా
- లంకపై 3-0తో సిరీస్ భారత్ కైవసం





విజృంభించిన బుమ్రా: లంక ఇన్నింగ్స్‌లో అందర్నీ ఆకర్షించింది బుమ్రా బౌలింగే. ఆరంభ ఓవర్లతో పాటు డెత్ ఓవర్లలో గొప్పగా బౌలింగ్ చేసిన అతను లంకను కట్టిపడేశాడు. డిక్వెలా (13), చండిమాల్ (36), కుశాల్ (1) వికెట్లు పడగొట్టి ప్రత్యర్థిని దెబ్బకొట్టాడు. డెత్ ఓవర్లలోనూ మరో రెండు వికెట్లు తీసి లంక మరీ ఎక్కువ స్కోరు చేయకుండా అడ్డుపడ్డాడు. తిరిమానె (80) ఒక్కడే భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నాడు.

క్యాండీ: భారత్ అదరగొట్టేసింది. మరోసారి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో లంకను చిత్తు చేసి మూడో వన్డేను గెలవడమే కాక.. సిరీస్‌ను కూడా కైవసం చేసుకుంది. భారత ఇన్నింగ్స్‌లో ఆరంభంలో నాలుగు వికెట్లు తీయడం తప్ప.. ఈ మ్యాచ్‌లో లంక ప్రభావమే చూపలేకపోయింది. రోహిత్, ధోనితో పాటు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' బుమ్రా (5/27) విజృంభించడంతో భారత్‌కు ఎదురేలేకుండా పోయింది.

రోహిత్ వదల్లేదు: తనదైన రోజున చెలరేగిపోయే రోహిత్ మరోసారి తన క్లాస్ చూపించాడు. లంక బౌలర్లను అలవోకగా ఎదుర్కొని భారత్‌కు ఘన విజయాన్ని అందించాడు. ఆరు ఓవర్లకే ధావన్ (5), కోహ్లి (3) ఔటైనా.. స్పిన్నర్ ధనంజయ (2/38) మరోసారి భయపెట్టినా.. రోహిత్ వదల్లేదు. ఆరంభం నుంచి చివరి వరకు అదే జోరు చూపించిన ఈ ఓపెనర్.. చక్కని షాట్లతో అలరించాడు. ధోని తోడుగా ఇన్నింగ్స్‌ను నడిపించిన అతను.. వీలు చిక్కినప్పుడల్లా బంతిని బౌండరీ దాటించాడు. 64 బంతుల్లో అర్ధసెంచరీ సాధించిన రోహిత్.. చమీర బౌలింగ్‌లో సింగిల్‌తో సెంచరీ మార్క్ అధిగమించాడు. లంకలో 23 వన్డేలు ఆడిన రోహిత్‌కు ఇదే తొలి సెంచరీ. మరోవైపు ధోని కూడా సమయోచితంగా ఆడడంతో భారత్ ఎలాంటి ఇబ్బందిలేకుండా లక్ష్యం దిశగా సాగింది. ఓ భారీ సిక్స్‌తో భారత్‌ను లక్ష్యానికి చేరువ చేసిన ధోని.. ఆ తర్వాత మరో సింగిల్ తీసి జట్టును గెలిపించాడు.

శ్రీలంక ఇన్నింగ్స్: డిక్వెలా ఎల్బీ (బి) బుమ్రా 13; చండిమాల్ (సి) బుమ్రా (బి) పాండ్య 36; కుశాల్ మెండిస్ (సి) రోహిత్ (బి) బుమ్రా 1; తిరిమానె (సి) జాదవ్ (బి) బుమ్రా 80; మాథ్యూస్ ఎల్బీ (బి) జాదవ్ 11; కపుగెదర (బి) అక్షర్ 14; సిరివర్ధన (బి) బుమ్రా 29; ధనంజయ (బి) బుమ్రా 2; చమీర రనౌట్ 6; ఫెర్నాండో నాటౌట్ 5; మలింగ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 19 **మొత్తం:** (50 ఓవర్లలో 9 వికెట్లకు) **217; వికెట్ల పతనం:** 1-18, 2-28, 3-100, 4-138, 5-159, 6-181, 7-191, 8-201, 9-210

బౌలింగ్: భువనేశ్వర్ 9-2-41-0; బుమ్రా 10-2-27-5; చాహల్ 10-0-49-0; పాండ్య 8-0-42-1; అక్షర్ పటేల్ 10-1-35-1; జాదవ్ 3-0-12-1

భారత్ ఇన్నింగ్స్: రోహిత్‌శర్మ నాటౌట్ 124; ధావన్ (బి) మలింగ 5; కోహ్లి (సి) చమీర (బి) ఫెర్నాండో 3; రాహుల్ (సి) తిరిమానె (బి) ధనంజయ 17; జాదవ్ ఎల్బీ (బి) ధనంజయ 0; ధోని నాటౌట్ 67; ఎక్స్‌ట్రాలు 2 **మొత్తం:** (45.1 ఓవర్లలో 4 వికెట్లకు) 218; **వికెట్ల పతనం:** 1-9, 2-19, 3-61, 4-61

బౌలింగ్: మలింగ 5-0-25-1; ఫెర్నాండో 8.1-2-35-1; చమీర 10-1-59-0; మాథ్యూస్ 3-0-17-0; ధనంజయ 10-0-38-2; సిరివర్ధన 9-0-43-0

వన్డేల్లో భారత్ తరఫున నాలుగో అత్యధిక పరుగుల వీరుడిగా ధోని (9,419) నిలిచాడు. అతను అజహర్ (9,378)ను దాటాడు. సచిన్ (18,426), గంగూలీ (11,363), ద్రవిడ్ (10,889) తొలి మూడు స్థానాల్లో ఉన్నారు.



ఈడెన్‌ను గుర్తుకు తెచ్చారు

మామూలుగా లంకతో మ్యాచ్‌లంటే సాఫీగా సాగిపోతాయి. కానీ మూడో వన్డేలో మాత్రం స్టేడియంలోని అభిమానులు తమ ఆటగాళ్ల ప్రదర్శనపై తీవ్ర అగ్రహాన్ని వ్యక్తం చేశారు. 44వ ఓవర్ జరుగుతుండగా స్టేడియంలోకి వాటర్ బాటిల్స్ విసురుతూ నిరసన తెలిపారు. దీంతో దాదాపు 35 నిమిషాల పాటు ఆట నిలిచిపోయింది. భద్రతా సిబ్బంది అల్లరి చేస్తున్న వాళ్లను బయటకు పంపించడంతో మళ్లీ మ్యాచ్ కొనసాగింది. ఈ సంఘటన 1996లో ఈడెన్ గార్డెన్‌లో భారత్-లంక మధ్య జరిగిన ప్రపంచకప్ సెమీస్‌ను గుర్తుకు తెచ్చింది. ఆనాడూ భారత్ వరుస వికెట్లు కోల్పోతుండడంతో అభిమానులు నీళ్లసీసాలు విసిరి, ప్లకార్డులు తగలబెట్టి గొడవ చేశారు. అయితే ఈసారి వంతు లంకది.



ఫెదరరా.. నాదలా?

- ఇద్దరి మధ్యే ప్రధాన పోరు
- ముర్రే, జకోవిచ్, వావ్రింకా ఔట్
- షరపోవాపై ప్రత్యేక దృష్టి
- యుఎస్ ఓపెన్ నేటి నుంచే

న్యూయార్క్: 36 ఏళ్ల వయసులో అనూహ్యంగా ఒకే ఏడాది రెండు గ్రాండ్‌స్లామ్‌లు గెలిచి చరిత్ర సృష్టించాడు రోజర్ ఫెదరర్. మరోవైపు కెరీర్‌కు ముగింపు పలికేలా కనిపించిన మోకాలి గాయం నుంచి కోలుకుని పదో ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ గెలిచి మళ్లీ సత్తా చాటుకున్నాడు రఫెల్ నాదల్. ఈ యోధులిద్దరికీ తమ గ్రాండ్‌స్లామ్‌ల ఖజానాలోకి మరో టైటిల్ జమ చేసుకునే సువర్ణావకాశం! ఆండీ ముర్రే, నొవాక్ జకోవిచ్, వావ్రింకా లాంటి ప్రధాన ప్రత్యర్థులు గాయాలతో దూరమైన నేపథ్యంలో యుఎస్ ఓపెన్ గెలవడానికి వీరికి మార్గం సుగమమైనట్లే. ఐతే ఫైనల్‌కు ముందే, సెమీస్‌లోనే ఈ దిగ్గజాల ముఖాముఖి చూడబోతున్నాం. క్వార్టర్స్ వరకు ఎదురయ్యే చిన్న అడ్డంకుల్ని అధిగమించి.. సెమీస్ చేరితే అక్కడ ఆ పెద్ద అడ్డంకిని ఎవరు అధిగమిస్తే వారికే యుఎస్ ఓపెన్ సొంతం కావచ్చు. టాప్-10లోని ఐదుగురు అగ్ర క్రీడాకారులు గాయాలతో ఓ గ్రాండ్‌స్లామ్‌కు దూరం కావడం అరుదైన విషయమే. సోమవారం ఆరంభమయ్యే యుఎస్ ఓపెన్‌కు ముందు అదే జరిగింది. ఇటీవలే నంబర్‌వన్ ర్యాంకు నుంచి దిగిపోయిన ఆండీ ముర్రే.. మాజీ నంబర్‌వన్ జకోవిచ్‌లతో పాటు డిఫెండింగ్ ఛాంపియన్ వావ్రింకా, 2014 యుఎస్ ఓపెన్ రన్నరప్ నిషికోరి, కెనడా సంచలనం రోనిచ్ సైతం ఈ టోర్నీకి దూరమయ్యారు. ఈ నేపథ్యంలో ఫెదరర్, నాదల్‌లకు మరో గ్రాండ్‌స్లామ్ గెలిచేందుకు మంచి అవకాశం లభించినట్లే. ముఖ్యంగా ఈ ఏడాది ఆడిన రెండు గ్రాండ్‌స్లామ్‌ల్లోనూ (ఆస్ట్రేలియన్ ఓపెన్, వింబుల్డన్) విజేతగా నిలిచిన ఫెదరర్‌కు తన గ్రాండ్‌స్లామ్‌ల సంఖ్యను 20కి పెంచుకోవడానికిది అద్భుత అవకాశమే. 15 గ్రాండ్‌స్లామ్‌లతో ఫెదరర్ తర్వాత, రెండో స్థానానికి చేరడమే కాక, చాలా ఏళ్ల తర్వాత మళ్లీ నంబర్‌వన్ ర్యాంకును కూడా దక్కించుకున్న నాదల్ అవకాశాల్ని కూడా కొట్టి పారేయలేం. రోజర్, రఫా ఒకే పార్శ్వంలో ఉన్న నేపథ్యంలో వీళ్లిద్దరూ సెమీస్‌లోనే తలపడబోతున్నారు. తొలి రౌండ్లో టాప్ సీడ్ నాదల్.. లజోవిచ్ (సెర్బియా)ను, మూడో సీడ్ ఫెదరర్.. టియోఫి (అమెరికా)ను ఢీకొనబోతున్నారు.

షరపోవా వచ్చేస్తోంది..: మహిళల సింగిల్స్‌లో ఇప్పుడందరి దృష్టి మరియా షరపోవా మీదే ఉంది. నిషేధిత ఉత్ప్రేరకం వాడినందుకు 15 నెలల పాటు నిషేధానికి గురైన మరియా.. ఆరు గ్రాండ్‌స్లామ్‌ల విరామం తర్వాత మళ్లీ మేజర్ టోర్నీలో బరిలోకి దిగుతోంది. ఏప్రిల్లోనే నిషేధం పూర్తయినప్పటికీ ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ టోర్నీలో వైల్డ్ కార్డ్ దక్కించుకోలేకపోయిన షరపోవాపై యుఎస్ ఓపెన్ నిర్వాహకులు కరుణ చూపారు. ఆమెకు వైల్డ్ కార్డ్ ఇచ్చారు. షరపోవాతో పాటు హలెప్, ప్లిస్కోవా, వోజ్నియాకి, ముగురుజ, స్వితోలినా, కొంటా టైటిల్‌పై గురిపెట్టారు. భారత క్రీడాకారులు లియాండర్ పేస్, సానియా మీర్జా, రోహన్ బోపన్న డబుల్స్‌లో తమ భాగస్వాములతో కలిసి బరిలోకి దిగుతున్నారు.

బెల్జియం గ్రాండ్‌ప్రి విజేత హామిల్టన్

బ్రెసెల్స్: బెల్జియం గ్రాండ్‌ప్రిని మెర్సిడెస్ స్టార్ లూయిస్ హామిల్టన్ సాధించాడు. ద్వితీయ స్థానంలో నిలిచిన సెబాస్టియన్ వెటల్ కంటే అతను రెండు సెకన్ల ముందుగా రేసు పూర్తి చేసి విజేతగా నిలిచాడు. దీంతో ప్రపంచ డ్రైవర్ ఛాంపియన్‌షిప్ రేసులో ముందున్న సెబాస్టియన్ వెటల్ (220)ను హామిల్టన్ (213) సమీపించాడు. మరోవైపు ఈ రేసులో ఫోర్స్ ఇండియా డ్రైవర్ ఎస్టెబాన్ ఒకాన్ తొమ్మిదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. అతను రేసులో సహచర డ్రైవర్ పెరిజ్ కారును ఢీకొన్నాడు.

కట్టింది.. మాటల 'కోట'లే!

- కళావిహీనంగా కాకతీయుల కట్టడాలు
- కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయ లోపం
- పునర్నిర్మాణ పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం
- నిధులున్నా పర్యవేక్షణ పూజ్యం



వేయిస్తంభాల ఆలయంలో అర్ధంతరంగా ఆగిన కల్యాణ మండపం పనులు



వరంగల్ కోట వద్ద కళతప్పిన తోరణాలు

ఈనాడు, వరంగల్: కాకతీయుల ఘన చరిత్రను ఆ కట్టడాలు కళ్లకుకడతాయి. ఆ అపురూప ఆలయాల్లోని శిల్పాలు రామాయణ, మహాభారత, పురాణ ఇతివృత్తాలను వివరిస్తాయి. శత్రుదుర్భేద్యమైన కోటలు కాకతీయ రాజుల పరాక్రమాన్ని ప్రతిబింబిస్తాయి. అందుకే అద్భుతమైన ఆనిర్మాణాలను చూసి తరించడానికి దేశవిదేశాల నుంచి యాత్రికులు వ్యయప్రయాసలకోర్చి వస్తుంటారు. కాగా..క్రమంగా ఆ చారిత్రక సంపద కాలగర్భంలో కలిసిపోయే ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. సమన్వయ లోపంతో ఆలయాల్లో జరగాల్సి అభివృద్ధి పనులు ముందుకెళ్లడం లేదు. రామప్ప ప్రహరీతోపాటు, పరిసరాల్లోని శివాలయం కూలడం, ఖిలా వరంగల్ కోట చుట్టూ ఆక్రమణలు పెరుగుతుండడం, వేయిస్తంభాల గుడిలో పదేపదే నిలిచిపోతున్న కల్యాణమంటపం పనులను గమనిస్తే 'మాటలు కోటలు దాటాయి..కాళ్లు గడప దాటలేదన్న' సామెత గుర్తుకురాక మానదు.

పదకొండేళ్లయినా పూర్తి కాలేదు

హన్మకొండలోని వేయిస్తంభాల ఆలయంలో కల్యాణ మండపం పునర్నిర్మాణ పనులు నత్తనడక నడుస్తున్నాయి. మొత్తం 137 స్తంభాల ఈ మండపాన్ని ఇంటర్ లాకింగ్ విధానంలో పునర్మించేందుకు ఏడున్నర కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 2006లో పనులు ప్రారంభించారు. రెండేళ్లలో నిర్మాణం పూర్తవుతుందని మొదట ప్రకటించారు. ఇప్పటివరకు 70 శాతం కూడా పూర్తికాలేదు. మంటప నిర్మాణంలో కీలకమైన పైకప్పు నిర్మాణం జరగలేదు. స్తపతికి బిల్లుల చెల్లింపుల విషయంలో వివాదం నెలకొనడంతో పనులు నిలిచిపోయాయి.

నిధులున్నా నీరసమే

వరంగల్ కోటను అభివృద్ధి చేసేందుకు కేంద్రం నుంచి హృదయ్ పథకం కింద రెండో దశలో ఏడాది క్రితం రూ.20.50 కోట్లు విడుదలయ్యాయి. మట్టి, రాతి కోటల మధ్య ఉన్న కందకాన్ని అభివృద్ధి చేసి అందులో బోటింగ్ సదుపాయం కల్పించడం, కోట చుట్టూ రహదారి నిర్మాణం, మొక్కల పెంపకం, శృంగార బావి పునరుద్ధరణ, ఖిలా వరంగల్ కోట నుంచి నిత్యం విడుదలయ్యే మురుగు నీటి శుద్ధీకరణ తదితర పనులు చేపట్టాల్సి ఉంది. భారత పురావస్తు శాఖ నుంచి ఇప్పటి వరకు ఎన్.ఒ.సి (నిరభ్యంతర పత్రం) అందకపోవడంతో..ఇప్పటివరకు ఒక్క అభివృద్ధి పనీ ప్రారంభం కాలేదు. కోట వద్ద స్టేట్ ఆర్కియాలజీ మ్యూజియం నిర్మాణానికి 2012లో శంకుస్థాపన జరగ్గా ఇప్పటికీ భవనం పూర్తి కాలేదు.

కూలిపోతున్నా పట్టింపు లేదు

జయశంకర్ జిల్లా వెంకటాపూర్ మండలంలో ఉన్న ప్రఖ్యాత రామప్ప ఆలయం చుట్టూ దాదాపు 18 ఉప ఆలయాలు ఉన్నాయి. వీటిల్లో రామప్ప, కామేశ్వరాలయం, కాటేశ్వరాలయాలు మాత్రమే భారత పురావస్తు శాఖ పర్యవేక్షణలో ఉండగా.. మిగతా కట్టడాలను పట్టించుకునేవారే లేరు. తాజాగా రామప్ప ప్రధానాలయం ప్రహరీ 40 మీటర్ల మేర కూలింది. రామప్ప చెరువు వద్ద ఉన్న కల్యాణమండపం దశాబ్దాల క్రితమే శిథిలమైనా పునరుద్ధరించలేదు. గత వారం భారీ వర్షాలకు ప్రధాన ఆలయం పరిసరాల్లోని యాకుబ్‌సాబ్ రాతి ఆలయం కూలిపోయినా ఇప్పటి వరకు అధికారులెవరూ దీన్ని సందర్శించలేదు.

ఈశ్వరా..ఎవరు దిక్కు

రామప్ప ఆలయం పక్కనే ఉన్న కామేశ్వరాలయం శిథిలమవడంతో 2012లో పునర్నిర్మాణ పనులు ప్రారంభించారు. అయిదేళ్లు గడచినా నిర్మాణం పూర్తి కాలేదు.

పునర్ వైభవం కలేనా?

జయశంకర్ జిల్లాలోని ఘణపురం మండలంలో కొలువైన కోటగుళ్లు (గణపేశ్వరాలయం) పూర్తిగా శిథిలమైంది. 11-12వ శతాబ్దాల మధ్య కాలంలో గణపతి దేవుని సామంత రాజు రేచర్ల రుద్రుడు ఈ ఆలయాన్ని నిర్మించాడు. ఆలయాన్ని పూర్తిగా తొలగించకుండా..జర్మనీ పరిజ్ఞానంతో కాకతీయులు కట్టిన విధంగానే దాన్ని తీర్చిదిద్దేలా రూ.2 కోట్ల అంచనాతో పనులకు పదేళ్ల క్రితం శ్రీకారం చుట్టారు. దాదాపు రూ.40 లక్షల విలువైన పనులు రెండు నెలలు మాత్రమే జరిగి ఆగిపోయాయి. 2014లో మరోసారి పనులు ప్రారంభిస్తామంటూ ప్రజాప్రతినిధులు హడావుడి చేసినా..అవి నీటిమీద రాతలే అయ్యాయి.

మాతాశిశు సంరక్షణకు కొత్త ఆసుపత్రులు

- ఒక్కోటి 50 పడకలతో ఐదు చోట్ల ఏర్పాటు
- రూ.35 కోట్ల నిధులు కేటాయింపు
- తెలంగాణ సర్కారు తాజా నిర్ణయం

ఈనాడు - హైదరాబాద్

మాతాశిశు సంరక్షణకు తెలంగాణ ప్రభుత్వం మరో ఐదు నూతన ఆసుపత్రులను నిర్మించనుంది. ఒక్కోటి 50పడకలతో కామారెడ్డి, ఏటూరునాగారం, సూర్యాపేట, మంథని, అచ్చంపేటల్లో వీటిని నిర్మించాలని నిర్ణయించింది. ఒక్కో మాతాశిశు సంరక్షణ(ఎంసీహెచ్) ఆసుపత్రికి సుమారు రూ.7కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేసిన సర్కారు మొత్తం రూ.35కోట్లు కేటాయించింది. తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణ కోసం జూన్‌లో 'కేసీఆర్ కిట్'పేరిట పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులను పెంచడం ద్వారా ప్రసవకోతలు తగ్గించాలనే లక్ష్యంగా దీనికి శ్రీకారం చుట్టారు. ఈ పథకం కింద ఇప్పటికే 4లక్షలకు పైగా గర్భిణులు వివరాలు నమోదు చేసుకున్నారు. కేసీఆర్‌కిట్ కింద వివరాలను నమోదు చేసుకున్న గర్భిణులకు ఈదశ నుంచే ఆర్థిక సాయం ప్రభుత్వం నుంచి అందుతుంది. ప్రసవానంతరం శిశువుకు టీకాల ప్రక్రియ ముగిసేవరకు మొత్తంగా రూ.12వేలు(అమ్మాయి పుడితే రూ.13 వేలు) మహిళా ఖాతాలోకి చేరతాయి.

పెరుగుతున్న సంఖ్య

కేసీఆర్ కిట్ పథకానికున్న విశిష్టత దృష్ట్యా ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పుల కొచ్చే మహిళలసంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఈసంఖ్య మరింతగా పెరిగే అవకాశాలుండడంతో, అందుకనుగుణంగా సర్కారు ఆసుపత్రులను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర ఆరోగ్యసంస్థ వార్షిక సమావేశంలో మాతాశిశు సంరక్షణపై ప్రధానంగా చర్చించారు. జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా రాష్ట్రానికి 2017-18 సంవత్సరానికి రూ.1000కోట్లకు(కేంద్రం 60శాతం+రాష్ట్రం 40శాతం)పైగా నిధులు కేంద్రం కేటాయించడంతో వాటిని సద్వినియోగం చేయడంలో భాగంగా మాతాశిశు ఆరోగ్య సంరక్షణకు కొత్త ఆసుపత్రుల నిర్మాణం తెరపైకి వచ్చింది.

ప్రస్తుతమున్న వాటికి అదనంగా..

ఇప్పటికే రాష్ట్రంలో హైదరాబాద్‌లో నాలుగు, వరంగల్‌లో రెండు, నిజామాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ రిమ్స్, జహీరాబాద్, తాండూరు, ఖమ్మం, సంగారెడ్డి, కరీంనగర్, నిర్మల్, భద్రాచలం, మలక్‌పేట, మహబూబాబాద్, గోదావరిఖని, సిద్దిపేట, కామారెడ్డి, జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 23ప్రసూతి కేంద్రాలున్నాయి. ఇవి కాకుండా పూర్తిస్థాయి ప్రత్యేక ప్రసూతి ఆసుపత్రులను మహబూబ్‌నగర్, నల్గొండ, సంగారెడ్డి, జనగామ, ఖమ్మం, కరీంనగర్, తాండూరు, కింగ్‌కోఠి(హైదరాబాద్)ల్లో నిర్మిస్తున్నారు. ఈ ఎనిమిదింటి నిర్మాణాలు దాదాపుగా పూర్తికాగా, త్వరలోనే వీటిని ప్రారంభించడానికి వైద్యారోగ్యశాఖ సన్నాహాలు చేస్తోంది. వీటికి తోడుగా ఇప్పుడు తాజాగా మరో ఐదు మాతాశిశు సంరక్షణ ఆసుపత్రుల నిర్మాణానికి ఇటీవల జరిగిన రాష్ట్ర ఆరోగ్యసంస్థ సమావేశం ఆమోదముద్ర వేసింది. వీటి నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాల్సిందిగా రాష్ట్ర వైద్యసేవలు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థను సమావేశం కోరింది. పూర్తిస్థాయి ప్రతిపాదనలు రూపొందించగానే త్వరలోనే ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపించనున్నట్లు వైద్యవర్గాలు తెలిపాయి.

30 సార్లు ఉల్లంఘిస్తే వాహన రిజిస్ట్రేషన్ రద్దు!

- తరచూ ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించే వారిపై దృష్టి
- హైదరాబాద్ పోలీసుల కసరత్తు

ఈనాడు, సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి

ఎన్నిసార్లు చలానాలు వేసినా జరిమానాలు చెల్లించి మళ్లీ ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించేద్దామంటే ఇక కుదరదు. గత నాలుగైదేళ్లుగా పదుల సంఖ్యలో నిబంధనలు ఉల్లంఘించే వారి వాహనాల రిజిస్ట్రేషన్‌ను తాత్కాలికంగా రద్దు చేయాలన్న యోచనలో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసు అధికారులు ఉన్నారు. దీనిపై త్వరలోనే ఉన్నతస్థాయిలో చర్చించి ఈ నిర్ణయాన్ని అమలులోకి తేవాలని నిర్ణయించారు. దీనివల్ల రహదారి ప్రమాదాలు తగ్గడంతోపాటు ట్రాఫిక్ నియంత్రణ చాలా వరకు సాధ్యమవుతుందని భావిస్తున్నారు. ఇందుకు కార్యాచరణను రూపొందిస్తున్నారు.

హైదరాబాద్ మహానగరంలో వాహనాల సంఖ్య కాస్త అటు ఇటుగా 50 లక్షలకు చేరింది. రోజూ వాహనదారులపై నగర ట్రాఫిక్ పోలీసులు దాదాపు 10 వేల ఉల్లంఘనలకు సంబంధించి చలానాలను వేస్తున్నారు. అంటే ఏడాదికి దాదాపు 30 లక్షల వరకు చలానాలు ఇళ్లకు చేరుతున్నాయి. వాహనదారులపై ఛార్జి షీట్లు దాఖలు చేస్తుండటంతో గత ఏడాది నుంచి చలానాలను చెల్లించే వారికి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇప్పటికీ చెల్లించని వారి సంఖ్య 20 లక్షల వరకు ఉంది. వాహనదారుల్లో ఒక్కొక్కరు వ్యక్తిగతంగా ఎన్ని సార్లు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించారు... ఇప్పటి వరకు ఎన్ని చలానాలను చెల్లించారన్న దానిపై ఇటీవల ట్రాఫిక్ పోలీసులు విశ్లేషించారు. ఓ వాహనదారుడు ఏకంగా తన ఖరీదైన కారుకు మూడేళ్లలో రూ.లక్షన్నర జరిమానాగా చెల్లించారని తెలిసింది. కొంతమంది వారి వాహనానికి రెండేళ్లలో 215 సార్లు జరిమానాలు చెల్లించారని తేలింది. దీనివల్ల పోలీసు శాఖకు భారీ ఎత్తున నిధులు వస్తున్నా జరిమానాల అసలు ఉద్దేశం నెరవేరడం లేదని నగర పోలీసు కమిషనర్ ఎం.మహేందర్ రెడ్డి భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో వాహనదారుడు చెల్లించే జరిమానాలను పరిగణనలోకి తీసుకుని కఠిన చర్యలు తీసుకుంటేనే ఫలితం ఉంటుందని అధికారులు యోచిస్తున్నారు. దీనికి అనుగుణంగా ట్రాఫిక్ పోలీసు అధికారులు చర్చలు జరిపారు. ఇందులో భాగంగానే అతిగా జరిమానాలు చెల్లించే, అధికంగా ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిని గుర్తించాలని అనుకుంటున్నారు. ఏడాదికి 30 సార్లు పోలీసులకు పట్టుబడితే వారి వాహన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని భావిస్తున్నారు. గత నాలుగేళ్ల సంబంధిత వాహనదారుని చరిత్రను విశ్లేషణ చేసి అప్పటి నుంచి అధికంగా నిబంధనలను అతిక్రమించే వారిపై ముందుగా చర్యలు తీసుకోవాలని యోచిస్తున్నారు. దీనిపై తుది నిర్ణయం తీసుకున్న తర్వాత కొన్ని రోజులపాటు పెద్దఎత్తున ప్రచారం చేయాలని నిర్ణయించారు. అనంతరం ఈ నిబంధనను అమలులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. తాజాగా పాయింట్ల విధానం అమలులోకి వచ్చిన తరువాత రోజూ దాదాపు 500 మంది ట్రాఫిక్ పోలీసులు రోడ్లపైకి వచ్చి జరిమానాలు విధించడమే కాకుండా పాయింట్లను నమోదు చేస్తున్నారు. ఒక వైపు సీసీ కెమెరాలు మరోవైపు పోలీసుల తనిఖీలతో ఏ మాత్రం నిబంధనలు ఉల్లంఘించినా జరిమానాల వాత పడుతోంది. దీంతో వాహనదారులు జాగ్రత్తగా ఉండకపోతే తాము నడిపే వాహనం రిజిస్ట్రేషన్ రద్దు అయ్యే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

– ఏవీ రంగనాథ్, ట్రాఫిక్ డీసీపీ

హైదరాబాద్‌లో ట్రాఫిక్ నిబంధనలను అధికంగా ఉల్లంఘించే వారి వాహనాల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని అనుకుంటున్నాం. దీనిపై నగర పోలీసు కమిషనర్ మహేందర్ రెడ్డితో చర్చించిన తర్వాత తుది నిర్ణయం తీసుకుంటాం. వందల సంఖ్యలో చలానాలు చెల్లించే వారు జరిమానాలు చెల్లించాం కాబట్టి తమకు ఏమీ కాదన్న ఉద్దేశంతో వాహనాలను నిర్లక్ష్యంగా నడుపుతున్నారు. వీరిలో మార్పు తీసుకువచ్చేందుకే ఈ చర్యలు తీసుకోవాలని భావిస్తున్నాం. ఈ రిజిస్ట్రేషన్ రద్దు పూర్తి కాలం ఉండకపోయినా మొదటి దశలో 3 నెలలు ఉంచాలని అనుకుంటున్నాం. తర్వాత అతను మళ్లీ ఇలానే ఉల్లంఘిస్తే అప్పుడు రద్దు కాలం కొన్ని నెలలపాటు ఉంచాలని యోచిస్తున్నాం.

ఆర్థిక సమానత్వం అమలు కావడం లేదు: రాఘవులు

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: రాజ్యాంగం ప్రకారం ఆర్థిక సమానత్వం అమలు కావడం లేదని సీపీఎం పోలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య కళానిలయంలో దళిత్ శోషణ్ ముక్తి మంచ్ (డీఎస్ఎంఎం) కేంద్ర కమిటీ సమావేశాల సందర్భంగా 'రాజ్యాంగం- సామాజిక న్యాయం- సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం వల్ల ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో నీతిఆయోగ్ కార్యాచరణ ప్రణాళికను కేంద్రం రూపొందించిందని, ఇందులో 237 ప్రభుత్వ సంస్థల్లో 74 సంస్థలను మూసివేయాలని, మరో 20 సంస్థలను ప్రైవేటుపరం చేయాలని, మిగతా వాటిని ప్రైవేటు భాగస్వామ్యంతో నడిపించాలని నిర్ణయించడం దుర్మార్గమన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టం దుర్వినియోగమవుతుందనే నెపంతో పాలకులు ఈ చట్టాన్ని ఎత్తివేసేందుకు పూనుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ చర్యలతోనే అసమానతలు పెరిగిపోతున్నాయన్నారు. దీనికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని చేపట్టాలని కోరారు. ప్రభుత్వ మాజీ ప్రధాన



సదస్సులో మాట్లాడుతున్న బీవీ రాఘవులు

కార్యదర్శి కాకి మాధవరావు, డీఎస్ఎంఎం జాతీయ కన్వీనర్, మాజీ ఎంపీ సుభాషిణి అలీ, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు, రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్, తదితరులు సదస్సులో పాల్గొన్నారు.

సౌదీలో తెలంగాణవాసుల ఇక్కట్లు

- భారత రాయబార కార్యాలయం స్పందించాలని వేడుకోలు

ఇందూరు, న్యూస్‌టుడే: 'ఉపాధి కోసం కన్నవాళ్లను.. కట్టుకున్న వారిని వదిలిపెట్టి ఇక్కడికి వచ్చాం. మేం సౌదీకి రావడమే మా పాపమైంది. ఇక్కడ పనుల్లేక, పస్తులుండలేక స్వదేశానికి వెళ్లిపోతామని వేడుకున్నా పట్టించుకునేవారు లేరు. భారత రాయబార కార్యాలయానికి ఎన్నిసార్లు వెళ్లినా స్పందన లేదు. తెలంగాణ బిడ్డలమైన మమ్మల్ని రక్షించవలసిన బాధ్యత సర్కారుపై ఉంది. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎంపీ కవితలే మమ్మల్ని ఇక్కడి నుంచి తీసుకెళ్లేందుకు దయ చూపాలి.' అంటూ గల్ఫ్ బాధితులు వేడుకుంటున్నారు. ఆర్థిక సంక్షోభంతో సౌదీలో పలు కంపెనీలు మూతపడ్డాయి. నెల జీతాలు రాక కొందరు, బయట పని చేసుకుందామని మరి కొందరు పాస్‌పోర్టులు యాజమానుల వద్దే ఉంచేశారు. తిరిగి స్వస్థలాలకు వారు రావాలంటే నిబంధనలు అడ్డువస్తున్నాయి. దీంతో అనేకసార్లు భారత రాయబార కార్యాలయానికి వెళ్తే.. సర్కారు నుంచి ప్రత్యేక ఉత్తర్వులు వస్తే



తమను స్వస్థలాలకు రప్పించాలని వేడుకుంటున్న సౌదీలోని తెలంగాణవాసులు

గానీ, పంపమని చెబుతున్నారని నిజామాబాద్‌కు చెందిన చిన్న బొర్రన్న, వర్ని గ్రామానికి చెందిన షేక్ మౌలానాలు నిజామాబాద్‌లో గల్ఫ్ సంక్షేమ ప్రతినిధి బసంత్‌రెడ్డితో ఫోన్‌లో చెప్పి వాపోయారు. నాలుగు నెలలుగా తాము బాధలు అనుభవిస్తున్నామని పని లేక, తిండి దొరక్క తీవ్ర ఇక్కట్లు పడుతున్నామని అవేదన వెళ్లగక్కారు. ప్రజాప్రతినిధులు పట్టించుకుంటేనే తాము 44 మంది ఈ నరకం నుంచి బయటపడతామని ప్రాధేయపడుతున్నారు.



కోర్పస్ క్రిస్టిలో ధ్వంసమైన మొబైల్ పార్కు



జలమయమైన టెక్సాస్‌లోని రాక్‌పోర్ట్

హరికేన్ హార్వే ధాటికి టెక్సాస్ విలవిల

- ఐదుగురు మృతి, 14 మందికి గాయాలు
- వంద సెం.మీ. వర్షపాతం నమోదు కావొచ్చని హెచ్చరించిన మేయరు
- ఇబ్బంది పడుతున్న 60 లక్షల మంది

హ్యూస్టన్: హరికేన్ హార్వే ధాటికి టెక్సాస్ విలవిల్లాడిపోతోంది. ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. 14 మంది గాయపడ్డారు. గంటకు 130 మైళ్ల వేగంతో వీస్తున్న గాలుల కారణంగా చెట్లు, విద్యుత్తు స్తంభాలు కూలిపోయాయి. ఇళ్లు ధ్వంసమయ్యాయి. కనీసం మూడు లక్షల ఇళ్లకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. హ్యూస్టన్, హారిస్‌కౌంటీలలో గత 24 గంటల్లో 20 అంగుళాల మేర వర్షపాతం నమోదైంది. కొన్ని ప్రాంతాల్లో వంద సెంమీ వరకు వర్షపాతం నమోదు కానుందని, ప్రజలు అప్రమత్తతతో వ్యవహరించాలని హ్యూస్టన్ మేయర్ సిల్వెస్టర్ టర్నర్ హెచ్చరించారు. వచ్చే వారంరోజులూ భారీవర్షాలు కురుస్తాయని చెప్పారు. హరికేన్ విధ్వంసానికి కుప్పకూలిన చెట్లు, విద్యుత్తు స్తంభాలను ప్రజలకు ఇబ్బంది లేకుండా తొలగించడానికి 1800 మంది సైనికులను రంగంలోకి దించినట్లు టెక్సాస్ గవర్నరు గ్రెగ్ అబాట్ తెలిపారు. హార్వే ధాటికి ఇబ్బంది పడుతున్న ప్రజలకు సహకరించడానికి, కనిపించకుండా పోయినవారిని వెదకడానికి, సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి మరో వెయ్యిమంది సహాయక సిబ్బందిని నియోగించినట్లు చెప్పారు. రాక్‌పోర్ట్ నగరంలోని కార్లు అమ్మే దుకాణంలో 12 వాహనాలు ధ్వంసమయ్యాయి. ఒకటి అగ్నికి ఆహుతైంది. అగ్నికీలల కారణంగా ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. బ్రజోస్ నదిలో నీటిమట్టం పెరుగుతుండటంతో మునిగిపోయే ప్రమాదం ఉన్న మూడు జైళ్ల నుంచి 4500 మంది ఖైదీలను వేరే జైళ్లకు తరలించారు. హార్వే కారణంగా లూసియానాలోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. దాదాపు 60 లక్షల మంది హార్వే కారణంగా ఇబ్బంది పడుతున్నారని అధికారులు చెబుతున్నారు. ఫోర్ట్ బెండ్ కౌంటీలో 50 ఇళ్లు ధ్వంసమయ్యాయి. 2004లో హరికేన్ చార్లీ ఫ్లోరిడాలో తన ప్రతాపం చూపిన తరువాత, అమెరికాలో ఆ స్థాయి(నాలుగో ప్రమాద హెచ్చరిక)లో విరుచుకుపడింది హార్వేనే కావడం గమనార్హం. 1961లో హరికేన్ కార్లా కూడా టెక్సాస్‌ను అతలాకుతలం చేసింది.



వరదనీటిలో చిక్కుకున్న విల్‌ఫోర్డ్ మార్టినెజ్‌ను కాపాడే ప్రయత్నంలో సహాయ సిబ్బంది

ఆమెకు 55.. అతనికి 22..!


పెళ్లికి సిద్ధమైన జంట

రక్షణ కోసం పోలీస్ స్టేషన్‌కు

కౌన్సెలింగ్ తర్వాతా మారని నిర్ణయం

గోల్కొండ, న్యూస్‌టుడే: ఆమెకు 55. అతనికి 22. ఇద్దరి మధ్య సాన్నిహిత్యం పెళ్లివరకు వచ్చింది. ఇదేదే పాశ్చాత్య దేశాల్లో జరిగిన ఘటన కాదు..సాక్షాత్తూ హైదరాబాద్‌లోనే జరగగా.. పంచాయితీ పోలీసుల వద్దకు చేరుకుంది. ఈ చిక్కుముడి ఎలా విప్పాలో తెలియక తలపట్టుకోవడం పోలీసుల వంతయింది. గోల్కొండ ధాన్ కోటకు చెందిన అయేషాబేగం (55) భర్త నాలుగు నెలల క్రితమే మరణించాడు. తర్వాత ఆమెకు, అదే ప్రాంతానికి చెందిన, ఓ కొరియర్ సంస్థలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న మహ్మద్ ముదస్సిర్ అలియాస్ అర్షద్ (22)ల మధ్య సాన్నిహిత్యం ఏర్పడింది. అదికాస్తా సహజీవనం వరకు వచ్చింది. ఇరు కుటుంబాల సభ్యుల నుంచి బెదిరింపులు రావడంతో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్న వారు.. తమకు రక్షణ కల్పించాలంటూ ఆదివారం గోల్కొండ పోలీసులను ఆశ్రయించారు. ఇన్‌స్పెక్టర్ సయ్యద్ ఫయాజ్ వీరికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అయినా వీరు పెళ్లి చేసుకోవాలన్న నిర్ణయానికే కట్టుబడటంతో పోలీసులు తలపట్టుకున్నారు. చేసేది లేక వారం రోజుల తర్వాత మళ్లీ స్టేషన్‌కు రావాలని సూచించి పంపారు. వారం రోజుల తర్వాత మత పెద్దల సమక్షంలో వీరితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని సీఐ తెలిపారు.

వజ్రాలతో బ్యాటరీ పేలుళ్లు అదుపు



న్యూయార్క్: వెంట్రుక కన్నా పదివేల రెట్లు సన్నగా ఉండే నానో వజ్రాలతో.. ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల్లో ఉండే బ్యాటరీలను ప్రమాదవశాత్తు పేలకుండా చేయొచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పేలుడుకు దారితీసే రసాయన ప్రక్రియ జరగకుండా.. బ్యాటరీల్లోని ఎలక్ట్రోలైట్ ద్రావణం ద్వారా అడ్డుకునే పద్ధతిని అమెరికాలోని డ్రెక్సెల్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు అభివృద్ధి చేశారు. ద్రావణానికి నానో వజ్రాలను కలిపి.. లిథియం ఆనోడ్‌లను మరింత స్థిరంగా, లిథియం పూతను ఏకరీతిగా వారు మార్చారు. ఎలక్ట్రోపూతకు సంబంధించి నానో వజ్రాల వాడకం ఎంతో కాలం నుంచి కొనసాగుతోంది. నిర్మాణం, ఆకారంలో ఆభరణాల్లో వాడే వజ్రాలలాగే ఉన్నప్పటికీ.. నానో వజ్రాలు వాటికన్నా చాలా చౌక. ఒకచోట చేర్చినప్పుడు ఇవి.. నునుపైన ఉపరితలాన్ని ఏర్పరుస్తాయి. నానో వజ్రాలతో జత కట్టినప్పుడు లిథియం అయాన్లు కూడా వాటి లక్షణాలనే కనబరుస్తున్నాయని పరిశోధకులు తెలిపారు. ప్రాథమిక పరీక్షల్లో 200 గంటలపాటు ఛార్జింగ్, వినియోగం చేసినా.. బ్యాటరీలో సూక్ష్మమైన పెచ్చులు ఏర్పడలేదని పరిశోధకులు తెలిపారు. అయితే ఫోన్లు, ఇతర పరికరాల్లో వాడేందుకు వీటిని మరింత మెరుగుపరచాల్సి ఉందని ఉన్నారు.

దారాన్ని సాగదీస్తే విద్యుత్



వాషింగ్టన్: సాగదీసినప్పుడు విద్యుత్‌ను ఉత్పత్తి చేసే 'ట్విస్ట్రాన్' అనే హైటెక్ దారాన్ని శాస్త్రవేత్తలు రూపొందించారు. ధరింపగలిగే పరికరాలు, స్మార్ట్ దుస్తులకు సంబంధించి భవిష్యత్తులో ఈ ఆవిష్కరణ కీలకమయ్యే అవకాశాలున్నాయి. అమెరికాలోని టెక్సాస్ విశ్వవిద్యాలయ పరిశోధకులు దీన్ని రూపొందించారు. మందంలో వెంట్రుక కన్నా 10వేల రెట్లు సన్నగా ఉండే కార్బన్ నానో ట్యూబ్‌లతో ట్విస్ట్రాన్‌ను వారు తయారుచేశారు. నానో ట్యూబ్‌లన్నింటినీ మెలితిప్పడం ద్వారా ఈ దారం ఓ రబ్బరు బ్యాండులా సాగే గుణాన్ని సంతరించుకుంది. అయాన్ల ద్వారా వాహకత కల్పించే పదార్థం లేదా ఎలక్ట్రోలైట్‌లో ముంచినప్పుడు గానీ, పూత పూసినప్పుడు గానీ ఈ దారం నుంచి విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుంది. సాగదీసినా, మెలితిప్పినా ట్విస్ట్రాన్ ఘనపరిమాణం తగ్గి.. దానిపై ఉండే ఎలక్ట్రిక్ ఛార్జ్ పెరుగుతుందని శాస్త్రవేత్తలు చెప్పారు. ఓ ఈగ కన్నా తక్కువ బరువు ఉండే ట్విస్ట్రాన్‌తో.. చిన్న ఎల్ఈడీ దీపాన్ని వెలిగించొచ్చని పేర్కొన్నారు.

కండరాల శ్రమకోర్చే శక్తి పురుషుల కంటే స్త్రీలలోనే అధికం



టొరంటో: శారీరక పరంగా చూస్తే.....పురుషులు స్త్రీల కంటే బలవంతులై ఉండవచ్చు. అయితే..., కండరాల శ్రమను ఓర్చుకునే శక్తి విషయంలో మాత్రం స్త్రీలదే పై చేయి. కెనడాకు చెందిన పరిశోధకుల తాజా అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. కండరాలకు సంబంధించి సహజంగా అత్యంత క్లిష్టమైన వ్యాయామాల విషయానికి వచ్చేసరికి మహిళల కంటే పురుషులే చాలా త్వరగా అలసిపోతారని తేలింది. బరువులు ఎత్తడం వంటి కీళ్లు కదలకుండా చేయాల్సిన ఐసోమెట్రిక్ వ్యాయామాలు చేయడంలో మహిళలు గొప్పశక్తినే కనపరిచారు. ఇందుకోసం ఎంపిక చేసుకున్న స్త్రీ, పురుషులన పరిశోధకులు వివిధ పరీక్షలకు గురిచేశారు. ప్రత్యేకంగా ఎంపిక చేసుకున్న కొన్ని సెన్సర్ల సముదాయంపై పాదాలను వేగంగా పైకి కిందకి కదలించాల్సిందిగా వారిని కోరారు. సుమారు రెండువందల పర్యాయాలు చేయాల్సిందిగా నిర్దేశించారు. ఆ క్రమంలో ఆయా వ్యక్తులు ఎంత వేగంతో...ఎంత శక్తితో..ఆ వ్యాయామాన్ని చేశారో క్షుణ్ణంగా నమోదు చేసుకున్నారు. ఫలితాలను విశ్లేషిస్తే....మహిళలే అత్యధిక శక్తిని, శ్రమను ఓర్చుకోగలిగిన బలాన్ని చూపినట్లు సుస్పష్టమైంది.

క్యాన్సర్‌ను మెరుగ్గా గుర్తించే పరీక్ష



వాషింగ్టన్: క్యాన్సర్‌ను మెరుగ్గా గుర్తించడంలో తోడ్పడే కొత్త విధానాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. కాంతి పడినప్పుడు ప్రకాశవంతమైన వెలుగుల సాయంతో కణితుల జాడను చూపించే సూక్ష్మకణాలు (క్వాంటమ్ డాట్స్) సాయంతో ఇది పనిచేస్తోంది. ప్రస్తుతం అందుబాటులోనున్న కణితుల స్కానింగ్ ప్రక్రియ కంటే ఇది ఐదు రెట్లు మెరుగైన ఫలితాలను ఇస్తుందని అమెరికాలోని శాన్‌ఫోర్డ్ బర్హామ్ ప్రెబీ మెడికల్ డిస్కవరీ ఇన్‌స్టిట్యూట్ (ఎస్‌బీపీ) పరిశోధకులు తెలిపారు. సిల్వర్ అణువులతో సిద్ధంచేసిన ఈ క్వాంటమ్ డాట్లతో ఎలాంటి దుష్ప్రభావాలు ఎదురుకావని వారు స్పష్టంచేశారు. వీటిని నాడుల గుండా శరీరంలోకి ప్రవేశపెట్టారు. దీంతో ఇవి రక్తంలో కలిసి క్యాన్సర్ కణాల పరిసరాల్లోకి చేరిపోయాయి. అనంతరం స్కానింగ్ నిర్వహించగా ప్రకాశవంతమైన వెలుగులతో ఇవి క్యాన్సర్ కణితులను చూపించాయి. ఎలుకలపై ఈ విధానంలో అత్యంత కచ్చితత్వంతో క్యాన్సర్‌ను నిర్ధారించగలిగామని పరిశోధకులు తెలిపారు.

చాక్లెట్లలోని పదార్థంతో మధుమేహానికి చికిత్స



వాషింగ్టన్: చాక్లెట్లలో ఉండే కోకాలోని ఓ పదార్థం మధుమేహ వ్యాధి చికిత్సలో ఉపయోగపడుతున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు అధికమైనప్పుడు.. ఇన్సులిన్ విడుదలకు అది దోహదపడుతున్నట్లు అమెరికాలోని బ్రిగ్హామ్ యంగ్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు కనుగొన్నారు. రక్తంలోని చక్కెర స్థాయిలను అదుపులో పెట్టేందుకు ఇన్సులిన్ కీలకం. దీనిని బీటా కణాలు ఉత్పత్తి చేస్తాయి. కోకాలో ఉండే ఎపికాటెచిన్ మోనోమర్‌లు.. బీటా కణాల కేంద్రకాలను శక్తిమంతంగా మారుస్తున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. తద్వారా కణాల శక్తి వనరులు పెరిగి.. ఇన్సులిన్ ఉత్పత్తి జరుగుతున్నట్లు వారు తెలిపారు. పశువులపై ఈ మేరకు తాము జరిపిన ప్రయోగాలు సత్ఫలితాలిచ్చినట్లు పేర్కొన్నారు. అయితే చక్కెర అధికంగా ఉండే చాక్లెట్లను తీసుకోవడం కన్నా.. అందుకు బదులుగా అవసరమైన ఎపికాటెచిన్ మోనోమర్‌లను మాత్రమే బయటకు తీసే విధానాలను అభివృద్ధి చేయాల్సిన అవసరముందని చెప్పారు.

బరువు తగ్గాలనుకుంటే కాఫీ జోలికి పోవద్దు

న్యూయార్క్: 'ఎన్ని ప్రయత్నాలు చేసినా బరువు తగ్గడంలేదా? అయితే, కాఫీ తాగడం మానేసి చూడండి! కచ్చితంగా నాజూగ్గా మారతారు' అంటున్నారు... కార్నెల్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు. కాఫీలో ఉండే కెఫిన్ రుచి ఆస్వాదన స్థాయిని తగ్గిస్తుందట. దీంతో ఆహార సంతృప్తి లభించక... తీపి పదార్థాలను తినాలన్న కోరిక ఎక్కువవుతుందని గుర్తించినట్లు పరిశోధకుడు రోబిన్ డాన్డో వివరించారు. ఓ బృందానికి కాఫీని, మరో బృందానికి కేవలం ఆ రుచి మాత్రమే ఉన్న పానీయాన్ని అందించి... తర్వాత వారి ఆహార స్వీకరణ తీరును గమనించారు. కాఫీని తాగినవారు ఆ తర్వాత మిఠాయిలు, ఇతర తీపి పదార్థాలను ఎక్కువగా తిన్నట్లు పేర్కొన్నారు. అధిక బరువుతో బాధపడేవారు కాఫీ జోలికి వెళ్లకపోవడమే ఉత్తమమన్నది పరిశోధకుల సలహా!

ఇక వయసు ఆధార వ్యాక్సిన్లు

- వ్యాధి నిరోధక స్పందనను మెరుగుపరిచే జన్యువు గుర్తింపు

వాషింగ్టన్: జలుబు, దగ్గు మొదలు తీవ్రస్థాయి శ్వాసకోశ వ్యాధులకు కారణమయ్యే సూక్ష్మక్రిముల (ఫ్లూ వైరస్)ను కట్టడిచేసే టీకాలకు సమర్థంగా స్పందించేలా... వ్యాధి నిరోధక వ్యవస్థకు తోడ్పడే జన్యువులు తాజా పరిశోధనలో వెలుగుచూశాయి. వీటిపై మరింత స్పష్టత వస్తే ప్రాణాంతక వ్యాధులకు ముకుతాడు పడటం ఖాయమని భావిస్తున్నారు యాలె విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు! వ్యాక్సిన్ వేయకముందు, ఆ తర్వాత 500 మంది నుంచి రక్త నమూనాలను సేకరించి... ఒక్కొక్కరిలోనూ వచ్చిన మార్పులను గమనించారు. 35 ఏళ్లలోపు వయసువారిలో టీకా బాగా పనిచేసేలా కొన్ని జన్యువులు తోడ్పడినట్లు గుర్తించారు. అవే రకం జన్యువులు 60 ఏళ్లు దాటినవారిలో మాత్రం వ్యాక్సిన్‌కు స్పందించకపోవడం విశేషం. వయసు వర్గాల వారీగా స్పందనాత్మక జన్యువులను గుర్తించడం ద్వారా- పిల్లలు, మధ్య వయస్కులు, వృద్ధుల కోసం విడివిడిగా వ్యాక్సిన్లు తయారుచేసి, వ్యాధులను సమర్థంగా అడ్డుకోవచ్చని పరిశోధకుడు మాంగోమెరి పేర్కొన్నారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. L/RN/KAR/48/2015-17 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00